మల్లినాథసూరి జీవితము రచనలు

(ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి ఆర్థ్యానుమతి పొందినది.)



రచయితలు

శ్రీ. శే. బృందావనం రామానుజాచార్యులు

భాషాప్రవీణ

గుమ్మా శంకరరావు, ఎం. ఏ.,

కాపీరైటు


మొదటి ముద్రణ

ప్రతులు 1000

1977

లలితా ప్రెస్

హైదరాబాదు.



వెల 15-00

ప్రాప్తిస్థానము

శ్రీను పల్లి శేషన్న

C/o గుమ్మా శంకరరావు,

తెలుగు అకాడమి, హిమాయత్‌నగర్

హైదరాబాదు-29.

శ్రీరస్తు

తద్దివ్యమవ్యయంధామ
సారస్వత ముపాస్మహే.
యత్ప్రకాశాత్ ప్రలీయంతే
మోహాంధ తమసశ్ఛటాః.

అంకితము

సాహితీబంధులకు

ముందుమాట

1975వ సంవత్సరానికి ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, హైదరాబాద్ వారు "మల్లినాథసూరి జీవితము-రచనలు" అన్న విషయంపై 250 పుటలకు మించని గ్రంథం పోటీకి పంపవలసినదిగా కోరటమూ పోటీకి పంపిన మా రచన ఉత్తమమైనదిగా పరిగణింపబడి బహుమతి పొందడమూ జరిగింది. ఈ సదవకాశాన్ని మాకు కల్పించిన సాహిత్య అకాడమీవారికి మేమెంతో కృతజ్ఞులము.

విషయం 250 పేజీలకు మించరాదనే నియమం ఉండటంవల్ల ఎంతో విషయం పాఠకలోకానికి అందించలేకపోయాము.

మిత్రుడు శ్రీమాన్ బృందావనం రామానుజాచార్యులు నాతోపాటు ఈ రచనచేసి అకాడమీ బహుమతి పొందిన వార్త వినకముందే కీర్తిశేషులైనారు. అది నాకు సంతాపకరమైనది.

నామీద వ్యక్తిగతమైన ఆదరాభిమానాలు కలిగి చాల కాలముగా నాకు సహాయపడుతున్న మిత్రులు ఇతోధికంగా ధన సహాయంచేసి ఈ గ్రంథముద్రణకు తోడ్పడినారు. వారందరికీ నా కృతజ్ఞతలు.

పుస్తకాన్ని సకాలంలో అచ్చువేసి అందించిన లలితాప్రెస్, ఖైరతాబాద్, హైదరాబాద్ వారికి నా కృతజ్ఞతలు.

ఈ గ్రంథానికి వ్రాతప్రతులు రెండింటిలో ఒక ప్రతిని సిద్ధంచేసిన నా మేనల్లుడు చి॥ వేదుల లక్ష్మీసత్యశంకరరావుకు నా ప్రత్యేక శుభాశీస్సులు.

ఇట్లు

హైదరాబాద్.　　　　బుధజనవిధేయుడు

25-8-77.　　　　గుమ్మా శంకరశాస్త్రి

పరిష్కారం

మల్లి-సౌరభం

మల్లినాథుణ్ణి మహావ్యాఖ్యాతగా అందరూ అభివర్ణిస్తారు. "మల్లినాథకవిస్సోయం" "మల్లినాథవిదుషా" అని అతడే చెప్పుకున్న మాటలకు ప్రత్యేకంగా ప్రాధాన్యం ఇవ్వడం జరగలేదు. ఇందులో మల్లినాథుని కవితాకల్పాప్రాగల్భ్యం పరిచయం చేయడం జరిగింది. "నామైకదేశే నామగ్రహణం" అనే సంప్రదాయం ఆధారంగా మల్లినాథలో 'మల్లి' మాత్రం గ్రహించడం మల్లినాథ కవితా సౌరభం-మల్లీ సౌరభం కూడా స్ఫురింపచేయడంకోసమే

తులనాత్మక పరిశీలన

సుమారు పన్నెండుగురు వ్యాఖ్యాతల వ్యాఖ్యలతో మల్లినాథుని వ్యాఖ్యలు సరిపోల్చడం, వ్యాఖ్యాతృచక్రవర్తిగా మల్లినాథునికి ఉండే అర్హత, నిరూపించడం, మల్లినాథుని వ్యాఖ్యాన వైశిష్ట్యం వివరించడం జరిగింది.

మహోపాధ్యాయ

మల్లినాథుడు 'మహోపాధ్యాయుడు' అని ఉన్నది. కాని మల్లినాథుని కాలంనాటికి "మహోపాధ్యాయ" బిరుదమే సర్వోత్కృష్టంగా ఉన్నది. అందువల్ల దానినే గ్రహించడం జరిగింది. శ్లోకాలలో 'మహోపాధ్యాయఆఖ్యాతః' అనే ఉంది. చాలా గద్యల్లో కూడా "మహోపాధ్యాయ" బిరుదమే ఉన్నది.

పెద్దిభట్టు

మల్లినాథసూరికి పెద్దిభట్టు అనే అన్నగాని తమ్ముడుకాని లేను. పెద్దిభట్టు మల్లినాథునికి పెద్దకుమారుడు. ఈ పెద్దిభట్టునే మల్లినాథునికి సోదరుడనీ-లేదా పెద్దిభట్టు-మల్లినాథులిద్దరూ ఒక్కరే

అని కొంతమంది పేర్కొంటున్నారు. అందువల్ల ఆ విషయం విపులంగా చర్చించడం జరిగింది.

మల్లినాథనామధేయులు

మల్లినాథనామంతో చాలామంది కవులు సారస్వతరంగంలో తారసిల్లుతున్నారు. కొందరు వీరిని గురించి చాలా కథలు చెబుతూ ఆ కథలు మల్లినాథసూరికే అంటకడుతున్నారు. అందులో ఉండే అనౌచిత్యాన్ని ఈ శీర్షికలో వివరించడం జరిగింది.

బహుశాస్త్రవైదుష్యం

మల్లినాథుని బహుగ్రంథ పరిచయం ప్రస్తావించడం జరిగినా విస్తరభీతిచేత సమగ్రంగా చర్చించలేదు అందువల్ల అనుబంధంలో అతడు పేర్కొన్న గ్రంథాలపేర్లూ-గ్రంథకర్తలపేర్లూ ఇవ్వడం జరిగింది.

ఆత్మీయత

ఈ శీర్షికలో మల్లినాథుని శిష్యవాత్సల్యం, పూర్వకవులమీద ఉండే గౌరవం, గర్వరాహిత్యం, లోకజ్ఞత, శైలి, హాస్యచతురత, భక్తి-వైరాగ్యభావసంపత్తి ఘనత దిఙ్మాత్రంగా చూపడం జరిగింది.

—: o :—

గ్రంథముద్రణకు సహాయంచేసినమిత్రులు

1. శ్రీ ఖాట్టం శ్రీరామమూర్తిగారు, హైదరాబాద్
2. శ్రీ ఎస్. కొండల్రావుగారు, ,,
3. శ్రీ ఉసిరికల నటరాజశ్రేష్ఠిగారు, విజయనగరం
4 శ్రీ అనివిళ్ళ ప్రకాశరావుగారు, ,,
5. శ్రీ ఎస్. కె. జగన్నాథరావుగారు, ,,
6. శ్రీ నరాలశెట్టి ప్రకాశరావుగారు, ,,
7. శ్రీ కూరెళ్ళ శాస్త్రిగారు, అడ్వకేట్, ,,
8. అరుణా జ్యూట్ మిల్స్ ప్రొప్రైటర్, ,,
9 మహిళామండలి, ,,
10. శ్రీ వేదుల గోవిందశర్మగారు, ,,
11. శ్రీ కొల్లా సత్తెయ్యశ్రేష్ఠిగారు, గజపతినగరం
12. శ్రీ అరిశెట్టి గణపతిగారు, ,,
13. శ్రీ గండి గాంధినాయుడు, అడ్వకేట్, కైలాం
14. శ్రీ కె. అప్పిరెడ్డి, అనకాపల్లి, ,,
15. శ్రీ బి. వి. నరసింహారాజుగారు, అమలాపురం.



కీ. శే. బృందావనం రామానుజాచార్యులు
భాషాప్రవీణ

జననం :- 1926.

జన్మస్థలము :- లింగాలవలస, రాజాం తాలూకా,
శ్రీకాకుళం జిల్లా.

విద్యాభ్యాసం :- విజయనగరం మహారాజా సంస్కృత
కళాశాల.

31-8-1976న కీర్తిశేషులయినారు.



గుమ్మా శంకరరావు ఎం.ఏ

జననం :- 10-2-1963.

జన్మస్థలం :- చామలాపల్లి అగ్రహారం, శృంగవరపుకోట
తాలూకా. విశాఖ జిల్లా.

విద్యాభ్యాసం :- చామలాపల్లి, విజయనగరం, ఆంధ్రా
యూనివర్సిటీ, వాల్తేరు.

రచనలు :- పొడుపుకథలు మోనోగ్రాఫ్ ప్రపంచ తెలుగు మహాసభల ప్రచురణ.

వ్యాసాలు :- నేయార్థం ఒక పరిశీలన, (2) పోతన అందించిన కవితామందారం, (3) ఖగోళంలో కర్ణుడు, (4, మహతి (5) ఆర్ష సాహిత్యంలో దోహదక్రియల వృక్షాల పాత్ర, (6) మల్లియ రేచన, (7) కవిసమయాలు శాస్త్రదృష్టి.

ఇతరములు :- అష్టావధానము, ఏకసంథాగ్రహణశక్తి అంకగణిత ప్రశ్నలు. జ్యోతిష వైద్యశాస్త్రాలలో పంచాంగ గణనలో ప్రవేశం.

విషయ సూచిక

ఉపోద్ఘాతము

భారతీయ విజ్ఞానానికీ సంస్కృతికీ కాణాచి అయిన సంస్కృత వాఙ్మయాన్ని ప్రాచీనకాలంనుంచీ అధ్యయనం చేస్తూ తమ అధ్యయన అధ్యాపన ఆచరణ ప్రచారాల ద్వారా ఆ భాషకు సేవచేస్తూ దాని అభివృద్ధికి కృషిచేస్తున్నవారిలో తెలుగువారి పాత్రకూడా చాలా విశిష్టమైనదే. వీరిలో పండితులుగాం కవులుగా, శాస్త్రవేత్తలుగా, వ్యాఖ్యాతలుగా, విమర్శకులుగా, మతాచార్యులుగా, తత్త్వవేత్తలుగా సంస్కృత వాఙ్మయానికి సంబంధించిన వివిధరంగాల్లో సముచిత స్థానాన్ని సంపాదించుకొన్నవారు శతాధికంగా ఉన్నారు.

సారస్వత విమర్శ సంస్కృత సాహిత్య చరిత్రలోనే ముందుగా ఆరంభమయింది. భరతుడు, భామహుడు, దండి, ఆనందవర్ధనుడు, విద్యానాథుడు, అభినవగుప్తుడు మొదలైనవారు సాహితీ సౌందర్యాన్ని భిన్న భిన్న దృక్కోణాలతో వీక్షించి, సారస్వతవిషయికంగా సమీక్షలు చేసి ఆసక్తికరమయిన చర్చలు అక్కడక్కడ చేశారు.

ధ్వని సిద్ధాంతం వ్యాప్తిలోకి వచ్చేవరకు కావ్యంయొక్క పరమ ప్రయోజనాన్ని వివరించే ప్రయత్నం జరుగలేదు, అలంకార వృత్తి. రీతి, శయ్యాపాకాది యావత్కావ్య సామగ్రిలోనూ ధ్వని పరమోత్తమము. వాల్మీకి, కాళిదాస శ్రీహర్షాది మహాకవులకు సైతం ధ్వని ఆరాధ్యమయింది, కావ్యానికి శబ్దార్థాలు శరీరము ధ్వని జీవము అని ప్రామాణిక వచనము. ఉత్తమకవిత్వం ధ్వని ప్రధానం. ఇది రమణీయార్థాలను ధ్వనిస్తుందేతప్ప వాచ్యం చేయదు ఇది ప్రాజ్ఞులకు అమృతప్రాయమైనది. దీనిని మహామహోపాధ్యాయ సార్థక నామధేయుడైన మల్లినాథ సూరి అనన్య సాధ్యాలైన ప్రతిభా

పాండిత్యాలతో హార్ష భట్టీయ, కాళిదాసీయాది మహా కవిత్వాగ్ర మాలకు భాష్యాలువ్రాస్తూ జయప్రదంగా నిర్వహించాడు. "వ్యాఖ్యాస్యతేస్తురసభావ గుణార్థదోష సధ్వన్యలంకృతి రహస్య విదాం ముదే తత్." అని స్పష్టంగా పేర్కొన్నాడు. మల్లినాథ సూరి ఉత్తమ విమర్శకుడు, మహామనీషి, వ్యాఖ్యాతృ చక్రవర్తి, పండిత మూర్ధన్యుడు, చుళికీకృత సకలశాస్త్రజలధి. మంత్ర తంత్ర అధ్యాత్మ విద్యలను, యోగ వేదాంత రహస్యాలను ఎరిగినవాడు. సాహిత్య కవిత్వాల్లో ఆయన ప్రజ్ఞ నిరుపమానం. వ్యాఖ్యలలో అతని ప్రజ్ఞ ప్రత్యేకంగా కనబడుతుంది. అనపేక్షిత విషయాలజోలికి పోక, మూలాన్ని అతిక్రమించక, అసిధారగా ప్రతిన నిర్వహించి, రసభావ గుణార్థదోష సధ్వన్యలంకృతి రహస్య విదులకు మోదాన్ని కూర్చటానికి వ్యాఖ్యానాన్ని సంతరించినవాడు స్వీయపాండిత్య ప్రాగల్భ్య ప్రకటనా లౌల్యంచేత ఇతర వ్యాఖ్యాతలు మూలాన్ని మరుగుపరిచే వ్యాఖ్యలువ్రాసి, మహాకవితలకు అపచారంచేశారు. మల్లినాథుడు కువ్యాఖ్యా విషమూర్ఛితలైన ఆ కవితలను సంజీవినిచే ఉజ్జీవింపజేసి ఉద్ధరించాడు. ఆ మహనీయ కవితలలోని కవితా సౌందర్యాన్ని ఆవిష్కరించడానికి సర్వజ్ఞుడైన మల్లినాథుడు పూనుకొనడం రసజ్ఞలోకంయొక్క అదృష్టం. పిజ్జులు మల్లినాధ సూరివంటి మహా పండితుడు, వ్యాఖ్యాత నభూతో నభవిష్యతి అంటారు. అటువంటి మహనీయుని జీవితం గురించికాని రచనలగురించికాని ఇంతవరకూ ఎట్లాంటి గ్రంథమూ వెలువడకుండటము విచారకరము.

సాధారణంగా రాజుల చరిత్రలు కవుల జీవితాలు, గాయకుల కథలు, మహానాయకుల ప్రతిభా విశేషాలు గ్రంథస్థం కావడమూ చరిత్రలుగా రూపొందడమూ నేటివరకూ పరిపాటిగా వస్తున్న సంప్రదాయం. ఒక వ్యాఖ్యాతయొక్క జీవితచరిత్ర వ్రాయడానికి చేసే తొలి ప్రయత్నమిది అయితే ప్రప్రథమంగా ఒక వ్యాఖ్యాత

సమగ్ర చరిత్ర వ్రాయడానికి పూనుకోవడం సాహసమే అయినా అది సముచితమూ న్యాయమూ అని చెప్పక తప్పదు. శాస్త్ర రహస్య ప్రదర్శకాలు, సహృదయ హృదయ రంజకాలు, పతితృజన సుబోధకాలూ, మనోవికాసహేతుకాలూ గ్రంథగ్రంథి విదళన క్షమాలూ, అసంఖ్యాలూ, రమణీయాలూ అయిన ఈతని వ్యాఖ్యానాలు వ్యాఖ్యాతల గౌరవాన్ని ఇనుమడింపచేసి ఈతని చరిత్ర వ్రాయడం సమంజసమే అని నిరూపిస్తున్నాయి.

సంస్కృత వాఙ్మయంలోని మహాకావ్యాలకు వ్యాఖ్య వ్రాసిన వారి అందరిలో చారిత్రవర్ధన, దక్షిణావర్తనాథాదులు చాలా ప్రసిద్ధులు. మల్లినాథుడు చాలా ప్రముఖుడు.

అందుచేతనే మల్లినాథ సూరి జీవితము - రచనలుగురించి సాధ్యమయినంతలో విషయ సేకరణచేసి గ్రంథంగా రూపొందించే ప్రయత్నం చేయడం జిజ్ఞాసువులకూ విద్యార్థులకూ కూడా హర్షదాయక మవుతుందని భావిస్తున్నాము.

కేవలం తెలుగుదేశంలోనే కాకుండా యావద్భారతంలోనూ ఖండ ఖండాంతరాలలోనూకూడా సంస్కృత సాహిత్య జగత్తులో ప్రసిద్ధి పొందినవాడు మల్లినాథుడు. బహుళసంఖ్యలో ఉన్న ఇతని వ్యాఖ్యలు రమణీయాలై సులభశైలిలో విద్యార్థులపాలిటి కల్పవృక్షాలై విరాజిల్లుతున్నాయి. ఈ వ్యాఖ్యలకు గల విశేష ప్రచారమే మల్లినాథునికి వ్యాఖ్యాతృ చక్రవర్తి గౌరవాన్ని సంతరించింది. ఈ వ్యాఖ్యలలో ఇతనికిగల బహుముఖ శాస్త్రవైదుష్యమూ, లోకజ్ఞతా వెల్లడి అవుతున్నాయి.

మన ప్రాచీనులు అందరూ మహాగ్రంథాలు వ్రాశారు. మహావ్యాఖ్యానాలు రచించినారు. అనేక విషయాలను విపులంగా వివరించారు. కాని ఎక్కడా తమ గురించికాని, కాలం గురించికాని, సమ

కాలికులగురించికాని, కొంచెమైనా ప్రస్తావించలేదు. ఇది కేవలం భారతీయుల తాత్త్వికదృష్టికి నిదర్శనంగా కనిపిస్తున్నది. ఈ మార్గాన్నే అనుసరించిన మల్లినాథ సూరికూడా తన కాలమూ, జీవిత విశేషాలూ, వంశావళీ మొదలైనవాటిని ఎక్కడా పేర్కొనలేదు. అయినా ఇతడు ఉదాహరించిన గ్రంథాలూ, గ్రంథకర్తల పేర్లూ కొంతవరకూ ఈతని కాలాన్ని నిర్ణయించడానికి సహకరిస్తున్నాయి. ఇదే విధంగా ఈతనిగురించి ఇతని కుమారుడైన కుమారస్వామి సోమపీథి రత్నాపణ వ్యాఖ్యానారంభంలో చెప్పినవిషయాలూ, చంపూ రామాయణవ్యాఖ్య - పదయోజనలో - కోలాచల వంశీయుడైన నారాయణ పండితుడు చెప్పిన శ్లోకాలూ. స్వర మనోజ్ఞ మంజరికి పరిమళవ్యాఖ్యవ్రాసిన మల్లినాధ సూరి కుమారుడైన గిరినాథుడు చెప్పిన మాటలూ ఉపయోగపడుతున్నాయి,

సంస్కృత వాఙ్మయంలో ప్రధానస్థానాన్ని ఆక్రమించిన గ్రంథాలకు వ్యాఖ్యలు వ్రాసినవారిలో మల్లినాధ సూరి ప్రముఖుడు. ఇతని వ్యాఖ్యలనుబట్టి కోలచల వంశానికి చెందినవాడని మాత్రం తెలుస్తున్నది. వ్యాఖ్యాన పీఠికా శ్లోకాలలోని "వాణీం కాణభుజీం" అనే శ్లోకాన్ని బట్టి కణాదుడు రచించిన వైశేషికంలోనూ, జైమిని రచించిన పూర్వ మీమాంసలోనూ, వ్యాసుడు రచించిన ఉత్తర మీమాంసలోనూ, పాణిని కాత్యాయన పతంజలులు రచించిన వ్యాకరణ శాస్త్రంలోనూ, గౌతమముని రచించిన న్యాయశాస్త్రంలోనూ చక్కని పాండిత్యం కలవాడు అని తెలుస్తూఉంది. ఇంతేకాక పై శ్లోకంలోని "లోకేఽభూత్ యదుపజ్ఞ మేవ విదుషాం సౌజన్య జన్యం యశః" అనేభాగం ఈతని సౌజన్య మూర్తిమత్వాన్ని మనకు సాక్షాత్కరింపజేస్తూ ఉంది.

మల్లినాథుని కాలాన్ని నిర్ణయించేటప్పుడు మల్లినాథుడు రచించిన గ్రంథాలూ, వ్యాఖ్యలూ పరిశీలించడం అవసరం.

అట్లా పరిశీలించేటప్పుడు మల్లినాథుని పేరుతో మరికొందరు మల్లినాథులు తారసిల్లడం, అనేకమయిన చాటువులూ, కథలూ, వ్యాఖ్యలూ మల్లినాథుని పేరుతో దొరకడం ఈ కాలనిర్ణయంలో క్లిష్టత కలిగిస్తున్నాయి. అందుచేత ఈ గ్రంథాలూ, వ్యాఖ్యలూ, చాటువులూ అన్నీ ఏక మల్లినాథకర్తృకాలా? కావా? అనే విషయాన్ని చర్చించిన మీదటే మన మల్లినాథుని కాలాన్ని నిర్ణయించడం సుగమమవుతుంది. అందుచేత ఇతర మల్లినాథులగురించి కూడా కొంతవరకు చర్చించడం అవసరమవుతూ ఉంది.

కొందఱు విద్వాంసులు ఈగ్రంథాలూ, వ్యాఖ్యలూ చాటువులూ ఏకమల్లినాథ కర్తృకాలే అని భావిస్తున్నారు కాని కాలంలోని వ్యత్యాసాలనూ, తక్కిన సమాచారాలనూ పరిశీలిస్తే మల్లినాథ నామధేయులు చాలమంది ఉన్నారని నిరాఘాటంగా చెప్పవచ్చు.

భోజ ప్రబంధంలోని కొన్ని ప్రశంసలలో ఒక మల్లినాథుని ప్రశంసఉంది. భోజప్రబంధం వ్రాసినవాడు బల్లాల సేనుడు. ఇతని తండ్రి లక్ష్మణసేనుడు పీరి నివాసము మిథిలానగరము ఈ బల్లాల సేనుడు తన గ్రంథంలో ఇచ్చిన కాలం క్రీ.శ. 1217. అయితే మన మల్లినాథసూరి తన వ్యాఖ్యలలో క్రీ.శ. 13, 14 శతాబ్దాలలోని గ్రంథాలనుంచి ఉదాహృతులు చూపడంవల్ల భోజ ప్రబంధంలోని మల్లినాథుడు వేరొకడని తెలుస్తూ ఉంది.

నైషధీయచరితానికి నరహరి అనేవాడు కూడా వ్యాఖ్య వ్రాశాడు. అతడు ఆంధ్రదేశంలో త్రిభువనగిరిలో విక్రమశకం 1279 అంటే క్రీ.శ. 1222 ప్రాంతంలో నివసించాడు. ఉపోద్ఘాత శ్లోకాలలో ఇతడు తాను మల్లినాథుని కుమారుణ్ణి అని చెప్పుకొన్నాడు. కాని కాలనిర్ణయ వ్యత్యాసాన్నిబట్టి ఇతడుకూడా మన మల్లినాథుడు కాడని వేరొకడని తెల్లమవుతూ ఉంది.

కుమారసంభవ కావ్యాన్ని, దాని వ్యాఖ్యానాన్ని ఎత్తి వ్రాసిన మల్లినాథసూరి కుమారుడొకడున్నట్లు తెలుస్తూ ఉంది. ఆ ఎత్తివ్రాసిన ప్రతిమీద క్రీ శ. 1603 అని కాలం గుర్తింపబడి ఉంది. ఇతడుకూడా మనమల్లినాథుడుకాడని స్పష్టమవుతున్నది. ఎటూ అంటే మల్లినాథుని కుమారుడైన కుమారస్వామి సోమపీథి కాలం 15వ శతాబ్ది అని స్పష్టంగా తెలియడం, తండ్రి, సోదరుల వృత్తాంతాన్ని ఇతడు పీఠికలో చెప్పుకొని ఉండటంవల్లా ఇతని తండ్రి అయిన మల్లినాథుడు 17వ శతాబ్దివాడు కావడం సంభవించదు.

పథ్యాపథ్య నిరూపణమనే వైద్యశాస్త్ర గ్రంథాన్ని రచించిన మల్లినాథుడొకడు కనిపిస్తున్నాడు. ఇతడు శకసంవత్సరం 1644 అంటే క్రీ శ. 1722 వాడని తెలుస్తున్నది. ఇతడుకూడా మన మల్లినాథునికంటె వేరొకడు కావడం నిర్వివాదము.

జైనులు ఒక మల్లినాథుని 19వ తీర్థంకరునిగా పేర్కొంటూ ఉంటారు, కాలక్రమాన అతడు బ్రాహ్మణుడుగా మారినట్లు జైనుల వాదమున్నది. కాని ఈ విషయమేదీ మన మల్లినాథుని వ్యాఖ్యానాలలో ఎక్కడా ప్రస్తావించడం జరుగలేదు. కాబట్టి ఈ మల్లినాథుడు కూడా వేరొకడని రూఢి అవుతున్నది.

థియోడర్ ఆఫ్రెక్ట్ కేటలాగస్ కేటలాగోరంలో ఒక మల్లినాథుని పేర్కొన్నాడు. మల్లినాథుని తండ్రి ఆదిత్యవర్మ. కుమారుడు త్రిభువనదేవుడు. ఈ త్రిభువనదేవుడు ప్రాకృత వ్యాకరణ వృత్తి వ్రాసినవాడు. పై విషయాలను బట్టి ఇతడుకూడా మన మల్లినాథసూరి కాకపోవడం స్పష్టము.

మాఘకావ్యానికి ముందుమాట వ్రాస్తూ పండితదుర్గాప్రసాదుగారు మల్లినాథుడు బ్రాహ్మణుడనీ. వత్సగోత్రుడనీ పేర్కొన్నారు. ఇతడు కడపజిల్లాలోని త్రిభువనగిరి గ్రామంలో జన్మించాడు. తండ్రిపేరు నరసింహాభట్టు తాతపేరు రామేశ్వరభట్టు.

భార్యపేరు నాగమ్మ కుమారులు నారాయణ నరహరులు అని తెల్పినారు. వీరిలో నరహరి సన్యాసదీక్ష తీసుకొన్నట్లు కావ్య ప్రకాశానికి "బాల చిత్తాను రంజనీ" అనే వ్యాఖ్య వ్రాసినట్లు తెలుస్తున్నది. ఈ నరహరినే సరస్వతీతీర్థ నామంతో వ్యవహరిస్తున్నారు. ఇతడు తన జన్మ కాలాన్ని శకసంవత్సరం 1298 అంటే క్రీ.శ. 1242గా చెప్పుకొన్నాడు. ఇతడు తన తాత ముత్తాతల గురించి తన "బాల చిత్తాను రంజనీ" ఉపోద్ఘాతంలో ఎక్కువ ప్రశంసించాడు. తన తండ్రిని సోమయాజిగా మాత్రం పేర్కొన్నాడు. యజ్ఞంచేసి తన తండ్రి సోమయాజి అయినట్లు అప్పటినుంచీ తన కుటుంబంలోని వ్యక్తులకు 'దీక్షిత' బిరుదు వస్తున్నట్లు వివరించాడు. అంతేకాక సోమయాగం చేసిన తర్వాతనే తన తండ్రికి గొప్ప ప్రతిష్ఠ వచ్చినట్లుకూడా చెప్పుకొన్నాడు. దీని తర్వాత తన సోదరుడైన నారాయణుని గురించీ, తన గురించీ చెప్పడం ఆరంభించాడు. అంతేకాని తన తండ్రిపేరు మల్లినాథుడు అనికానీ, అతడు కవి అనికానీ, వ్యాఖ్యాత అనికానీ, ఎక్కడా చెప్పలేదు. కాగా మన మల్లినాథునికి కుమారులు ముగ్గురు, 1. పెద్దయార్యుడు. 2. కుమారస్వామి. 3. గిరినాథుడు. మల్లినాథుని తండ్రిపేరు కపర్ది. తాత శతావధాని మల్లినాథ నామధేయుడు, అందుచే ఇతడుకూడా మన మల్లినాథుడు కాడని నిస్సంశయంగా చెప్పవచ్చు.

దక్కన్ కాలేజీలోని పండిత వామనాచార్య మల్లినాథుడు-బ్రాహ్మణుడనీ కాశ్యపగోత్రం వాడనీ అతని వంశీయులు ఇప్పటికీ ధార్వాడ్ జిల్లాలోని గదగ దగ్గరలో ఉన్న గజేంద్రగద నగరంలో ఉన్నారనీ అంటున్నారు. కాని దీనికి సరిఅయిన ఆధారాలు వామనాచార్య చూపలేదు.


అమరకోశానికి అమరపదపారిజాతమనే పేరుతో ఒక టీక కనిపిస్తున్నది. ఆ టీక మల్లినాథుడు రచించినట్లు ఉన్నది. కొందరు

విద్వాంసులు అమరపద పారిజాతము మల్లినాథ సూరి రచనమే అయి ఉంటుందని భావించారు. కాని అందుకు ఆధారాలు లేవు. డా ఆఫ్రెక్ట్‌గారుకూడా ఈ విషయంలో పొరపాటు పడ్డారు. వారు మల్లినాథ సూరి రచనలు వరసగా చెబుతూ అందులో అమరపద పారిజాతాన్నికూడా ఉదహరించారు. అంతేకాక ఈ అమరపద పారి జాతం వ్రాతపతి మద్రాస్ గవర్నమెంటు ఓరియంటల్ లైబ్రరీలో ఉన్నదని ఆఫ్రెక్టుగారే చెప్పారు. శ్రీ కె.పి. త్రివేదిగారు తానా ప్రతిని సంపాదించి చదివాననీ, అందులోని ఉపోద్ఘాత శ్లోకాలు చది విన మీదట అమరపద పారిజాతం స్పష్టంగా మరో మల్లినాథ రచనమే అని స్పష్టమయిందనీ చెప్పారు. ఈ ఉపోద్ఘాత శ్లోకాలలో ఇతడు "వ్యాచ ష్టే. మరసింహ నామక మహం శ్రీవత్స గోత్రోద్భవో బోల్లా పిన్నినృసింహసూరి తనయః శ్రీ మల్లినాథో ముదా" అని చెప్పడం వల్ల అమరపద పారిజాతరచన మన మల్లినాధుది కాదని మరో మల్లి నాథుని రచనమనీ స్పష్టమవుతున్నది. ఈ విషయాన్నే డా పి. శ్రీరామమూర్తి. రీడరు, ఆంధ్ర విశ్వవిద్యాలయము, తమ సిద్ధాంత వ్యాసం 196 పేజీలో పేర్కొనడం ఈ వాదాన్ని బలపరుస్తూ ఉంది.

పై విషయాలన్నింటినీ సమగ్రంగా పరిశీలిస్తే కొన్ని విష యాలు తెలుస్తున్నాయి. మీద చెప్పిన మల్లినాధ నామధేయులలో ఏ ఒక్కరికీ మహోపాధ్యాయ బిరుదంలేదు. వారెవ్వరూ పదవాక్య ప్రమాణ పారాపార పారీణులుగా ప్రసిద్ధులుకారు. ఇంటిపేరు కోల చలమని వారిలో ఎవ్వరూ చెప్పుకోలేదు. తాత తండ్రుల పేర్లు, కాలము, నివాసాలు వేరు వేరుగా ఉన్నాయి

ఈ విధంగా పరిశీలించిన మీదట కోలచల వంశీయుడూ, పద వాక్య ప్రమాణ పారావార పారీణుడూ, మహోపాధ్యాయ బిరు దాంకితుడూ, కాకతి ప్రతాపరుద్రునిచే కనకాభిషేక గౌరవం పొందిన

మల్లినాథ శతావధానికి మనుమడూ, శ్రౌతకల్పానికి వ్యాఖ్యవ్రాసినవాడూ, వేదవేదాంగవేత్తా అయిన కపర్ది పండితునకు కుమారుడూ, ప్రతాపరుద్రీయానికి రత్నాపణవ్యాఖ్య వ్రాసిన కుమారస్వామి సోమపీథికితండ్రీ, వ్యాఖ్యాతృచక్రవర్తీ అయిన మల్లినాథుడే మన మల్లినాథ సూరిఅనీ, ఇతడే రఘువంశాది కావ్యాలకు వ్యాఖ్యలు రచించినవాడనీ స్పష్టమవుతున్నది.



వంశావళి

మల్లినాథ సూరి తన వ్యాఖ్యలలోగాని, రచనలలో గాని తన పూర్వులను వంశావళిని ఎక్కడా ప్రస్తావించలేదు. గద్యలనుబట్టి పద వాక్యప్రమాణపారావారపారీణుడనీ మహోపాధ్యాయుడనీ, కోలచల వంశీయుడనీ మాత్రమే తెలుసుకోవడానికి వీలవుతున్నది.

అయినా మల్లినాథ సూరి వంశంలోనివాడైన నారాయణ పండితుడు రచించిన పదయోజనమనే చంపూరామాయణ వ్యాఖ్యానంలోని శ్లోకాలనూ, ప్రతాపరుద్రీయానికి రత్నాపణ వ్యాఖ్య వ్రాసిన కుమారస్వామి సోమపీథి రచించిన పీఠికా శ్లోకాలనూ, నృసింహ విరచిత స్వర మనోజ్ఞమంజరికి పరిమళ వ్యాఖ్య వ్రాసిన గిరినాథుని వ్రాతలనూ ఈ వంశావళిని నిర్ణయించడంలో మనము ఆధారాలుగా స్వీకరించవచ్చు.

వీరిలో పదయోజన వ్యాఖ్యానాన్ని రచించిన నారాయణ పండితుడు మన మల్లినాథ సూరికి తొమ్మిదో తరంవాడు. రత్నాపణ వ్యాఖ్యానాన్ని రచించిన కుమారస్వామి సోమపీథి మల్లినాథుని రెండో కుమారుడు. పరిమళ వ్యాఖ్యానాన్ని రచించిన గిరినాథుడు కూడా తాను మల్లినాథ సూరికి కుమారుడనని చెప్పుకొన్నాడు. "పరిమళ" వ్యాఖ్య *R. 3488 and Indian Antiquary Volume No.* II పేజీ 445.

నారాయణ పండితుని రచననుబట్టి వంశావళిని ఈ క్రింది విధంగా నిర్ణయించవలసి ఉంటుంది. నారాయణ పండితుని చంపూరామాయణ వ్యాఖ్యానమైన పదయోజన పీఠికలోనివిగా ఈ క్రింది శ్లోకాలను శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు "మీగడ తరక"లనే వ్యాస సంపుటిలో ఉదాహరించారు.

"కోలచెల్మాన్వయాబ్ధీందుర్మల్లినాథో మహాయశాః
శతావధాన విఖ్యాతో వీరరుద్రాభి వర్షితః
మల్లినాథాత్మజః శ్రీమాన్ కపర్ది మంత్రకోవిదః
అఖిల శ్రౌత కల్పస్య కారికా వృత్తిమాతనోత్.
కపర్దితనయో ధీమాన్ మల్లినాథోఽగ్రజః స్మృతః
ద్వితీయస్తనయో ధీమాన్ పెద్దిభట్టో మహోదయః
మహోపాధ్యాయ అఖ్యాతః సర్వదేశేషు సర్వతః
మాతులేయ క్రతౌ దివ్యే సర్వజ్ఞేనాభివర్షితః
గణాధిప ప్రసాదేన ప్రోచే మంత్రవరాన్ బహూన్
నైషధ జ్యోతిషాదీనాం వ్యాఖ్యాతాఽభూత్ జగద్గురుః
పెద్దిభట్ట సుతః శ్రీమాన్ కుమారస్వామి సంజ్ఞకః
ప్రతాపరుద్రీయాఖ్యాన వ్యాఖ్యాతా విద్వదగ్రిమః
తనయాస్తస్య చత్వారో మహాదేవస్తదగ్రజః
... ..."

మల్లినాథ సూరి తాత అయిన మల్లినాథుడు శతావధానాలు చేసి ప్రతాపరుద్రునిచేత కనకాభిషేక సత్కారం పొందినట్లు పై శ్లోకాలవల్ల తెలుస్తున్నది. తండ్రిఅయిన కపర్దిస్వామి గొప్ప విద్వాంసుడు, మంత్రకోవిదుడు ఈతడు కల్పానికి చెందిన పఆస్తంబ శ్రౌత, కల్ప, గృహ్యసూత్రాలకు భాష్యాలు, ఆపస్తంబ గృహ్య కారికలు, దర్శపూర్ణమాసభాష్యం, భారద్వాజ గృహ్యసూత్ర భాష్యమూ మొదలైనవి రచించాడు. ఇతడు ఎక్కువగా ఆపస్తంబ కల్పానికి భాష్యాలు రచించడంవల్ల ఇతడు కృష్ణ యజుర్వేదశాఖకు చెందినవాడని చెప్పవచ్చు.

కపర్దికారికలు వ్రాసిన కపర్దిస్వామీ, ఈ కపర్ది ఒక్కడే అని చెబుతున్నారు. ఆపస్తంబ గృహ్యసూత్రాలకు తాత్పర్యదర్శనం వ్రాసిన సుదర్శనాచార్యుడు "యత్కృతం వేదవద్భాష్యం అద్రి


యంతే విపశ్చితః సకపర్ది చిరంజీయాత్ వేదవేదాంగ తత్త్వవిత్" అని కపర్దిని స్తోత్రించేశాడు.

ప్రస్తుతం హైదరాబాద్ నగరంలోని కాలిబండలో నివసిస్తున్న శ్రీ గుండేరావు హార్కారేగారు తాను తాళపత్ర ప్రతులలో కపర్ది కారికలు చూసినట్లు చెబుతున్నారు. వీరు బహుభాషాకోవిదులు, పాణిని అష్టాధ్యాయికి అనుగుణంగా యంత్రాన్ని నిర్మించి, రూప సాధన ప్రక్రియాలాఘవాన్ని సాధించిన ప్రతిభాశాలి. విదేశీయ సంస్కృత వ్యాకరణ పండితులచే ప్రశంసలు పొందిన ఈ శతాధిక వయోవృద్ధులు తామీకపర్దికారికలను చూసిఉన్నట్లు చెప్పిఉన్నారు.

కపర్దికి మల్లినాథుడూ, పెద్దిభట్టూ అనే వారు ఇద్దరు కుమారులనీ, వీరిలో మల్లినాథుడే పెద్దవాడనీ, రెండోవాడైన పెద్దిభట్టు మహావిద్వాంసుడుగా మహోపాధ్యాయుడుగా జగద్గురువుగా పేరు పొందినవాడనీ, నైషధాది గ్రంథాలకు వ్యాఖ్యలను రచించినవాడనీ, తెలుస్తూఉంది. ఈ పెద్దిభట్టు కుమారుడు కుమారస్వామి సోమపీథి. ఇతడే రత్నాపణవ్యాఖ్య వ్రాసినవాడు. ఇతనికి కుమారులు నలుగురు. మొదటివాడు మహాదేవుడు. మహాదేవునికి కుమారుడు శంభువు. శంభుని కుమారుడు భాస్కరుడు. భాస్కరుని కుమారుడు నాగేశ్వరయజ్వ. ఇతని పుత్రుడు కొండుభట్టు. కొండుభట్టుసుతుడు నాగేశ్వరయజ్వ. నాగేశ్వరయజ్వ భార్య నరసమాంబ. ఈ నాగేశ్వర యజ్వకూ నరసమాంబకూ తాను జన్మించినట్లు నారాయణ పండితుడు తన వంశీయులను పదయోజన వ్యాఖ్యానంలో వివరించి ఉన్నాడు.

నారాయణ పండితుని రచన ఆధారంగా లభించిన వంశావళి

కోలచల మల్లినాథుడు I శతావధాని



పెద్దిభట్టు నైషధాది కావ్యాలకు వ్యాఖ్యలు వ్రాసి తన అన్నగారి పేరుపెట్టినట్లు ఒక ప్రవాదంఉన్నది. నారాయణ పండితుని వాక్యాలుకూడా అట్లాంటి జనశ్రుతిమీదనే ఉన్నట్లు కనిపిస్తున్నది. మల్లినాథునికి తొమ్మిదోతరంవాడైన నారాయణ పండితుని ఈ మాటలు అంత విశ్వసనీయమైనవికావు. బ్రహ్మశ్రీ మల్లాది

సూర్యనారాయణశాస్త్రి గారి అభిప్రాయంకూడా ఈ భావాన్నే బలపరుస్తున్నది. "మల్లినాథుని తమ్ముడైన పెద్దిభట్టు నైషధాది కావ్యాలకు వ్యాఖ్యలను తన అన్నపేర నిర్మించాడనీ, కుమారస్వామి యజ్వ ఆ పెద్దిభట్టుకు కొడుకేకాని ప్రసిద్ధ మల్లినాథుని ఔరసుడు కాడనీ తెలుస్తున్నది. కాని మన మల్లినాథుని తరువాత ఏదో పురుషుడైన ఈ నారాయణునిమాటకంటె మల్లినాథుని తరువాతి పురుషుడైన కుమారస్వామి మాటకు ఎక్కువ ప్రమాణం ఉంటుం దనటం స్పష్టమే. అయినా ఆ వంశంలోనివాడే ఇంత తేడాగా ఎందుకు చెప్పాడో ఊహించడం కష్టం. కుమారస్వామి కంఠోక్తిగా చెప్పినమాటలను నమ్మక తప్పడంలేదు. "ఇతి శ్రీ పదవాక్య ప్రమాణ పారావారపారీణ కోలచల మల్లినాథసూరి సూనునా విశ్వజకన విద్యస్య విద్వన్మణేః పెద్దనార్యస్యానుజేన కుమారస్వామి సోమపీథినావిరచితే ప్రతాపరుద్రీయ వ్యాఖ్యానే రత్నాపణాఖ్యానే" (సంస్కృత కవిజీవితము : శ్రీ మల్లాది సూర్యనారాయణశాస్త్రి పేజీ 474-481).

ప్రతాపరుద్రీయానికి రత్నాపణ్య వ్యాఖ్య రచించిన కుమార స్వామి సోమపీథి వ్యాఖ్యానారంభంలో తన వంశ క్రమంగురించి ఇట్లా చెప్పాడు.

"త్రిస్కంధ శాస్త్రజలధించుళుకీ కురుతేస్మయః
తస్య శ్రీమల్లినాథస్య తనయోఽజని తాదృశః
కోలచల పెద్దయార్యః ప్రమాణ పద వాక్యపారదృశ్వాయః
వ్యాఖ్యాత నిఖిలశాస్త్రః ప్రబంధకర్తాచ సర్వ విద్యాసు
తస్యానుజన్మా తదనుగ్రహోత్త విద్యోఽనవద్యో వినయావనమ్రః
స్వామీ విపశ్చి ద్వితనోతి టీకాం ప్రతాపరుద్రీయరహస్య భేత్రీం"

కుమారస్వామి శ్లోకాలనుబట్టి లభించిన వంశావళి

మల్లినాథుడు

పెద్దయార్యుడు | కుమారస్వామి సోమపీథి

పై శ్లోకాలను బట్టి మల్లినాథసూరికి ఇద్దరు కుమారులనీ వారిలో పెద్దవాడు పెద్దయార్యుడు, రెండోవాడు కుమారస్వామి సోమపీథి అని స్పష్టమవుతున్నది. నారాయణ పండితునివలె ఇతడు పూర్వుల్ని పేర్కొనక తండ్రినీ సోదరునీమాత్రమే పేర్కొన్నాడు. కుమారస్వామి సోమపీథి చెప్పిన దానినిబట్టి మల్లినాథుని పెద్ద కుమారుడైన పెద్దయార్యుడు కూడా తండ్రివలెనే పదవాక్య ప్రమాణ పారావార పారీణుడని, నిఖిలశాస్త్ర వ్యాఖ్యాత అనీ సర్వ విద్యలలో ప్రబంధాలు రచించినవాడనీ తెలుస్తున్నది. కుమార స్వామి సోమపీథి తనఅన్నఅయిన పెద్దయార్యుని అనుగ్రహంవల్లనే తాను సకలశాస్త్రాలు గ్రహించినట్లు చెప్పుకొన్నాడు.

ఈ పెద్దయార్యునికే పెద్దిభట్టు అనే వ్యవహారం ఉండి ఉండ వచ్చు. తండ్రి అంతటి మహాపండితుడైన ఈ పెద్దిభట్టు వ్యాఖ్యాన రచనలలో తండ్రిగారికి సహాయపడి ఉండవచ్చు. అందువల్లనే కొన్ని నైషధ, శిశుపాలవధాది కావ్యాల వ్రాతప్రతులలో వ్యాఖ్యాంతా లలో "పెద్దిభట్ట విరచితే" అని కనబడుతున్నది. తంజావూరు పుస్తక భాండాగారం లిఖిత పుస్తకం 3608 నంబరుపైని "పెద్దిభట్టీయ వ్యాఖ్యానమ్" అని ఉన్నట్లు బ్రహ్మశ్రీ మల్లాది సూర్యనారాయణ శాస్త్రిగారు సంస్కృత కవిజీవితంలో వెల్లడించారు(పేజీ 474-481). ఈ విషయం మీద చెప్పిన అభిప్రాయానికి ఉపబలకంగా ఉన్న దని చెప్పవచ్చు. "మాతులేయ క్రతౌ దివ్యే సర్వజ్ఞైనాభివర్ణితః" అని చెప్పిన నారాయణుని వాక్యాంకూడా ఈ పెద్దయార్యునికి సరిపడు

తున్నవి. దీనికి ఆధారంగా సాహితీవాఙ్మయము పేజీ 403-404లలో శ్రీ ఖండవల్లి లక్ష్మీరంజనంగారు చూపిన సర్వజ్ఞ సింగభూపాలుని కాలనిర్ణయం తోడ్పడుతున్నది.

మొదటి సింగభూపతి

అనపోతనాయుడు క్రీ. శ. 1380

|

రెండవ సింగభూపతి క్రీ. శ. 1365-1397

(రసార్ణవ సుధాకర, రత్నపాంచాలిక, సంగీత సుధాకర గ్రంథాలు రచించినవాడు)


|

రెండో అనపోత లేక కుమారాన్నపోత

|

మూడో సింగభూపతి క్రీ. శ. 1422 (సర్వజ్ఞ బిరుదాంకితుడు)

పై విధంగా సర్వజ్ఞ సింగభూపాలుని కాల నిర్ణయమూ, సర్వజ్ఞ బిరుద నిర్ణయమూ, రసార్ణవసుధాకరం మొదలయిన గ్రంథ కర్తృత్వ నిర్ణయమూ, స్పష్టమవుతున్నవి. ఇందులో రెండో సింగభూపతికే సర్వజ్ఞ బిరుదం చెందుతుందనీ రసార్ణవ సుధాకరం మొదలయిన గ్రంథాలు ఇతడే రచించాడనీ, పెద్దిభట్టుకు కనకాభిషేకం చేసినవాడు ఇతడే అని భావించవచ్చు. History of Reddi Kingdoms" పేజీ 467లో క్రీ. శ. 1378 తరవాత అనవోతారెడ్డిచే కోలచల పెద్దిభట్టు సన్మానం పొందినట్లూ, పెద్దిభట్టు కొల్లూరు గ్రామమంనుంచి వృత్తి గ్రహించినట్లూ ఆధారాలున్నాయి. నృసింహ విరచితమైన స్వరమనోజ్ఞ మంజరికి పరిమళ వ్యాఖ్య వ్రాసిన గిరినాథుని వ్రాతలుబట్టి వంశావళిని కిందివిధంగా చెప్పవలసిఉంటుంది.



డా॥ వి. రాఘవన్‌గారు గిరినాథునికి మరోపేరు పెద్దిభట్టుగా ఊహించారు. కాని అది నిరాధారమైనది. గిరినాథుని వ్రాతలనుబట్టి మల్లినాథునికి ముగ్గురు కుమారులని తెలుస్తున్నది. కుమారస్వామి తనకంటె పెద్దవాడూ మహావిద్వాంసుడూ తనకు సకల విద్యల ననుగ్రహించిన గురువూ అయిన పెద్దిభట్టు గురించీ, తండ్రి అయిన మల్లినాథుని గురించీ మాత్రమే వివరించాడు. తక్కిన మరో సోదరుని గురించి కానీ తన కుమారులను గురించి కానీ పేర్కొలేదు. అయినా పెద్దిభట్టుతో సమానమయిన పాండిత్యంగల పెద్దిభట్టు ఒకడు తన తండ్రి అయిన మల్లినాథునికి సోదరుడుగా ఉండి ఉంటే తప్పకుండా పేర్కొనే ఉంటాడు. గిరినాథుడు కూడా కపర్దికి మల్లినాథుడొక్కడే కుమారుడున్నట్లు చెప్పాడు. శతావధాని అయిన మల్లినాథుని నుంచి వంశావళిని పేర్కొన్న గిరినాథుడు మన మల్లినాథసూరికి పెద్దిభట్టు అనే సోదరుడున్నట్లు చెప్పలేదు. ఈ విధంగా మల్లినాథునికి కుమారులైన కుమారస్వామిసోమపీథీ గిరినాథుడూ చెప్పిన మాటలకంటె జనశ్రుతులకుగానీ ఆ జనశ్రుతుల నాధారంగా చేసుకొని చెప్పిన నారాయణ పండితుని మాటలకుగానీ ప్రామాణికతను కల్పించటం అసమంజసము. కుమారుల మాటలు ప్రామాణికాలు కాని, మల్లినాథునికి తొమ్మిదోతరంవాడయిన నారాయణుని మాటలు ప్రామాణికాలు కావు. లోకప్రవాద భ్రమలోపడి నారాయణ పండితుడు అట్లా పేర్కొని ఉండవచ్చు.

వ్యాఖ్యాన పీఠికా శ్లోకాలు మాత్రమేకాక కుమారస్వామి సోమపీథి ప్రతాపరుద్రీయ వ్యాఖ్యానంలో "ఇతి పదవాక్య ప్రమాణ పారావార పారీణ శ్రీ మహోపాధ్యాయ కోలచల మల్లినాథసూరి సూనునా విశ్వజనీన విద్యస్య విద్వన్మణేః పెద్దయార్యస్యానుజేన కుమారస్వామి సోమపీథినా విరచితే" అనీ, ప్రకరణాంతంలో అభిసారికా లక్షణోదాహరణ ప్రసంగంలో "ఏతచ్చ సంజీవినీ సర్వంకషా దావసకృదుక్తమ్ తాతపాదైః" అనీ, ధృష్టలక్షణోదాహరణంలో "బహుశశ్చైతదుక్తం . తాతపాదైస్సంజీవిన్యాదౌ" అనీ నాటక ప్రకరణోదాహరణంలో ' యోఽయం జాతస్త్రిలోకీ" అనే శ్లోక వ్యాఖ్యానంలో "ఇదం" శబ్ద విచార సందర్భంలో "తదైవలోక వేదయోః ప్రయోగ దర్శనాదిత్యాది బహుధా ప్రపంచిత మస్మన్మహోపాధ్యాయ మల్లినాథసూరిణా ఏకావళీతరళే'' (ప్రతాపరుద్రీయ వ్యాఖ్యానం పేజీలు 23, 30, 33, 122) అనీ మల్లినాథసూరినే తన తండ్రి అని స్పష్టంగా పేర్కొవటంవల్ల మల్లినాథసూరే నైషధాది బహుగ్రంథ వ్యాఖ్యాత అనీ, అతని పుత్రులు పెద్దిభట్టు, కుమారస్వామిసోమపీథులనీ నిశ్చయమవుతున్నది. మల్లినాథునికి మూడో కుమారునిగా గిరినాథుని అంగీకరించడంలో ఎట్లాంటి విప్రతిపత్తిలేదు.

ఇంతకుముందు ''పెద్దిభట్ట విరచితే'' అనీ, "పెద్దిభట్టీయమ్'' అనీ శిశుపాలవధ కావ్య వ్యాఖ్యానంమీద ఉండటాన్నిబట్టి పెద్దిభట్టు వ్రాసి మల్లినాథుని పేరుపెట్టినాడన్న జనశ్రుతిని చర్చించాం. కాని మల్లినాథుడే శిశుపాలవధ కావ్య వ్యాఖ్యానమైన "సర్వంకష'' వ్రాసినట్లు కుమారస్వామిసోమపీథి "ఏతచ్చ సంజీవినీ సర్వంకషాదావసకృదుక్తం తాతపాదైః" అని కంఠోక్తిగా చెప్పడం పై జనశ్రుతిని పరాస్తం చేస్తున్నది.

మల్లినాథుని కుమారుడైన పెద్దయార్యుడు లేదా పెద్దిభట్టు తండ్రివలెనే పదవాక్య ప్రమాణ పారావార పారీణుడూ, మహా విద్వాంసుడూ అయి తండ్రిగారికి చేదోడువాదోడుగా ఉండి తండ్రి గారు రచించే వ్యాఖ్యలను తాను వ్రాస్తూ ఉండవచ్చు. తండ్రి అయిన మల్లినాథునితోపాటు ఇతడు కూడా చాల ప్రసిద్ధుడై ఉండటంవల్లా కొన్ని వ్రాతప్రతులపై "పెద్దిభట్ట విరచితే" అని ఉండటంవల్లా మల్లినాథుని కాలంలో ఇతడు అతనితో కలిసి ఉండటం వల్లా పెద్దిభట్టును మల్లినాథునికి సోదరునిగా భావించే అవకాశ మున్నది. అంతేకాక ఒకే గ్రంథానికి వ్రాసిన వ్యాఖ్యానానికి ప్రతులు సిద్ధం చేయడంలో మల్లినాథసూరిపేరూ, పెద్దిభట్టుపేరూ ఒకే స్థలంలో కన్పించడమే ఈ భ్రాంతికి మూలమై ఉండవచ్చు. మహా విద్వాంసుడైన పెద్దిభట్టు తాను స్వతంత్రంగా ఏ గ్రంథాన్నీ రచించినట్లు లేదు. తండ్రిగారికి సహాయంగా ఉండి వ్యాఖ్యలను వ్రాస్తూ ఉండేవాడేమో. తండ్రిగారిపేరనే వ్రాస్తున్నప్పటికీ అక్కడక్కడ ప్రమాదవశాన "పెద్దిభట్టీయమ్", "పెద్దిభట్ట విరచితే" అని లిఖితమై ఉండవచ్చు. దీన్ని ఆధారంగా తీసుకొని పెద్దిభట్టూ మల్లినాథసూరీ అన్నదమ్ములనీ పెద్దిభట్టు అన్నగారిపేర తానే వ్యాఖ్యలు వ్రాశాడనీ కొందరు భావించారు. మరికొందరు పెద్ది భట్టూ మల్లినాథసూరీ ఒక్కరే అని భావించారు. మల్లినాథసూరిని పెద్దిభట్టుగానూ పెద్దిభట్టునే మల్లినాథసూరిగానూ కొందరు భావించారు.

"భారతదేశంలో కొన్ని ప్రాంతాలలో మల్లినాథుడే పెద్ది భట్టు అనీ పెద్దిభట్టే మల్లినాథుడనీ అభేదంగా భావిస్తున్నారు దీనికి ఆధారంగా కృష్ణకర్ణామృతానికి పశుపతి పాప ఎల్లయసూరి వ్రాసిన "సువర్ణ చషకం" వ్యాఖ్యను చూపిస్తున్నారు."

శ్రీమతి ఆర్. అనంతలక్ష్మి (ఎమ్ ఏ.)

"పెద్దిభట్టు నైషధాది కావ్యాలకు వ్యాఖ్యలు వ్రాసి తన అన్నగారి పేరుపెట్టాడని ఒక ప్రవాదం ఉంది. నారాయణుని వాక్యం కూడా ఆ ప్రవాదాన్ని అనుసరించిందే. మల్లినాథుని తరువాతి పురుషుడైన కుమారస్వామి మాటలు అధిక ప్రమాణాలుగా తీసుకోవాలి కాని మల్లినాథసూరికి తొమ్మిదోతరంవాడైన నారాయణుని మాటలను ప్రామాణికంగా తీసుకోరాదు. లోకప్రవాద భ్రమలోపడి నారాయణుడు అట్లా పేర్కొని ఉండవచ్చు."

(శ్రీ భాష్యం విజయసారథి)

"మల్లినాథుడే పెద్దిభట్టుగా కొన్ని తెలుగు, కన్నడ ప్రాంతాలలో ప్రసిద్ధికెక్కాడు. ఇతని మరోపేరు "ఇది" అని భావించబడుతున్నది. ఈ రెండు భాషలలోనూ ఈ పేరుకు "చాలా తెలివి తక్కువవాడు", "మూఢుడు", "గ్రామీణుడు", అని అర్థం. ఇది మల్లినాథుని బాల్యాన్ని తెలుపుతున్నది. మల్లినాథుడు ముప్పది ఏళ్ళ తరవాత వారణాసిపోయి విద్య నేర్చుకొన్నట్లు ఆధారాలున్నవి. అతడు సర్వ విద్యాపారంగతుడైన తరవాతనే "భట్ట" బిరుదం వచ్చి ఉంటుంది. ఇప్పటికీ మైసూరులోనూ కొన్ని తెలుగు ప్రాంతాలలోనూ మల్లినాథుడు ఈ పెద్దిభట్టు బిరుదుతోనే స్మరింపబడుతున్నాడు."


(శ్రీ కె. పి. త్రివేది)

'పెద్దిభట్ట చరితమ్' అనే మూడు కన్నడ వాచకాలలో నుంచి పై విషయం సంగ్రహించబడింది. ఈ వాచకాలను ఎడిట్ చేసినవారు (1) పుట్టన్న బి.ఏ. (2) ఎం. బి. శ్రీనివాసయ్యంగార్ ఎం.ఏ. వీరిద్దరూ మైసూరులో సర్వీసులో ఉన్నవారు. త్రివేంద్రం సంస్కృత కాలేజి ప్రిన్సిపాల్ గారూ త్రివేదిగారికి మిత్రుడూ అయిన 'టి. గణపతిశాస్త్రిగారు' ఈ విషయాలు తమకు అందజేసినట్లు త్రివేదిగారే ఏకావళీ తరళవ్యాఖ్య ఉపోద్ఘాతంలో చెప్పారు.

కీ.శే. బ్రహ్మశ్రీ చెళ్లపిళ్ల వేంకటశాస్త్రిగారు కథలు, గాథలు అనే గ్రంథంలో "నా మూలం లిఖ్యతే కించిత్ నానపేక్షిత ముచ్యతే" అని పెద్దిబొట్లుగారు చెప్పినట్లు అని పెద్దిభట్టునూ మల్లినాథుణ్ణీ అభేదంగా పేర్కొన్నారు.

కీ శే. బ్రహ్మశ్రీ వేదం వేంకటరాయశాస్త్రిగారు కూడా మల్లినాథసూరిని ఒకమారు మల్లినాథుడనీ, అప్పుడప్పుడు పెద్దిభట్టుగారనీ వ్యవహరించారు. "జీమూతేన" అనేచోట "జీవస్య'' 'జీవనస్య మూతః పుటబంధో జీమూతః జీవనార్థం కర్మజీవనప్రదేనైవ కారయితవ్యమితిభావః' అను వివరణముచే పెద్దిభట్టు అంగీకారం సూచితమవుతున్నది అని వివరించారు." (మేఘ సందేశం అవతారిక)

మల్లినాథ-పెద్దిభట్టులు అన్నదమ్ములు. ఇద్దరూ మహా విద్వాంసులూ, వ్యాఖ్యాతలూ. అన్నగారిమీద పెద్దిభట్టుకు భక్తి విశ్వాసాలు ఎక్కువ. తాను రచించిన కావ్య వ్యాఖ్యానాలకు కూడా తన అన్నగారిపేరే పెడుతూ ఉండేవాడు. ఇత్యాదిగా విద్వత్పరంపరలో కర్ణాకర్ణిగా వ్యాపిస్తూ వచ్చిన కథలెన్నో కలవు. నా బాల్యమున మా కులవృద్ధులు ఆ కథలు చెప్పుకొనుచుండ నేనెన్నోసార్లు వినియున్నాను...ఇది అంతయూ పరిశీలింపగా నాకిట్లు తోచినది. నారాయణ పండితుని మాటలకున్నూ పూర్వులు నమ్ముతూ వచ్చిన కథలకున్నూ సామరస్యం కలిగించునది. పాఠకులు ఇది చూచి ఎట్లు నిర్ణయించినా సంతోషమే. మల్లినాథుడు-పెద్దిభట్టు సహోదరులే. పెద్దిభట్టు తనయులు పెద్దనార్యుడు, కుమారస్వామి యజ్వ. ఈ యజ్వ మల్లినాథుని స్వీకృత పుత్రుడై ఉండును. ఈ మాట తల పెట్టక తన వంశమునకు మూలపురుషుడైన కోలచల పెద్దిభట్టుకే కుమారస్వామి కొడుకైనట్లు నారాయణ పండితుడు పురుషక్రమమిచ్చియున్నాడు. కుమారస్వామి మల్లినాథుని కుమారుడనని చెప్పికొనుచూ జన్మచే సోదరుడయిన పెద్దనార్యునికి తమ్ముడయినట్లు




వ్రాసికొన్నాడు. ఇందేమీ అనౌచిత్యములేదు. కనుక మనమిట్లు భావించినచో సర్వమూ చక్కబడునని నా యాశయము.„ (సంస్కృత కవి జీవితము: మల్లాది సూర్యనారాయణశాస్త్రిగారు పేజీ 474-481).

"ఆంధ్రదేశమునబుట్టి సంస్కృతములో ఉద్దండపండితులై తమ అమూల్య గ్రంథరత్నములచే గీర్వాణ సరస్వతి నలంకరించి తమ విమలయశశ్చంద్రికల నాసేతుశీతాచలము వ్యాపింప చేసిన కపర్దిస్వామి, అన్నంభట్టు, జగన్నాధ పండితరాయలు, కవికళానిధి, కృష్ణభట్టు, రామచంద్రబుధేంద్రుడు, నీలకంఠుడు మొదలగు కొలది మంది పండితులలో మల్లినాథుడు అగ్రగణ్యుడు. మల్లినాథుడు పెద్దిభట్టు అనువారిద్దరునూ సోదరులనియు వారిలో పెద్దిభట్టారకుడు విద్వాంసుడై గ్రంథములను రచించి యన్నగారియందలి భక్త్యతిశయముచే తన గ్రంథములను మల్లినాథుని పేరుతో వెలయించెననియు జనశ్రుతి కలదు మల్లినాథసూరి వంశజుడగు నారాయణ పండితుడు రచించిన పదయోజనమను చంపూరామాయణ వ్యాఖ్యానము లోనివిగా "కొలచెల్మాన్వయాబ్ధీందుర్మల్లినాథో మహాయశాః... విద్వదగ్రిమః" అను శ్లోకములను శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు "మీగడతరక"అను వ్యాస సంపుటిలో నుదాహరించినారు. ఈ శ్లోకములు వ్యాఖ్యానము రచించినవాడు "పెద్దిభట్టు" అనియే చెప్పుచున్నవి.

"పెద్దిభట్ట గృహిణీ విరాజతే" అను శ్లోకములో గూడా ఈ పేరే ఉన్నది. సాంప్రదాయికులు పెద్దిభట్ట వ్యాఖ్యానములనియే నుడువుదురు. అయినను పెద్దిభట్టులవారు గ్రంథాంతగద్యలలో నన్నగారి పేరుంచుటచే మనము కూడా మల్లినాథునే గ్రంథకర్తగా వ్యవహరింతము."

(శ్రీ గరిమెళ్లఅచ్యుత సత్యశేషగిరి సోమయాజిశర్మ)

"మల్లినాథునకు పెద్దిభట్టు తమ్ముడనియు—మల్లినాథుడు మందబుద్ధియు, పెద్దిభట్టు కుశాగ్రబుద్ధియనియును చాలా కాలము తన్ను సేవించినందుల కానందించి యొకయోగి మల్లినాథునకు సారస్వత మంత్రముపదేశింపబోగా సోదరనియుక్తుడైన పెద్దిభట్టే యట్టితఱి దగ్గరనుండుట తటస్థించి యోగి అతనికే ఉపదేశించి దీని ఫలము మీయన్నగారికే అందజేయవలెనని చెప్పగా పెద్దిభట్టు అట్లే తాను వ్రాసిన గ్రంథములనన్నింటినీ అన్నయగు మల్లినాథుని పేరనే ప్రకటించెనను ఐతిహ్యముగలదు. ఇట్టివింకనుఅనేకములుగలవు.



యని రత్నాపణమువలన తెలియుచున్నది.

కుమారస్వామిసోమపీథి పెద్దిభట్టు కుమారుడని కొందరన్నను అవి రత్నాపణమునకు విరోధించుచున్నవి.

(తెలుగు విజ్ఞాన సర్వస్వము 4వ భాగము పేజీ 969 బు. వెం. ర)

వ్యాఖ్యాతృ చక్రవర్తి గురించి చెప్పేటప్పుడు జనశ్రుతులు ఆధారంగా ఏర్పడిన సందేహాలను తొలగించడానికి పెద్దిభట్టు మల్లినాథుల సంబంధాన్ని వివరించవలసిన అవసరమున్నది. కొందరు పెద్దిభట్టు మల్లినాథునికి తమ్ముడనీ, మరికొందరు అన్న అనీ, మరి

కొందరు మల్లినాథుడే పెద్దిభట్టు అనీ, ఈ "పెద్దిభట్టు" అనేది బిరుద నామమనీ అభిప్రాయపడుతున్నారు. పెద్దిభట్టు అంటే పెద్ద పండితుడు. మల్లినాథుడు పెద్ద పండితుడు కావడంవల్ల అతనికా బిరుదం వచ్చి ఉంటుందని కొందరిమతం. నారాయణ పండితుడూ అతణ్ణే అనుసరించిన మల్లాది సూర్యనారాయణశాస్త్రిగారూ తెలుగు విజ్ఞాన సర్వస్వము 4వ భాగంలో వ్యాసం వ్రాసిన శ్రీ బులుసు వేంకట రమణయ్యగారూ శ్రీ భాష్యం విజయసారథిగారూ, శ్రీ గరిమెళ్ల అచ్యుత సత్యశేషగిరి సోమయాజిశర్మగారూ, పెద్దిభట్టు మల్లినాథునికి తమ్ముడనీ అన్నగారిపేర అతడే వ్యాఖ్యలు రచించాడనీ అభిప్రాయపడుతున్నారు.

శ్రీ పాటిబండ మాధవశర్మగారు మాత్రము మల్లినాథుని పెద్దిభట్టుకు తమ్ముడుగా రాజశిల్పి నవలలో చిత్రించినారు.

కృష్ణకర్ణామృతానికి సువర్ణ చషక వ్యాఖ్య వ్రాసిన పశుపతి పాపయల్లయసూరి, శ్రీ చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రిగారూ, కీ. శే. బ్రహ్మశ్రీ వేదం వేంకటరాయశాస్త్రులుగారూ పెద్దిభట్ట మల్లినాథులు అభిన్నులని భావించారు.

కన్నడ వాచకాలనుంచి "పెద్దిభట్ట చరితమ్"ను సంగ్రహించిన శ్రీ టి. గణపతిశాస్త్రిగారు పెద్దిభట్ట మల్లినాథులు అభిన్నులని తెలిపినట్లు శ్రీ కె. పి. త్రివేదిగారు ఏకావళి తరళవ్యాఖ్య ఉపోద్ఘాతంలో తెలిపి ఉన్నారు.

పెద్దిభట్టు-మల్లినాథులు ఇద్దరూ విద్వాంసులూ, వ్యాఖ్యాతలూ అని మల్లాది సూర్యనారాయణశాస్త్రిగారు చెప్పారు.

వీరిని వేరువేరు వ్యక్తులుగా అంగీకరించినవారిలో మిగిలిన వారందరూ మల్లినాథుడు మందమతి అనే అభిప్రాయం వెలిబుచ్చారు. వీరందరి అభిప్రాయాలకూ, జనశ్రుతులకూ నారాయణ పండితుని మాటలు మాత్రమే ఆధారము.

మల్లినాథుని వంశంలోని నారాయణ పండితుడు ఒక్కడు మాత్రమే మల్లినాథునికి పెద్దిభట్టు అనే సోదరుడున్నట్లు చెప్పి ఉన్నాడు. మల్లినాథునికి పెద్దిభట్టు అనే సోదరుడున్నట్లు చెప్పిన వారందరికీ ఈ నారాయణ పండితుని మాటలే భ్రాంతిని కలిగించాయి. మల్లినాథుని కుమారులైన కుమారస్వామిగానీ, గిరినాథుడుగానీ మల్లినాథునికి పెద్దిభట్టు అనే సోదరుడున్నట్లు చెప్పలేదు. వీరి మాటలే ప్రమాణాలు కాని నిరాధారాలయిన నారాయణుని మాటలు స్వీకరించదగినవికావు.

కుమారస్వామిసోమపీథి పెద్దిభట్టుకు కుమారుడని వంశావళిలో నారాయణ పండితుడు పేర్కొన్నాడు. కుమారస్వామిసోమపీథి మాత్రం తాను మల్లినాథుని కుమారుడననీ తనకు పెద్దయార్యుడు అన్న అనీ అతనివద్దనే తాను విద్య అభ్యసించాననీ చెప్పాడు. పెద్దయార్యుణ్ణి పదవాక్య ప్రమాణ పారావార పారీణుడనీ, వ్యాఖ్యాత నిఖిలశాస్త్రిుడు అనీ, సర్వవిద్యలలోనూ ప్రబంధకర్త అనీ స్తుతించాడు. నారాయణ పండితుడు పెద్దిభట్టుకు కుమారస్వామిసోమపీథి అనే ఒక్క పుత్రుడు మాత్రమే ఉన్నట్లు చెప్పాడు

మల్లాది సూర్యనారాయణశాస్త్రిగారు ఈ భేదాలను సరిపెట్టడానికి మల్లినాథునికి పుత్రులేలేరనీ పెద్దిభట్టు కుమారుడైన కుమారస్వామిని దత్తపుత్రునిగా స్వీకరించి ఉంటాడనీ కుమారస్వామి పెంచుకొన్న తండ్రి అయిన మల్లినాథుణ్ణి తండ్రిగానూ జనకసోదరుడైన పెద్దయార్యుణ్ణి సోదరునిగానూ స్మరించి ఉంటాడనీ ఊహచేశారు. నారాయణ పండితుడు తాను కుమారస్వామికి అసలు సోదరులే ఉన్నట్లు చెప్పకపోవడంవల్ల. జనకసోదరుడొకడు ఉండటం అసంభవం ఇంతేకాక గిరినాథుడు మల్లినాథునికి తాను కుమారుణ్ణని చెప్పుకొని ఉన్నాడు. అందువల్ల మల్లినాథుడు అనపత్యుడనటం

పొసగదు. కుమారస్వామిని పెంచుకొన్న తర్వాత గిరినాథుడు పుట్టి ఉంటాడని అనుకొందామన్నా కుమారస్వామికంటె పెద్దవాడైన పెద్దయార్యుడున్నట్లు కుమారస్వామియే చెప్పి ఉన్నాడు. ఈ విధంగా ఎట్లా ఆలోచించినా మల్లినాథునికి కుమారస్వామి దత్త పుత్రుడనటం పొసగదు. దీనినిబట్టి కుమారస్వామి మాత్రమేకాక అతనికంటె పెద్దవాడైన పెద్దయార్యుడూ, చిన్నవాడైన గిరి నాథుడూ మొత్తం ముగ్గురు మల్లినాథునికి కుమారులని స్పష్టమవు తున్నది.

నారాయణ పండితుడు కుమారస్వామికి పెద్దయార్యుడు అనే సోదరుడున్నట్లు చెప్పకపోవడమూ, మల్లినాథునికే పెద్దిభట్టు అనే సోదరుడున్నట్లు చెప్పి, ఆ పెద్దిభట్టు కుమారుడే కుమారస్వామి అని భ్రమపడి చెప్పాడు. నారాయణుని మాటలు ప్రమాదజనితాలన డానికి కుమారస్వామి మాటలే ఆధారం. కాగా పెద్దయార్యుడే పెద్దిభట్టు అనీ, ఇతడు మల్లినాథునికి కుమారుడే కాని సోదరుడు కాడనీ తెలుస్తున్నది. తండ్రివలె ఇతడు కూడా పదవాక్య ప్రమాణ పారావారపారీణుడు, సర్వవిద్యలలో ప్రబంధాలు రచించినవాడు; నిఖిలశాస్త్ర వ్యాఖ్యాత; తండ్రికి వ్యాఖ్యానరచనలో సహాయం చేసినవాడు సర్వజ్ఞ సింగభూపాలునిచేగానీ, రెండో అనపోతారెడ్డిచే గానీ కనకాభిషేకాదిసమ్మానాలు పొందినవాడు ఈ పెద్దిభట్టే అని చెప్పవచ్చు.

అయితే ఈ మల్లినాథుడూ, అతని కుమారుడైన పెద్దిభట్టూ ఇద్దరూ సమాన ప్రతిభావంతులూ, విద్వాంసులూ అయి ఒకే కాల ములో ప్రసిద్ధులు కావటమే ఈ భ్రమ ప్రమాదాలకూ జనశ్రుతు లకూ మూలమని తలచటం సమంజసమని తోస్తున్నది.

—(౦)—

మల్లినాథుని నివాసము - ఇంటిపేరు

మల్లినాథసూరి నివాసం గురించీ, ఇంటిపేరు గురించీ విద్వాంసులూ, విమర్శకులూ పలురకాలుగా తమ అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. అధిక సంఖ్యలో వ్రాయబడిన మల్లినాథుని వ్యాఖ్యానాలకు వేరువేరు స్థలాల్లో నివసించే వ్యక్తులు, వేరువేరు కాలాల్లో ప్రతులు ఎత్తివ్రాయడంవల్ల మల్లినాథసూరి ఇంటి పేరులోనూ నివాసంలోనూ కొన్ని తేడాలు కనిపిస్తున్నాయి. ఇంతేకాక కోలాచలం శ్రీనివాసరావుగారు మొదలయిన మల్లినాథ వంశీయులు కొందరు వెలిబుచ్చిన ఊహాపోహాలు కూడా ఈ సందేహాలకు హేతువులయినాయి.

సాధారణంగా ఒక గ్రామంలో స్థిరంగా నివసిస్తూ ఉండేవారు మరో చోటికిపోయి అక్కడ నివాసం ఏర్పరుచుకొన్నప్పుడే ప్రత్యేకంగా వారిని పూర్వ గ్రామ నామంతో పేర్కొవడం పరిపాటిగా వస్తూ ఉంది. అందులోనూ తెలుగువారిలో సామాన్యంగా గ్రామనామమే గృహనామంగా ఉంటూన్న సంగతి ఇప్పటి తెలుగువాళ్ళ ఇంటిపేర్లను పరిశీలిస్తే స్పష్టంగా తెలుస్తూ ఉంది ఈ ఇంటిపేర్లు ఏర్పడ్డానికి ఇంతకంటే వేరే కారణం కనిపించదు.

ఈ మధ్య ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రంవారు మల్లినాథసూరిమీద ఒక సంచికా కార్యక్రమాన్ని ప్రసారం చేశారు ఈ కార్యక్రమాన్ని సమర్పించినవారు శ్రీ కేశవపంతుల నరసింహశాస్త్రి గారు. సంపాదకులు శ్రీ సన్నిధానం సూర్యనారాయణశాస్త్రిగారు. ప్రసారం చేసినవారు శ్రీ కప్పగంతుల లక్ష్మణశాస్త్రి, శ్రీ సన్నిధానం సూర్యనారాయణశాస్త్రి మొదలైనవారు. ఈ విద్వాంసుల

ప్రసంగాల్లోని విశేషాలను ఆకాశవాణి సౌజన్యంతో తెలుగు అకాడమీవారు "తెలుగు" అనే పత్రికలో ప్రకటించారు. మల్లినాథుని గురించి సన్నిధానంవారు మల్లినాథసూరి ఇంటిపేరు కోలాచలంవారని, ఇతడు తెలంగాణా వాస్తవ్యుడనీ, అంటే తెలగాణ్యుడనీ, సర్వతంత్ర స్వతంత్రుడనీ, మహోపాధ్యాయుడనీ, 15వ శతాబ్ది ప్రథమ పంచవింశతివాడనీ స్పష్టం చేశారు. కప్పగంతుల వారు హైదరాబాద్ సమీపంలో ఉన్న "కొలచలమ" మల్లినాథుని నివాసస్థలమనీ క్రీ.శ. 14వ శతాబ్ది ఉత్తరార్ధం ఇతని కాలమనీ, ఇతడు కాశ్యపగోత్రుడనీ చెప్పారు.

మల్లినాథసూరి కోలచలమ వంశానికి చెందిన వైదికుడు, కాశ్యపగోత్రుడు, ఆపస్తంబసూత్రుడుయజుశ్శాఖకు చెందినవాడు, కోలచలమ వారు మెదకు జిల్లాలోని పట్టంచెరువు ప్రాంతం వారు. కాకతీయరాజుల మన్ననలు పొంది ఏకశిలా నగరంలో స్థిరపడ్డారు. కాకతీయ రాజ్యం పతనమయిన తర్వాత రాచకొండ రాజుల ఆస్థానం అలంకరించారు .అని శ్రీభాష్యం విజయ సారథిగారు అభిప్రాయ పడుతున్నారు.

"ఆంధ్రదేశ ప్రసిద్ధు లయిన పూర్వమహా విద్వాంసుల లోని ఈ మహా పురుషుడు జగమెరిగిన బ్రాహ్మణుడు.........ఏకశిలా నగర ప్రాంతవాసి. కోలచలవంశ వర్ధనుడు. కౌశిక గోత్రుడు ఆపస్తంబ సూత్రుడు" అని మల్లాది సూర్యనారాయణ శాస్త్రిగారు వ్రాశారు.

మల్లి నాథుని వంశీయులు వరంగల్ ప్రాంతంలోని కొలచెలమలో మొదట నివసిస్తూ తరువాత విజయనగరానికి ఆ తరువాత రాచకొండకూ నివాసం మార్చినట్లు ఒకవాదం ఉంది.

మొత్తంమీద మల్లినాథసూరి తెలుగు బ్రాహ్మణుడనీ, ఇప్పటి తెలంగాణాలోని రాచకొండ ప్రాంతంలోని "కొలచెలమ"

గ్రామనివాసి అనీ స్పష్టమవుతున్నదని శ్రీమతి ఆర్. అనంతలక్ష్మి గారు అభిప్రాయ పడుతున్నారు,

ఉత్తర భారతంలో 'దేవపురం' అనే ఒక గ్రామముంది. అదే మల్లినాథుని జన్మస్థలమై ఉంటుందని కొందరు అభిప్రాయ పడుతున్నారు. అట్లాంటి అప్రసిద్ధమైన దేవపురాన్ని ఉత్తర భారతంలో గుర్తించడం కష్టం. అంతేకాక ఔత్తరాహుల మనఃఫలకాల మీద మల్లినాథుని స్మృతులు చాలా తక్కువగా మాత్రమే ఉన్నాయి. అయితే ఈ దేవపురం అనే గ్రామం 14, 15 శతాబ్దులలో బలవంతుడైన ఒక జమీందారు పాలనలో ఉండేదనీ అతడు పండిత పక్షపాతి అనీ అందుచేత పండితులాతనిని ఆశ్రయించే వారనీ వారిలో మల్లినాథుడు కూడా ఒకడై ఉండ వచ్చుననీ ఊహిస్తున్నారు. మల్లినాథుని జన్మస్థలం రాజమహేంద్రవరం దగ్గర ఉంది అంటున్నారు. కాని ఇతని తండ్రిదేవశర్మఅని, ఈ దేవశర్మ మహా విద్వాంసుడూ, వైదిక నిష్ఠా గరిష్ఠుడూ అని చెబుతున్నారు. దీనిని బట్టి కపర్ది కుమారుడైన మన మల్లినాథ సూరికి ఈ విషయంతో సంబంధం లేదని స్పష్టమవుతున్నది.

సర్వపథీన వ్యాఖ్య బొంబాయి వ్రాత ప్రతిలో మల్లినాథుని ఇంటిపేరు "కోలచర్ల" అని ఉన్నట్లు శ్రీ కె. పి. త్రివేదిగారు వివరించారు.

ఇంతేకాక తేది-10-1901దీని కోలాచలం శ్రీనివాసరావు గారు తమకు వ్రాసిన జాబులో "మల్లినాథ" అనే నామం జైనుల పేరు కాదనీ, తమ ప్రాంతంలో ఉన్న శివుని పేరు మల్లినాథుడనీ, "కోలాచల" అనేది ఊరిపేరనీ, తమపూర్వులలో కొందరికి మల్లి, మల్లయ్య అనే పేర్లు ఉన్నాయని వ్రాసినట్లు త్రివేదిగారు చెబుతున్నారు.

శ్రీకోలాచలం శ్రీనివాసరావుగారు ఆంధ్ర దేశంలోని "పందిపాడు" అనే గ్రామానికి సంస్కృతీ కరణరూపమే 'కోలా

చల' గా ఊహించారు. కాని అదిఅంత సమంజసంగా ఉన్నట్లు విజ్ఞులు అంగీకరించడం లేదు. మరి కొంతమంది కన్యాకుమారి ప్రాంతంలో ఉన్న 'కోలచర్ల' అయి ఉంటుందని ఊహిస్తున్నారు. కాని దీనికి సరైన ఆధారాలులేవు.

'వెలుగోటివారి వంశావళి' అనే తెలుగు పుస్తకంలో వరంగల్ ప్రాంతంలోఉన్న ఒక గ్రామంపేరు 'కొలచలమ' అని అన్నట్లు ఉంది. అంతేకాక రాచకొండ ప్రాంతంలో 'కోలాచల' అనేగ్రామం కూడా ఉన్నట్లు పేర్కొబడింది. వెలుగోటి వారివంశావళి పద్యం 46 పేజీ 14 ఆధారంగా పైవిషయాలు లభించాయి.

మల్లినాథసూరి మేఘ సందేశ వ్యాఖ్యలో రామగిరేః చిత్రకూటస్య' అని వ్యాఖ్యానించాడు. చిత్రకూట పర్వత ప్రాంతంలో కోలాచల పర్వతమున్నట్లు మహా భారతం సభా పర్వం 30వ అధ్యాయంలోనూ, మార్కండేయ పురాణంలోనూ కనిపిస్తున్నది. అయితే ఈ విషయాలు ప్రస్తుతాంశానికి ఎంతవరకు సంబంధించి ఉన్నాయ నేది పరిశీలించ వలసిన విషయం.

వెలుగోటివారి వంశచరిత్రను బట్టిచూస్తే ఈ కొలచలమ పురాణాల్లోని కోలాచలం కాదనీ, శ్రీకోలాచలం శ్రీనివాసరావు గారు చెప్పినట్లు "పందిపాడు" గ్రామంకూడా కాదనీ, తెలుస్తున్నది. అయితే ఇది తెలంగాణా ప్రాంతంలోని రాచకొండకు దగ్గరలోఉన్న ఒక గ్రామం అని మాత్రం అందులో స్పష్టమవుతున్నది.

మల్లినాథుని జన్మస్థలం గురించీ ఇంటిపేరు గురించీ, నివాస స్థలం గురించీ పలువురు పలురకాలుగా తెలిపిన అభిప్రాయాలు చర్చించిన మీదట ఈ విధంగా నిర్ణయించడానికి అవకాశం కలుగుతున్నది.

మల్లినాథసూరి తెలుగువాడు కావడంవల్ల కన్యాకుమారి ప్రాంతంలోని కోలాచలంగానీ, ఉత్తర భారతంలోని కోలాచలం

గానీ, వామనాచార్య చెప్పిన గుజరాత్ ప్రాంతంకానీ, మరికొందరు ఊహించినట్లుగా మహారాష్ట్ర ప్రాంతంగానీ ఇతని నివాసమనటం పొసగదు.

ఇంక ఆంధ్ర ప్రాంతాలయిన రాజమహేంద్రవరం దగ్గరలో ఉన్న పందిపాడుకాని వరంగల్ దగ్గరగా ఉన్న రాచకొండ సమీపం లోని 'కోలచలమ'గానీ కావచ్చు అనే వాదాలలో మల్లినాథుని తాత అయిన మల్లినాథ శతావధాని కాకతిప్రతాపరుద్ర మహీపతిచే కనకాభిషేక గౌరవం పొందడంవల్ల వీరి వంశీయులు వరంగల్ ప్రాంతంలో నివసించారనడంలో కొంత సామంజస్యం కనపడు తున్నది. ఇక్కడే కొల్లూరు వృత్తిశాసనంలో అనపోతారెడ్డి మల్లి నాథుని కుమారుడైన పెద్దిభట్టుకు వృత్తి అనుగ్రహించినట్లు సాక్ష్యా ధారం లభిస్తున్నది.

ఈ రాచకొండ రాజ్యాన్ని పాలించిన సర్వజ్ఞసింగభూపా లుడు పెద్దిభట్టుకు సన్మానం చేసినట్లు ఆధారాలున్నాయి ఈ విధంగా వీరు రాచకొండ ప్రాంతంలో నివసించి ఉంటారనడానికి కొంత అవ కాశం ఉంది. అంతేకాని రాజమహేంద్రవరం దగ్గర పందిపాడు మాత్రం ఇతని నివాసమనడానికి ఎట్లాంటి ఆధారాలు లేవు.

ఈ కోలచల వంశీయులు కాకతీయుల కాలం తర్వాత విజయ నగరం ప్రాంతానికి వెళ్ళి ఆ తరవాత రాచకొండ ప్రాంతానికి వచ్చి ఉంటారనే వాదం కూడా ఉంది. అది కూడా అంత బలమైన వాదంగా కనిపించటంలేదు.

కాకతీయుల పాలనలో ఉన్న మెదకు జిల్లాలోని పట్టంచెరువు ప్రాంతంలోని "కొలచెలమ" గ్రామమే వీరి నివాసమయినట్లు చెప్ప డానికి మరికొన్ని బలమైన ఆధారాలు లభిస్తున్నాయి

ఈ కొలచెలమలో మల్లినాధుని వంశీయులు నేటికీ ఉన్నారు. సుమారు 8 10 సం ల క్రితం "కొలచెలమ"లో జరిగిన "మలి

నాథ జయంతి" ఉత్సవానికి శ్రీ కేశవపంతుల నరసింహశాస్త్రిగారు తాము వెళ్ళి వచ్చినట్లు చెప్పారు. అంతేకాక ఈ కొలచెలమవాసులైన మల్లినాథుని వంశీయులు మల్లినాథుడు ఉపయోగించిన "గంటాన్ని" డాక్టర్ బి. రామరాజుగారికి అందజేసినట్లు శ్రీ రామరాజుగారు తెలిపారు.

మెదకు జిల్లాలో ఉన్న మల్లన్నగుట్టమీద మల్లినాథసూరి తపస్సు చేసినట్లు డాక్టర్ దివాకర్ల వేంకటావధానిగారు ఒక వ్యాసములో వ్రాశారు.

వీటినన్నింటినీ పరిశీలిస్తే మెదకు జిల్లాలోని పట్టంచెరువు ప్రాంతంలో ఉన్న 'కొలచెలమ' గ్రామమే మల్లినాథ వంశీయుల నివాసస్థలమనీ, అదే మల్లినాథ సూరి జన్మస్థలమనీ స్పష్టమవుతున్నది. ఈ 'కొలచెలమ' హైదరాబాదుకు 40 కి.మీ. దూరంలోఉంది.

మన మల్లినాథసూరికి తాత అయిన మల్లినాథ శతావధానికి కాకతి ప్రతాపరుద్రుడు కనకాభిషేకం చేయడంవల్ల కాకతీయ రాజులకు కొలచలమ వంశంవారిపైనున్న గౌరవాదరాలు వ్యక్తమవుతున్నాయి

అట్లాగే మల్లినాథుని కుమారుడైన కుమారస్వామిసోమపీథి ప్రతాపరుద్రీయానికి రత్నాపణ వ్యాఖ్య వ్రాయడం కొలచల వంశంవారికి కాకతీయులమీద ఉండే గౌరవాన్ని వెల్లడిస్తున్నది. ఇది విద్యానాథునిమీద ఉండే గౌరవాన్నికూడా నిరూపిస్తూ ఉంది.

ఈకుమారస్వామి సోమపీథి రత్నాపణ వ్యాఖ్యలో "త్రిస్కంధ శాస్త్ర జలధిం చులుకీ కురుతేస్మయః, తస్య శ్రీ మల్లినాథస్య తనయోఽజని తాదృశః కొలచల పెద్దయార్యః ప్రమాణపదవాక్య పారదృశ్వాయః, వ్యాఖ్యాత నిఖిలశాస్త్రః పరిబంధకస్తాచ సర్వవిద్యాసు, తస్యానుజన్మా తదనుగ్రహాత్త విద్యోఽనవద్యో వినయావనమ్రః,

స్వామీ విపశ్చిద్విత నోతి టీకాం ప్రతాప రుద్రీయ రహస్య భేత్రీమ్"
అని రచించాడు

ఈ శ్లోకాలలో చూస్తే "కోలచల పెద్దయార్యః" అనేచోట 'కోలచల' కనపడుతున్నది. కోలచల వీరి ఇంటిపేరుగా స్పష్టంగా కుమారస్వామి చెబుతున్నాడు. ఇంతేకాక వ్యాఖ్యాంత గద్యల్లో "ఇతి పదవాక్య ప్రమాణ పారావార పారీణ శ్రీ మహోపాధ్యాయ కోలచల మల్లినాథ సూరి సూనునా విశ్వజనీన విద్యస్య విద్వన్మణేః పెద్దయార్యస్యానుజేన కుమారస్వామి సోమపీథినా విరచితే ప్రతాప రుద్రీయ వ్యాఖ్యానే రత్నపణాఖ్యానే..." అని చెప్పాడు.

పండితులూ, విమర్శకులూ కుమారస్వామి సోమపీథి ఇంటి పేరు విషయంలోగానీ, పెద్దిభట్టు ఇంటిపేరు విషయంలోగానీ భిన్నాభిప్రాయాలు వ్యక్తంచేయలేదు. "కోలచల" అనే ఇంటిపేరును అంగీకరించారు.

'కోలచల' అనే ఇంటిపేరు మల్లినాథ సూరి కుమారులు ఇద్దరి విషయంలో చెల్లినప్పుడు తండ్రిఅయిన మల్లినాథ సూరి విషయంలో చెల్లదనడం హాస్యాస్పదంగా ఉంటుంది.

మల్లినాథసూరి వ్యాఖ్యానించిన గ్రంథాలు ఎక్కువసంఖ్యలో ఉన్నాయి. వాటికి వ్రాసిన ప్రతులసంఖ్య కూడా చాలా ఎక్కువే వాటిని ఎత్తివ్రాసిన లేఖకులు వేర్వేరు కాలాలకూ, వేర్వేరు ప్రాంతాలకూ చెందినవారు కావడంవల్ల వారు వ్రాసిన ప్రతులలో ఈ 'కోలచల' అనే పదం రకరకాలుగా రూపాంతరాలు పొందింది. 'కొలచల, కోలచల, కోలాచల, కొలచెల, కోలచెల, కోలచెలమ, కొలచెల్మ కొలచెలమ, కోలచల్మ, కోలిచర్ల, కోలచర్ల, కోలచలమ,' అని ఈ విధంగా కనిపిస్తున్నాయి. వీటిలో ఎక్కువ ప్రతులలో 'కోలచల' అని మాత్రమే ఉన్నది.

మనకు దొరికిన ఈ ఆధారాలుబట్టి 'కోలచల' అనే ఇంటిపేరు మాత్రమే కుమారస్వామి సోమపీథికీ, మల్లినాథసూరికీ సమానంగా ఉంది. అందువల్ల దాన్ని గ్రహించడం మాత్రమే సమంజసం.

ఈ విధంగా వ్యాఖ్యాతృ చక్రవర్తిఅయిన మల్లినాథ సూరి తెలుగువాడనీ, వైదిక బ్రాహ్మణుడనీ, తెలగాణ్యుడనీ, కాశ్యప గోత్రం వాడనీ, ఆపస్తంబ సూత్రుడనీ, కృష్ణ యజుశ్శాఖీయుడనీ, ఇతని ఇంటిపేరు 'కోలచల' అనీ స్పష్టమవుతున్నది.

—o—

మల్లినాథుని కాలనిర్ణయము

మల్లినాథుడు ఆంధ్రదేశంలో కాకతీయుల కాలానంతరం రాచకొండ వెలమ రాజ్యాలూ, అద్దంకి, కొండవీటి రెడ్ల రాజ్యాలూ, పూర్వ విజయనగర రాజ వంశాలూ అభివృద్ధి చెందుతున్న కాలంలో నివసించి ఉన్నట్లు చెప్పవచ్చు. మల్లినాథుడు తన వ్యాఖ్యానాలలో అసంఖ్యాకాలైన ఇతరుల గ్రంథాల నుంచి ఉదాహృతులను చూపాడు. ఉదాహృత గ్రంథకర్తలలో కొందరు మల్లినాథునికి సమకాలికులు, కొందరు కొద్దికాలం ముందువారు. వీరిలో సమకాలికులనే ఎక్కువగా ఉదాహరించాడు. ఇతని కాలనిర్ణయం చేయడానికి ఈ ఉదాహృత గ్రంథాలు మనకు ఎక్కువగా ఉపయోగపడుతున్నాయి.

డా. భండార్కరుగారు, థియోడరు ఆఫ్రెక్టు చెప్పిన విషయాలను ఆధారంగా తీసుకొని మల్లినాథుని క్రీ. శ 14వ శతాబ్ది వాడని నిర్ణయించారు. వీరు మల్లినాథుడు మేదినీకోశాన్ని తన వ్యాఖ్యలలో ఉదాహరించక పోవడంవల్ల, మేదినీకోశం ఉదాహరించిన జగద్ధరునికంటె, మేదినీ కోశరచన కంటె పూర్వుడైనట్లుగా నిర్ణయించారు. కాని మాఘ నైషధ కావ్యాలకు వ్యాఖ్యలు వ్రాసేటప్పుడు మల్లినాథుడు ఈ మేదినీకోశం ఉదాహరించి ఉన్నాడు. మేదినీ కోశం క్రీ. శ. 1400 ప్రాంతానికి చెందినది అనుకొన్నా తొలి వాఖ్యలలో మల్లినాథుడు దానిని ఉదాహరించక పోయినప్పటికీ ఆ తరవాతి వ్యాఖ్యలలో మేదినీ కోశం ఉదాహరించటం అసంగతం కాదు.

ప్రొఫసరు రాఘవన్‌గారు వైశ్యవంశ సుధాకర రచనపై ఒక వ్యాసం వ్రాస్తూ అందులో మల్లినాథుని కాలం గురించి చర్చించారు.

రెండో దేవరాయల పాలనా కాలానికి చెందిన ధర్మనిర్ణయ సభలో మల్లినాథుడు ధర్మాసనమున ఉండి న్యాయ నిర్ణయ నివేదకగా వైశ్య వంశ సుధాకరం సమర్పించాడు. దీన్ని ఆధారంగా తీసుకొని మల్లినాథుని కాలాన్ని క్రీ. శ. 1430గా రాఘవన్‌గారు నిర్ణయించారు

శ్రీ కె. పి త్రివేదిగారు తరళ వ్యాఖ్యతో ఏకావళిని ప్రచురిస్తూ ఆ గ్రంథపీఠికలో మల్లినాథుని క్రీ. శ. 14వ శతాబ్దికి చెందిన వానిగానే పేర్కొన్నారు. పై విధంగా ఈ కాల నిర్ణయాలు ఇంచుమించుగా సరిపోతున్నాయి.

మల్లినాథుడు విద్యానాథుని ప్రతాపరుద్రీయం నుంచి 200కు పైగా ఉదాహృతులను తన వ్యాఖ్యల్లో చూపాడు. ఏకావళికి వ్రాసిన తరళవ్యాఖ్యలో రాచకొండ సర్వజ్ఞ సింగభూపాలునిరసార్ణవ సుధాకరంనుంచి ఉదాహృతులను చూపాడు. ఈ సింగభూపాలుని 'భూపాల' శబ్దంతోనే పలుసార్లు మల్లినాథుడు వ్యవహరించాడు. రసార్ణవ సుధాకరం క్రీ. శ. 1370 ప్రాంతమున రచింప బడింది. రఘువంశ వ్యాఖ్యలోకూడ మల్లినాథుడు దీనిని ఉదాహరించాడు. రఘువంశ వ్యాఖ్య అతని వ్యాఖ్యల్లో మొదటిదని విమర్శకులు నిర్ణయిస్తున్నారు. అందుచేత ఇతని రచనా వ్యాసంగం క్రీ. శ. 1370 తరవాత ప్రారంభమై ఉంటుందని చెప్పవచ్చు పెద్దిభట్టుకు సర్వజ్ఞ సింగ భూపాలుడు కనకాభిషేకం చేసినట్లు ఉన్నది. పెద్దిభట్ట మల్లినాథులు సమకాలికులవటంవల్ల భూపాలునితో వీరికి గల ప్రత్యక్ష సంబంధం నిరూపిత మవుతున్నది.

కుమారగిరి క్రీ. శ. 1386–1402. సం.ల మధ్య వసంత రాజీయం రచించిఉండవచ్చు. మల్లినాథుడు మాఘకావ్యవ్యాఖ్యలో వసంతరాజీయం నుంచి ఒకశ్లోకం ఉదాహరించాడు.

శ్లో. "యన్నాట్య వస్తునః పూర్వం రంగ విఘ్నో పశాంతయే
కుశీలవాః ప్రకుర్వంతి పూర్వరంగః ప్రకీర్తితః"

దీనివల్ల మల్లినాథుని రచనా వ్యాసంగ కాలం 15వ శతాబ్దిలోనికి కూడా పొడిగించ వీలవుతున్నది. వైశ్యవంశ సుధాకర రచనము కూడా ఈ భావాన్నే బలపరుస్తున్నది. వైశ్యవంశ సుధాకర రచనము దేవరాయలు II కాలంలో జరిగింది. 1426లో దేవరాయలు II తండ్రి చనిపోవటంవల్ల అతడు విజయనగర సామ్రాజ్యానికి నిరంకుశ ప్రభువైనట్లు తోస్తున్నది. దీన్నిబట్టి మల్లినాథుడు క్రీ శ. 1430 వరకూ జీవించి ఉన్నట్లు స్పష్టమవుతున్నది. అంటే ఇతని రచనా వ్యాసంగ కాలం క్రీ. శ. 1375 నుంచి 1421 వరకూ 50 సం.లు నిరాఘాటంగా సాగినట్లు విశదమవుతున్నది.

మల్లినాథుడు సంపూర్ణమైన ఆయుర్దాయంతో ఉంటాడని భావిస్తే 84 సం లు (సహస్రమాసజీవి) ఇతని జీవితకాలం అని తేలుతుంది. అప్పుడు క్రీ. శ. 1340-1350 సం.ల మధ్య పుట్టిన వాడుగా మనం భావించ వచ్చు. ఇతడు 25,30 సం.ల వరకూ చదువు సంధ్యలు లేక వున్నాడనీ తర్వాత ఒక యోగి ఇచ్చిన సారస్వత మంత్రం కారణంగా కాశీవెళ్ళి విద్యాభ్యాసం చేశాడనీ ఒక కథ ఉంది. ఇదీ నిజమని భావించినా 1375 నుంచీ ఇతని రచనా వ్యాసంగం ఆరంభమయిందనడానికీ, 1340-1350 మధ్య పుట్టాడనడానికీ అభ్యంతరం ఉండదు.

—(o)—

మల్లినాథుని బాల్యము-విద్యాభ్యాసము

కోలచల మల్లినాథ శతావధాని మహాపండితుడు. అనేక రాజాస్థానాలలో కనకాభిషేకాది విద్వత్కవి సమ్మానములు పొందినవాడు. ఆంధ్రులసొత్తుఅయిన శతావధాన ప్రక్రియకు ఇతడు మూల పురుషుడు. ఇతని కుమారుడు కపర్ది పండితుడు. ఇతడు తండ్రివలెనే మహాపండితుడు. అసంఖ్యాకాలయిన గ్రంధాలు రచించాడు. ఇతని కుమారుడే మన మల్లినాథసూరి.

ఇట్లాంటి ప్రఖ్యాత పండిత కుటుంబంలో జన్మించిన మల్లినాథునికి బాల్యంలోనే సంప్రదాయసిద్ధంగా తండ్రిదగ్గరకావ్యపాఠాలు అభ్యసించే మహాభాగ్యం లభించింది. బహు శాస్త్ర పరిచయమూ, అసంఖ్యాక నిఘంటువుల పరిశీలనమూ, తమ ఇంటికి వచ్చే మహాకవి పండితుల ప్రసంగాలతో సన్నిహిత సంబంధమూ, చిన్నతనంలోనే ఇతనికి లభించాయి. మల్లినాథునికి బాల్యంలో ఈ విధంగా లభించిన ఈ అవకాశాలు భవిష్యత్తులో అతడు మహావ్యాఖ్యాతగా, పదవాక్య ప్రమాణ పారావార పారీణుడుగా, మహోపాధ్యాయుడుగా, రూపొందడానికి హేతుభూతాలయ్యాయి.

మల్లినాథుని బాల్యంగురించీ, విద్యాభ్యాసం గురించీ కొన్ని జనశ్రుతులున్నాయి. వాటినిక్కడ పేర్కొవడం సమంజసం కాక పోదు.

1. మల్లినాథుడు బాల్యంలో చాలా మందమతిగా ఉండేవాడు. భార్యచేత అవమానింపబడి కాశీకి పోయి ఒక గురువుదగ్గర సర్వశాస్త్రవిషయాలు నేర్చుకొన్నాడు. ఈ విద్యాభ్యాసం సమయంలో గురువు మల్లినాథుని శ్రద్ధను పరీక్షించడానికి కొన్ని పరీక్షలు ఏర్పాటుచేశాడు. భోజనసమయంలో నేతికి బదులుగా ఆందము

వేయమని తన భార్యకు చెప్పాడు. విద్యాభ్యాస దీక్షచేత మల్లి నాథుడు ఆరుచి భేదం గుర్తించలేదు. ఈ విధంగా కొన్ని ఏళ్ళు గడచిన తర్వాత గురుపత్ని మళ్ళీ ఒకనాడు నేతికిబదులుగా ఆముదం వడ్డించింది. మల్లినాథుడు రుచి భేదంగుర్తించి ఇదేమిటని అడిగాడు. వెంటనే ఆమె పొరపాటు జరిగిందని పలికి నేతినివడ్డించింది. మల్లి నాథునితో వచ్చిన ఈమార్పును ఆమె భర్తకు తెలిపింది. గురువు చాలా సంతోషించాడు. మల్లినాథుణ్ణి పిలిచి "నీ విద్యాభ్యాసం పూర్తిఅయింది నీ వింక ఇంటికిపోయి సుఖంగాఉండు" అని చెప్పి పంపాడట.

2. మల్లినాథుడు పెద్దిభట్టు అనేవారు ఇద్దరు అన్నదమ్ములు, వీరిలో పెద్దిభట్టు కుశాగ్రబుద్ధి మల్లినాథుడు మందబుద్ధిఇట్లాఉండగా వారి గ్రామానికి దగ్గరలో ఒక సాధువు బసచేశాడు. ఆ సాధువుకు మల్లినాథుడు వినయ విధేయతలతో భక్తి పూర్వకంగా పరిచర్యలు చేశాడు. ఆ సాధువు మల్లినాథుణ్ణి అనుగ్రహించి అతనికి సారస్వతి మంత్రోపదేశం చేయ సంకల్పించాడు. కాని యోగి నిర్యాణ సమయానికి ముందు ఉపదేశించాలనే తలంపుతో అతడు కాల హరణం చేస్తుండేవాడు. దైవవశాత్తు నిర్యాణసమయంలో యోగికి సేవచేయడానికి మల్లినాథునికి ప్రతిబంధం కలిగి పెద్దిభట్టును యోగి దగ్గరకు పంపడం తటస్థించింది. యోగికి మరణసమయం ఆసన్న మయింది ఆ సమయంలో మల్లినాథుడు లేనందుకు యోగి చాలా విచారించాడు. తాను చేయదలచిన సారస్వత మంత్రోపదేశాన్ని పెద్దిభట్టుకేచేసి ఈ ఫలితం మాత్రం మల్లినాథునికే చెందాలని ఆదే శించాడు. తరువాత మహాపండితుడైన పెద్దిభట్టు అనేక గ్రంథాలకు వ్యాఖ్యలు వ్రాసి మల్లినాథుని పేర వెలయించాడట.

3. ఒకప్పుడు మల్లినాథుడు సర్వజ్ఞ సింగభూపాలుని ఆస్థానా నికి చిరిగిన బట్టలతో వంకరటింకర చేతికర్రతో పోతూ ఉండగా

మార్గమధ్యంలో ఒకడు ఈ వేషంతో పోతున్నావేమని ప్రశ్నించాడు. అప్పుడు మల్లినాథుడు సమాధానంగా "కిం వాససా చీకిరిబాకిరేణ కిం దారుణా వంకరటింకరేణ సర్వజ్ఞభూపాల విలోకనార్థం వైదుష్య మేకం విదుషాం సహాయం॥"అని చెప్పి రాజదర్శనానికి పోయాడట.

4. విద్యావిహీనుడయిన మల్లినాథుడు అత్తవారింటికి ఒక నాడు బయలుదేరాడు. అత్తవారింటిలోనివారు అందరూ బాగా చదువుకొన్నవారు. అందుచేత మల్లినాథుని ఎగతాళి చేస్తారని ముందుగానే మల్లినాథుని తండ్రి ఊహించి కొన్ని మెలకువలు అతడికి చెప్పాడు.

"ఎవ్వరే గ్రంథ ప్రసక్తిచేసినా "సంపూర్ణమా?" ఈ శాస్త్రం సమగ్రమా? అని మాత్రమే అడుగు. కానీ ఇంకే ప్రసంగం చేయకు అనిచెప్పాడు. ఇట్లా మల్లినాథుని విద్యారాహిత్యం బయటపడకుండా తప్పించుకోమని తండ్రి సలహా ఇచ్చాడు.

కాని అత్తవారింటిలోని వారు ఏదో గ్రంథం వ్రాయాలని సిద్ధం చేసుకొన్న తాళపత్ర సంపుటాలు మల్లినాథునికి చూపారు. ఇవేమి టన్నాడు మల్లినాథుడు. వారు "అలేఖ్యాలు" అని సమాధానం చెప్పారు. మల్లినాథుడు తండ్రి మాట జవదాటక "సంపూర్ణమా?" అనిఅడిగాడు అప్పుడు విద్యారాహిత్యం బయట పడిందట.

5. పెద్దిభట్టు పేరుతో మల్లినాథుని గురించిన జనశ్రుతి పెద్దిభట్టు అనేక గంథాలకు వ్యాఖ్యానాలు రచిస్తూ ఇంట్లో ఏముందో? ఏమి లేదో? పట్టించుకోలేదు. వ్యాఖ్యాన రచనలో మునిగి తేలుతూ అప్పుడప్పుడు "ఇత్యర్థః" "ఇతిభావః" అని బయటకి కూడా పలికే వాడు. ఒకనాడు పెద్దిభట్టు మడిగట్టుకొని భోజనం చేయడానికి వంటింటికి వెళ్ళి భార్యను 'ఏమి వండా'వని అడిగాడు. అప్పుడామె చిరునవ్వుతో "ఇత్యర్థాల" కూర వండి, "ఇతిభావాల పులుసు పెట్టా

నని బదులు చెప్పింది. అయితే నేటి భోజనం రసవంతమే అని నవ్వాడు.

మరొకప్పుడు ఆ దంపతులు సరస సల్లాపాలాడుకొనే సమయంలో ఆమె భర్తతో "ఏమండీ! ఎందరు చేసిన స్త్రీ వర్ణనలకో వ్యాఖ్యానాలు వ్రాస్తారు. స్త్రీల సౌందర్యాన్ని వర్ణిస్తారు. నన్ను ఎప్పుడూ వర్ణించరేమి?" అని నవ్వుతూ అడిగింది దానికి పెద్దిభట్టు నవ్వుతూ ఇదిగో నిన్ను ఇప్పుడే వర్ణిస్తాను.

"అర్క శుష్కఫల కోమల స్తనీ
మేరు మందర సమాన మధ్యమా
తింత్రిణీదళ విశాలలోచనా
పెద్దిభట్ట గృహిణీ విరాజతే" అని శ్లోకం చెప్పి కడుపుబ్బ నవ్వించాడట.

ప్రతిభావంతులైన మహామనీషుల జీవితాలలో ఇట్లాంటి కట్టు కథలను కల్పించుకొని ఆనందించటం ఒక చమత్కారంగా భాసిస్తూ ఉంది. ఇట్లే మహాకవి కాళిదాస, శ్రీ హర్ష కవిరాజ జీవితచరిత్రల్లో అనేక చమత్కార కల్పనలు చోటుచేసుకొన్నాయి. ఇంతలి సత్యాసత్యాలెట్లున్నా ఈ జనశ్రుతులు పాఠకుల మనస్సులకు ఒక చమత్కృతిని కలిగిస్తాయనడం సత్యదూరంకాదు.

—:o:—

మల్లినాథ నామధేయులు

సంస్కృత వాఙ్మయంలో మరికొందరు మల్లినాథులు కని పిస్తున్నారు. వీరిని గురించికూడా తెలుసుకోవడం అవసరమే.

మల్లినాథుడనే పేరుగల పండితుడొకడు దారిద్ర్యంతో బాధ పడుతూ భోజుని దర్శించడానికి ఆస్థానానికి వెళుతున్నాడు. అప్పుడు దౌవారికుడు భోజునితో "దేవ! దక్షిణ దేశాత్కోఽపి మల్లినాథ నామాకవిః కౌపీనావశేషః ద్వారివర్తతే" అని చెప్పాడు. రాజు వెంటనే ఆ కవిని ప్రవేశపెట్టమన్నాడు. అతడు సభలో ప్రవేశిస్తూ "దేవ! భోజ తవ దాన జలౌఘైః సోఽయమబ్ధి రజనీతి విశంకే, అన్యథా తదుదితేషు శిలాగో భూరుహేషు కథమీదృశదానమ్?" అని ఆశువుగా చెప్పాడు.

భోజరాజా! నీదానజల ప్రవాహాలచేత ఈ సముద్రం ఉద్భవించిందని భావిస్తున్నాను. అట్లా కాకపోతే ఆ సముద్రంలో పుట్టిన చింతామణి, కామధేనువు, కల్పవృక్షాలకు ఇట్లాంటి దానగుణం ఎట్లా కలుగుతుంది? అని పొగిడాడు. ఈ సరసకవిత్వానికి ముగ్ధుడైన ధారాధిపతి వెంటనే తన చేతికంకణం బహూకరించాడు.

ఈ కవి చెప్పినవే మరి రెండు శ్లోకాలు :—

శ్లో. అంబా కుప్యతి నమయా నస్నుషయా
సాఽపి నాంబయా నమయా
అహమపి నతయా నతయా
వద రాజన్! కస్య దోషోయం!"

ఈ శ్లోకభావాన్ని గ్రహించి భోజుడు అతని దారిద్ర్యాన్ని రూపుమాపాడు.

శ్లో. నాగోభాతి మదేన ఖం జలధరైః పూర్ణేందునా శర్వరి
శీలేన ప్రమదా జవేన తురగో నిత్యోత్సవైర్మందిరమ్
వాణీవ్యాకరణేన హంస మిథునై ర్నద్యస్సభా పండితైః
సత్పుత్రేణ కులం త్వయా వసుమతీ లోకత్రయంభానునా॥

అని భోజరాజును కీర్తించాడు.

మరో మల్లినాథుడనే కవీంద్రుడు చమత్కారార్థంగల ఒక శ్లోకం చెప్పి దానిభావం వివరించమని రసజ్ఞుల్ని అడుగుతున్నాడు.

శ్లో. కాచిద్బాలా రమణ వసతిం ప్రేషయంతీ కరండం
దాసీ హస్తాత్ సభయమలిఖద్వ్యాళ మస్యోపరిష్టమ్
గౌరీకాంతమ్ పవనతనయం చంపకం చాత్రభావం
పృచ్ఛత్యార్యో నిపుణ తిలకో మల్లినాథః కవీంద్రః॥

అర్థం:- నూత్నయౌవనవతిఅయిన ఒకనాయిక తన ప్రియుని గృహానికి దాసీచేత ఒక పేటికను పంపుతూ భయంతో ఆ పేటిక పై భాగమున పామును, శివుణ్ణి, హనుమంతుణ్ణి, సంపెంగ పువ్వుని లిఖించింది.

ఈ శ్లోకంలోని ఆశయాన్ని ప్రగల్భశ్రేష్ఠుడు అయిన మల్లినాథ కవీంద్రుడు అడుగుతున్నాడు.

భావం:- ఇందులోని భావమేమిటంటే నాయిక నిజయౌవనారంభ పూర్వ ప్రవాసస్థిత నిజనాయకునకు స్వవయోద్యోతనార్థము పేటికలోపల అర్థవికసిత పద్మాన్ని ఉంచి దానిరక్షణకోసం పేటికపై భాగమున గంధవహ శత్రువైన పామును, మదనశత్రువైన శివుణ్ణి, పద్మాన్ని వికసింపచేసే సూర్యునికి శత్రువైన హనుమంతుణ్ణి, ఆమకరంద ఆస్వాదనలోలుపభ్రమరానికి శత్రువైన సంపెంగను లిఖించి పంపింది. అంటే అర్థవికసిత పద్మం నూత్నయౌవనవతిని తెలుపుతుంది. సౌగంధ్యాది గుణాలు సౌశీల్యవాల్లభ్యాదిగుణాలకుప్రతీకలు.

పద్మసౌగంధ్యాన్ని వాయువుఅపహరించకుండా గాలినితినేపామునూ, పుష్పబాణుడైన మన్మథుడు పద్మాన్ని అపహరించకుండా మన్మథ హంతకుడైన శివుణ్ణి, పద్మాన్ని పూర్తిగా వికసింపజేసి సూర్యుడు తన వేడిమిచే మ్లానత కలిగించకుండా ఉండటానికి - పుట్టిన ఉత్తర క్షణంలో ఫలభ్రాంతిచే సూర్యుని కబళింపబోయిన హనుమంతుణ్ణీ లిఖించి ఈవిధంగా నా శీలాన్ని రక్షించుకుంటూ ధైర్యంతో నీ కోసం దినాలు గడుపుతున్నాననే భావాన్ని నాయిక స్ఫురింప జేసింది.

దీనిలోని చమత్కారం మనోహరంగా ఉంది ఈ కవే యువ రంగ రాజుమీద చెప్పినట్లు లభించిన మరో శ్లోకం దిగువ ఉంది ఈ యువరంగరాజు ఎప్పటివాడో, ఈ మల్లినాథ కవీంద్రుడు ఎప్పటి వాడో మనకు తెలుసుకొనే ఆధారాలులభించలేదు. అయినా కవితా చమత్కారానికి ఈ శ్లోకం కూడా పరిశీలిద్దాం.

శ్లో. రంగత్తుంగ మధిరోహతి రంగనాథే
గోత్రారిరాత్త కుతుకః కులిశం బిభర్తి
ఖేదంచ మోద ముపయాతి నగేంద్ర కన్యా
నాగాజినేన పరిముహ్యతి మౌళిమీశః।

యువరంగరాజు గుర్రం ఎక్కగానే ఇంద్రుడు సంతోషంతో వజ్రాయుధం ధరించాడు. పార్వతీదేవి ఖేదమోదాలు సమంగా పొందింది. పరమేశ్వరుడు నాగాజినంతో మౌళిని కప్పుకొన్నాడు

భావం: రంగరాజు గుర్రాన్ని ఎక్కి యుద్ధానికి బయలు దేర గానే తురంగ ఖురవిన్యాసంవల్ల ధూళి బయలుదేరింది. అపారమైన అపరాగం సముద్రంలోపడి నీటనిపిల్చగా మైనాకమనే పర్వతంబయటు పడుతుందని దాని రెక్కలు నరకడానికి ఇంద్రుడు సంతోషంతో వజ్రాయుధం ధరించాడు. ఈశ్వరునితలపై ఉన్న గంగ ఈ పరాగం

చేత ఇంకిపోతుందని మోదమూ, అన్నకు సంభవించే ఆపదకు ఖేదమూ పార్వతీదేవి పొందింది. పరమేశ్వరుడు ఈ పరాగం తన తలపై పడి గంగకు అపకారం కలిగిస్తుందని గజచర్మంతో తన మౌళిని కప్పు కొన్నాడు.

ఇట్లాంటి చమత్కార జనకాలయిన శ్లోకాలూ, చాటువులూ సంస్కృత సాహిత్యంలో కోకొల్లలుగా ఉన్నాయి ఇందులోని రచన గానీ, భావాలుగానీ పరిశీలిస్తే మల్లినాథసూరి రచనతో ఇవి ఏవిధం గానూ సరిపోలవు ఈ కథలు కొందరు మల్లినాథసూరికే అంట కట్ట డానికి కూడా ప్రయత్నించ పూనుకోవడం పరిహాస భాజనం కాక పోదు

రాజపూజితమూ, ఉన్నత విద్యాసంపన్నమూ, శిష్టమూ అయిన పండితకుటుంబంలో జన్మించిన మన మల్లినాథుడు రాజ దర్శ నాలకు తానుగాపోవడంగానీ అల్పచమత్కార జనకాలైన ఈ శుష్క చాటు స్తోత్రాలు చేయడంగానీ అసంభవము.

శివక్షేత్రమైన శ్రీశైలం సమీపంగా ఉండటమూ, శ్రీమల్లి కార్జునుడు ఆరాధ్యదైవమై తెలుగువారి హృదయాల్లో స్థిరనివాసం ఏర్పరుచుకోవడంచేతనూ, మల్లి, మల్లయ్య, మల్లమ్మ, మల్లినాథ నామాలు తెలుగు నాట విరివిగా వ్యాప్తిలోనికివచ్చాయి. అందుచేతనే మల్లినాథ నామాలతో కొందరు కవులు కనిపిస్తున్నారు.

—(o)—

వ్యాఖ్యానాలు-వాటి అవసరము

వ్యాఖ్యాత కవితో సమానమైన పాండిత్యం కలవాడు కానీ అంతకంటె అధికుడు కానీ అయిఉండాలి. అప్పుడే ఆ కావ్యగతమైన సౌందర్యాదుల్ని వెల్లడించగలుగుతాడు. వ్యాఖ్యాతకి కవిలోఉండే ప్రతిభ, విమర్శకుడిలో ఉండే వివేచనాశక్తికూడా అవసరం. ప్రాణిని వ్యాకరణానికి అంత గొప్పదనం రావడానికి పతంజలి వ్రాసిన వ్యాఖానమే కారణం.

కావ్యాలకు వాఖ్య వ్రాసేటప్పుడు సమగ్రంగా వివరించి చెప్పడానికి దండాన్వయ పద్ధతే అత్యంతం ఉపయోగపడుతుందని విజ్ఞులు అంగీకరించిన విషయము. చాలమంది వ్యాఖ్యాతలు దండాన్వయ పద్ధతిని అనుసరించే కావ్యాలకు వ్యాఖ్యలు వ్రాశారు.

ప్రతిభా సముంచితులూ' అపార శేముషీ విశేషభూషితులూ అయిన మహాకవులు రచించిన కావ్యాలకు అట్లాంటి శక్తిఉన్నవారు వ్రాసిన వ్యాఖ్యానాలవల్లే బహుళప్రచారం చేకూరుతుంది. కవి సూత్రంగా చెప్పినదాన్ని వ్యాఖ్యాత విపులీకరిస్తాడు. వ్యాఖ్యాత సామర్థ్యాన్నిబట్టి ఇంత అర్థం ఉందని తెలుకోవాలి. వ్యాఖ్యాత అదరిస్తేనే, వివరిస్తేనే మూలకర్తకు గౌరవం లభిస్తుంది. వ్యాఖ్యాత బహుముఖపాండితీ మండితుడై ఉండాలి. పాండిత్యంతోపాటు వ్యాఖ్యకు సహృదయతకూడా కావలసి ఉంటుంది. కవిహృదయం లోతులలోకి దృష్టి ప్రసరింపచేసే వ్యాఖ్యాతకుగాని కావ్యతత్త్వం గోచరం కాదు.

"పదచ్ఛేదః పదార్థోక్తిః విగ్రహో వాక్య యోజనా
ఆక్షేపస్య సమాధానం వ్యాఖ్యానం పంచలక్షణమ్"

"సరళాజ్జటిలం జ్ఞానం స్థూలాత్సూక్ష్మం తథైవచ
పూర్వజ్ఞాతా దవిజ్ఞాతం లక్ష్యాల్లక్షణ మేవచ
అనిశ్చితా ద్వి నిర్ణీతం పూర్ణ దాంశిక మేవచ
అంశాదవయవిజ్ఞానం అనుభూతాత్తత్త్వ సంగతిః
శిక్షకేణ ప్రయుజ్యేత బోధస్య గతి రష్టధా।

అన్నట్లు సంపూర్ణానుభవం గడించినవాడు మాత్రమే ఏ విష యాన్నైనా తేలికగా వివరించగలుగుతాడు.

కావ్య వ్యాఖ్యానంలో ఉద్బోధనవిధి, కోశవిధి, ప్రయోగవిధి, ప్రసంగవిధి మొదలయిన విధుల్ని సందర్భానుసారంగా వ్యాఖ్యాత ప్రవేశపెడతాడు. వ్యాకరణవిధి, ఆగమనవిధి, నిగమనవిధి మొదలైనవి అందులోని అంతర్భాగాలు. కావ్యానికి గానీ, శ్లోకానికి గానీ, మొదట అభిరుచిని గలిగించే అవతారికే ఉద్బోధనవిధి. విషయంమీద అభిరుచి కలిగించడానికి ఈ విధిని అవలంబిస్తారు. మల్లినాథుడు చాలాచోట్ల దీన్ని పాటించాడు.

పదాలకి పర్యాయ పదాల్నిగానీ, అర్థాంతరాల్నిగానీ, చూపడానికి నిఘంటువుల్ని పేర్కొనడం కోశవిధి. ఇతరకవుల ఉదాహరణల్ని వారుపయోగించిన విధానాన్ని చూపడం ప్రయోగవిధి. ఐతిహాసిక, పౌరాణిక, ధర్మశాస్త్ర సంబంధమైన వివిధ విషయాల్ని సందర్భానుసారంగా ఉదహరించడంకూడా ప్రయోగవిధే.

"ఆద్యే విశేషణం యోజ్యం
విశేష్యం తదనంతరం
క్త్వాణముల్ ల్యప్ప్రభృత్యేవం
పూర్వం దండాన్వయో భవేత్"

అన్నట్లు ముందు విశేషణాలూ, తర్వాత విశేష్యమూ, ఆతర్వాత క్త్వాద్యులూ ఆ తరువాత క్రియఉండీ దండాకారంగా ఉండేది దండాన్వయము.

"విశేషేణ అఖ్యానమ్ వ్యాఖ్యానమ్" అనే వ్యుత్పత్తి చేత వ్యాఖ్యాన మంటే విశేషంగా చెప్పడం అని అర్థం. అంటే ప్రతిపదార్థం మాత్రమేకాక ప్రతిపదార్థ, విశేషార్థ, తాత్పర్య నిర్ణయ, తదుపష్టంభక కోశాది ప్రదర్శన, పదసాధుత్వప్రకాశక, వ్యాకరణ విశేష ప్రదర్శన, సమాస పదవిగ్రహ ప్రదర్శన, సలక్షణాలంకార ప్రదర్శనాదుల కథనమని అర్థము. దీన్నే "వ్యాఖ్యానతో విశేష ప్రతిపత్తిః" అని చెబుతారు.

ఈవ్యాఖ్యానాల రచనకు ముఖ్యమైన కారణం చెప్పాలంటే ఈవిధంగా చెప్పాలి. అ ప్రతిపత్తి - అన్యథాప్రతి పత్తులు అంటే ఏ పదాలకి అర్థం తెలియదో, ఏపదాలు నానార్థకాలు కావడంవల్ల మరో అప్రాకరణి కార్థజ్ఞానం స్ఫురిస్తుందో అవి అట్లాంటి పదాలకి ప్రాకరణి కార్థ ప్రతిపాదనం చేయందే అ ప్రతిపత్తి - అన్యథా ప్రతిపత్తులు వారించబడవు. అందుచేత అట్లాంటి ఇబ్బందులు తొలగించి సులభంగా గ్రంథం అర్థం అయ్యేటట్లు పాఠకులకు అందించడానికి వ్యాఖ్యానం అవసరమని భావము.

శిశుపాలవధ 1వ సర్గ 29వ శ్లోకం "విలోకనే నైవ తవాముసా మునే కృతః కృతార్థోऽస్మి నిబర్హితాంహసా తథాపి శుశ్రూషురహం గరీయసీ ర్గిరోऽథవా శ్రేయసి కేన తృప్యతే!" దీనిలో 'అథవా' అనే పదానికి "పక్షాంతరంలో" అనే అర్థం. సరిపడనందువల్ల మల్లినాథసూరి "అథవా - తథాహీత్యర్థః" అని వ్యాఖ్యానించాడు. ఇట్లాంటి వ్యాఖ్యానం లేనిదే ప్రకృతోపయోగి అయిన అర్థ ప్రతిపత్తి పీటికి కలుగదు.

ఇట్లాగే ఆధిః శరధిం ప్రవిశతి" అనే చోట "ఆధిర్బాణః శరధిం నిషంగం" అనే వ్యాఖ్యానం లేనిదే బాణం అమ్ముల పొదిలో ప్రవేశిస్తున్నదనే అర్థ ప్రతిపత్తి కలుగదు. ఈ విధంగా వ్యాఖ్యానం సర్వత్రా అవసరమే అని చెప్పక తప్పదు. గురుముఖతః పఠించడం

సంప్రదాయార్థ సిద్ధికోసం. ఇది కావ్యశాస్త్రాలు రెండింటికీ సమానమే. అందువల్ల వ్యాకరణం మొదలైన శాస్త్రాలకువలనే కావ్యాలకు కూడా విశేషార్థ ప్రతిపత్తి కోసం వ్యాఖ్యానం అవసరమవుతున్నది.

శ్రుతి, స్మృతి, పురాణేతిహాస, న్యాయ, మీమాంసా, వేదాంత, వ్యాకరణ, సాంఖ్య, యోగ, గణిత, వైద్యక నాట్యకళా, ఛందోఽలంకార, లోకవృత్తాది సర్వ విజ్ఞానవంతునికే విశేషార్థ ప్రతిపాదన రూపమైన వ్యాఖ్యాకరణ పాటవం సిద్ధిస్తుంది. కాని సామాన్య జ్ఞానవంతులకు సిద్ధించదు.

మల్లినాథసూరి సర్వ వ్యాఖ్యాకరణ దక్షుడు. నిఖిల వ్యాఖ్యాతృ శిరోమణి. అనితర సాధారణ వ్యాఖ్యా విధాన మర్మజ్ఞుడు. వస్తు తత్త్వావధారణా సమర్థుడు. సర్వతంత్ర స్వతంత్రుడు. ఈ పండిత కవిసార్వభౌముని యొక్క సర్వతంత్ర స్వాతంత్ర్యం సర్వశాస్త్ర పారంగతత్వం, సప్రమాణ పద సాధుత్వ ప్రతిపాదనా సామర్థ్యం. ఆయా శ్లోక వ్యాఖ్యాన ఉదాహృత శ్లోకాలవల్ల స్పష్టమవుతుంది.

మల్లినాథుని వ్యాఖ్యలకి ఆంధ్రదేశంలోనే కాకుండా యావద్భారతంలోనూ అత్యధికమైన ప్రసిద్ధి ఉంది.

ఇతడు వ్యాఖ్య రచించిన కావ్యాలకి ప్రాచీనులు చాలామంది వ్యా ఖ్యా నా లు ఇతని కంటె ముందే వ్రాసి ఉన్నారు. కాని ఆ వ్యాఖ్యానాలు అన్వయ ముఖంగా కాక శ్లోకంలో ఉన్న క్రమాన్నే అనుసరించి పదాలు వ్యాఖ్యానింప బడినాయి. అందువల్ల విద్యార్థులకు ఏకవాక్యతకలుగక సుబోధం కావడంలేదు. ఇంకావ్యాకరణ విశేషాలు యథోచితంగా చూపబడ్డం లేదు. విశేషాపేక్షగల విషయాలు యథాశ్రుతంగా వ్యాఖ్యానించబడ్డాయి. అనవసర స్థలాల్లో అనపేక్షిత వాగాడంబరాలు ప్రదర్శించబడ్డాయి. కాబట్టి ఆవ్యాఖ్యానాలు అల్ప ప్రయోజనకాలు అని భావించి మల్లినాథసూరి మీద

చెప్పిన దోషాల్ని పరిహరిస్తూ -అపేక్షితాలయినవీ, మూలానికి సంబంధించినవీ అయిన విషయాలు సవిమర్శంగా వ్యాఖ్యానించాడు. వృత్త ఛందోలక్షణాలు, అలంకార లక్షణాలు, అపేక్షితాలైన న్యాయ, వ్యాకరణ, రాజనీతి, గాంధర్వ, వైద్యక పూర్వోత్తర మీమాంసా, సాంఖ్యాదులైన శాస్త్ర విషయాలు సుబోధమయ్యేటట్లు ప్రతిపాదించాడు మూలానికి సంబంధించని విషయాలు స్పృశించలేదు. "ఇహాన్వయ ముఖేనైవ సర్వం వ్యాఖ్యాయతే మయా నామూలం లిఖ్యతే కించిన్నానపేక్షితముచ్యతే" అని ప్రతిజ్ఞచేసి ఆ ప్రకారంగా వ్యాఖ్యానించాడు. ఈ విధంగా వ్యాఖ్యానించడం మల్లినాథునికి తప్ప వేరొకరికి సాధ్యంకాదు. ఈ విషయం నారాయణీయం మొదలైన నైషధ వ్యాఖ్యాంతరాలు చూస్తే స్పష్టమవుతుంది.

మల్లినాథుడు తాను సంపాదించిన బహు శాస్త్రవిజ్ఞానాన్ని తానువ్యాఖ్యానించిన అసంఖ్యాక గ్రంథాల్లో స్పష్టపరిచాడు. ఏదో ప్రసంగం తీసుకొని వచ్చి కావ్య మార్గంలో శాస్త్ర సిద్ధాంతాల్ని ఉపన్యసించటం అతని మతంకాదు. కావ్య కర్తలైన మహా కవులు తమకున్న శాస్త్రీయ జ్ఞానాన్ని తమకావ్యాల్లో చూపి ఉన్నారు. దాన్ని మల్లినాథుడు తనవ్యాఖ్యల ద్వారా వ్యక్తపరిచాడు. ఆనాటి మహా కవులందరూ సర్వ శాస్త్ర పారంగతులే. అందులో ముఖ్యంగా శ్రీహర్షుడు నిఖిలశాస్త్రాల్లో నిష్ణాతుడు మాత్రమే కాక తాను రచించిన నైషధ కావ్యంలో సకలశాస్త్రాలమూల సిద్ధాంతాలను ప్రవేశపెట్టాడు ఆదృష్టితోనే తాను నైషధ కావ్యాన్ని రచించానని శ్రీహర్షుడే ఈ క్రింది విధంగా చెపాడు.

శ్లో. గ్రంథగ్రంథిరిహ క్వచిత్ క్వచిదపి న్యాసి ప్రయత్నాన్మయా
ప్రాజ్ఞమ్మన్యమనా హఠేన పఠితీమాఽస్మిన్ ఖలః ఖేలతు
శ్రద్ధారాద్ధ గురుశ్లథీకృత దృఢ గ్రంథిః సమాసాదయ
త్వేతత్కావ్య రసోర్మి మజ్జన సుఖవ్యా సజ్జనం సజ్జనః

నేను నా కావ్యాల్లో ప్రయత్నించి అక్కడక్కడ గ్రంథ గ్రంథుల్ని ప్రవేశ పెడుతున్నాను. హఠాత్తుగా గ్రంథాన్ని పఠించ డానికి తొందరపడే ప్రాజ్ఞమ్మన్యులకు ఇది కొరుకుడు పడేది కాదు. అట్లాంటి వారిందులో ప్రవేశించ వద్దు. గురువుల్ని శ్రద్ధతో ఆరా ధించి, శాస్త్రరహస్యాలను చక్కగా అర్థంచేసుకొన్న శ్లథీ కృత దృఢ గ్రంథులైన సజ్జనులుమాత్రమే ఈ కావ్యంలోని ఆనందరస తరంగాల్లో ఓలలాడి మజ్జన సుఖవ్యాసజ్జనాన్ని పొందండి అని చెబుతూ నేనిట్లా వ్రాయడం చేతకాక కాదు. కావ్యత్వ హానికూడా దీనివల్ల కలగదు. అక్కడక్కడ మాత్రమే ఖలులకు దుర్బోధంగా ఉండటానికే కావ్యశోభకు భంగంలేకుండా గ్రంథగ్రంథులు పెట్టాను. విద్వాంసులకు మాత్రమే నాగ్రంథం పఠనీయం, ఆనందదాయకం అవుతుందని చెప్పి "నైషధం విద్వ దౌషధమ్" అనేమాటను నిరూ పించాడు.

ఇట్లాంటి కావ్యాన్ని వ్యాఖ్యానించడానికి సకలశాస్త్ర పరి జ్ఞానం అవసరం. వీటిలో ఏశాస్త్రజ్ఞానం లోపించినా ఆకవిభావాన్ని చెప్పడం వ్యాఖ్యాతకు సాధ్యంకాదు. మహాకవి రేఖామాత్రంగా మల చినకావ్యశిల్పాన్ని లోతుపాతులతో ప్రపంచానికి చూపేవిశాలహృద యుడూ, సమర్థుడూ అయి వ్యాఖ్యాతఉండాలి. వ్యాఖ్యానం లేకుం డానే కొంతమందికి కావ్యాలు అర్థంకావచ్చు. వ్యాఖ్యానం ఎందుకు రచించాలి? వ్యాఖ్యానాల వల్లలభించే విశేషార్థాలు మరికొంతమంది బుద్ధిమంతులకు స్ఫురించవచ్చు. అట్లాకాకపోతె మల్లినాథుడు మొదల యిన వ్యాఖ్యాతలకి ఇట్లాంటి సామర్థ్యం ఎట్లాకలిగింది? అనే సంశ యం కొందరికి కలగడం సహజం.

అయితే శ్రీహర్షుడు, కాళిదాసు మున్నగు మహాకవులు కేవ లం భాషాజ్ఞానం కలిగినవారు మాత్రమేకాక సకలశాస్త్ర పారంగతు లైన విజ్ఞానఖనులు. అట్లాంటివారు రచించిన మహా కావ్యాలు

కూడా కొందరికి స్వతఃఅర్థంకావచ్చు. మఱికొందరికి కొన్నివిషయాలు స్ఫురించవచ్చు. ఆ విధంగా వెలువడ్డవిశేషార్థాలు, అప్పుడప్పుడు. అక్కడక్కడ మహాప్రతిభావంతులనుంచి వృద్ధపరంపరగా గ్రహించి సంప్రదాయార్థాన్ని కంఠస్థవిద్యగా సంరక్షించుకొంటూ శ్రద్ధారాద్ధ గురుశ్లథీకృత దృఢగ్రంథులైన వినయ సంపన్నులుమాత్రమే సర్వజన సుబోధకంగా మహాకావ్యాలు వ్యాఖ్యానించ గలరు

శాస్త్రగ్రంథాలకు వ్యాఖ్యానం అవసరంఅవుతుంది కానీ రసాస్వాదన యోగ్యాలైన కావ్యాలకు వ్యాఖ్యానం అవసరమవుతుందా? అనికొందరికి సందేహంకలుగవచ్చు. కాని ఒక శాస్త్రగ్రంథానికి వ్యాఖ్యానం అవసరం అనిభావించినవారు బహుశాస్త్ర పారంగతులై అనేక శాస్త్రమర్మాలను తమకావ్యాల్లో చొప్పించిన మహాకవులకావ్యాలకు వ్యాఖ్యానావసరం శతధా అంగీకరించవలసి ఉంటుంది.

ఉత్తమ కావ్యానికిధ్వని ప్రధాన లక్షణం. ఈ ధ్వని వివరించనిదే- వ్యాఖ్యానించనిదే- అందరికీతెలియదు. అందుచేత కూడా మహాకవుల కావ్యాలకు వ్యాఖ్యానం అవసరమే.

గురుముఖతః అందరూ కావ్యాలునేర్చుకోవడం సాధ్యంకాదు. అప్పుడు ఈవ్యాఖ్యానం గురురూపమై అందరికీ అందుబాటులో ఉంటుంది. బహుళవ్యాప్తికి కూడా మంచి వ్యాఖ్యానాలు అవసరమే,

ఈ విధంగా కావ్యాలకు వ్యాఖ్యానావసరం ఎంతైనా ఉందని చెప్పవచ్చు,

—(0)—

మల్లినాథుని వ్యాఖ్యాన వైఖరి

మల్లినాథుడు కొన్నివందలఏళ్ళ సంప్రదాయాన్ని తాను, తన తండ్రి, తనతాత- అన్నట్లు తనగురువు తనగురువుకు గురువులన్నట్లు కంఠస్థవిద్యగా సంరక్షించుకొంటూ వచ్చినవాడు.

మల్లినాథునితాత- తండ్రులు మహాపండితులు. బహుగ్రంథ నిర్మాతలు. సంప్రదాయం తెలిసినవారు. ప్రతిభా శేముషీ విరాజితులు ఇట్లాంటి శిక్షణలో పెరిగి, నిఘంటువులు అన్నింటినీ కంఠగతం చేసు కొని, సంప్రదాయార్థాలన్నీ ఆకళించుకొని, బహుశాస్త్ర కావ్యపరి జ్ఞానాన్ని సంపాదించుకొని, తానుసంపాదించినవిజ్ఞానాన్ని సామాన్య జనులకుకూడా అందుబాటులో ఉంచాలని మల్లినాథుడు అను కొన్నాడు.

సంస్కృతగ్రంథాల అధ్యయన, అధ్యాపనాలలో జీవితమంతా గడిపిన మల్లినాథునికి ఛాత్రజనసుబోధకమైన నూతనపద్ధతిలోకావ్యా లకు వ్యాఖ్యానాలు వ్రాయాలనే సంకల్పంకలిగింది. అంతకుముం దున్న వ్యాఖ్యలువిద్యార్థులకుసుబోధకాలుకావనిభావించాడు. కాబట్టి కొన్ని నియమాలు ఏర్పరుచుకొని పూర్వ వ్యాఖ్యానాలలోని లోపాలు లేకుండా అసిధారావ్రతంగా తనరచన సాగించాడు.

అన్వయక్రమంలో అర్థాదులను వివరించడంలో చెప్పిన విష యాలకు ప్రమాణాలు చూపడంలో, శ్రుతి, స్మృతి ఇతిహాస సూక్తు లను ఉదాహరించడంలో, కవిహృదయాన్ని ఆవిష్కరించడంలో, యోగాదిశాస్త్ర విషయాలను సప్రమాణంగా నిరూపించడంలో, అలంకారాదులను సమన్వయించడంలో, లక్షణాలను నిర్వచించడంలో సారాంశం చెప్పడంలో, పూర్వపక్షాలకు యుక్తమైన సిద్ధాంతాలు

ప్రతిపాదించడంలో, శబ్దస్వరూపం తెల్పి సూత్రాల్ని వివరించడంలో అపపాఠాల్ని, ప్రక్షిప్తాల్ని, దోషాల్ని, భ్రమప్రమాదాల్ని పసికట్టడంలో మల్లినాథుడు ఒక విలక్షణమైన పద్ధతిని చేపట్టాడు. బహుశాస్త్రపరిజ్ఞానం, వివిధకావ్యపరిచయం అసంఖ్యాక గ్రంథపరిశీలనమూ, లోకజ్ఞత, ప్రతిభావ్యుత్పత్తి సంపదలు మల్లినాథుని ప్రతి శ్లోకవ్యాఖ్యానంలో ప్రస్ఫుటంగా కనిపిస్తాయి.

ఇతడు పదవాక్యప్రమాణ పారావార పారీణుడు. అంటే వ్యాకరణ, మీమాంస, న్యాయ, వైశేషికాలందు కూలంకషప్రజ్ఞ గలవాడు. అధీతి, బోధ, ఆచరణం ప్రచారం, అనే నాల్గున్నూ విద్యకు పరమార్థాలు. వీటికిపరమాదర్శమైనవాడు మనమల్లినాథుడు. సర్వవిద్యలను ప్రవచనంచేయడంలో ఆరితేరినవాడు. వేదాలు, దర్శనాలు, పురాణేతి హాసాలు, మన్వాదిధర్మశాస్త్రాలు, సంగీతఅలంకార శాస్త్రాలు, నాట్యశాస్త్రం, కామతంత్రం, ఆయుర్వేదం, గజ, అశ్వ శిక్షాశాస్త్రాలు, ఛందోవ్యాకరణ శాస్త్రాలు, జ్యోతిషము, సాంఖ్య, యోగ, గణితశాస్త్రాలు, అనేక నిఘంటువులూ తెలిసినవాడే కాక అన్నింటినీ సమన్వయపరిచే శక్తి, సందర్భానుసారంగా వాటిని ఉపయోగించే సమయస్ఫూర్తి కలవాడు. ఈవిషయాలు అతని వ్యాఖ్యానాలు చూసినవారికి స్పష్టంగా అడుగడుగునా కనిపిస్తాయి. ఇట్టి పరిజ్ఞానం ఇతర వ్యాఖ్యాతలలో కనపడదు. అందువల్లనే మల్లినాథుని వ్యాఖ్యానాలకు భారతదేశంలోనే కాక ఖండఖండాంతరాల్లో కూడా విశేష వ్యాప్తి కలిగింది.

మల్లినాథుడు కావ్యాలకు వ్యాఖ్యలు వ్రాసేటప్పుడు మూడు పద్ధతులు అవలంబించాడు. (1) "ఇహాన్వయ ముఖేనైవ సర్వం వ్యాఖ్యాయతేమయా" అన్వయముఖంగా వ్యాఖ్యానిస్తాను.

(2) "నామూలం లిఖ్యతే కించిత్" అమూలకాలైన విషయాలను ప్రస్తావించను.

(3) "నా౽నపేక్షితముచ్యతే" అనపేక్షిత విషయాలను చెప్పను. అంటే అన్వయక్రమంలో అర్థాదులను వివరించడం. వివరించిన అంశాలకు ప్రమాణాలను చూపడం. అనపేక్షిత వాగాడంబరాల జోలికిపోక అవసరమయినంత మాత్రమే చెప్పడం అనే అసిధారఅయిన నియమత్రయాన్ని విధించుకొని యథోక్తంగా పాటించాడు. అన్యూనాతిరిక్తంగా రమ్యమైన ధోరణిలో కవిహృదయాన్ని వ్యాఖ్యానించటంలో మల్లినాథుడు తనకు తానేసాటి. సమస్త విద్యలలోనూ అతనికిగల సునిరూఢప్రజ్ఞ• సమయస్ఫూర్తి లోకోత్తరాలు.

ఏ విషయంపై వ్యాఖ్యానించవలసి వచ్చినా దానికి సంబంధించిన నిఘంటు ఉదాహరణలు చూపడంలో కూలంకషపరిజ్ఞను కనపరిచిన ఈ మహావిద్వాంసుడు ఒక సంచార గ్రంథాలయమనదగినవాడు. కావ్యశ్లోకాలనువలెనే మల్లినాథుని వ్యాఖ్యానపంక్తులను కూడా విద్యార్థులు పూర్వకాలంలో కంఠస్థం చేసేవారు. ఇట్టివారికి బహుశాస్త్ర మర్యాదాభిజ్ఞత కలిగేదనడంలో ఆశ్చర్యమేమున్నది? అదే మహావిద్వాంసుడైన మన మల్లినాథసూరి వ్యాఖ్యాన వైఖరిలోని వైశిష్ట్యము.

ఇట్టి మహావ్యాఖ్యాతయొక్క ఛాయాపటానికైనా మనము నోచుకోలేదు. చరిత్ర చూద్దామంటే కాలగర్భంలో లీనమయిపోయింది. తద్రచనా విశేషాలను తాళపత్రాలలో శ్రమించి, పరిశ్రమించి వ్రాసుకొని వేదాలవలె మౌఖికంగా వాటిని ధరించి ఏనాటినుంచో సంరక్షించుకొంటూ వచ్చి మనకందజేసిన మన పెద్దలకు మనమెంతో ఋణపడి ఉన్నాము. కాలగర్భంలో నశించక జీవించడమే మహాకవితా లక్షణము. మహోన్నతపదమును అధిష్ఠించి సహజదేదీప్యమాన రత్నకాంతులతో సార్వకాలికంగా విద్వన్మోదం కూర్చడమే మహావ్యాఖ్యాన లక్ష్యము.

వ్యాఖ్యానాలు - పరిచయము

వ్యాఖ్యలు	గ్రంథాలు
1. సంజీవిని	రఘువంశము
2. సంజీవిని	కుమారసంభవము
3. సంజీవిని	మేఘసందేశము
4. ఘంటాపథము	కిరాతార్జునీయము
5. సర్వంకష	శిశుపాలవధ
6. జీవాతువు	నైషధీయచరితము
7. సర్వపథీన	భట్టికావ్యము
8. తరళ	ఏకావళి
9. నిష్కంటక	ప్రశస్తపాదభాష్యటీక (భాష్యనికరము)
10. నిష్కంటక	తార్కికరక్ష
11. సిద్ధాంజనము	తంత్రవార్తికము
12. పరిమళ	స్వరమంజరి
13. న్యాసోద్ద్యోతము	న్యాసము
14. వైమల్యవిధాయిని	కావ్యాదర్శము
15. తరళ	నలోదయము
16. వైశ్యవంశసుధాకరము	స్వీయరచన
17. రఘువీరచరితము	స్వీయరచన
18. ఉదారకావ్యము	స్వీయరచన
19. భక్తిరహస్యము	స్వీయరచన
20. నక్షత్రపాఠాధ్యాయము	స్వీయరచన.

మల్లినాథుడు పై గ్రంథాలకు ఏవరుసలో వ్యాఖ్యలు రచించినాడో తెలుసుకోవడానికి మొదట మనము తార్కికరక్షకు వ్రాసిన నిష్కంటక వ్యాఖ్యను పరిశీలించవలసి ఉంటుంది. ఈ వ్యాఖ్యలో మల్లినాథుడు పంచకావ్యాల వ్యాఖ్యలనూ ప్రశస్తపాద భాష్యటీకకు వ్యాఖ్య అయిన నిష్కంటకను పేర్కొన్నాడు. అందు వల్ల తార్కికరక్షకు వ్రాసిన వ్యాఖ్య వీటి తరవాత వ్రాసినట్లు స్పష్టం అవుతున్నది.

కుమారసంభవ సంజీవినిలోనూ, మేఘసందేశ సంజీవినిలోనూ, సర్వపథీనలోనూ, ఘంటాపథంలోనూ, రఘువంశ సంజీవిని ఉదాహరింపబడింది.

కిరాతార్జునీయ వ్యాఖ్య అయిన ఘంటాపథం భట్టి కావ్య వ్యాఖ్య అయిన సర్వపథీనలోనూ, నైషధీయచరిత వ్యాఖ్య అయిన జీవాతువులోనూ, శిశుపాలవధ వ్యాఖ్య అయిన సర్వంకషలోనూ ఉదాహరించబడింది. అందుచేత ఈ రచనలకంటె ఘంటాపథ రచన ముందుది అని చెప్పవచ్చు. మేఘసందేశ సంజీవిని మాఘ వ్యాఖ్య అయిన సర్వంకషలో పేర్కొబడింది. నైషధీయచరిత వ్యాఖ్య అయిన జీవాతువులో కుమారసంభవ సంజీవిని ఉదాహృతమయింది. సర్వంకషలో కాళిదాసత్రయ సంజీవిని ఉదాహృతమయింది. ఏకావళీ వ్యాఖ్య అయిన తరళలో తంత్రవార్తికటీక అయిన సిద్ధాంజనమూ, స్వరమంజరి వ్యాఖ్య అయిన పరిమళ ఉదాహృతాలయ్యాయి.

ఈ విధంగా మహాకావ్య వ్యాఖ్యానాలు తొలిరచనలని నిర్ణయించడానికి వీలవుతున్నది. వాటిలో రఘువంశ సంజీవిని మొట్ట మొదటిది. ఇది కుమారసంభవ, మేఘ సందేశ వ్యాఖ్యల్లో పేర్కొ బడింది. రఘువంశ సంజీవిని, కుమారసంభవ సంజీవిని, మేఘ సందేశ సంజీవిని అని వీటి రచనాక్రమం చెప్పవచ్చు.

సర్వపథీనలోనూ, జీవాతువులోనూ, సర్వంకషలోనూ ఘంటాపథము ఉదాహరింపబడటంవల్లా ఘంటాపథ రచన కాళిదాసు త్రయ సంజీవిని తర్వాతిది అని చెప్పవచ్చు.

సర్వపథీనలో ఘంటాపథ, కుమారసంభవ సంజీవినులు పేర్కొబడ్డాయి. సర్వంకషలో ఘంటాపథ, కాళిదాసత్రయ సంజీవినులు పేర్కొబడ్డాయి. ఈ ఆధారాలనుబట్టి వీటినన్నిటినీ ఒక క్రమంలో ఏర్పరచడానికి వీలవుతుంది. కాని ఎందులోనూ పేర్కొనకపోవడం వల్ల జీవాతు రచన వీటి అనంతర రచనమే అని చెప్పవచ్చు.

సర్వపథీన, సర్వంకషలలో ఏదిముందు రచనో నిర్ణయించడం సాధ్యంకాదు. కాళిదాసత్రయ సంజీవినుల తరవాత ఘంటాపథ, సర్వంకష, సర్వపథీన, జీవాతు వ్యాఖ్యలు రచితములయినవనడం స్పష్టమే.

మిగిలిన వ్యాఖ్యానాలక్రమం చెప్పేటప్పుడు ప్రశస్తపాద భాష్యటీకకు వ్యాఖ్య అయిన నిష్కంటక రచన తర్వాతనే తార్కిక రక్ష వ్యాఖ్య అయిన నిష్కంటక రచనమని చెప్పవచ్చు. సిద్ధాంజన, పరిమళ వ్యాఖ్యలు తరళ (ఏకావళి వ్యాఖ్య)లో ఉదాహరించడంవల్ల తరళ వ్యాఖ్య ఈ రెండింటి తర్వాతి రచనమని చెప్పడానికి వీలవుతున్నది.

ప్రశస్తపాదభాష్యటీక అయిన నిష్కంటక, తార్కికరక్షటీక అయిన నిష్కంటక, సిద్ధాంజనమూ, పరిమళ, ఏకావళీ వ్యాఖ్య అయిన తరళ అని ఈ వ్యాఖ్యల రచనాక్రమం చెప్పడానికి వీలవుతున్నది.

1. రఘువంశ సంజీవిని 2. కుమారసంభవ సంజీవిని 3. మేఘసందేశసంజీవిని 4. ఘంటాపథము 5. సర్వంకష 6. సర్వపథీన 7 జీవాతువు 8. ప్రశస్తపాద భాష్యటీకకు వ్యాఖ్య అయిన నిష్కంటక 9 తార్కికరక్షకుటీక అయిన నిష్కంటక 10 సిద్ధాంజనము 11 పరి

మళ 12. ఏకావళికి తరళ 13. న్యాసోద్ద్యోతము 14 కావ్యాదర్శానికి వైమల్యవిధాయిని 15. నలోదయానికి తరళ 16. వైశ్యవంశ సుధాకరం (స్వీయరచన) 17. రఘువీరచరితమ్ (స్వీయరచన) 18. ఉదార కావ్యము (స్వీయరచనము) 19. భక్తరహస్యమ్ (స్వీయరచన) 20 నక్షత్రపాఠాధ్యాయం (స్వీయరచన) ఈ విధంగా మల్లినాథుని రచనల క్రమాన్ని తెలపడానికి వీలవుతున్నది.

1. సంజీవిని (రఘువంశము): రఘువంశంలో మొత్తం 19సర్గలున్నాయి. మొత్తంశ్లోక సంఖ్య 1568. దీనికి ఏభైకిపైగా వ్యాఖ్యలున్నాయి.

మల్లినాథసూరి కాళిదాస త్రయానికి అంటే రఘువంశ, కుమారసంభవ, మేఘసందేశ కావ్యాలకు "సంజీవిని" అనే వ్యాఖ్యానాలురచించాడు

శ్లో. మల్లినాథకవిస్సోయం మందాత్మానుజిఘృక్షయా
వ్యాచష్టే కాళిదాసీయం కావ్యత్రయ మనాకులమ్"

మందబుద్ధులపైని ఉన్న అనుగ్రహంతో సర్వశాస్త్రజ్ఞుడైన మల్లినాథసూరి కాళిదాసు రచించిన కావ్యత్రయానికి నిరాకులంగా వ్యాఖ్యానిస్తున్నాడు. ఆ కావ్యాలకు ఎట్లాంటి ఆకులత కలిగిందని ప్రశ్నించుకొంటే—

శ్లో॥ భారతీ కాళిదాసస్య కువ్యాఖ్యా విషమూర్ఛితా
ఏషా సంజీవినీటీకా తామద్యోజ్జీవయిష్యతి.

కాళిదాస సరస్వతి ఇంతకుముందు అనేక వ్యాఖ్యాతలు చేసిన దుర్వ్యాఖ్యా విషంచేత మూర్ఛిత అయి పడిఉన్నది. సంజీవినీ వ్యాఖ్య ఆ సరస్వతిని ఉజ్జీవింపచేయగలదు అని చెప్పాడు. ఇట్లా చెప్పడం అహంకారంగా తోచవచ్చు. కాని మల్లినాథునిలో దుష్టమైన అహంకారం ఏకోశానా కానరాదు, అతని వినయం ఈ శ్లోకంలో గోచరిస్తుంది.

శ్లో॥ కాళిదాస గిరాంసారం కాళిదాస స్సరస్వతీ
చతుర్ముఖో௨థవా సాక్షాద్విదుర్నాన్యేతు మాదృశాః.

కాళిదాసు వాక్కులలోని సారాన్ని కాళిదాసు, సరస్వతి ఎరుగుదురు. అథవా సాక్షాత్తు చతుర్ముఖుడైన బ్రహ్మ అయినా తెలుసుకోగలడు. మాదృశులైన ఇతరులు తెలుసుకోలేరు. అయినా దక్షిణావర్తనాథాది మహానుభావులు ఏర్పరిచిన రాజమార్గం తోడుగా మాకు కూడా కాళిదాసు వాక్కులు గ్రహించడానికి అవకాశం లభించింది అని సవినయంగా చెప్పుకొన్నాడు. ఇట్లాంటి వినయాన్ని సౌజన్యాన్ని ఇతడు కాళిదాసునుంచి గ్రహించి పెద్దల పట్ల తన కున్న గౌరవాన్ని ఈ విధంగా ప్రదర్శించినట్లు కనబడుతున్నది.

కాళిదాసు రఘువంశ ప్రారంభంలో తన వినయాన్ని ఇట్లా ప్రదర్శించాడు.

శ్లో "క్వసూర్యప్రభవోవంశః క్వచాల్పవిషయామతిః"
శ్లో॥ "మందఃకవియశః ప్రార్థీగమిష్యామ్యుపహాస్యతామ్"
శ్లో॥ అథవాకృత వాగ్ద్వారే వంశే௨స్మిన్ పూర్వసూరిభిః
మణౌవజ్రసముత్కీర్ణే సూత్రస్యేవాస్తి మేగతిః

ఈ విధంగా కవి స్వాహంకారాన్ని పరిహరించుకొన్నాడు. ఆ మార్గాన్నే మల్లినాథుడు అనుసరించి తన వినయాన్ని ప్రకటించు కొన్నాడు.

ఇతర వ్యాఖ్యాతలు స్వీయపాండిత్య ప్రాభవ ప్రదర్శనా లౌల్యంవల్ల కాళిదాస కావ్య సౌందర్యాన్ని మరుగుపరిచి వ్యాఖ్యా డంబరాన్ని ప్రదర్శించారు. అంతేకాదు అన్వయముఖంగా వ్యాఖ్యా నించకుండా ఆకాంక్షా పద్ధతిలో వ్యాఖ్యానించారు. ఇది సామాన్యుల కంతగా ఉపయోగపడే వ్యాఖ్యాన పద్ధతికాదు. అందువల్ల మల్లి నాథుడు పై దోషాలు తన వ్యాఖ్యలకు సంక్రమించకుండా కొన్ని నియమాలను ఏర్పరుచుకున్నాడు. ఇవి ముందు ప్రస్తావించాం.

మల్లినాథుడు రఘువంశాన్ని వ్యాఖ్యానిస్తూ ప్రతిసర్గ వ్యాఖ్యారంభంలో ముత్యంవంటి ఒక్కొక్క శ్లోకాన్ని రచించి ఒక కొత్త పోకడపోయాడు.

మల్లినాథసూరి నిరంతర ప్రవచనం చేసినవాడు. విద్యార్థులకు ఎప్పుడేది బోధిస్తే వారి సంస్కారానికి వన్నె చేకూరుతుందో బాగా తెలిసినవాడు. అందువల్లనే ముందుగా రఘువంశానికి వ్యాఖ్యానం మొదలుపెట్టాడు.

"సరళాజ్జటిలమ్" అనే బోధ నియమాల్ని వ్యాఖ్యానాల్లో ప్రవేశపెట్టాడు. రఘువంశం మానవ జీవితాన్ని తీర్చిదిద్దే మహా కావ్యము. అందులో మానవుడు పుట్టింది మొదలు ఎట్లా జీవనం గడపాలో, ఏది చేయాలో, ఎట్లా ప్రవర్తించాలో మొదలైన విష యాలు వివరంగా ఉన్నాయి. ఇక్ష్వాకు ప్రభువుల నియమ జీవనం ఈ కావ్యంలో ఆదర్శప్రాయంగా అనుసరణీయంగా వర్ణింపబడింది.

కాళిదాసు తన కావ్యాల్లో ధర్మ ప్రాధాన్యాన్ని ప్రతిపాదిం చాడు. రఘువంశ కావ్యంలో దిలీపుని ధర్మరక్షణ-గోరక్షణకోసం తన శరీరాన్ని త్యాగం చేయడానికి సంసిద్ధుడు కావడంతో వ్యక్త మవుతూ ఉంది. ధర్మాన్ని అతిక్రమించి అర్థకామాలవెంట పరు గెత్తితే ఏంజరుగుతుందో అగ్నివర్ణుని చరిత్రలో కాళిదాసు మనకు వివరిస్తాడు ఇక్ష్వాకు రాజుల పాలన వర్ణిస్తూ కాళిదాసు—

శ్లో "రేఖామాత్రమపిక్షుణ్ణా దామనోర్వర్త్మనఃపరం
నవ్యతీయుఃప్రజాస్తస్య నియంతుర్నేమి వృత్తయః"

అని వివరించాడు.

శ్రీరాముణ్ణి ఉత్తమ శిష్యుడుగా, పుత్రుడుగా, భర్తగా, సోదరుడుగా, మిత్రుడుగా, శత్రువుగా, ప్రభువుగా, వీరుడుగా, ప్రజా పాలకుడుగా వర్ణించి ఆదర్శప్రాయుడన్నట్లు సాక్షాత్కరింపజేశాడు.

రఘువంశంలో ప్రసర్గ చదివినా పవిత్ర వాతావరణం, పుణ్య తీర్థాలూ, యజ్ఞయాగాదులూ, ఋషివాటికలూ, పతివ్రతలూ, విశుద్ధ చరితులైన రాజర్షులూ, ధర్మమూర్తులూ సాక్షాత్కరిస్తారు. మన మనస్సుల్ని ధర్మంవైపు మళ్ళించి మన నడవడిని తీర్చిదిద్దుకొనే విధంగా రఘువంశ కథనం సహకరిస్తుంది.

అత్రి, జాబాలి మొదలైన తపస్సంపన్నులు కూడా సత్పురుషుడైన రామునికి చేతులు మోడ్చారు మంచితనానికీ దైవత్వానికీ తేడా లేదని ఈ సంఘటన తెలియజేస్తూ ఉంది. అన్ని సద్గుణాల సమాహార రూపమే శ్రీరాముడు. ఈ సద్గుణాల నన్నింటినీ సామూహికంగా ఆత్మసౌందర్యం అనవచ్చు. అదే మానవ జీవన వంశవృక్షానికి పూచిన మంజుల కుసుమం.

అందుచేతనే మల్లినాథసూరి ముందుగా రఘువంశాన్ని సరళమైనరీతిలో వ్యాఖ్యానించి విద్యార్థులలో సదాచార బీజాలు నాటి వారిని ఉదారులుగా, ఉదాత్తులుగా, ధర్మపరులుగా, ఉత్తమ సంస్కారవంతులుగా తీర్చిదిద్దడానికి నిశ్చయించుకొన్నాడు.

రఘువంశ వ్యాఖ్యానంలో శ్రుతులూ, స్మృతులూ, సూక్తులూ, పురాణకథలూ, ఆచారాలూ మొదలైన వాటికి ప్రాధాన్యమిచ్చి వ్యాఖ్యానించాడు.

రసాలంకార విశేషాలకు ఇందులో ప్రాధాన్యం ఇవ్వలేదు. వ్యాకరణాంశాలను తగినంతలో సంగ్రహంగా వివరించాడు.

"సోహమాజన్మ శుద్ధానా మాఫలోదయ కర్మణామ్
ఆ సముద్ర క్షితీశానా మానాకరథవర్త్మనామ్".
"యథావిధి హుతాగ్నీనామ్ యథాకామ ప్రవర్తినామ్
యథాపరాధ దండానామ్ యథాకాల ప్రబోధినామ్"
"త్యాగాయ సంభృతార్థానాం, సత్యాయ మితభాషిణామ్,

యశసే విజిగీషూణాం, ప్రజాయైగృహమేథినామ్''.
"శైశవేఽభ్యస్త విద్యానాం, యౌవనే విషయైషిణాం,
వార్ధకే మునివృత్తీనాం, యోగేనాన్తే తనుత్యజామ్".

ఇత్యాదిగా మహోదాత్త భావాలతో నిండి కావ్యమాలకే తరళమణి అయిన రఘువంశాన్ని మొదట వ్యాఖ్యానించడంలో ఇదే మల్లినాథుని పరమోద్దేశమని భావించడానికి వీలవుతున్నది. ఈ పంచ కావ్యపఠనము మల్లినాథుని వ్యాఖ్యానక్రమాన్నిబట్టి ఏర్పడిందే కాని కావ్యరచనబట్టి ఏర్పడిందికాదు.

2. (సంజీవిని కుమారసంభవము) :— ఇది 17 సర్గల మహా కావ్యం. ఇందులో మొదట 8 సర్గలకు మాత్రమే అరుణగిరి నాథుడూ, మల్లినాథుడూ వ్యాఖ్య రచించారు. శ్లోకాల సంఖ్య 614. దీనికి మల్లినాథుని వ్యాఖ్య పేరు సంజీవిని. కుమారసంభవానికి 25 వ్యాఖ్యలున్నాయి వీటిలో చారిత్రవర్ధనుని కుమారసంభవ తాత్పర్యదీపికకూ, అరుణగిరినాథుని ప్రకాశికకూ, దక్షిణావర్తుని టీకకూ ఎక్కువ ప్రచారం ఉండేది. మల్లినాథుని సంజీవిని వీటి నన్నింటినీ గుణమహత్తుచే మించి విశేష ఖ్యాతినీ, ప్రచారాన్నీ పొందింది.

కుమారసంభవంలో మల్లినాథసూరి ఎనిమిది సర్గలకు మాత్రమే వ్యాఖ్య వ్రాయడంవల్ల విద్వల్లోకంలో అనేక వాదాలు బయలు దేరాయి. కాళిదాసు 8 సర్గలవరకే రచించాడనీ, ఆ తరవాతి భాగం కాళిదాసు రచన కాదనీ అందువల్ల మల్లినాథుడు ఆ భాగాన్ని వ్యాఖ్యానించక వదలివేశాడనీ చెబుతున్నారు. మరికొందరు కాళి దాసు 17 సర్గలూ పూర్తిగా వ్రాశాడనీ మల్లినాథునికి 8 సర్గల ప్రతిమాత్రమే లభించి ఉంటుందనీ మిగిలిన భాగం ఖిలమై ఉంటుందనీ భావిస్తున్నారు. ఇంకా కొందరు 9వ సర్గమొదలు అసభ్యమైన శృంగార వర్ణనలు దానిలో ఉన్నాయి. అందుచేత అది కాళిదాసు

రచన అయిఉండదు. ఎవరో ఆ విధంగా వ్రాసి కాళిదాసు పేరు పెట్టి ఉంటారు. అందుచేతనే మల్లినాథుడు ఆ భాగాన్ని విడిచాడు అని భావిస్తున్నారు.

పార్వతీదేవి శాపంచేతనే దాని రచన అంతటితో ఆగిపోయినట్లు ఒక వదంతి ఉంది. జగత్పితరులైన ఆదిదంపతుల విలాస వర్ణనమే బృహద్విమర్శకు గురిఅయింది. దానితో కాళిదాసు సిగ్గుపడి ధైర్యంలేక కావ్యరచన అక్కడికి ఆపివేసి అసంపూర్ణంగా విడవడానికి కారణమైనట్లు కొందరు భావించారు. కావ్యరచన మధ్యలోనే ప్రజలు ఆ కావ్యాన్ని చూడటంకానీ విమర్శించడంకానీ, కాళిదాసు ఆ మాటలు ఆదరించి భయపడి మధ్యలో కావ్యం విడిచిపెట్టడంకానీ, జరిగి ఉంటుందని భావించడం అంత సహేతుకంగా లేదు.

పై వాదాలన్నీ ఆపాతరమణీయాలుగా ఉన్నా అంత సమంజసంగా లేవు. కాళిదాసు 8 సర్గలు మాత్రమే వ్రాసి ఉంటాడనికానీ, ఒకవేళ వ్రాసినా 8 సర్గలు మాత్రమే మిగిలి తక్కిన భాగం శిథిలమై పోయిందనడంకానీ, లేదా అసభ్య శృంగార వర్ణన చేసినందువల్ల దీన్ని పరిహరించవలసివచ్చిందని చెప్పడంకానీ అసమంజసము. ఎందువల్లనంటే 8 సర్గలలో కుమారసంభవం జరగనే లేదు. కుమారసంభవం జరగకుండానే కుమారసంభవ కావ్యాన్ని కాళిదాసు మధ్యలోనే విరమించినట్లు భావించడం న్యాయంకాదు అంతేకాక "తదిచ్ఛామో విభో స్రష్టుమ్ సేనాన్యం తస్య శాంతయే" అని ఇంద్రాదులు బ్రహ్మను ప్రార్థించడంకానీ, బ్రహ్మ ఇంద్రాదులతో "తస్యాత్మా శితికంఠస్య సైనాపత్య ముపేత్యవః మోక్ష్యతే సురబందీనామ్ వేణీర్వీర్య విభూతిభిః" అని చెప్పడంగానీ అర్థరహితము. అందువల్ల కవి కావ్యం కుమారసంభవంగానే వ్రాసినట్లు స్పష్టమవుతున్నది. అంతేకాక ఇంకో విషయం ఇక్కడ పరిశీలించడం అవసరం.

కుమారసంభవం 8వ సర్గ 77వ శ్లోకం వ్యాఖ్యలో "మాన్యభక్తి" అనే సమాసానికి వివరణ ఉంది. మాఘకావ్యంలో 13వ సర్గ

24వ శ్లోకం వ్యాఖ్యానంలో "వికాసిభక్తి" అనే సమాసానికి వివరణ చేస్తూ మల్లినాథుడు కాళిదాసత్రయ సంజీవినిలో తానీ అంశాన్ని స్పష్టంగా చర్చించినట్లు పేర్కొన్నాడు.

(1) రఘువంశం 12వ సర్గ 19వ శ్లోకంలో "దృఢభక్తి రితి జ్యేష్ఠే" అని సమాసం ఉంది. దృఢభక్తి అనేది ప్రత్యేక విషయము. (2) కుమారసంభవం 8వ సర్గ 77వ శ్లోకంలో "మాన్యభక్తి" అనే సమాసం ఉంది. (3) మేఘ సందేశం 1వ సర్గ 86వ శ్లోకంలో "దృష్టభక్తిః" అని ప్రయోగం ఉంది. (4) మాఘ కావ్యం 18వ సర్గ 24వ శ్లోకంలో "వికాసిభక్తి" అని ఉంది.

వీటిలో మాన్యభక్తి, దృష్టభక్తి, వికాసిభక్తి అనేవి సక్రమంగా పై దృఢభక్తివంటి ప్రయోగాలే. ఇవన్నీ బహువ్రీహి సమాసాలే. మాఘ కావ్యం 18వ సర్గ 24వ శ్లోకం వ్యాఖ్యానిస్తూ సూరి "తదేతత్సర్వమస్మాభిః కాళిదాసత్రయ సంజీవిన్యాం 'దృఢభక్తిరితి జ్యేష్ఠే' ఇత్యాదిషు వివేచితమ్, తస్మాత్ 'వికాసిభక్తిభిః' ఇత్యత్రాపి మతభేదేన పూర్వపదస్య స్త్రీత్వే నపుంసకత్వేచ రూపసిద్ధిరస్తీతిసిద్ధమ్" అని చెప్పాడు.

మరో విషయం ఇక్కడ గమనించవలసి ఉంది. కుమారసంభవం 8వ సర్గ వ్యాఖ్యాంతగద్యలో శ్రీ సీతారామకవి పేరు కనిపిస్తున్నది. ఇది వ్రాతప్రతులను చూసిన సంపాదకుల తప్పిదమై ఉండవచ్చు. లేదా మల్లినాథసూరి ఈ సర్గకు వ్యాఖ్య వ్రాయలేదనే "కింవదంతి"నిబట్టి సీతారామకవి తాను వ్యాఖ్య వ్రాసి ఉండవచ్చుననే వాదం ఉంది.

కుమారసంభవం 8వ సర్గలో ఈ ఒక్కచోటనే వచ్చిన భక్తి చర్చ తాను చేసినట్లు మాఘంలో పేర్కొవడంవల్ల కుమారసంభవం 8వ సర్గకు కూడా మల్లినాథసూరి వ్యాఖ్యానం వ్రాసినట్లు మనము గ్రహించవచ్చు.

మల్లినాథసూరికి గ్రంథమంతా లభించిందని భావించవచ్చు. అయినా విద్యార్థులను ఉద్దేశించి వ్రాస్తున్న వ్యాఖ్య కావడంవల్ల 8 సర్గలవరకే వ్యాఖ్యానించి ఆ మీదిభాగం అనపేక్షిత విషయంగా భావించి విడిచి ఉండవచ్చు. అంతేకాని కాళిదాస రచనకు వచ్చి శృంగారమనే నిందను ఆపాదించడంకానీ, అసభ్యమనడంగానీ అనాలోచితమూ, అనుచితమూ అనక తప్పదు.

కాళిదాసు మహాభక్తుడు, సకలశాస్త్రపారంతుడు; మహాకవి; యోగ, మంత్ర, తంత్ర, విద్యారహస్యాలను ఎరిగినవాడు. 'త్వమేవాహంనసంశయః' అని ప్రసిద్ధికెక్కిన అపర సరస్వతి. భక్తిభావ పరవశుడై జగత్పితరులైన పార్వతీ పరమేశ్వరుల శృంగారాన్ని వర్ణించాడు. రాగద్వేష కామవాసనలు మచ్చుకైనా- అతనిలో కనిపించవు. అతనిలో తుచ్ఛకామ వాసన ఉన్నట్లు ఆలోచనచేయడం అపరిపక్వ మనస్కతకు నిదర్శనము.

కేవలము లౌకికదృష్టితో పద,పదార్థమాత్ర జ్ఞానంతో మహావేత్తలైన కాళిదాసాది మహాకవుల కవితల నర్థంచేసుకోవడం సులభంకాదు.

శ్రీమచ్ఛంకర భగవత్పాదాది మహాభక్తులు దేవతామూర్తుల సౌందర్యాన్ని కేశాది పాదపర్యంతం అంగప్రత్యంగంగా వర్ణనచేశారు. ఇట్లాంటి మహాపురుషుల భక్తి భావ పారమార్థికదృష్టులను అవగతం చేసుకోవడానికి సంప్రదాయాభిజ్ఞత, మంత్రశాస్త్ర పరిచయము, శ్రీవిద్యోపాసనాది పరిజ్ఞానము, గురుశుశ్రూష, బహుగ్రంథపరిశీలనము, అవసరము. లేకపోతే మనసారస్వతంలో సగభాగంకంటె ఎక్కువ స్థానాన్ని ఆక్రమించిన భక్తిసాహిత్యం నిషిద్ధ గ్రంథ వాహినిలో ఏనాడో కొట్టుకొని పోయేది. కాబట్టి సమ్యగ్దృష్టి సమ్యక్పరిశీలనము ఎంతైనా అవసరము.

(3) సంజీవిని (మేఘసందేశము):- మేఘసందేశము రెండు సర్గల కావ్యము. శ్లోకసంఖ్య. 120.

ఈ మేఘదూత కావ్యానికి సుమారు 30 వ్యాఖ్యలున్నాయి. ఆవ్యాఖ్యాతల నిక్కడ పేర్కొవడం పాఠకులకు ఉత్సాహ జనకం కాకపోదు. 1. జగద్ధరుడు 2. వల్లభదేవుడు. 3. మహి మసింహగణి 4. సుమతీ విజయుడు 5. లక్ష్మీనివాసుడు 6. కల్యాణమల్లి 7. కవి రత్న 8. కృష్ణదాసు 9 హేమహంసగణి 10.చింతామణి 11.జినేంద్రుడు 12. దివాకరుడు 13. భరతసేనుడు 14. భగీరథమిశ్రుడు 15. హరిదాసు 16. అవచూరి 17. కథంభూతి 18. ఉద్యోతకారుడు 19. సనాతనశర్మ 20. శాశ్వతుడు 21. విశ్వనాథ మిశ్రుడు 22.విశ్వనాథుడు 23 వాచస్పతిదేవుడు 24.రామనాథుడు 25.రామోపాధ్యాయుడు 26 మేఘరాజు 27. భరతుడు 28 హరగోవిందుడు 29 సరస్వతీ తీర్థుడు 30 మల్లినాథుడు.

వీటిలో జగద్ధరుని రసదీపిక వ్యాఖ్యా మల్లినాథుని సంజీవిని వ్యాఖ్య, రామనాథుని ముక్తావళివ్యాఖ్య, లక్ష్మీనివాసుని శిష్యహితైషిణీవ్యాఖ్య, విశ్వనాథుని దుర్బోధ పదభంజిక, విశ్వనాథ మిశ్రుని మేఘదూతార్థముక్తావళీ వ్యాఖ్య పేర్కొదగినవి.

మల్లినాథుడు వ్యాఖ్యవ్రాసిన కాళిదాసు కావ్యాలలో మేఘదూత కావ్యముచివరిది కొందరుదీనిని లఘుకావ్యంగా పేర్కొన్నారు.కాని మల్లినాథుడు దీనినిమహాకావ్యంగానే పేర్కొన్నాడు.

"అత్రశేశతః తత్ర తత్ర అద్రినగరనదీ సముద్రాది వర్ణన సంభవాత్ మహాకావ్యత్వమ్".

ఇంతేకాక శ్రీమద్రామాయణంలోని హనూమత్సందేశాన్ని మనస్సులో ఉంచుకొని ఈ మేఘదూత కావ్యాన్ని కాళిదాసు రచించినట్లు "సీతాంప్రతిరామస్య హనూమత్సందేశమ్ మనసి

నిధాయ మేఘసందేశమ్ కవిఃకృతవాన్ ఇత్యాహుః" అని మల్లి నాథుడు చెప్పాడు. "ఇత్యాఖ్యాతే పవనతనయం మైథిలీవోన్ముఖీసా" అని కవి కూడా కంఠో_క్తిగా చెప్పాడు.

మల్లినాథుడు ఈ వ్యాఖ్యానంలో కొన్ని ఆగంతుక పాఠాలను కూడా వ్యాఖ్యానించాడు. వ్యాకరణాంశాలనూ, సారస్వత విష యాలనూ, అలంకారిక విశేషాలనూ ఇందులో విపులంగా చర్చించి, అనేక గ్రంథాలనూ, గ్రంథక_ర్తలనూ, అనేకశాస్త్ర విషయాలకు సంబంధించిన అపూర్వ ఉదాహృతులను చూపాడు. "మాఘే మేఘే గతం వయః" అన్న సూ_క్తిప్రకారం మల్లినాథుడు మాఘ మేఘ వ్యాఖ్యలకు ఎక్కువ శ_క్తినీ, కాలాన్నీ వినియోగించినట్లు తెలుస్తున్నది.

1957లో ఢిల్లీ సాహిత్య అకాడమీవారు డాక్టర్ రాధా కృష్ణన్, కలకత్తా సుశీలకుమారదేవ్‌లు సంపాదకులుగా మేఘ దూతాన్ని పరమప్రామాణికంగా ముద్రించారు. అందులో వారు చెప్పినవి. కాశ్మీరదేశంలో వల్లభదేవుని వ్యాఖ్యతో ఉన్న మేఘ దూతము పదో శతాబ్దం పూర్వార్థంలోనిదనీ, జైనస్థిరదేవుని వ్యాఖ్యతో లభించిన మేఘదూతము ఇంచుమించుగా 12వ శతాబ్దిదే అనీ, మలబారుదేశ వ్యాఖ్యతో లభించిన మేఘదూతం ఒకటి అట్లాంటిదే ఉన్నదనీ కుమారదేవ్ చెప్పాడు. ఈ మూడింటి శ్లోకాల వరస, సంఖ్య ఒకదానికొకటి సరిపోయినందువల్ల అవి నిజమైన కాళిదాసు రచించిన శ్లోకాలని నిశ్చయించాడు. తక్కిన శ్లోకాలు ప్రక్షిప్తాలు. ఈ విధంగా పూర్వమేఘానికి చెందినవి 63, ఉ_త్తర మేఘానికి చెందినవి 48 మొ_త్తం 111 శ్లోకాలు కాళిదాసుని నిజమైన శ్లోకాలుగా చెబుతున్నారు. కాళిదాస గ్రథనంలో ఈ పూర్వో_త్తర విభాగం అగుపించదట. ఈ విభాగం కొందరు ఇటీవలి వ్యాఖ్యాతలు చేశారనీ అందరూ అంగీకరించారనీ చెబుతున్నారు.

ఆచార్య సుశీలకుమారదేవ్‌పండితుడు కాళిదాస శ్లోకాలు 111, ప్రక్షిప్తశ్లోకాలు 19, మొత్తం 130 శ్లోకాలుగా మేఘదూతాన్ని పేర్కొన్నాడు. ప్రక్షిప్తశ్లోకాలకు కూడా ప్రక్షిప్తాలని చెప్ప కుండానే మల్లినాథుడు వ్యాఖ్యానించాడు. ఈ ప్రక్షిప్తపాఠ నిర్ణయంలో నందర్గీకార్ పండితుడు మొదలైనవారికి భేదాభిప్రాయా లున్నాయి. ప్రక్షిప్తపాఠ నిర్ణయక్లేశం ఈ కావ్యంలో ఉన్నంతగా మరే కావ్యంలోనూ కనిపించదు. ఈ విషయంలో వృద్ధ పరంపరా ప్రాప్తసం ప్రదాయజ్ఞుడైన మల్లినాథుని అనుసరించుటే సముచితము.

కాళిదాసు హనూమత్సందేశాన్ని మనస్సులో పెట్టుకొని మేఘసందేశాన్ని రచించినట్లు మల్లినాథుడు తన వ్యాఖ్యలో తెలి పాడు. ఈ విషయాన్ని శ్రీ గుంటూరు శేషేంద్రశర్మగారు 'మేఘదూతకు రామాయణంతో ఉన్న సంబంధం' అనే వ్యాసంలో విపులంగా చర్చించారు. మచ్చుకొకటి, రెండు ఉదాహరణలు.

రామాయణం అరణ్యకాండలో రాముని చేత హతుడైన విరాధుడు దివ్యరూపం ధరించి ఆకాశంలో నిలిచి తాను వాస్తవంగా గంధర్వుడననీ రంభాసక్తుడై తాను కొలువులో అశ్రద్ధ చేసినందువల్ల ప్రభువైన కుబేరుడు శపించాడనీ తత్ఫలితార్థమే తన విరాధ జన్మమనీ చెబుతాడు. "ఇతివై శ్రవణో రాజా రంభాసక్తం పురానఘ అనుపస్థీయమానోమామ్ సంక్రుద్ధోవ్యాజహారహ" (అర 1వ సర్గ 54వ శ్లో.) ఇదే "కశ్చిత్ కాంతా విరహగురుణా స్వాధికారాత్ప్ర మత్తః శాపేనాస్తంగమితమహిమా" అనే మేఘసందేశ ఆరంభ శ్లోకంగా రూపొందింది.

రామాయణంలో - అశోకవనంలో సీతాదేవికి శుభశకునాలు కనిపిస్తాయి. యక్షకాంతకు కూడా శుభనిమిత్తాలు కనిపిస్తాయి. ఉభయత్రా అవే శకునాలూ, అవే ఉపమానాలూ. సీతకు ఎడమకన్ను

అదిరింది. ఆ అదరడం ఎట్లా ఉందంటే "చేపవల్ల కదలిన తామరపువ్వు వలె" ఉందట. "ప్రాస్పందతైకం నయనమ్ సుకేశ్యాః మీనాహతమ్ పద్మమివాభితామ్రమ్" (సుందర 29వ సర్గ 29వ శ్లోకం) అని రామాయణము. ఇంక మేఘదూతము. 'త్వయ్యాసన్నేనయన ముపరిస్పంది శంకేమృగాక్ష్యా మీనక్షోభాత్ చల కువలయశ్రీ తులామేష్యతీతి' (మేఘ 2వసర్గ 34వ శ్లో.) చేపమూలంగా కదిలిన కలువపువ్వువలె యక్షప్రియ కన్ను స్పందించింది. ఒకచోట కలువపువ్వు-మరోచోట తామరపువ్వు-ఇంతే తేడా.

రామాయణంలో సీత "సహచరరహితేవ చక్రవాకీ" అని వర్ణించబడింది. మేఘ దూతంలో కూడా యక్షకాంత "దూరీభూతే మయిసహచరే చక్రవాకీ మివైకామ్" అని వర్ణించబడింది. ఈవిధంగా రామాయణ ప్రభావం మేఘదూతంమీద ఉందనడం నిర్వివాదము.

మల్లినాథసూరి ఈ విషయాలన్నీ పరిశీలించినమీదటే హనూమత్సందేశాన్ని మనస్సులో పెట్టుకొని మేఘసందేశాన్ని కాళిదాసు రచించాడని చెప్పాడు. అమూలక విషయాలు లిఖించడంకానీ, అనపేక్షిత విషయాలు చెప్పడంకానీ మల్లినాథుని అభిమతాలుకావు. ఈ వ్యాఖ్యతో లఘుత్రయి వ్యాఖ్య పూర్తిఅయింది.

4. ఘంటాపథము (కిరాతార్జునీయము) :- కిరాతార్జునీయము 18 సర్గల కావ్యము. మొత్తం శ్లోక సంఖ్య 1040.

మల్లినాథసూరి లఘుత్రయిని వ్యాఖ్యానించి, బృహత్త్రయిని వ్యాఖ్యానించదలచి కిరాతార్జునీయానికి వ్యాఖ్య వ్రాయడానికి నడుముకట్టినాడు.

"మల్లినాథకవిస్సోఽయం మందాత్మానుజిఘృక్షయా
తత్కిరాతార్జునీయాఖ్యం కావ్యంవ్యాఖ్యాతుమిచ్ఛతి".

కాళిదాసత్రయానికి వ్యాఖ్య వ్రాసేటప్పుడు మల్లినాథసూరి కాళిదాసభారతి కువ్యాఖ్యా విషమూర్ఛిత అయిందనీ-సంజీవినీటీక

చాన్ని ఉజ్జీవింప చేస్తుందని చెప్పాడు. కాని మందాత్మానుజిఘృక్షే వ్యాఖ్యానాల రచనకు కారణమని చెప్పాడు.

అట్లే భారవి కావ్యాన్ని వ్యాఖ్యానించడానికి కూడా ఈ మందాత్మానుజిఘృక్షే కారణమవుతున్నది.

"నారికేళఫల సమ్మితంవచోభారవేస్సపది తద్విభజ్యతే
స్వాదయంతురసగర్భనిర్భరం సారమస్యరసికా యథేప్సితమ్".

నారికేళ ఫలాలవలె కష్టసంపాద్యాలై శ్రమసాధ్యాలై స్వాద్యాలైన భారవి మహాకవి వాక్కులనిప్పుడు నేను విభజించి సులభంగా అనుభవించదగినట్లు అందిస్తున్నాను. రసగర్భనిర్భరమైన ఇందులోని సారాన్ని యథేచ్ఛగా రసికులు ఆస్వాదించండి అని రసికులను ఆహ్వానించాడు.

మల్లినాథసూరి సాధారణంగా కావ్యమంతా అనేకపర్యాయాలు చదివి అందులోని సారాంశాన్ని కుణ్ణంగా గ్రహించినమీదటే వ్యాఖ్య వ్రాసేవాడని తెలుస్తున్నది. పూర్వోత్తర కథా సమన్వయాన్ని చక్కగాచేస్తాడు ఈ కావ్యంలో అట్లాంటిశ్రద్ధ మరింత అధికంగా కనిపిస్తున్నది.

ఈకావ్య వ్యాఖ్యానారంభంలో ఇతడోకొత్త పోకడ పోయాడు కావ్యంలో రసాన్ని, కావ్యనాయకుణ్ణి, కావ్యఫలాన్ని తెలిపి కావ్య పరిచయాన్ని, పాఠకులకు కలిగించి వారిని కావ్యపఠనోత్సుకులుగా చేశాడు. కావ్యార్థాన్నంతా ఒక్కశ్లోకంలో సంగ్రహించి చెప్పాడు.

కావ్యనాయకుడు పాండవమధ్యముడైన అర్జునుడు. ఇతడు సామాన్యుడుకాడు, భగవంతుడైన శ్రీమన్నారాయణుని అంశవల్ల జన్మించిన వాడట. 'పాండవానాం ధనుంజయః' అనిభగవద్గీత చెబుతు న్నది. కావ్యనాయకుని ఉత్కర్ష కోసమే దివ్యుడైన కిరాతుని వర్ణనము అధికంగా చేయడం జరిగింది. శృంగారాదులు అంగరసాలు మాత్రమే,

ప్రధానమైనది వీరరసము. శైలాదుల వర్ణనలు బహుళంగా చేయడంజరిగింది. దివ్యాస్త్రలాభమే ఇందులోఫలము. పరమేశ్వరుడు పాశుపతాస్త్రాన్ని అనుగ్రహించడమే పరమప్రయోజనము.

"నేతా మధ్యమ పాండవో భగవతో నారాయణస్యాంశజ
స్తస్యోత్కర్ష కృతే త్వవర్ణ్యత తరాందివ్యః కిరాతఃపునః
శృంగారాది రసోఽంగ మత్ర విజయీ వీరః ప్రధానోరసః
శైలాదీనిచ వర్ణితాని బహుళో దివ్యాస్త్ర లాభః ఫలమ్"

ఇంకా మల్లినాథసూరి మొదటి సర్గ వ్యాఖ్యాంతంలో "ఇతి భారవి కృతౌ కిరాతార్జునీయే మహాకావ్యే లక్ష్మీపద లాంఛనే ప్రథమ స్సర్గః" అని ఉన్నకవి వాక్యాదులను మిక్కిలి అర్థవంతంగా ప్రత్యక్షర వ్యాఖ్యానంగా వివరించాడు.

"అథకవిః కావ్య వర్ణనీయాఖ్యాన పూర్వకమ్ సర్గపరిసమాప్తిం కథయతి. ఇతీతి ఇతిశబ్దః పరిసమాప్తౌ భారవి కృతావితి కవి నామ కథనమ్, మహాకావ్య ఇతి మహచ్ఛబ్దేన లక్షణ సంపత్తి స్సూచితా, కిరాతార్జునీయ ఇతికావ్యవర్ణనీయయోః కథనమ్ ప్రథమ స్సర్గః సమాప్త ఇతి శేషః ఏవముత్తరత్రాపి ద్రష్టవ్యమ్. కిరాతార్జునావధి కృత్య కృతో గ్రంథః కిరాతార్జు నీయమ్ తథాప్యర్జున ఏవాత్రనాయకః కిరాతస్తు తదుత్కర్షాయ ప్రతి భటతయా వర్ణితః" ఇదే పద్ధతితో కావ్యాన్నంతటినీ ప్రత్యక్షర వ్యాఖ్యగా వివరించి మల్లినాథసూరి "నారికేళ ఫలసమ్మితంవచో భారవేస్సపది తద్విభజ్యతే" అనితాను మొదటచేసినశపథం ప్రకారంకావ్యాన్ని నారికేళాన్ని పగులగొట్టినట్లే పగులగొట్టి పాఠకజనానికి అందించాడు

భారవిమహాకవి ప్రతిసర్గాంతశ్లోకంలోనూ లక్ష్మీశబ్దాన్ని ప్రయోగిస్తూవచ్చాడు. గద్యలో 'లక్ష్మీపద లాంఛనే' అనిఉన్నది. అయినా ఈలక్ష్మీపద లాంఛన శబ్దాన్ని మల్లినాథుడు వివరించలేదు. పద్య వ్యాఖ్యలో మాత్రం "చమత్కారకారితయా మంగళాచరణరూప

తయాచ సర్గాంత్య శ్లోకేషు లక్ష్మీ శబ్దప్రయోగః యథాహభగవాన్ భాష్యకారః మంగళాదీని మంగళమధ్యాని మంగళాంతానిచ శాస్త్రాణి ప్రథంతే. వీరపురుష కాణ్యాయుష్మత్పురుషకాణిచ భవంతి. అధ్యేతారశ్చప్రవక్తారో భవంతీతి" అని లక్ష్మీ శబ్దంయొక్క పరమప్రయోజనాన్ని సప్రమాణంగానిరూపించాడు. బహుశా 'లక్ష్మీపదలాంఛనే' అనేది తరువాతి వారెవరో కవి గద్యలో చేర్చిఉంటారు.

భారవి కావ్యంలోని మొదటి మూడు సర్గలకు పాషాణత్రయమనిప్రసిద్ధిఉంది. "భారవే రర్థగౌరవమ్" అనే సూక్తికి అది నిదర్శనము.

ఏకనాథ, జోనరాజ, వినయసుందర, ప్రకాశవర్ష, నరహర్యాదులు కిరాతార్జునీయ వ్యాఖ్యాతలుగా ప్రసిద్ధులు. వీరివ్యాఖ్యానాలు ఏకపదులుగామాత్రమేమిగిలిపోయాయి. అంటే ఒక్కొక్క అడుగు జాగ్రత్తగా వేసుకొంటూ అతికష్టంగా ముందుకు సాగిపోయే కాలిబాటలుగా మాత్రమే మిగిలాయి. మల్లినాథుడు ఘంటాపథాన్ని నూతనంగా సిద్ధపరచి నిష్కంటకమైన ఈ ఘంటాపథంలో ప్రయాణించి నిశ్శంకగా భారవి కావ్యసౌధంలో ప్రవేశించి ఆనందించండని ఆహ్వానించాడు.

"నానా నిబంధ విషమైక పదైర్విశాంతం
సాశంక చంక్రమణ ఖిన్న ధియామశంకం
కర్తుం ప్రవేశ మిహ భారవి కావ్య బంధే
ఘంటాపథం కమపి నూతన మాతనిష్యే."

అనేకములైన వ్యాఖ్యల్లోని ఎగుడు దిగుడు పదాలతో నిరంతరం శంకాకులమైనచిత్తంతో ఖిన్నమతులైనవారికి భారవికావ్యబంధంలో నిస్సంశయంగా బుద్ధిప్రవేశం కలిగేటట్లు నూతనమైన ఘంటాపథాన్ని రచిస్తున్నానని మల్లినాథుడు చెప్పాడు.

తన ప్రతిజ్ఞ ప్రకారం మూలంలోని చిన్న, పెద్ద పదాల్లో దేన్నీ విడువకుండా మూలంలోలేని ఏపదాల్నీ స్వీకరించక, అనపేక్షిత విషయాలను తడవక, అన్వయముఖంగా వ్యాఖ్యానించాడు.

అర్థగౌరవంగల భారవికవితలోని అంతరార్థాలు మల్లినాథుని ఘంటాపథం ఏర్పడేవరకురసికులకు అందుబాటులోనికిరాలేదని చెప్పడం సత్యదూరంకాదు.

5 సర్వంకష (శిశుపాలవధ):- ఈశిశుపాలవధ 20సర్గల మహాకావ్యం. 1679శ్లోకాలు. ఈకావ్యానికి మొత్తం 8వ్యాఖ్యలుఉన్నాయి అవివ్రాసినవారు. (1)వల్లభదేవుడు. (2)రంగరాజు. (3)ఏకనాథుడు (4) చరిత్రవర్ధనుడు. (5)భరతమల్లికుడు. (6)దినకర మిశ్రుడు (7)గోపాలదేవుడు. (8)మల్లినాథుడు.

వీటిలో వల్లభదేవుని సందేహ విషౌషధీవ్యాఖ్యా ఒక్క కాశ్మీర ప్రాంతంలో మాత్రమే విశేష ప్రచారం పొందింది. మల్లినాథుని సర్వంకషా వ్యాఖ్యానమే సర్వాంగ సంపూర్ణమై ప్రామాణికమై దేశంలో అన్నిప్రాంతాల్లోనూ ప్రచారంపొందింది.

మాఘకవి సకలశాస్త్ర పారంగతుడు ప్రత్యేకంగా వ్యాకరణ శాస్త్ర రహస్యాలను తనకవితలో ప్రదర్శించాలనే ఔత్సుక్యమున్నవాడు. అన్నిశ్లోకాలలోను బంధ, యమక, చిత్రకవిత్వపూర్ణమూ, వ్యాకరణ వైచిత్రీప్రయోగ విన్యాసపూర్వకమూ అయిన ప్రతిభను ప్రదర్శించాడు. "మహావైయాకరణస్య మాఘస్య కృతౌ శిశుపాలవధే" అనికొన్ని ప్రతుల్లో ఉన్నట్లు దుర్గాప్రసాదపండితులు చెబుతున్నారు. దీన్నిబట్టి మాఘుని వ్యాకరణ పాండిత్యం స్పష్టంగా తెలుస్తున్నది.

"తావ ద్భాభారవే ర్భాతి యావన్మాఘస్య నోదయః
ఉదితేతు పునర్మాఘే భారవేర్భార వేరివ"

అనే చాటూక్తి వల్ల మాఘుడు భారవిని మించినమహాకవి అనిపించినా మాఘుడు భారవిని పూర్తిగా అనుసరించడంవల్లా అతనికి శిష్యప్రాయుడిగా లేదాగురువునుమించిన శిష్యుడిగా ఇతణ్ణి ప్రశంసించవచ్చు.

భారవి కృతమైన కిరాతార్జునీయాన్ని పఠించి దానిచే ఆకర్షితుడై దానినిఎదుటపెట్టుకొనే మాఘుడు తనశిశుపాలవధ కావ్యాన్ని రచించినట్లు స్పష్టంగా తెలుస్తూఉంది.

భారవి "శ్రియఃకురూణామ్" అని ప్రారంభించగా మాఘుడు "శ్రియఃపతిః శ్రీమతి శాసితుంజగత్." అనిమొదలుపెట్టాడు. భారవి ప్రతి సర్గాంత శ్లోకంలో లక్ష్మీశబ్దాన్ని ప్రయోగించగా, మాఘుడు శ్రీ శబ్దాన్ని ప్రతిసర్గాంతంలోనూ అదేవిధంగా సంఘటిస్తూవచ్చాడు తక్కినవర్ణనలన్నీ ఇంచుమించు సరిపోతున్నాయి. మాఘకవి నాటికే కిరాతార్జునీయం బహు పండితాదరపాత్రమై లోకంలోవన్నెకెక్కింది. అందువల్ల ఆకావ్యంకంటె తనకావ్యంమిన్నయై ఎక్కువప్రసిద్ధి పొందవలెననే దృఢ దీక్షతో మాఘకవిశిశుపాలవధ కావ్యరచనసాగించాడు. కొన్నిచోట్ల భావాలు గ్రహించాడు. కొన్నిచోట్ల భారవిశ్లోకాలకు ప్రతిబింబశ్లోకాలుకూడా రచించాడు.

"ఉపమా కాళిదాసస్య భారవే రర్థగౌరవమ్
దండినః పదలాలిత్యమ్ మాఘేసంతి త్రయోగుణాః."

అని ప్రసిద్ధిపొందిన మహాపండితుడు మాఘ మహాకవి. కాళిదాసుని ఉపమా సౌందర్యమూ, భారవి అర్థగౌరవమూ, దండి పదలాలిత్యమూ అన్నీకలిసి మాఘునిలో మూర్తీభవించాయి. అందువల్లనే మాఘకావ్య పఠనం సర్వంకష పాండిత్య సంధాయకం అవుతున్నది.

"నవసర్గ గతే మాఘే నవ శబ్దో న విద్యతే" అని అంటారు. మాఘ కావ్యంలో తొమ్మిది సర్గలుపూర్తిగా చదివినవానికి ఇక 'నవ' శబ్దం అనేది ఉండదని అభిజ్ఞుల వచనము.

మాఘకవి శ్రీకృష్ణభక్తుడు. మీమాంసాశాస్త్రం 20 అధ్యాయాల గ్రంథం. ఆవిధంగానే 20సర్గలున్న పరమాత్మ పరమైన కావ్యాన్ని మాఘుడు రసపుష్టంగా తత్త్వజుష్టంగా నిర్మించాడు.

సాంఖ్య, యోగ, వ్యాకరణ, భరత, చాణక్య, వాత్స్యాయన, భారత, రామాయణ, మోక్షోపాయ, ఆత్మజ్ఞాన, ధాతువాద, రత్నపరీక్ష, వైద్యక, జ్యోతిష, ధనుర్వేద గజ తురగ, పురుషలక్షణ, ద్యూత, ఇంద్రజాల, వైశేషిక, న్యాయ, మీమాంసా శాస్త్రపాండిత్యాన్ని కావ్యమంతటా మాఘుడు ప్రదర్శించాడు.

ఇట్లాంటి మహాకవి కావ్యానికి మల్లినాథసూరి వ్యాఖ్య వ్రాయడానికి పూనుకోవడం సంస్కృత సాహిత్యం నోచుకొన్న నోమేకాక తెలుగువారి భాగ్యం కూడా అని చెప్పాలి. కవి, వ్యాఖ్యాత–ఇద్దరూవారికి వారేసాటి. మాఘకావ్య మహత్తుకు తగిన టీకను మల్లినాథుడు సంతరించాడు.

మల్లినాథుని సర్వంకష వ్యాఖ్య లేకపోతే మాఘకవి హృదయం అవగతం కావడం కష్టం. మల్లినాథుడు మహాపండితుడే కాక కవి కూడా కావడంవల్ల ఆ కావ్య వ్యాఖ్యానంలో ఆ కావ్య సౌభాగ్య ధన్యత్వాలను ప్రకటిస్తూ—

"యే శబ్దార్థ పరీక్షణ ప్రణయినో యే వా గుణాలంక్రియా
శిక్షాకౌతుకినో విహర్తుమనసో యే చ ధ్వనేరధ్వని
శుశ్రూద్భావతరంగితే రససుధాపూరే మిమంక్షంతి యే
తేషామేషకృతే కరోమి వివృతింమాఘస్య సర్వంకషామ్"

అని చెప్పాడు.

కాళిదాసు మొదలైన మహాకవుల గ్రంథసారాన్ని చవిచూసిన మల్లినాథసూరికి మాఘకవిమీద గలిగిన ఉద్వేలమైన ఉద్దామమైన గౌరవాతిశయానికి పై శ్లోకమే ప్రమాణము. ఇదే ఆ కావ్య విలక్షణతను వ్యక్తం చేస్తున్నది.

శబ్దార్థ పరీక్షణ ప్రణయినులకు, గుణాలంకార ప్రియులకు, ధ్వని మార్గాభిలాషులకు, శుభ్యద్యాభవతరంగితమైన, రససుధాపూరంలో మునకలు వేయగోరేవారికి సహాయపడటానికే నేను మాఘ కావ్యానికి సర్వ కష వ్యాఖ్య వ్రాస్తున్నానని మల్లినాథుడు చెప్పి యథాప్రతిజ్ఞము వ్యాఖ్యా కార్యము నిర్వహించాడు.

వ్యాఖ్యాన పీఠికాభాగం మాత్రం తక్కినవాటితో పోల్చి చూసినప్పుడు ఇందులో ఎక్కువగా ఉన్నది. ఇక్కడ మల్లినాథుడు మొదట శ్రీకృష్ణుని, తరవాత గణేశుని, ఆ తరవాత శారదాదేవిని స్తుతించాడు.

"ఇందీవర దళశ్యామ మిందిరానంద కందళమ్
వందారు జనమందారం వందేహం యదునందనమ్"
"దంతాంచలేన ధరణీతల మున్నమయ్య
పాతాళకేళిషు ధృతాదివరాహలీలమ్
ఉల్లాఘనోత్ఫణ ఫణాధరగీయమాన
క్రీడావదానమిభరాజ ముఖం నమామః"
"శారదా శారదాంభోజవదనా వదనాంబుజే
సర్వదా సర్వదాఽస్మాకం సన్నిధి స్సన్నిధింక్రియాత్".

ఆ తరవాత "వాణీంకాణభుజీ" మిత్యాదిశ్లోకాలతో తన పాండిత్యం ఉగ్గడించాడు. వ్యాఖ్యాన లక్ష్యాన్ని వివరించాడు. ఇందులో ఒక విశేషం ఉంది.

"మల్లినాథ స్సుధీస్సోఽయం మహోపాధ్యాయ శబ్దభాక్,
విధత్తే మాఘకావ్యస్య వ్యాఖ్యాం సర్వంకషాభిధామ్".

దీనిలో తక్కిన వ్యాఖ్యల్లో చెప్పినట్లు "కవి" శబ్దం ప్రయోగించకుండా "సుధీ" శబ్దం ప్రయోగించాడు. 'మహోపాధ్యాయ శబ్దభాక్' అని మహోపాధ్యాయ బిరుదము వచ్చినట్లు చెప్పి

కొన్నాడు. మల్లినాథుడు కిరాతార్జునీయానికి వ్యాఖ్య వ్రాసిన తరవాత రసికులు ఆ రసగర్భనిర్భరమైన భారవి కవితాసారాన్ని అనుభవించి తత్పరవశులై సంతోషంతో మల్లినాథుని మహోపాధ్యాయ బిరుదంతో సత్కరించి ఉంటారు.

మాఘకావ్య సంపూర్ణ స్వరూపాన్ని విలక్షణతనూ మల్లినాథుడు ఈ విధంగా పేర్కొన్నాడు :-

"నేతాస్మిన్ యదునందనః స భగవాన్ వీరః ప్రధానోరసః శృంగారాదిభి రంగవాన్ విజయతేపూర్ణాపునర్వర్ణనా;ఇంద్రప్రస్థగమాద్యుపాయ విషయః చైద్యావసాదః ఫలం; ధన్యోమాఘ కవిర్వయంతు కృతినఃతత్సూక్తి సంసేవనాత్".

ఇందులో "శ్రీకృష్ణుడు నాయకుడు. ప్రధానరసము వీరము శృంగారాదులు అంగరసాలు వర్ణనలు సంపూర్ణము. ఇంద్రప్రస్థ గమనాదుల ద్వారా శిశుపాలవధ ఫలము. అట్టి మహాకావ్యం వ్రాసిన మాఘకవి ధన్యుడు. అతని సూక్తులు సేవించినందువల్ల మనము కూడా చరితార్థులమైనాము." అని ఉదాత్త హృదయంతో ఆనంద పారవశ్యంతో వెల్లడించాడు.

వ్యాఖ్యానం ఉపోద్ఘాతంలో వస్తునిర్దేశ వర్ణనతో కవి కావ్యం ఆరంభించినట్లు మల్లినాథుడు పేర్కొన్నాడు. కావ్యలక్ష్యాన్నీ, ప్రయోజనాన్నీ ఇక్కడ మల్లినాథుడు వివరించాడు.

మాఘమేఘ కావ్యాలకు వ్యాఖ్యానాలు వ్రాయడంలో మల్లినాథుడు తన కాలాన్ని ఎక్కువగా వెచ్చించాడని తెలుస్తున్నది. మాఘకావ్యానికి సవిస్తరమైన వ్యాఖ్యానాన్ని చాలా చర్చలతో చేశాడు. "మాఘస్య సర్వంకషామ్" అని చెప్పినట్లుగానే సర్వంకష అనే పేరు సార్థకమయ్యేటట్లు అన్ని విషయాలను, అన్ని కోణాల లోనూ పరిశీలించి, కూలంకషంగా చర్చించి చదివేవారికి సర్వంకషా

పాండిత్యం అబ్బేటట్లు విపుల వ్యాఖ్యానాన్ని సంతరించాడు. 'మాఘే మేఘే గతంవయః' అనే మాటలోని యాదార్థ్యం మాఘ వ్యాఖ్య చూస్తేనే తెలుస్తుంది. సూరి ఈ విధంగా సంజీవిని అను గ్రహించి ఘంటాపథంలో నడిపించి ద్రాక్షా, కదళీ, నారికేళ పాకాలతో పుష్టిని చేకూర్చి, ఈ మాఘ వ్యాఖ్యతో విద్యార్థులను సర్వంకష ప్రజ్ఞాసమన్వితులను చేశాడు.

సర్వంకషలో కూడా ఘంటాపథంలో చెప్పినట్లే కొన్ని విశేషాలు చెప్పాడు. వ్యాఖ్యానారంభంలో "అత్రాదౌ శ్రీశబ్ద ప్రయోగాత్ వర్ణగణాది శుద్ధేరభ్యుచ్చయః" అని శ్రీశబ్ద ప్రయోగ ప్రయోజనాన్ని వివరించాడు. ప్రథమ సర్గాంతంలో "చమత్కార కారితయా మంగళాచరణ రూపతయాచ సర్గాంత్యశ్లోకేషు శ్రీశబ్ద ప్రయోగః యథా గవాన్ భాష్యకారః మంగళాదీని మంగళ మధ్యాని మంగళాంతాని శాస్త్రాణి ప్రథంతె, వీరపురుషాణ్యా యుష్మత్పురుషాణిచ భవంతి అధ్యేతారశ్చ ప్రవక్తారో భవంతీతి".

"అథకవిః కవికావ్య వర్ణనీయాఖ్యాన పూర్వకసర్గసమాప్తిం కథయతి-ఇతీతి. ఇతి శబ్దః పరిసమాప్తే మాఘకృతావితి కవినామ కథనం, మహాకావ్యమితి మహచ్ఛబ్దేన లక్షణ సంపత్తిస్సూచితా, 'శిశుపాలవధ' ఇతి కావ్యనామకథనం, ప్రథమఃసర్గ ఇతి సమాప్త ఇతి శేషః. ఏవముత్తరత్రాపి ద్రష్టవ్యమ్" అని స్పష్టంగా వివరించాడు.

మాఘకావ్యాన్ని వ్యాఖ్యానించడం అంటే కొన్ని శాస్త్ర గ్రంథాలను వ్యాఖ్యానించినట్లే. గ్రంథకర్త అనేక శాస్త్రాంశాల్ని కావ్యంలో చొప్పించగా ఆయా విషయాలను సప్రమాణంగా సోదాహరణంగా వివరించి మల్లినాథుడు తన అపార శాస్త్ర పాండిత్యాన్ని వెల్లడించాడు.

మాఘమహాకవి 'వైయాకరణ శిరోమణి', సాహిత్య సామ్రాజ్య చక్రవర్తి కావడంవల్ల అటు వైయాకరణులూ, ఇటు ఆలంకారికులూ ఇతని కావ్యాన్ని వారి గ్రంథాల్లో ఉదాహరించి ఇతనిపైగల గౌరవాన్ని చూపారు. కావ్యాలంకార సూత్ర ధ్వన్యాలోకలోచనాలూ, వ్యక్తివివేకమూ, వక్రోక్తిజీవితమూ, కావ్యప్రకాశము, కువలయానందమూ మొదలైన అలంకార గ్రంథాల్లోనూ, పదమంజరి, ధాతువృత్తి, భాషావృత్తి, సిద్ధాంత కౌముది, మనోరమ, శబ్దేందుశేఖరమూ, కృదంతరూపమాల, మొదలైన వ్యాకరణ గ్రంథాలలోనూ, ఇతని శ్లోకాలు ప్రమాణంగా స్వీకరించబడ్డాయి.

మాఘకవిలోని కొన్ని ప్రయోగదోషాలను మల్లినాథసూరి, మల్లినాథ వ్యాఖ్యలలోని కొన్ని లోపాలను శ్రీ దుర్గాప్రసాద ద్వివేదులూ చూపారు. వాటి చర్చకు ఇది సమయమూకాదు; సందర్భమూకాదు.

మాఘకావ్యం మూడోసర్గ చివరిశ్లోకం వ్యాఖ్యానిస్తూ మల్లినాథుడు దాన్ని "పంచకావలీ" వృత్తంగా పేర్కొంటూ "నజభజ జాజరౌవరపతే కథితా భువిపంచకావలీ ఇతిలక్షణాత్" అని చెప్పాడు. దానినే 'ధృతశ్రీవృత్త'మని కొందరంటారని చెబుతూ "నజభజ జజరైర్ధృతశ్రీః" అని లక్షణం ఉదాహరించాడు. కొందరు దీనిని 'చంపకావళీ' వృత్తమని పేర్కొన్నారు. 'సరసీవృత్త'మని కొందరు చెప్పారు. ఎవరేవిధంగా చెప్పినా అందరూ ఈ "తురగశతాకులస్య" అనే శ్లోకాన్నే లక్షణంగా చూపారు. తెలుగులో ఈ వృత్తం 'చంపకమాల'గా ప్రసిద్ధమయి ఉంది.

6. జీవాతువు (నైషధీయచరితము) :- విద్వదౌషధమని పేరు గాంచిన నైషధీయచరితము 22సర్గల మహాకావ్యము. మొత్తం శ్లోక సంఖ్య 2764.

హర్ష నైషధానికి అనేక వ్యాఖ్యలు బయలుదేరాయి. ఇప్పటికి 46 వ్యాఖ్యలు దొరికాయి. మొదటి వ్యాఖ్యాత విద్యాధర పండితుడు క్రీ. శ 1250-60 ప్రాంతంవాడు. రెండోవాడు చందూ పండితుడు. ఇతడు క్రీ. శ. 1297 ప్రాంతంవాడు.

ఈ నైషధీయచరితానికి శేషరామచంద్ర, విశ్వేశ్వర భట్టారక, మల్లినాథ, నారాయణభట్టాది మహోవ్యాఖ్యాతలు వ్రాసిన వ్యాఖ్యలు పేర్కొనదగినవి వీటిలో నారాయణభట్ట ప్రణీతనైషధీయ ప్రకాశ వ్యాఖ్యా, విశ్వేశ్వరభట్టారకుని విశ్వేశ్వరీయమూ, మల్లినాథుని జీవాతువూ ప్రసిద్ధిచెంది, విద్వాంసుల ఆమోదం పొందాయి. మల్లినాథుడు తన వ్యాఖ్యలలో నారాయణీయాన్ని, విశ్వేశ్వ రీయాన్ని అక్కడక్కడ స్మరించాడు. ఈ వ్యాఖ్యాతలతో. శ్రీనాథాచార్యుడొకడు కనిపిస్తున్నాడు. ఇతడు వ్యాఖ్యాంత గద్యలో ప్రతిసర్గ చివరనూ 'ఇతి శ్రీ మహోపాధ్యాయ శ్రీనాథా చార్య విరచితే నైషధప్రకాశే' అని వ్రాసుకొన్నాడు. ఈ ప్రతి బరోడా మహారాజుగారి పుస్తకశాలలో ఉన్నట్లు చెబుతున్నారు. మహామహోపాధ్యాయ శివదత్తశర్మమహాదేవ్ గారు నైషధీయ చరిత ప్రస్తావనలో ఈ కింది నైషధవ్యాఖ్యాతలను పేర్కొన్నారు.-

1 ఆనందరాజానక్ 2. ఈశానదేవ్ 3. ఉదయనాచార్య 4. గోపీనాథ్ 5. చందూపండితుడు 6. చారిత్రవర్ధనుడు 7. జినరాజు 8. నరహరి (నరసింహ) 9 నా రా య ణ భ ట్ట 10. భగీరథుడు 11. భరతమల్లికుడు (భరతసేన్) 12. భవదత్తుడు 13. మధురా నాథ్ 14. మహామహోపాధ్యాయ మల్లినాథసూరి 15 మహాదేవ వి ద్యా వా గీ శు డు 16. రామచంద్రశేష్ 17. వంశీవదన్‌శర్మ 18. విద్యాధరుడు 19. విద్యారణ్యయోగి 20. విశ్వేశ్వరాచార్య 21. శ్రీదత్తుడు 22. శ్రీనాథుడు 23, సదానందుడు.

నైషధీయ చరితంలో 12వ సర్గకుమాత్రం మల్లినాథ వ్యాఖ్యా నం లభించలేదని అందుచేత 12వ సర్గను నారాయణీయ వ్యాఖ్యతో

ప్రచురిస్తున్నామని చౌఖాంబా ప్రచురణ కర్తలు పేర్కొన్నారు. ఇది కాక ప్రక్షిప్తాలుగా తలచి మల్లినాథుడు విడిచిపెట్టిన మరికొన్ని శ్లోకాలను కూడా నారాయణీయ వ్యాఖ్యతో ప్రకటించారు. వీటిని క్షేపక శ్లోకాలుగా అంగీకరిస్తూనే నారాయణభట్టు వ్యాఖ్యానించినట్లు తెలిపారు. ఆగంతుక పాఠాలని తెల్పి వీటిని మల్లినాథుడు వ్యాఖ్యానించక విడిచాడు.

నైషధకర్త అయిన శ్రీహర్షుడు ఉద్దండ పండితుడు. చింతామణి మంత్రోపాసకుడు, సరస్వతీ సమారాధనా లబ్ధ అసాధారణ ప్రతిభాసంపన్నుడు, ఖండనఖండఖాద్యాది బహుగ్రంథరచనా ధురీణుడు. సంస్కృత వాఙ్మయంలో అత్యుత్కృష్టస్థానం ఆక్రమించిన నైషధీయచరితము విద్వదౌషధమనే ప్రసిద్ధిపొందింది. అందులోనిమృదు మధుర పదవిన్యాస నైపుణీ, ఉత్తమాలంకార చమత్కారాలూ, అసమాన అనుప్రాస విలాసాలూ, నిరుపమాన ఉపమానచాతురీ మొదలైన సుపమాన కావ్యసామగ్రి ఈ మహా విద్వత్కవిలోని లోకోత్తర ప్రతిభను ఆవిష్కరిస్తున్నది. దీనిని బట్టే:

"తావద్భా భారవేర్భాతి యావన్మాఘస్య నోదయః

ఉదితే నైషధే కావ్యే క్వమాఘః క్వచ భారవిః" అనే అభియుక్తోక్తి బయలుదేరింది. అంటే మాఘోదయంవరకే భారవి ప్రకాశిస్తున్నాడు. నైషధం ఉదయించినతరువాత మాఘుడెక్కడో భారవి ఎక్కడో మనకుకనిపించరు. భారవి కిరాతార్జునీయము అద్భుతమైన కావ్యం. దీనికంటె మాఘము (శిశుపాల వధ) శ్రేష్ఠమైనది. మాఘ భారవుల కంటే నైషధీయచరితము పరమోత్కృష్టమైనదని భావము.

సంస్కృత వాఙ్మయంలో హార్ష నైషధ కావ్యానికి విశిష్టమయిన స్థానమున్నది. ఇందులో మంత్ర, యోగ, వేదాంత రహస్యాలు నిక్షిప్తాలయ్యాయి. ఈ కావ్యం పరమధ్వని కావ్యము కావ్య

మంతటా ప్రయత్నించి బుద్ధిపూర్వకంగా ఖలముఖ భంగార్థమై గ్రంథగ్రంథులు నిక్షేపించి ట్లు కవే స్పష్టంగా చెప్పాడు. గ్రంథగ్రంథి రిహక్వచిత్ క్వచిదపిన్యాసి ప్రయత్నాన్మయా, ప్రాజ్ఞమ్మన్యమనా హఠేన పఠితీ మాస్మిన్ ఖలః ఖేలతు, శ్రద్ధారాద్ధ గురు శ్లథీకృత దృఢగ్రంథిః సమాసాదయ, త్వేతత్కావ్య రసోర్మి మజ్జన సుఖ వ్యాసజ్జనం సజ్జనః" "ఖలముఖభంగార్థం బుద్ధిపూర్వమేవ ఇదంకావ్యం మయాదుర్బోధం వ్యరచి; నతు ప్రసన్న కావ్య కరణాశక్త్యా, నకా వ్యత్వ హానిరపి." ఇట్లా చెప్పడంవల్ల ప్రాజ్ఞమ్మన్యులకు-గురు శుశ్రూషా విరహితులకు అపక్వచిత్తులకు- సంప్రదా యానభిజ్ఞులకు నైషధ వ్యం అనభిగమ్యమనీ, శ్రద్ధారాద్ధగురుశ్లథీకృత దృఢగ్రంథు లకు మాత్రమే ఈ కావ్యం ప్రవేశసాధ్యమనీ తెలుస్తున్నది. పరమార్థ తత్పరుడైన నైషధకర్తధ్వని మార్గాన్ని అవలంబించి రమణీయమై అమృత వర్షి అయిననైషధీయ చరితాన్ని రసజ్ఞలోకానికి అందించాడు

నైషధీయచరితానికి వ్యాఖ్యాతృ చక్రవర్తీ, పదవాక్య ప్రమాణ పారావార పారీణుడూ, మహోపాధ్యాయ సార్థక నామ ధేయుడూ అయిన మల్లినాథసూరి అనన్యసాధ్యాలైన ప్రతిభా పాండి త్యాలతో మహనీయ వ్యాఖ్యానాన్ని రచించాడు. ఆవ్యాఖ్యానంలో అతడు రసభావ, గుణార్థదోష, సధ్వన్యలంకృతి రహస్యవిదులకు మోదం కూర్చటానికి తానా వ్యాఖ్యానం సంతరిస్తున్నట్లు ప్రతిజ్ఞచేసి ఆప్రతిజ్ఞను అక్షరాలా నిర్వహించగలిగాడు.

కాళిదాసు భారతివలెనే శ్రీహర్ష వాణికూడా క్షుద్రవ్యాఖ్యా విషార్త అయినదట. మల్లినాథసూరి జీవాతువు ప్రసాదించి దానిని పునరుజ్జీవింపజేశాడట.

క్షుద్రవ్యాఖ్యా విషార్తానాం శ్రీహర్షకవిరాడ్గిరామ్
ఉజ్జీవనాయ జీవాతుర్జీయా దేష మయాకృతః" అన్నాడు

తనవ్యాఖ్యా విద్వన్మోద హేతునని తెలిపాడు.

శ్రీమల్లినాథ విదుషో విదుషాం మతేన
తేనైవ నైషధ కథామృత కావ్య బంధః
వ్యాఖ్యాస్య తేస్తు రసభావ గుణార్థ దోష
సద్ధ్వన్యలంకృతి రహస్య విదాం ముదేతత్।"

గ్రంథగ్రంథులతో నిండిసామాన్య పాండిత్యానికి అందనిది నైషధము. దాని గ్రంథులువిప్పి అందులోని రస, భావ, ధ్వన్యలంకారాలు చేతికందించి మల్లినాథుడు విద్వాంసుల మెప్పుగొన్నాడు నిజంగా మల్లినాథసూరి రచించిన జీవాతు వ్యాఖ్యాన సాహాయ్యం తోనే శ్రీహర్షుని కవితానుగుంఫనములు సర్వరసికా స్వాద్యా లయ్యాయి అనిచెప్పవచ్చు. ప్రాచీనకవులు తత్త్వ వేత్తలూ, శాస్త్ర వేత్తలూ, పరమార్థ పరాయణులు. వారి వ్యాఖ్యాతలు కూడా అంతటివారే. అలాంటి వ్యాఖ్యాతలలో మల్లినాథుడు అగ్రగణ్యుడు.

"అద్వైతసిద్ధాంత బుద్ధితో విద్యారణ్యులు వేదభాష్యాలు చేసినట్లు మల్లినాథసూరి ధ్వనిస్ఫూర్తితో కాళిదాసీయాది కవిత్వాగమభాష్యాలు వ్రాశాడు. హర్షనైషధంలో ఎక్కడెక్కడ ధ్వని ఉందో సాధ్యమైనంతవరకు అక్కడంతా మల్లినాథులవారు "ఇతిధ్వనిః, ఇత్యలంకారేణ అలంకారధ్వనిః, ఇత్యలంకారేణ వస్తుధ్వనిః" అని ఈ విధంగా స్పష్టంగా చెబుతూ ఆయాధ్వని విశేషాల లక్షణాలు వివరించారు. శ్రీహర్షుడు సామాన్యుడు కాడు. అతడు కాళిదాసువలె ధ్వనివేత్త. శంకరుడివలె బ్రహ్మవేత్త. అంత మహనీయమైన ఆ కవితలోని సౌందర్యావిష్కరణకు సర్వజ్ఞుడైన మల్లినాథుడు పూనుకోవడం రసజ్ఞలోకం చేసుకొన్న అదృష్టము. ఎట్లా తరించాడో! ఆ కవితాసాగరాన్ని. కాళిదాస భారవి మాఘాదుల కవిత సామాన్యమా! ఒక్కొక్క శ్లోకం చాలు కొన్ని దినాలు చర్వణ చేయడానికి. ఆయన విప్పి చెప్పిన సౌందర్య రహస్యాలు సుదీర్ఘ తపోనిష్ఠ చేతగాని వేద్యమయ్యేవి కావు.

ఒక్కొక్క శ్లోకమే ఒక్కొక్క మహాసముద్రమైతే అట్లాంటివి ఎన్ని శ్లోకాలు-ఎన్ని కావ్యాలు! ఇదంతా ఆలోచిస్తే మల్లినాథుని వారిపని ఎంత మహత్తరమో ఊహించడం కూడా అసాధ్యమే. స్వీయపాండిత్య ప్రగల్భంచేత అన్యవ్యాఖ్యాతలు మహాకవితలకు అపచారంచేశారు. రాక్షసాపహృతమైన వేదచతుష్టయాన్ని భగవంతు డుద్ధరించినట్లు కువ్యాఖ్యా విషమూర్ఛితలైన ఆ కవితలను అతడుద్ధ రించాడు" శ్రీ గుంటూరు శేషేంద్రశర్మగారి పై వాక్యాలు ప్రత్యక్షర సత్యాలు

మల్లినాథుని వ్యాఖ్యలతో ఈఆరు కావ్యాలూ చదివినవారికి భాషాజ్ఞానమూ, అన్వయశక్తి, రసాస్వాదన సామర్థ్యమూ, విమర్శనాపాటవమూ, బహుశాస్త్ర మర్యాదాభిజ్ఞతా కలుగుతా యనడంలో ఆశ్చర్యంలేదు.

పూర్వం గురువులు కావ్యంలోని శ్లోకాలతోపాటు మల్లి నాథుని వ్యాఖ్యానపంక్తులు కూడా విద్యార్థులచేత కంఠస్థం చేయించే వారంటే మల్లినాథుని వ్యాఖ్యాన వైశిష్ట్యం స్పష్టం అవుతూ ఉంది

7. సర్వపథీన (భట్టికావ్యము)':- భట్టికావ్యము 22 సర్గ. కావ్యము. శ్లోకసంఖ్య 1639.

"వ్యాఖ్యాం సర్వపథీనాఖ్యాం భట్టికావ్యస్య కామపి
మల్లినాథ సుధీఃసోహం కుర్వేసర్వపథీనధీః".

ఈ భట్టి కావ్యానికి మల్లినాథసూరి "సర్వపథీన" అనే వ్యాఖ్యానం వ్రాశాడు. దీనికే "సుబోధినీకారుడు" అనే మరో వ్యాఖ్యాత కూడా వ్యాఖ్యానం వ్రాసినట్లు సూరి తన సర్వపథీన వ్యాఖ్యలో చెప్పాడు. వ్యాకరణ గ్రంథిబంధురమైన భట్టికావ్యాన్ని వ్యాఖ్యానించి మల్లినాథసూరి వ్యాకరణశాస్త్రంమీద తనకు ఉండే అధికారం వెల్లడించాడు.

ఇందులో ప్రతిసర్గకూ పేర్లున్నాయి అవి:-

1. శ్రీరామసంభవః 2. సీతాపరిణయః రామప్రవాసః 4 శూర్పణఖానిగ్రహః 5. సీతాహరణం 6. వాలివధః 7. సీతాన్వేషణం 8. అశోకవనికాభంగః 9. మారుతిసంయమః 10. సీతాభిజ్ఞానదర్శనం 11. ప్రభాతవర్ణనమ్ 12.—13. సేతుబంధః 14 సర్వ బంధః 15. కుంభకర్ణవధః 16. రావణవిలాసః 17. రావణవధః 18. విభీషణ పలాపః 19. విభీషణాభిషేకః 20. సీతాప్రత్యాఖ్యానం 21. సీతాసంశోధనం 22 అయోధ్యాప్రత్యాగమనమ్

భట్టివిరచితమైన ఒక మహాకావ్యమే "రావణవధ" లేక "భట్టి కావ్యము" దీనికి చాలామంది వ్యాఖ్యాతలున్నారు. ఆ వ్యాఖ్యలలో జయమంగళ రచితమైన జయమంగళటీకా మల్లినాథ విరచిత "సర్వపథీన" వ్యాఖ్య చాలా ప్రసిద్ధమైనవి. ఈ రెండింటిలోనూ జయమంగళటీక ముందుది.

అన్ని వ్యాఖ్యలవలెనే మల్లినాథుని భట్టికావ్య వ్యాఖ్యా కూడా ప్రత్యక్షరవ్యాఖ్యారయే. అన్వయక్రమమూ, వైయాకరణ, ఆలంకారిక విషయాలూ, తాను చెప్పిన వాటిని సమర్థిస్తూ ప్రమాణాల ఉదాహరణలూ ఈ వ్యాఖ్యలో ఉన్నాయి. ఇది సర్వోత్కృష్ట మైన వ్యాఖ్య తన వ్యాఖ్యానంలో వ్యాకరణాంశాలు మాత్రమే కాక అలంకార విషయాలు కూడా చర్చించాడు. తాను చెప్పిన అర్థాలకు కోశాలను ఉదాహరించాడు. ప్రతిశ్లోకనామం చెప్పి ఛందోవిషయాలు వివరించాడు. కేవల రూపనిష్పాదన, వ్యాకరణ విషయాలుకాక ముడిపడ్డ వ్యాకరణాంశాలమీద మల్లినాథుడు లోతులకు వెళ్ళి చర్చించాడు కొన్నిచోట్ల జయమంగళుని విమర్శించాడు. ఒకచోట "సుబోధినీకారుడు" అనే పూర్వ వ్యాఖ్యాతను కూడా విమర్శించాడు

అతనివ్యాఖ్యలో భట్టోజీ దీక్షితుని సిద్ధాంతకౌముదికి సంబంధించినకొన్ని ఇతిహాసాలు ఉన్నాయి. ప్రొ. త్రివేది ఈవ్యాఖ్యాన భాగం

(సిద్ధాంత కౌముదికి సంబంధించింది) మ|దాసు థియోసాఫికల్ సొసైటీ కార్యాలయంలోఉన్న వ్రాతప్రతుల్లో కనిపించలేదనీ, అందుకే ఇది ఆగంతుక భాగంగా చెప్పవచ్చుననీ అన్నారు. భట్టోజీ దీక్షితుని కంటె మల్లినాధుడు చాలా పూర్వుడు. కనుకనే సిద్ధాంత కౌముదినుంచి అతడు ఉదాహరించలేక పోయినాడని అన్నారు

వ్యాఖ్యానారంభంలో 'సర్వపథీనం' అనే ఈవ్యాఖ్యానం అన్నికాల విద్వాంసులకు సమ్మతంగా తాను వ్యాఖ్యానిస్తున్నానని మల్లినాథుడు చెప్పాడు. "వ్యాఖ్యాం సర్వపథీనాఖ్యాం భట్టి కావ్యస్యకామపి మల్లినాథసుధీః సోఽహం కుర్వే సర్వపథీన ధీః" గుణ అలంకార శబ్ద, అర్థ, ధ్వని, భావ, రసాదిసాహిత్తి విశేషాలన్నిటినీ ఈ వ్యాఖ్యానం వివరిస్తుంది. దీనిలో వీరరసము ప్రధానము. అంగరసాలు శృంగారం,కరుణము రాముడు నాయకుడు పట్టణ, సముద్ర, పర్వత వర్ణనలు ఈ గ్రంథంలో ఉన్నాయి. రావణ మరణం ఫలితము. ఈ కావ్యసౌందర్యాన్ని అనుభవిస్తున్న కావ్యకర్త భట్టీ, మనమూ ఆశీస్సులు పొందుతాము.

వ్యాఖ్యాన పీఠికలో శ్లోకాలున్నాయి. సంప్రదాయానుసారంగా వస్తువర్ణనతో కావ్యారంభమయిందని మల్లినాథుడు చెప్పాడు.

భట్టి భాషాశ్లేషలకు ఉదాహరణలుగా ఇచ్చిన కొన్ని శ్లోకాలకు సంస్కృత భాషలోనూ, ప్రాకృత భాషలోనూ, మల్లినాథుడు వివరణ చేశాడు.

ఈ కావ్యంలో 14వ సర్గనుంచి 'సౌశబ్ద్యం' లేక 'సుశబ్దత' అనే ఒక గుణం ఉందని మల్లినాథుడు చెప్పాడు. ఈ సందర్భంలో ప్రతాపరుద్రీయం నుంచి దీని లక్షణాన్ని ఇట్లా మల్లినాథుడు ఉదాహరించాడు. "సుపాం తిఙాంచవ్యుత్పత్తిః సౌశబ్ద్యం పరికీర్త్యతే "

ఈ సర్గలన్నింటిలోనూ క్రియలకుసంబంధించిన సౌశబ్ద్యం ప్రతిష్ఠితమయింది. సంస్కృత భాషలో పది లకారాలు ఉన్నాయి.

అందులో "లేట్" అనే లకారం వేదాలలో మాత్రమే ప్రయుక్త మవుతుంది. మిగిలిన 9 లకారాలు మాత్రమే కావ్యాలలో వాడు కోవాలి.

8. తరళ (ఏకావళి):- ఏకావళికర్త విద్యాధరుడు. ఇది అలంకార గ్రంథము. ఎనిమిది ఉన్మేషాలు ఉన్నాయి. మొత్తం శ్లోకాలు 399. మొత్తం కారికలు 150.

మల్లినాథుకు దీనికి "తరళ" అనే వ్యాఖ్యానం వ్రాశాడు. ఈ వ్యాఖ్య సులభశైలిలో ఉండి విద్యార్థులకు అత్యంత ఉపయోగ కరంగా ఉంది. "ఏకావళి" అంటే ఒంటిపేట హారము. "తరళ" అంటే హారం మధ్యలో ఉండే "నాయకమణి."- మల్లినాథుడు మేఘ దూత, కిరాతార్జునీయ, శిశుపాలవధ వ్యాఖ్యలలో ఏకావళిని ఉదాహరించాడు.

మల్లినాథుడు తరచుగా విద్యానాథుని ప్రతాపరుద్రీయాన్ని ఉదాహరించినా ప్రతాపరుద్రీయానికి వ్యాఖ్యానం వ్రాయక విద్యాధరుని ఏకావళికి వ్యాఖ్యానం వ్రాశాడు. ప్రతాపరుద్రీయానికి ఇతని కుమారుడైన కుమారస్వామిసోమపీథి రత్నాపణ వ్యాఖ్య వ్రాశాడు.

మల్లినాథుని ఇతర వ్యాఖ్యానాల ఆరంభంలో చేసిన ప్రార్థన కంటె ఈ వ్యాఖ్యానం ఆరంభంలోని ప్రార్థన శ్లోకాలు భిన్నంగా ఉన్నాయి.

1. అగ్రేకృత్వాప్రియ సహచరీమంతికం సంప్రయాంతీం
వ్రీడాభారాదవనతముఖీ మంబికామాదరేణ
లోలాపాంగాం ప్రణయ మధురాం లోచనాంతేనపశ్య
న్నంతస్తుష్యన్నవతు భగవానంబికా వల్లభోనః

2. స్వైర్యైర్నిత్యం గుణపరిముళై ర్మోదయంతీ దిగంతా
నత్యుద్దండై రమృతకిగణై రైందవీ లేఖికేవ
సాలంకారా సులలితపదా సాధువృత్తా సభావా
మాతానిత్యం మమభగవతీ భారతీ సన్నిధత్తామ్॥

3. అధ్యాగూఢః కపర్దం పితురమరధునీం హేలయా
గాహమానః
కర్షన్ హర్షాతిరేకాత్ కనక కమలినీషండముద్దండవృత్త్యా,
అంతర్మగ్నం కరాగ్రం ఫణిపతి శిరసిస్వైరమాధాయతోయం
ముంచన్‌సించన్నధస్తాత్ ప్రమథపతి శిరః
ర్భాతిబాలో గణేశః॥

4. వాణీం కాణభుజీ...జన్యంయశః

5. మల్లినాథకవిః సోఽయ మేకావల్యామలంకృతీ
టీకారత్నం నిబద్నాతి తరలం నామ నామతః।

6. ఏకావలీ గుణవతీయమలంక్రియాపి
యద్వైశసాదజని కోశగృహేషుగుప్తా
తేనోద్ధృతేన తరలేవ సమేత్య ధన్యైః
కంఠేషు చాద్య హృదయేషు చ ధార్యతాం సా॥

తరళ వ్యాఖ్యానంలో మల్లినాథుడు తన రచనలు కొన్నింటిని ఉదాహరించాడు. తంత్రవార్తికంపై వ్రాసిన సిద్ధాంజన వ్యాఖ్యానం ఉదాహరించాడు. "తదేతత్ సమ్యగ్వివేచితమస్మాభిః తంత్రవార్తిక టీకాయామ్ వాజపేయాధికరణే" తరళ వ్యాఖ్యలోనే స్వరమంజరి పరిమళ వ్యాఖ్యను కూడా పేర్కొన్నాడు. "తదేతత్ సమ్యక్ ప్రపంచిత మస్మాభిః స్వరమంజరీ పరిమళటీకాయామ్" మైత్రీ శయ్యను చూపించడానికిగాను తాను సొంతంగా రచించిన ఒక శ్లోకాన్ని మల్లినాథుడు ఉదాహరించాడు.

శబరభాష్య శంకరభాష్యాదులలోవలె ఏకావళి ఆరంభంలో తత్కర్తప్రార్థనలు, గ్రంథపరిసమాప్తికి మాత్రమే చేయబడవు అని చెప్పినాడు. కాని అవి జయప్రదంగా పరిసమాప్తిన౯దాయి. కిరణావళి, కాదంబరి మొదలైన కొన్ని గ్రంథాలలో ప్రార్థనలు చేసినా అవి అసంపూర్తిగానే మిగిలిపోయాయి దీనిమీద "భట్ట పాదాదులు అందించిన సమాచారాన్నిబట్టి శబరభాష్యాది గ్రంథా లలో ప్రార్థనలు కృతకాలే కాని సహజాలుకావు అని మల్లినాథుడు వివరించాడు.

మొదటి శ్లోకానికి వ్యాఖ్య వ్రాస్తూ మల్లినాథుడు ప్రకరణ లక్షణం ఇట్లా చెప్పాడు "ప్రధాన వాక్యమంగోక్త్యా ఆకాంక్షం ప్రకరణం మతమ్."

'ప్రలయ' శబ్దంనుంచి 'ప్రాలేయ' శబ్దం నిష్పన్నం అయిం దనిన్నీ ఇది విరోధాభాసాలంకారమనీన్నీ మల్లినాథుడు చెప్పాడు. ఇక్కడ చెప్పిన లక్షణం ప్రతాపరుద్రీయంలో ఉంది. మల్లినాథుడు ఈ వ్యాఖ్యలో ఇచ్చిన అనేక ఉదాహృతులు ఈ కిందివిధంగా ఉన్నాయి. శాస్త్రమంటే ఏమిటో వివరిస్తూ ఇట్లా చెప్పాడు.

"ప్రవృత్తిర్వా నివృత్తిర్వా నిత్యేన కృతకేన వా
పుంసాం యేనోపదిశ్యేత తత్ శాస్త్రమభిధీయతే".

'కాంతాసమ్మిత తయా' అనే శ్లోకం వివరిస్తూ మల్లినాథుడు ఒక చక్కని ఆసక్తిదాయకమైన వివరణం ఇచ్చాడు. "యథా కాంతా కటాక్షవీక్షణ మందహాస మధుర భాషణాదిభిః పురుషాన్ రంజయంతీ వ్యంజన వ్యాపారేణైవ సర్వం కారయతి ఏవం కావ్యమపి శబ్దార్థోభయ శక్తిమూలతయా వ్యంజనా వృత్త్యా సహృదయ హృదయాహ్లాదకతయా చమత్కుర్వతీ 'రామాదివత్ వర్తితవ్యంజనేన, న రావణాదివత్। ఇతిధ్వనయంతీ సరసతామా

పాద్యపుంసః కర్తవ్యే ప్రవర్తయతి నివర్తయతి చ అకర్తవ్యాత్. ఇతి కాంతా సమ్మితమిదంశాస్త్రం ఇత్థం ఉపదేశత్రయం వివిచ్య తత్ర తృతీయ నిరూపణా స్వగ్రంథకృత్యం ఇతి ప్రతిజానీతే".

కవి-కావ్యశబ్దాల రూపనిష్పత్తిని మల్లినాథుడు వివరించాడు. కవయతే వర్ణయతే ఇతికవిః. ఇక్కడ ధాతువు 'కవ-వర్ణనే', 'తస్యకర్మకావ్యమ్' అని వివరించాడు.

దీని 8వ ఉన్మేషం వ్యాఖ్యానాంతంలో మల్లినాథుడే ఈ కింది విధంగా శ్లోకాల్ని రచించాడు.

"జగతి వివిధ విద్యాసింధు మష్టింధయానాం
వరభణితిపరీక్షా యుజ్యతేసజ్జనానాం
తదిహామమ నిబంధే దూషణం భూషణం వా
భవతి యది విదగ్ధైస్తద్వ్యవశ్యం విమృశ్యమ్."

"పారీణాఃపదసాగరస్య కతిచిత్ తంత్రే స్వతంత్రాఃపరే
కేచిత్ కర్కశతాసవక్రభణితి ప్రౌఢిప్రియం భావుకాః
అన్యే సత్కవితామృతాబ్ధిలహరీమృష్టాంశ ముష్టింధయా
నైతేకేసి వయంతు కింతుత ఇమేసర్వే బహూకుర్వతే."

ఈ ఏకావళి ప్రాసు ఖ్యాన్ని మల్లినాథుడు ఒక్క శ్లోకంలో ఈ విధంగా స్పష్టం చేశాడు.

"ఏకామేకావలీమేవ కంఠేధత్త కవీశ్వరాః
అఃకిమన్యైరలంకారైరసారైర్భారదాయిభిః."
అందుకోసమే మల్లినాథుడు దీన్ని మనకందించాడు.
దీని గద్య ఇతర వ్యాఖ్యానాలలోవలెనే ఉన్నది.

9. నిష్కంటక (ప్రశస్తపాదభాష్యటీక) - భాష్యనికరము:- వేదాల తర్వాత పేర్కొదగినవి దర్శనాలు. "దృశ్యతేయేన తద్దర్శనమ్" పలురకాలుగా వేరైన దృశ్యజగత్తులోని సమస్త మౌలిక సమస్యలకు సమాధాన మార్గాన్ని చూపే శాస్త్రాలే దర్శనాలు.

ఇవి ఆరు :-

1. న్యాయదర్శనము	గౌతమమహర్షి
2. వైశేషికదర్శనము	కణాదమహర్షి
3. సాంఖ్యదర్శనము	కపిలమహర్షి
4. యోగదర్శనము	పతంజలిమహర్షి
5. పూర్వమీమాంస	జైమినిమహర్షి
6. ఉత్తరమీమాంస	వ్యాసమహర్షి

ఈ దర్శనాలు వేదవేదాంతాలలో ఉన్న సంప్రదాయసిద్ధమైన ఆయా విషయాల విజ్ఞానం ఆధారంగా అవతరించాయి. "కాణాదం పాణినీయంచ సర్వశాస్త్రోపకారకమ్." దీనినిబట్టి కణాదుని వైశేషిక దర్శన ప్రాముఖ్యం వెల్లడి అవుతున్నది.

కణాదముని రచించిన సూత్రాలకు ప్రశస్తపాదుడు "పదార్థ ధర్మ సంగ్రహము" అనే భాష్యాన్ని వ్రాశాడు. దీనినే ప్రశస్త పాద భాష్యము అంటారు

ఈ ప్రశస్తపాద భాష్యానికి భాష్యాలు రచించినవారిలో శ్రీధరపండితుడొకడు. శంకరమిశ్రుడు వ్రాసిన "వైశేషికోపస్కారము" అనే కణాద సూత్ర వ్యాఖ్య ఒకటి ఉన్నది. దీనికి వాత్స్యాయనుడు భాష్యం వ్రాశాడు.

దీనికి 8 వృత్తులు బయలుదేరాయి. (1) వ్యోమశివాచార్యుని వ్యోమవతి (2) శ్రీధరాచార్యుని కందళి (3) ఉదయనాచార్యుని కిరణావళి (4) శ్రీవత్సాచార్యుని లీలావతి (5) జగదీశతర్కాలంకారుని భాష్యసూక్తి (6) పద్మనాభమిశ్రునిసేతువు. (7) మల్లినాథ సూరి భాష్యనికరము (8) శంకరమిశ్రుని కాణాదరహస్యము.

మల్లినాథుడు రచించిన భాష్యనికరానికే ప్రశస్తపాద భాష్య టీకకు వ్రాసిన "నిష్కంటక" అని వాడుక ఉంది.

10 నిష్కంటక (తార్కికరక్ష) :- ఈ తార్కికరక్ష రచించిన వాడు వరదరాజు ఇది తర్కశాస్త్ర గ్రంథము. దీనికి 'నిష్కంటక' వ్యాఖ్య మల్లినాథుడు రచించాడు. ఇది 364 పేజీల గ్రంథం. శ్రీ వింధ్యేశ్వరిప్రసాద్ ద్వివేదిగారి ఉపోద్ఘాతంతో వారణాసి మెడికల్ హాల్ ప్రెస్ వారు 1906లో ప్రచురించారు. ఈ వ్యాఖ్య మల్లినాథుని తర్కశాస్త్ర పాండిత్యానికి నిదర్శనంగా ఉంది.

11. సిద్ధాంజనము (తంత్రవార్తికము) :- తంత్రవార్తికాన్ని కుమారిల భట్టు రచించాడు. మల్లినాథుడు దీనికి 'సిద్ధాంజన'మనే వ్యాఖ్య వ్రాశాడు.

12. పరిమళ (స్వరమంజరి) :- ఈస్వరమంజరిని ఎవరు వ్రాశారో తెలీదు. ఏ శాస్త్రసంబంధమైనదో తెలియదు. కాని మల్లినాథుడే పరిమళమనే వ్యాఖ్యవ్రాసినట్లు ఏకావళి తరళ వ్యాఖ్యలో పేర్కొనాడు.

13. న్యాసోద్ద్యోతము(న్యాసము) :- పాణిని సూత్రాల్లోని అర్థాన్ని సులభంగా వివరించడానికి 'వామనుడు, జయాదిత్యుడు' అనే ఇద్దరు పండితులు "కాశిక" అనేపేరుతో వృత్తి ఒకటి రచించారు. అదే "కాశికావృత్తి" దీనికి గొప్పవ్యాప్తి వచ్చింది.

ఈ కాశికావృత్తికి వ్యాఖ్యలు బయలుదేరాయి. అవి :- ఉపమన్యుని తత్త్వవిమర్శని; జినేంద్రబుద్ధిపాదుని న్యాసము; హరదత్తుని పదమంజరి.

ఇందులో జినేంద్రబుద్ధి పాదుడు రచించిన న్యాసానికి వివరణలు బయలు దేరాయి. మల్లినాథసూరి దీనికి న్యాసోద్ద్యోతం రచించాడు. మైత్రేయ రక్షితుడు "తంత్రదీపం" అనే వ్యాఖ్యానం రచించాడు.

14 వైమల్య విధాయిని (కావ్యాదర్శం) :-కావ్యదర్శం రచించిన వాడుదండి. దీనికి తరుణ వాచస్పతి, మల్లినాథుడు మొదలైన

12 మంది వ్యాఖ్యాతలు వ్యాఖ్యలు రచించారు. ఇంతమంది దీనికి వ్యాఖ్యలు వ్రాయడం దీని ఘనతకు నిదర్శనం. హిందీలో ధర్మేంద్ర కుమార గుప్త దీనికి చక్కని వ్యాఖ్య రచించాడు. ఇతడే మల్లినాథ సూరి దీనికి వైమల్య విధాయిని" అనే వ్యాఖ్య వ్రాసినట్లు పేర్కొన్నాడు.

15. తరళ (నలోదయము) :- నలోదయమనే నాలుగు ఆశ్వాసాల కావ్యమొకటి దేశంలో ప్రసిద్ధంగా ఉంది. దీనినికాళిదాసు రచించినట్లుగా దీనిలోని గద్యలు చెబుతున్నాయి.

ఈ నలోదయ కావ్యానికి మల్లినాథసూరి, మైథిల శ్రీ ప్రజ్ఞాకరమిశ్రుడు. కృష్ణపండితుడు, తిరువేంగళసూరి మొదలైన చాలా మంది పండితులు వ్యాఖ్యలు వ్రాశారు. వీరందరూ వ్యాఖ్యాంత గద్యలలో "ఇతి శ్రీ కాళిదాస కృతౌ నలోదయే" అని చెప్పటంవల్ల దీనిని వ్రాసినవాడు ప్రసిద్ధ కాళిదాస మహాకవిగాక కాళిదాసు పేరుగల మరో పండితుడు దీనిని రచించిఉంటాడని విశ్వసించవలసి ఉంది.

దీనికి మల్లినాథసూరి "తరళ" అనే పేరుతో వ్యాఖ్యానం రచించాడు.

16. వైశ్య వంశ సుధాకరము (స్వీయరచన) :- ప్రౌఢదేవరాయలు విజయనగర సామ్రాజ్యాన్ని పరిపాలిస్తూఉండగా కాంచీపురం శిలా శాసనంలో ఉన్న వైశ్య, వ్యాపారి శబ్దాల నిర్వచనంలో వివాదం చెలరేగింది. దానిని పరిష్కరించడానికి ధర్మశాస్త్రవేత్త. ఆయిన మల్లినాథుని ఆమహారాజు ఆహ్వానించాడు. అప్పుడా పండితాఖండలుడు సమస్త స్మృతి, పురాణాగమాలు అవలోడించి ఒకతీర్పు చెప్పాడు. ఆతీర్పు "వైశ్యవంశ సుధాకర" మనేపేరుతో మైసూరు ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారంలోఉన్న అముద్రిత గ్రంథం.

ఈ టీక్ప చివరి భాగంలో మల్లినాథుడు కొంత తెలుగు వచనమూ, కొన్ని ద్విపదలూ వ్రాశాడు. ఇది తెలుగు వారందరికీ సంతోషం కలిగించే విషయం.

17. రఘువీరచరితమ్ :- స్వీయరచన. మల్లినాథసూరి రఘువీర చరితమనే మహాకావ్యాన్ని రచించాడు. అది మనకీనాడు లభించడంలేదు. అయితే అందులోని ఒకశ్లోకాన్ని ఏకావళితరళ వ్యాఖ్యలో పరివృత్త్యసహిష్ణుతకు మల్లినాథసూరి ఉదాహరించాడు. "పదానాం పరివృత్తిర్వినిమయాసహిష్ణుత్వం. ఏతదేవ మైత్రీ, శయ్యేత్యాఖ్యాయతే. యథాస్మదీయే రఘువీరచరితే చంద్రోదయే-"నిశాకరకరప్పరాన్నిశయా నిర్వృతాత్మనా అమీ స్తంభాదయో భావా వ్యజ్యంతే రజ్యమానయా" ఇక్కడ 'నిశయా' అనే పదానికిబదులు "క్షపయా" అనే పదంవేస్తే పదమైత్రికి భంగం కలుగుతుంది. ఇందులో నిశాకర, 'నిశయా, నిర్వృతాత్మనా' అనే అయత్న సిద్ధమైన అనుప్రాస కనిపిస్తూ ఉంది. ఇది సూరి రచనా సౌందర్యాన్ని మనకు చూపిస్తున్నది.

కొందరు 'రఘువీర చరితం ఇప్పుడు లభ్యం అవుతున్నది. కాని అందులో ఈ శ్లోకం కనిపించలేదు. అందుచేత సూరి "రఘువీరచరితమ్" వ్రాయలేదంటున్నారు. ఇది సబబుకాదు. ఏమంటే సూరి తాను కంఠోక్తిగా చెప్పిన కావ్యం అతని రచన కాదనడం సాహసమే. అయితే మనకు లభ్యమైన 'రఘువీరచరితమ్' సూరి రచన కాకపోవచ్చు. అంతే. సూరి రచించిన 'రఘువీర చరితమ్' కోసం మనం గాలించాలి.

18. ఉదారకావ్యమ్ :- స్వీయరచన. మల్లినాథుడు దీనిని రచించినట్లు పండిత శివదత్తశర్మగారూ, శ్రీ ఎన్. కృష్ణమాచారియర్ గారూ పేర్కొన్నారు. కానీ ఇదీ-రఘువీర చరితమ్ ఒక్కటే అనేవారున్నారు. దానికి ఆధారాలులేవు.

19. భక్తిరహస్యమ్ :- స్వీయరచన. దీనిని మల్లినాథసూరి రచించినట్లు రాజస్థాన్ ఓరియంటల్ రిసెర్చి ఇన్స్టిట్యూట్ వారు ప్రచురించిన సంస్కృత-ప్రాకృత లిఖిత పుస్తకాల జాబితా. పార్టు (II) బి పేజి 2లో వివరింపబడి ఉంది.

20. నక్షత్రపాతాధ్యాయము:-"ఇది ఒక ఖగోళశాస్త్ర గ్రంథం. దీని మల్లినాథుడు రచించి తన కీర్తిచంద్రికలు ఆ భూఖగోళ వ్యాప్తం చేసికొన్నాడు. అని డా॥ బి. రామరాజుగారు' సంస్కృత వాఙ్మయంలో తెలుగువారి స్థానం" అనే వ్యాసంలో వెల్లడించారు.

మల్లినాథుడు కొన్ని జ్యోతిషగ్రంథాలు కూడా వ్రాశాడని నారాయణపండితుడు చెప్పినమాటలు దీనినిమరింత బలపరుస్తునాయి.

21. అభిజ్ఞాన శాకుంతలమ్:- మల్లినాథుడు కిరాతార్జునీయంలో 1వ సర్గమొదటి శ్లోకాన్ని వ్యాఖ్యానిస్తూ అందులో "విదిత" శబ్ద సాధుత్వాన్ని సమర్థిస్తూ వ్యాకరణ వైచిత్ర్యాన్ని వివరిస్తూ (1) "ఏతేన - వనాయు పీతప్రతిబద్ధ వత్సామ్"; (2)"పాతుం నప్రథమం వ్యవస్యతి జలం యుష్మా స్వపీతేషుయాః": ఇత్యేవ మాదయో వ్యాఖ్యాతాః" అని చెప్పాడు పై రెండు తావులలో వివరింపబడ్డాయి అని చెప్పడం మనము ఆలోచించాలి ఇందులో మొదటి ఉదాహరణ "రఘువంశం" లోనిది. రెండో ఉదాహరణ "అభిజ్ఞాన శాకుంతలం లోనిది. రెండింటిలోనూ "పీత" శబ్దంరావడమూ, రెండూ కాళిదాస కృతములు కావడమూ మనను తెలిసిందే. అయితేసూరి రఘువంశాన్ని వ్యాఖ్యానించాడు. అభిజ్ఞాన శాకుంతలంలోని ఈపాదంకూడా చెప్పి "ఉత్యేవమాదయో వ్యాఖ్యాతాః "అని అనడం అభిజ్ఞానశాకుంతలం కూడా వ్యాఖ్యానించాడేమో అని అనుకోవలసి వస్తున్నది. ఇది పరిశీలించదగిన విషయం.

ఇన్ని శాస్త్రగ్రంథాలకూ, ఇన్నికావ్యాలకూ, మల్లినాథుడు వ్యాఖ్యానాలు వ్రాసి నాటకానికి వ్రాయలేదని అనకోవలసి వస్తుంది. పైదాన్ని పరిశీలిస్తే "కావ్యేషునాటకం రమ్యమ్" అందులో అభిజ్ఞాన శాకుంతలం" వ్యాఖ్య వ్రాయలేదనడం కంటె వ్రాశాడు అనడమే సరిఅయినది కావచ్చు.

మల్లినాథుని వ్యాఖ్యాన రచన తులనాత్మక పరిశీలన

వ్యాఖ్యాతృ చక్రవర్తిగా గణుతికెక్కిన మల్లినాథుని ఇతర వ్యాఖ్యల్ని పోల్చి చూడటం దీని సార్థక్యాన్ని మరింత వెల్లడిస్తూ ఉంది. అయితేసమగ్ర తులనాత్మక పరిశీలన ఇక్కడ సాధ్యంకాదు. కాని ముఖ్యమైన కొందరి వ్యాఖ్యాతలను. కొన్ని గ్రంథాల లోని కొన్నిశ్లోకాల వ్యాఖ్యానాలను మాత్రమే ఇక్కడ పరిశీలించ పిలవుతుంది.

రఘువంశానికి వ్యాఖ్యాతలు అనేకులు ఉన్నారు. అందులో ముఖ్యులుగా పరిగణింపబడినవారు. 1. వల్లభుడు 2. హేమాద్రి 3. చారిత్రవర్ధనుడు 4 దినకరుడు 5. విజయానందసూరివరచరణ సేవకుడు 6. విజయగణి 7. సుమతివిజయుడు 8. ధర్మమేరువు.

రఘువంశానికి 60కిపైగా వ్యాఖ్యలున్నట్లు ఇప్పటికి తేలింది. అందులో కొందరి వ్యాఖ్యాతలపేర్లు, కొన్ని వ్యాఖ్యానాల పేర్లు :- (1) మల్లినాథుడు (2) హేమాద్రి (3) చారిత్రవర్ధనుడు (4) వల్లభుడు (5) దినకరమిశ్రుడు (6) సుమతీవిజయుడు (7) విజయగణి (8) విజయానందసూరివరచరణ సేవకుడు (9) ధర్మమేరువు (వీరి వ్యాఖ్యానాలన్నీ భండార్కరు ఇన్స్టిట్యూట్‌లో లభ్యమవుతున్నాయి.) (10) దక్షిణావర్తుడు (11) నాథుడు (12) కృష్ణభట్టు (13) భోజుడు (14) విస్తరకారుడు (15) ప్రభాకరుడు (16) జనార్దనుడు (17) గోపీనాథకవిరాజు (18) త్రివిదాకరుడు (19) ఉదయాకరుడు (20) భగీరథుడు (21) భరతసేనుడు

(భరతమల్లికుడు) (22) బృహస్పతిమిశ్రుడు (23) కృష్ణపతిశర్మ (24) గుణవినయగణి (25) నగ్నధరుడు (26) నారాయణుడు (27) భావదేవమిశ్రుడు (28) మహేశ్వరుడు (29) రామభద్రుడు (30) సముద్రసూరి (31) కథంభూతి (32) అద్వైత సారస్వత సూత్రం అని ఒక వ్యాఖ్యానం ఉంది. దానిని వ్రాసిన వ్యాఖ్యాత పేరు తెలియదు. (33) పదార్థదీపిక మరో వ్యాఖ్యానం, వ్యాఖ్యాత పేరు కూడా లభ్యం కాలేదు.

రఘువంశానికి వ్యాఖ్యలు వ్రాసినవారిలో హేమాద్రి, చారిత్రవర్ధనుడు, వల్లభుడు, మల్లినాథుడు గొప్పవారు. మిగిలిన వారి వ్యాఖ్యలు చిన్నటీకలూ, టిప్పణులే. అందుచేత అందరినీ పరిశీలించటం అనావశ్యకం. కొందరిని పరిశీలిద్దాం.

స్థూలంగా పరిశీలిస్తే ముందుగా మనకీ విషయాలు అవగతమవుతాయి

చారిత్రవర్ధనుడు, మల్లినాథుడు అనేక స్థలాలలో హేమాద్రిని అనుసరించారు. కాని అతని పేరు చెప్పలేదు. కాగా కనీసం ఇవి తమవి కావని కూడా చెప్పలేకపోయారు

హేమాద్రిని అనుసరించడం మల్లినాథునికి పాండిత్యలోపం కాదనీ, హేమాద్రి ప్రజ్ఞాపాటవాల పట్ల అతనికిగల ఆదరణమే కారణమనీ మనము భావించటం యుక్తము. విద్యార్థులను దృష్టిలో పెట్టుకొని అవసరమయినంత మేరకు మాత్రమే చెప్పటం నియమంగా పెట్టుకొన్న మల్లినాథునికి మహాభాష్యప్రాయమైన హేమాద్రి వ్యాఖ్యాన రచనా విధానం నచ్చలేదనే చెప్పాలి. శాఖా చంక్రమణంగా అనపేక్షితాలను చెప్పి విద్యార్థులకు క్లిష్టతను కలిగించడం ఇందలి దోషమని మల్లినాథుడి భావన. పండితులు చూడదగినది హేమాద్రి వ్యాఖ్యానము. పాండిత్య ప్రకర్షమున మల్లినాథాదులనూ హేమాద్రి మించినాడనే చెప్పవచ్చు.

చారిత్రవర్ధనుని వ్యాఖ్య కూడా బాష్యప్రాయమైనదే. "దుర్వ్యాఖ్యా విషమూర్ఛితా" అని మల్లినాథుడు చెప్పడం హేమాద్రినీ, చారిత్రవర్ధనునీ దృష్టిలో పెట్టుకొనే అన్నాడుఅనడానికి వీరి వ్యాఖ్యల్లో అనపేక్షిత విషయాలు చర్చించడం కారణంగా కనిపిస్తుంది. చారిత్రవర్ధనుడు అనేక స్థలాలలో హేమాద్రిని అనుసరించాడు. లేదా హేమాద్రికీ చారిత్రవర్ధనునికీ వారి వ్యాఖ్యాన రచనలకు ఆధారమూ. మూలమూ ఒక్కటే అయిఉండాలి.

రఘువంశం ప్రథమసర్గ 18వ శ్లోకానికి మల్లినాథసూరి, చారిత్రవర్ధనుడు, సుమతీవిజయుడు, విజయగణి, వల్లభదేవుడు, దినకరమిశ్రుడు వ్యాఖ్యానించినతీరు తులనాత్మకంగా పరిశీలిద్దాం.

"ప్రజానామేవ భూత్యర్థం స తాభ్యో బలిమగ్రహీత్
సహస్రగుణ ముత్స్రష్టు మాదత్తేహి రసం రవిః"
దీనికి మల్లినాథుడు చేసిన వ్యాఖ్యానం ఇట్లా ఉంది.

సరాజా ప్రజానాం భూత్యా ఇతి భూత్యర్థం వృద్ధ్యర్థమేవ అర్థేనసహనిత్యసమాసః సర్వాలింగతాచ వక్తవ్యా, గ్రహణ క్రియా విశేషణంచైతత్; తాభ్యః ప్రజాభ్యో బలిం షష్ఠాంశరూపం కర మగ్రహీత్; "భాగధేయః కరోబలిః" ఇత్యమరః; తథాహి రవిః సహస్రం గుణా యస్మిన్ కర్మణి తద్యథా తథాసహస్రగుణం సహస్రధోత్స్రష్టుం దాతుమ్; ఉత్సర్జన క్రియావిశేషణంచైతత్, రసమంబ్వాదత్తే గృహ్ణాతి. రసోగంధే "రసేస్వాదేతిక్తాదౌ విషరాగయోః శృంగారాదౌ ద్రవేవీర్యే దేహధాత్వంబు పారదే" ఇతివిశ్వః.

'రసమాదత్తే' అనేది చారిత్రవర్ధనుడు, సుమతీవిజయుడు, విజయగణి ఇట్లా వ్యాఖ్యానించారు. "సూర్యోజలాని గ్రీష్మే గృహీత్వా వర్షాసు వర్షతీత్యాగమః అగ్నౌప్రాస్తాహుతిః

సమ్యగాదిత్య ముపతిష్ఠతే ఆదిత్యాజ్జాయతే వృష్టిర్వృష్టేరన్నం తతః ప్రజాః" ఇతి మనుః. ఏతేన కిముక్తం స ప్రజాభ్యో గృహీత్వా. కరేణ యజ్ఞాదికం తేనాన తేభ్యస్త్రై రిందాద్రి దిభిర్వృష్టిస్తయాన్నం. తేన ప్రజాపుష్టిరితి పరంపరయా బలేర్భూత్యర్థతా.

వల్లభుడు కూడా వీరివలెనే చెప్పాడు. దినకరుడు చారిత్ర వర్ధనుని సంపూర్ణంగా అనుకరించాడు. "అష్టౌమాసాన్యధా దిత్యస్తోయం హారతిరశ్మిభిః, తథాహారేత్కరం రాష్ట్రాన్నిత్యమర్క వ్రతంహితత్ -రవిః రవతేగచ్ఛతీతిరవిఃధాతువు 'రు'-'ఇ' ప్రత్యయము. అచఇః ఉణాది సూత్రము. "అజంతాద్ధాతోరిఃస్యాదితిఇః" యథా పవిః, తరిః, కవిః, అలిః, అరిః. ఇక్కడ అలంకారము ప్రతి వస్తూపమః సామాన్యస్వద్విరేకస్యయత్ర వాక్యద్వయేస్థితిః"

ఈ వ్యాఖ్యానాలను పరిశీలించిన మీదట మల్లినాథుడు ఇందులో ప్రతివస్తూపమ అనే అలంకారం ఉందని చెప్పలేదనీ, వల్లభాదులు ఉందని చెప్పారనీ మనకు స్పష్టమవుతున్నది.

అయితే మల్లినాథుడు ఎందుకుచెప్పలేదు? ఇదిఅనపేక్షితమా? విద్యార్థులకు అవసరంకాదా? ఆలోచిస్తే విద్యార్థులకు ముందుగా పద స్వరూపం, ప్రకృతి ప్రత్యయ విభాగం, రూపనిష్పాదన ప్రక్రియాది వ్యాకరణ విశేషాలు మాత్రం చెప్పాలనీ తర్వాతనే అలంకారాలు, ధ్వని, రసము, శాస్త్రమర్యాదలు, వివిధశాస్త్ర పరిజ్ఞానము అందించ దగ అపేక్షితమనీ మల్లినాథుని ఊహగా మనము భావించాలి,

ముఖ్యంగా రఘువంశంలో కొంతవ్యాకరణ పరిజ్ఞానం, కొన్ని సంప్రదాయాలు సరళమైన సంస్కృతభాషలో తెలిపి తదుపరి శాస్త్ర విషయాలను గ్రహించటానికి విద్యార్థులను ఆయత్తంచేయడం మల్లి నాథుడు ఇక్కడ వ్యాఖ్యానించిన తీరువల్ల స్పష్టమవుతుంది

శ్లో. సోఽహమాజన్మ శుద్ధానా మాఫలోదయ కర్మణామ్
ఆ సముద్ర క్షితీశానా మానాక రథవ ర్త్మనామ్

(రఘువంశం 1వ సర్గ 5వశ్లోకం)

దీనిని మల్లినాథుడు వ్యాఖ్యానిస్తూ "ఏవం రఘువంశే లబ్ధ ప్రవేశ స్తద్వర్ణనాం ప్రతిజానీతే సోహమిత్యాదిభిః పంచభిః శ్లోకైః కులకేనాహ" అని అరంభిస్తాడు. ఇతనిది అన్వయ ముఖమైన వ్యాఖ్యానం విద్యార్థులకు అన్వయక్లిష్టత కలుగకుండా చెప్పడమే ఇతని ప్రత్యేకత చారిత్ర వర్ధనుడు, వల్లభదేవుడు, విజయగణి మొదలైన వారు ఈ శ్లోకం వ్యాఖ్యానిస్తూ "కులకం" గురించి ప్రస్తావించలేదు. "ద్వాభ్యాం యుగమితి ప్రోక్తం త్రిభిః శ్లోకే విశేషకం కలాపకం చతుర్భిఃస్యాత్ తదూర్ధ్వం కులకం స్మృతమ్." అంటే రెండు శ్లోకాల వరకూ అన్వయం ఉంటేదాన్ని "యుగ్మం" అనీ, మూడింటివరకూ ఉంటే "విశేషకం" అనీ, నాల్గింటి వరకూ ఉంటే 'కలాపకం' అనీ, అటుపైని ఉంటే 'కులక'మనీ అంటారు.

ఏశ్లోకాని ఆశ్లోకం అన్వయం లేకుండా ఐదు శ్లోకాలకు ఒకే అన్వయం ఉండటం వాటిఅన్నిటిని కలిపి అన్వయంకోసం చూడాలనీ అట్లాంటి అన్వయానికి కులకం అంటారనీ మల్లినాథుడు. చెప్పడం మిగిలినవారు చెప్పకపోవటం చూస్తేమల్లినాథుని విశిష్టత మనకు అవగతమవుతుంది. ఇట్లాంటి మందాత్ములను అనుగ్రహించడానికి అపేక్షితాలు, రస ధ్వన్యలంకారాదులు ఇప్పుడు అనపేక్షితాలనే మల్లినాథుని భావన. అందుచేతనే [illegible] ఎక్కడ చెప్పినా వాటిజోలికి అంతగా పోలేదు. [illegible] దులను వ్యాఖ్యానించి నప్పుడు ఒకొక్కశ్లోకంలో రెండు, మూడు అలంకారాలను చెప్పిన మల్లినాథుడు ఇక్కడ అలంకారమే చెప్పక పోవటంలో అంతకన్నా ఆంతర్యం కానరాదు.

అంతేకాక మల్లినాథుడు అలంకార లక్షణం ఎట్లాపట్టింది విద్యార్థుల హృదయానికి పట్టేటట్లు వివరిస్తాడు. కానివల్లభదేవాదులు ప్రతి వస్తూపమ లక్షణం మాత్రం చెప్పి ఊరుకున్నారు లక్ష్య లక్షణసమన్వయం చేయలేదు.

శ్లో. త్యాగాయ సంభృతార్థానాం సత్యాయ మితభాషిణామ్
యశసే విజిగీషూణాం ప్రజాయై గృహమేధినామ్
(రఘువంశం 1వసర్గ 7వ శ్లోకం)

దీనికి మల్లినాథుడు చేసిన వ్యాఖ్యానం . ఇట్లా ఉంది. త్యాగాయ సత్పాత్రే వినియోగ స్త్యాగః తస్మై. త్యాగో విహాపితం దానమ్ ఇత్యమరః, సంభృతార్థానాం సంచితార్థానాం, నతు దుర్వ్యాపారాయ. సత్యాయ, మితభాషిణాం మితభాషణ శీలానామ్, నతు పరాభవాయ, యశసే కీర్తయే. "యశఃకీర్తిః సమజ్ఞాచ" ఇత్యమరః, విజిగీషూణామ్ విజేతుమిచ్ఛూనామ్, నత్వర్థ సంగ్రహాయ. ప్రజాయై సంతానాయ, గృహ మేధినామ్ దారపరిగ్రహిణామ్, నతు కామోపభోగాయ. అత్ర 'త్యాగాయ' ఇత్యాదిషు "చతుర్థీ తదర్థ -"ఇత్యాదినా తాదర్థ్య సమాస విధాన జ్ఞాపకాచ్చతుర్థీ గృహైర్దారై ర్మేధన్తే సంగచ్ఛంత ఇతి గృహమేధినః 'దారేష్వపి గృహాః' ఇత్యమరః, జాయాచ గృహిణీ గృహమ్.' ఇతి హలాయుధః. "మేధృ సంగమే ఇతి ధాతోర్ణినిః. ఏభిర్విశేషణైః పరోపకారిత్వం, సత్యవచనత్వం, యశః పరత్వం, నిత్యాణాం శుద్ధత్వంచ విలక్షితాని.

ఇంక ఈ వ్యాఖ్యాన వైశిష్ట్యం ఎట్లాఉంది తర్వాత చర్చిద్దాం కాని శ్లోక వ్యాఖ్యానంలో "గృహమేధినః" అన్నదిచారిత్రవర్ధనుడు దినకరుడు, సుమతివిజయుడు . విజయగణి ఎట్లావివరించిందిపరిశీలిద్దాం.

'గహమేధో వివాహః సోఽస్తీతి యేషామ్' అని చారిత్రవర్ధనుడు, దినకరుడు సుమతివిజయుడు వివరించారు. వల్లభుడు గృహాం

కలత్రం మేథంతే సేవంతే ఇతి గృహమేధినః" అనివివరించాడు. విజ
యగణి మల్లినాథుని వలనే వివరిస్తూ ఇంకా ఇట్లా:- అథవా గృహమేధో
వివాహో విద్యంతే యేషాం తేగృహమేధినస్తేషాం, యద్వా, గృహే
గృహస్థ ధర్మే మేధా బుద్ధిర్యేషాంతే" అని వివరించాడు. మల్లినా
థుడు. గృహైర్దారై ర్మేథంతే సంగచ్ఛంత ఇతి గృహమేధినః; దారే
ష్వపి గృహాః ఇత్యమరః. "జాయాచ గృహిణీ గృహమ్" ఇతి
హాలాయుధః. "మేధృ సంగమే" ఇతి ధాతోర్ణినిః అనివివరించాడు.

వివాహం ఎవనికున్నదో వాడు అంటే "వివాహమైనవాడు
గృహమేధి అని చారిత్రవర్ధరుడు, దినకరుడు, సుమతివిజయుడు వివ
రించారు ఇక్కడ 'గృహమ్' అంటే వివాహమునివీరు అర్థం గ్రహిం
చినారు. "మేధ"కు అర్థంవివరించనేలేదు.
వల్లభుడు మాత్రం గృహమ్ కలత్రమ్ అని అర్థం గ్రహించి మేధంతే
సేవంతే అని వివరించాడు.

విజయగణి మల్లినాథుని వలెనే 'గృహమ్ అంటే దార' అని
గ్రహించాడు. మేధంతే సంగచ్ఛంతే అని చెప్పాడు. ఇట్లా చెబుతూ
"అథవా గృహమేధో వివాహో విద్యంతే యేషాంతే గృహమేధినః
అన చెప్పి. గృహమ్ వివాహమ్ అనిగ్రహించి మేధంతే విద్యంతే అని
చెప్పాడు. అంటే గృహమ్ వివాహమ్ అని చారిత్రవర్ధనుడు, దినక
రుడు. సుమతివిజయుడు చెప్పిన దానిని అనుసరించారు గృహం
"దార" అని గ్రహించి మేధంతే సంగచ్ఛంతే అని మల్లినాథుణ్ణి అను
సరించారు.

మల్లినాథుడు తానుచెప్పిన ప్రతిమాటకు ప్రమాణంచూపాడు.
గృహం అంటే దార అనిగ్రహించాడు. దానికిప్రమాణంగా "దారే
ష్వపి గృహా అనిఅమరకోశంచెబుతుందన్నాడు. 'జాయాచ గృహిణీ
గృహమ్' అనిఅహాలాయుధుణ్ణి పేర్కొన్నాడు. "మేధంతే సంగ

చ్ఛంతే" అనిచెప్పి దానికి ప్రమాణంగా "మేధృ సంగమే" ఇతిధాతో ర్ణినిః అని వివరించాడు.

మిగిలిన వ్యాఖ్యాతలు "సేవంతే" అనీ "విద్యంతే" అనీ ధాత్వర్థానికి భిన్నమైన అర్థం చెప్పారు. మిగిలిన వ్యాఖ్యాతలకు మల్లినాథునికి గల భేదమిక్కడ స్పష్టంగా తెలుస్తూఉంది.

ఇంక వ్యాఖ్యాన వైశిష్ట్యం చూద్దాం. త్యాగాయ సంభృతార్థానామ్' అన్నదానికి మల్లినాథుడు ఇట్లా వ్యాఖ్యానించాడు. సత్పాత్రే వినియోగస్త్యాగః తస్మై, త్యాగో విహాపితం దానమ్" ఇత్యమరః, సంభృతార్థానామ్ సంచితార్థానామ్. ఈ వివరణ చాలు కానీ నతు దుర్వ్యాపారాయ' అని మల్లినాథుడు చెబుతాడు ఇది సారాంశము ఇది విద్యార్థికి అందించాలి కవిహృదయం కూడా ఇదే మల్లినాథుడు సహృదయుడు. కవితో సమానమైన హృదయ ధర్మం గలవాడే సహృదయుడు. మల్లినాథుడు అట్లాంటివాడు. కవిహృదయం గ్రహించి మనకు అందించడం అందుకే మల్లినాథునికి చేతనైనంతగా ఇతరులకు వీలుకాదు. ఈ శ్లోకంలో డబ్బుకూడబెట్టడం త్యాగం కొరకు అని మాత్రమేఉంది దుర్వ్యాపారం కోసంకాదుసుమా అని మల్లినాథుడు వ్యాఖ్యానించాడు. అల్లేమితభాషణం సత్యంకోసం అని ఉంది. నతుపరాభవాయ అంటే ఇతరులను పరాభవించటం కోసం కాదు మితభాషణమని వ్యాఖ్యానించాడు. ప్రజాయై గృహమేధినః అన్నదానిని వ్యాఖ్యానిస్తూ సంతానంకోసమే కాని నతు కామోపభోగాయ అంటారు. దారపరిగ్రహణం సంతానంకోసమేకాని కామోపభోగానికి కాదు అని వివరిస్తాడు. సుదక్షిణాదేవి దిలీపుడు సంతానం కోసం చేసిన పూజాదితక కాళిదాసు దీనిలో సూచించాడు. సహృదయుడైన మల్లినాథుడు దానిని గ్రహించి మనకు వివరించాడు.

ఇక్కడ "గృహమేధినః" శబ్దానికి మల్లినాదుని వ్యాఖ్యానమే సరిపోతుంది ఇతరుల వ్యాఖ్యానం ఇక్కడ పనికిరాదు. ప్రజాయై

సంతానాయ అని అర్థం సమన్వయించాలంటే గృహ శబ్దానికి దార అర్థం, 'మేధృ సంగమే' అనిమాత్రమేచెప్పాలికదా! తాదర్థ్యంచతుర్థీ ప్రస్తావన మిగిలిన వ్యాఖ్యాతలు చేయకపోవడమూ, ఇతచేచేయడం కూడా ఇతని వ్యాఖ్యాన వైశిష్ట్యమే.

శ్లో॥ తస్యాంరఘోఃసూనురుపస్థితాయాం
వృణీత మాంనేతి సమాకులోఽభూత్
వామేతరః సంశయమస్యబాహుః
కేయూర బంధోచ్ఛ్వసితైర్నునోద॥
(రఘువంశం 6వసర్గ 68వ శ్లో)

మల్లినాథుని వ్యాఖ్యానం చూద్దాం. తస్యామిందుమత్యాముపస్థితాయామాసన్నాయామ్, సత్యాం రఘోః సూనురజో మాం వృణీత నవేతి సమాకులః సంశయితోఽభూత్. అ థా స్యా జ స్య వామేతరో వామాదితరో దక్షిణోబాహుః, కేయూరం బధ్యతేఽత్రేతి కేయూర బంధోఽంగదస్థానం, తస్యోచ్ఛ్వసితైఃస్ఫురణైః సంశయంనునోద.

వామేతరో బాహుః సంశయం నునోద. దీనికి చారిత్రవర్ధనుడు ఇట్లా వివరించాడు. "పుంసోహి దక్షిణభుజ స్ఫురణం కాంతాలింగనం కథయతి, అతఏవేందుమతీం లప్స్యేహమిత్యస్య చిత్తవృత్తిరభూదితి తాత్పర్యమ్" దీనికే హేమాద్రి ఇట్లా వ్యాఖ్యానించాడు. వామ భాగశ్చనారీణాం శ్రేష్ఠః పుం సాం తు దక్షిణః, దానే దేవాది పూజాయామ్ స్పందేశృంగారణేపిచ" ఇతినిమిత్తనిదానే, తథా "అంగవిస్ఫురణం నృణాం దక్షిణమ్ సర్వకామదమ్, తదేవశస్యతే సద్భిర్నారీణా మప్రదక్షిణమ్." కేయూరబంధోచ్ఛ్వసితైః, అన్న దానిని హే మా ద్రి ఇట్లా వ్యాఖ్యానించాడు. కేయూరం బధ్యతేఽనేనేతి కేయూరబంధో బాహుప్రదేశస్తస్యోచ్ఛ్వసితైః స్ఫురణైః సంశయంనునోద. దీనికే చారిత్రవర్ధనుడిట్లా అన్నాడు, కేయూర

ప్యాంగదస్య బంధో గ్రంథిస్తస్య భుజస్ఫురణవశాద్యాని ఉచ్ఛ్వాసి తాని తైః కృత్వా సంశయం న నోద "

పై వాటిని మనం పరిశీలిస్తే మల్లినాథునికంటె హేమాద్రి, చారిత్రవర్ధనుడు అర్థవివరణమేకాక నిమిత్తనిదాన లక్షణాలను సలక్షణంగా వివరించారు. ఇది అపేక్షితమే. ఇట్లాంటివి అనపేక్షితాలని భావించి మల్లినాథుడు వ్యాఖ్యానించలేదనడం సబబుకాదు.

శ్లో। లోకేనభావీ పితురేవతుల్యః సంభావితో మౌలిపరిగ్రహాత్సః
దృష్టో హిపృణ్వన్ కలభప్రమాణోఽప్యాశాః
పురోవాతమవాప్య మేఘః (రఘు 18వసర్గ 38వ శ్లో)

మల్లినాథుని వ్యాఖ్య: సభాలో మౌలిపరిగ్రహాత్ కిరీట స్వీకారాత్ హేతోః పితుస్తుల్యః పితృసరూప ఏవ భావీ భవిష్యతి లోకేన జనేన సంభావితస్తర్కితః, తథాహి, కలభప్రమాణః కలభ మాత్రోఽపి, మేఘః, పురోవాతమవాప్యశాః దిశోవృణ్వన్ దృష్టోహి.

ఈ శ్లోకంలో 'మౌలిపరిగ్రహాత్' అనే దానికి 'మౌలపరిగ్రహాత్' అనే పాఠం గ్రహించి వల్లభుడు, హేమాద్రి విజయానందసూరి వరచరణ సేవకుడు వ్యాఖ్యానించారు. మూలపరిగ్రహాత్ అనే పాఠం గ్రహించిసుమతీవిజయుడు వ్యాఖ్యానించాడు వీరందరిలోవల్లభదేవుని వ్యాఖ్యానం అత్యంత రమణీయంగా ఉంది. హేమాద్రి చెప్పినతీరు కూడా కొంతలో కొంత బాగుంది. వారి వ్యాఖ్యానాలు ఈ సందర్భంలో యథాతథంగా చూద్దాం.

"స సుదర్శనో మౌలపరిగ్రహాత్ కులామాత్య స్వీకరణాత్ లోకేన పితురేవ తుల్యాంభావీ సంభావితోమేనే" అని వల్లభుడు చెప్పాడు.

మూలేభవం మౌలం పైతృకం బలం తస్యపరిగ్రహాత్ అంగీకారాత్ పితురేవ పిత్రైవ తుల్యోభావీ సంభావితః, అస్తిత్వాధ్యవసాయః సంభావనా, పితురితి 'తుల్యార్థైరతులోపమాఖ్యామ్ తృతీయాన్యతరస్యామ్!! ఇతిషష్ఠీ' పాణిని అని హేమాద్రి చెప్పాడు.

"స సుదర్శనః పితురేవ తుల్యోభావీ సంభావితః కస్మాత్ మౌలపరిగ్రహాత్ ముకుటధారణాత్, అథవా మౌలపరిగ్రహాత్ మౌలః ప్రాక్తన వృద్ధామాత్యాస్తేషాం పరిగ్రహాత్ అంగీకరణాత్" అని విజయానందసూరి వరచరణ సేవకుడు చెప్పాడు.

'ససుదర్శనఃపితుర్జనకస్యైవతుల్యః సదృశో భావీ భవితా లోకేన జనేన సంభావితశ్చిత్తేమానితః కస్మాన్మౌలపరిగ్రహాత్ ముకుటం మస్తకం ధారణాద్వా వృద్ధామాత్యాంగీకరణాత్' అని సుమతీ విజయుడు చెప్పాడు.

పై వ్యాఖ్యానాల సారాంశం ఇట్లా భావించడానికి మనకు వీలవుతుంది. "మౌల" శబ్దానికి "కులామాత్య" అనే అర్థం వల్లభుడు చెప్పాడు. రాజవంశ మర్యాదననువరించి కులామాత్యుని అంగీకారం పొందటం సంప్రదాయమే. నేరుగా దానిని గ్రహించి ఆ అర్థాన్ని వల్లభుడు అందించటంలో ఔచిత్యం, సంప్రదాయం, కవిహృదయం ఇమిడి ఉన్నాయి. ఇదే మిగిలిన వ్యాఖ్యాతలు చెప్పిన వాటికన్నా మిన్నగా ఉంది.

హేమాద్రి కూడా 'మౌల' శబ్దాన్ని పరిగ్రహించాడు. కానీ దాని అర్థం మరోతీరుగా వివరించాడు. 'మూలేభవం మౌలం' అని వ్యుత్పత్తి చెప్పి పైతృకం బలం అని అర్థం చెప్పాడు. ఆపైతృక బలాన్ని అంగీకరించటంవల్ల అని వ్యాఖ్యానించాడు. వల్లభుని తర్వాత హేమాద్రి చెప్పినదే బాగుంది.

విజయానందసూరి వరచరణసేవకుడు కూడా మౌల శబ్దాన్నే గ్రహించాడు. కాని మౌలపరిగ్రహాత్ అంటే ముకుటధారణాత్ అని వివరించాడు. అంటే మౌల శబ్దానికి కిరీటం అని అర్థం చెప్పాడు.

సుమతీవిజయుడు మూలపరిగ్రహాత్ అనే పాఠాన్ని గ్రహించి దానికి "ముకుటం మస్తకః ధారణాద్వా వృద్ధామాత్యాంగీకరణాత్'' అని చెప్పాడు. అంటే మూలశబ్దానికే 'ముకుటం' అని అర్థం గ్రహించాడన్నమాట.

మల్లినాథసూరి మౌలిపరిగ్రహాత్ అనే పాఠాన్ని గ్రహించి 'కిరీటస్వీకారాత్' అని అర్థవివరణ చేశాడు.

తమ వ్యాఖ్యానంలో మల్లినాథుడూ, హేమాద్రీ కులామాత్య ప్రసక్తి చేయనేలేదు. వల్లభుడు మాత్రమే కులామాత్య ప్రసక్తి చేశాడు. విజయానందసూరి వరచరణ సేవకుడూ, సుమతీ విజయుడూ భిన్నపాఠాలు గ్రహించినప్పటికీ మల్లినాథునివలె 'కిరీట స్వీకరణం' అనే అర్థాన్ని వివరించారు. కాగా మౌల శబ్దానికి "ముకుటం" అని విజయానందసూరి వరచరణసేవకుడూ 'మూల' శబ్దానికి "ముకుటం" అనీ సుమతీవిజయుడూ చెప్పారు. ఇంకా "వృద్ధామాత్యాంగీకరణాత్" అన్న అర్థం కూడా వీరిద్దరూ చెప్పారు. అయితే వల్లభుడు, హేమాద్రి, మల్లినాథుడు వేర్వేరుగా తమ ప్రత్యేకతతో అర్థాలు చెప్పినవారని మనము గ్రహించాలి. మిగిలినవారు వారిని అనుసరించినవారే.

ఇక్కడ మనము మరో విషయం ఆలోచించవలసి ఉంటుంది. మౌల, మౌలి శబ్దాలకు 'కిరీటం' అనే అర్థం చెల్లినట్లే "కులామాత్య" అనే అర్థం కూడా చెల్లుతుందా? ఈ విషయం విద్వల్లోకం నిర్ణయించాలి.

ఇంక మాఘుని శిశుపాలవధ చూద్దాం. మాఘకావ్యానికి వల్లభదేవుడు 'సందేహవిషౌషధి' అనే వ్యాఖ్యానం వ్రాశాడు. మల్లినాథుని సర్వంకషతో ఒక్కతావున తులనాత్మక పరిశీలన సాగిద్దాం.

మాఘకావ్యంలోని మొదటిసర్గ మొదటిశ్లోక వ్యాఖ్యానాన్ని పోల్చి చూద్దాం. ముందుగా మల్లినాథుని వ్యాఖ్య.

"శ్రియఃపతి...శాసితుంజగత్" శ్రియఇతి. అత్రాదౌ శ్రీశబ్ద ప్రయోగాత్ వర్ణగణాది శుద్ధేరభ్యుచ్చయః. తదుక్తం దేవతా వాచకాశ్శబ్దాయేచ భద్రాదివాచకాః తే సర్వేనైవ నింద్యాస్స్యుర్లి పితోగణతోపివేతి" శ్రియః లక్ష్మ్యాః పతిః, ఏతేనరుక్మిణీరూపయా శ్రియాసమేత ఇతిసూచితమ్. "రాఘవత్వేఽభవత్ సీతారుక్మిణీ కృష్ణజన్మనీ"తి విష్ణుపురాణవచనాత్. జగన్నివాసో జగతా మాధారః, కుక్షిస్థాఖిల లోక ఇతిభావః. తథాపి. "పరిత్రాణాయ సాధూనాం వినాశాయచదుష్కృతాం, ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగేయుగే" ఇత్యాది వచనానుసారేణ జగత్ లోకం శాసితుం దుష్టనిగ్రహ శిష్టానుగ్రహాభ్యాం నియంతుం, శ్రీమతి సంపద్యుక్తే వసుదేవసద్మని వసుదేవరూపిణః కస్యపస్యవేశ్మని వసన్ కృష్ణరూపేణతిష్ఠన్ హరిర్విష్ణుః అంబరాత్ ఆకాశాత్ అవతరంతం ఆపతంతం ఇంద్ర సందేశ కథనార్థమితిభావః, హిరణ్యగర్భో బ్రహ్మ, బ్రహ్మాండ ప్రభవత్వాత్ తస్యాంగ భువం తనూజం అథవా తస్యాంగాత్ అవయవాత్ ఉత్సంగాఖ్యాద్భుతి'తి హిరణ్యగర్భాంగ భూః తంమునింనారదమిత్యర్థః 'ఉత్సంగాన్నారదోజజ్ఞేదక్షోఽంగు ష్ఠాత్స్వయంభువ' ఇతి భాగవత వచనాత్ దదర్శ కదాచిదితిశేషః" ఈ విధంగా అపేక్షిత విషయాలను విడవకుండా అనపేక్షిత విషయా లను ప్రవేశపెట్టకుండా సప్రమాణరూపమైన వివరణతో స్పష్టంగా అర్థమయ్యేటట్లు వ్యాఖ్యానించాడు. విష్ణుపురాణ, భగవద్గీత,

భాగవత గ్రంథాలనుంచి అతిసముచితమైన సందర్భసహితమైన అవసరమైనంత మాత్రం ఉదాహృతులు చొప్పించి కవిహృదయాన్ని ఆవిష్కరించాడు. ఈ విధంగా సహృదయుడైన వ్యాఖ్యాత తనకు లభించడం కవి భాగధేయము. మల్లినాథుని మంగళహస్తాన్ని అలంకరించి మాఘకావ్యమణి దివ్యకాంతులతో దీపించింది. మాఘాన్ని వ్యాఖ్యానించి మల్లినాథుడపారమైన కీర్తి గడించాడు. కావ్యానికీ వ్యాఖ్యాతకూ ఇది భూష్య భూషణ భావంగా నన్నె కూర్చింది.

ఇంక వల్లభదేవుని వ్యాఖ్య పరిశీలిద్దాం. ఇతనిది ఆకాంక్షా ముఖ వ్యాఖ్యానము.

శ్రియఇతి. హరిర్మునిం దదర్శ ఇతిసంబంధః. నవదశ సంఖ్యాతాః హరయః వర్తంతే. "అర్క, మర్కట, మండూక, విష్ణు. వాసవ, వాయవః, తురంగ, సింహ, శీతాంశు యమాశ్చ హరయస్స్మృతాః" కోఽసౌహరిరిత్యాహ. శ్రియఃపతిః లక్ష్మీనాథో విష్ణురిత్యర్థః మునిం కమిత్యాహ, హిరణ్యగర్భాంగ భువం బ్రహ్మ తనయం నారదమిత్యర్థః. యద్యపి బ్రహ్మత్వేన అసౌ తదా హరిణా అజ్ఞాయి. యేనకేన చిచ్ఛబ్దేవనిర్దేశే కర్తవ్యే మునిశబ్దః ప్రయుక్తః కవినాజ్ఞాతఏవ, తస్యచైతద్వచనమ్."

కదాఽధాక్షీత్. క్వ. వసుదేవ నద్మవి శూరసేనపుత్రగృహే శ్రీమతి సర్వసమృద్ధియుక్తే వసన్ తిష్ఠన్ కలిద్వాపర సంధా విత్యర్థః ఇట్లా సాగింది వల్లభుని సందేహవిషౌషధి. తక్కిన వ్యాఖ్యానాలు ఇంతకంటె అసమగ్రంగానూ అసమర్థంగా ఉన్నాయి. ఈ విధంగా పరిశీలిస్తే మల్లినాథుని వ్యాఖ్యానంలో ఉండే గొప్పతనం ఎంతటిదో మనకు స్పష్టంగా ప్రతత్యమవుతుంది. పై వ్యాఖ్యలేవీ కావ్యమహత్తుకు తరిన టీకలు కావని వాటి ప్రచారలోపమే మనకు చెబుతున్నది

మల్లినాథ వల్లభదేవుల వ్యాఖ్యలను పరిశీలిస్తే వల్లభదేవుడు 'హరి' శబ్దానికిఉన్న అనేకార్థాలు చెప్పడానికి "అర్క మర్కట మండూకాది" అర్థాలను చూపిస్తూ "కోఽసౌ హరిః" అని ప్రశ్నించుకొని శ్రియః పతిః లక్ష్మీనాథో విష్ణురిత్యర్థః అని వివరించాడు. కాని మల్లినాథుడు "హరిః విష్ణుః" అని మాత్రమే అర్థం తెలిపాడు ఈ స్థలంలో హరిశబ్దానికి ఉండే అర్క మర్కట మండూకాది నానార్థాలు వల్లభదేవుడు వివరించడం అనపేక్షిత మవుతున్నది. "కోఽసౌ హరిః" అనే సందేహమే ఇక్కడ ఎవ్వరికీ కలుగదు. అందుచేత వల్లభదేవుని నానార్థవివరణ ప్రయత్నం వ్యర్థమవుతున్నది.

ఇట్లాంటి స్థలాలలో మల్లినాథుడు నానార్థాలు చూపడానికి ప్రయత్నంచేయడు. ఒకపదానికి ఒక అర్థంలోకంలో రూఢిగాఉండి ఆ అర్థం శ్లోకాన్వయానికి కుదరనప్పుడు మాత్రమే నానార్థాలు తెల్పి సమన్వయం చేస్తాడు. అట్లాంటి స్థలాలలో మాత్రమే ఇట్లాంటి వివరణ ప్రయత్నం అపేక్షితమనీ, ఇతరత్రా అనపేక్షితమనీ మల్లినాథుని భావన. ఇదే మల్లినాథుని వ్యాఖ్యానంలో ఉండే ప్రత్యేకత.

ఇంక నైషధ మహాకావ్యానికి వ్యాఖ్యలు వ్రాసినవారు సుమారు 25మంది వరకు వారిపేర్లతో లభ్యమయ్యారు. వీరిలో సుప్రసిద్ధులుగా విద్వాంసులచే ఆమోదింపబడినవారు 1 నారాయణ భట్టు, 2. మల్లినాథసూరి మాత్రమే.

నైషధానికి నారాయణభట్టు వ్రాసిన వ్యాఖ్యపేరు నైషధప్రకాశము. దీనినే 'నారాయణి' అనే పేరుతో వ్యవహరిస్తారు. ఈ వ్యాఖ్యమిక్కిలి విస్తృతమయింది. బహుళవ్యాప్తిపొందింది. ఇతని వ్యాఖ్యాఖండాన్వయ ముఖము. మల్లినాథుడు దీనికి వ్రాసిన వ్యాఖ్యపేరు జీవాతువు. దండాన్వయ ముఖంగా. ఈ వ్యాఖ్యసాగింది. శ్రీహరగోవిందశాస్త్రిగారు ఈ నైషధానికి మణిప్రభావ్యాఖ్యానం హిందీలో వ్రాసినారు. దీనిని చౌఖాంబావారు అచ్చువేశారు.

అయితే శ్రీహరగోవిందశాస్త్రిగారు తమవ్యాఖ్యానం నారాయణీ వ్యాఖ్యననుసరించి వ్రాసినట్లుపేర్కొన్నారు తులనాత్మక పరిశీలనకు దీనిని గ్రహించాం. అయితే నైషధం 12, 22సర్గలకు జీవాతు వ్యాఖ్యలభించనేలేదు. అందుచేత అక్కడ నారాయణీ వ్యాఖ్యాపూర్తిగా ఇచ్చారు. తక్కిన సర్గలకు జీవాతు వ్యాఖ్య సంస్కృతంలో ఇచ్చారు.

శ్లో॥ తటాంత విశ్రాంత తురంగ మచ్ఛటా
స్ఫుటాను బింబోదయ చుంబనేనయః
బభౌ చలద్వీచిక శాంత శాతనైః
సహస్రముచ్చైః శ్రవసామివశ్రయన్

(నైషధం 1వ సర్గ 109వ శ్లోకం)

దీనికి మల్లినాధుని వ్యాఖ్యానం ఇట్లాఉంది:— "యస్తటాకస్తటాంతే తీరప్రాంతే విశ్రాంతాయ తురంగమచ్ఛటా నలాసీతేశ్వ శ్రేణీతస్యాః స్ఫుటానుబింబోదయ చుంబనేన ప్రకట ప్రతిబింబావిర్భావ ప్రీత్యా నిమిత్తేనచ ఏకైకశస్తాసామ్ వీచీనామంతః శాతనైః ఉగ్రతాడనైః "అశ్వాదేస్తాడనీకశే" త్యమరః. చల్లదుల్లల దుచ్చైః శ్రవసాం సహస్రం శ్రయన్ ప్రాప్నువన్నివ బభావిత్యుత్ప్రేక్షా వ్యతిరేకశ్చ పూర్వవత్. ఏతేన నలాశ్వానాముచ్చైఃశ్రివః సామ్యమ్ గమ్యత ఇత్యలంకారేణ వస్తుధ్వనిః."

నారాయణిని అనుసరించివ్రాసిన మణిప్రభావ్యాఖ్యానం ఇట్లా ఉంది. "ఉస్ మహారాజ్ నల్ కే సహస్రోం ఘోడే ఉస్ తాలాబ్ కే తట్ పర్ విశ్రాంతి లేరహేథే, జిన్‌కీఛాయా ఉసీకే జల్ మేంపడ్ రహీథీ. ఉసే దేఖ్ కర్ ఐసా ప్రతీత్ హోతాథాకి సహస్రోం "ఉచ్చైఃశ్రవా" (ఇంద్ర్ కే ఘోడే) ఉస్ కే భీతర్ విద్యమాన్ హైం ఔర్ ఉస్‌కీ తరంగరూపీ చాబుకోంసే తాడిత్ హోకర్ చల్ రహేహైం."

పై వ్యాఖ్యానాలను పరిశీలిస్తే మల్లినాథుడు ఉత్ప్రేక్షాలంకారం చెప్పి తద్ద్వారా వస్తుధ్వని ఉన్నదని వివరించాడు. కాని నారాయణిని అనుసరించిన మణిప్రభలో వీటి వివరణమే లేదు. నలాశ్వాలకు ఉచ్చైశ్శ్రవ సామ్యము గమ్యం కావడంచేత అలంకార వస్తుధ్వనిఅని మల్లినాథుడు లక్ష్యలక్షణ సమన్వయం చూపాడు. మల్లినాథుడు అలంకారంగానీ, ధ్వనిగానీ, రసంగానీ వివరించేటప్పుడు లక్ష్యలక్షణ సమన్వయం చేస్తాడు. మిగిలినవ్యాఖ్యాతలు అట్లా చేయరు.

నైషధం 22వసర్గకు నారాయణపండితుని నైషధప్రకాశం అనే సంస్కృతవ్యాఖ్య లభించింది. అందులోకూడా రసం, ధ్వనీ, ఎక్కడా అతడు ప్రస్తావించనేలేదు. మూడు, నాలుగుచోట్లమాత్రం అలంకారం పేర్కొన్నాం లక్ష్యలక్షణ సమన్వయం చేయనేలేదు. లక్షణ నిర్వచనంకూడాలేదు. అవి మచ్చుకు ఒకటిచూపితే అతని వ్యాఖ్యాన పద్ధతీ, శైలీ కొంత అర్థమవుతుందని చూపుతున్నాము.

శ్లో. ప్రబోధకాలేఽహని బాధితాని తారాః
ఖపుష్పాణి నిదర్శయంతీ
నిశాహ శూన్యధ్వని యోగినీయం మృషా
జగద్దృష్టమపి స్ఫుటాభమ్॥

(నైషధం. 22వ సర్గ 23వ శ్లోకం)

దీనికి నారాయణభట్టువ్రాసిన వ్యాఖ్యఇట్లాఉంది. హే ప్రియే ప్రబోధకాలే జాగరణ సమయే అథచ సమ్యగ్ జ్ఞానోత్పత్తి సమయే, అహని దినే బాధితాని సూర్యదీప్తి ధ్వస్తకాంతీని అథచ భ్రాంతి కారణ నాశాన్నిరుపపత్తీని తారానక్షత్రరూపాణి ఖపుష్పాణి గగనసంబంధీని కుసుమాని నితరాం దర్శయంతీ అథచ దృష్టాంతీ కుర్వంతీ శూన్య ధ్వని బౌద్ధాది శూన్యవాది దర్శనే విషయే యోగినీ తద్దర్శన రహస్యం జానతీ కాచిత్ ప్రవ్రజితైవేయం నిశాస్ఫుటిమాభాతి తాదృశం దృష్టమపి ప్రత్యక్షేణ ప్రతీయమానమపి స్థావరజంగమాత్మకం సకలమ్

జగన్మృషాఽసత్య మాహ బ్రూతే. బౌద్ధాది దర్శనేహిజ్ఞానస్యైవ బహిర్ఘటాద్యాకారత్వ జ్ఞానాతిరిక్తం సర్వ మిథ్యేతి తజ్ఞాయోగిన్యపి ప్రపంచో మిథ్యేతి దర్శయతి తథేయమపి రాత్రి రహస్య దృశ్యా వ్యపి పుష్పతుల్యాని నక్షత్రాణి నిజయోగాద్గగనే దర్శయతీ తిభావః. నిదర్శనం కరోతి వేతి ప్రతీయమానోత్ప్రేక్షా.”

సంస్కృత వ్యాఖ్యానంలోని ఇతని వాక్య రచనకు చాలా వ్యత్యాసం ఉంది. మల్లినాథునిది సరళవాక్కు. ఇతని వాక్కుకుఅంత సారళ్యంలేదు. అలంకారాదులకు లక్ష్యలక్షణ సమన్వయం అసలే చేయలేదు.

మల్లినాథుడు శ్రీనాథుడు సమకాలికులు: మల్లినాథుడు సంస్కృత నైషధానికి వ్యాఖ్యానం వ్రాశాడు. శ్రీనాథుడు సంస్కృత నైషధాన్ని తెలుగులోనికి అనువదించాడు భట్టహర్షుడికి ఉద్దండులైన వ్యాఖ్యాత, అనువాదకుడూ లభించారు. ఈ ఇద్దరూ తెలుగువారే కావటం మనకు గర్వకారణం.

సంస్కృతనైషధంతో పోల్చిచూడకుండా ఉంటే శ్రీనాథుని శృంగార నైషధం అద్భుతంగాకనిపిస్తుంది. కానిఎన్నోచోట్ల సంస్కృతంతో పోల్చినప్పుడు తెలుగు నైషధం బాగులేక పోవడమేకాదు. శ్రీనాథునికి అర్థమేకాలేదు అనిపిస్తున్నది. మల్లినాథుని వ్యాఖ్యానం చూస్తే మల్లినాథునికి అర్థమైనంతగా శ్రీనాథునికి నైషధం అర్థం కాలేదని పిస్తుంది.

అంతేకాక శ్రీనాథుడు తనకు సమకాలికుడైన మల్లినాథుని వ్యాఖ్యానాన్ని చూడలేదు అందుచేత శ్రీనాథుకు బాగా నష్టపోయాడనే చెప్పాలి. దానికి అసమర్థమైన అతని పద్యానువాదమే నిదర్శనం. శ్రీనాథుడు నారాయణీయాన్ని అనుసరించాడేమో అని పిస్తుంది. అక్కడక్కడ కొన్ని పోలికలు కనిపిస్తున్నాయి. అపితు

పూర్ణశకటస్య కూర్పైస్త్రైవ న కశ్చిత్ భారో భవతి నారాయణీయం (17 వసర్గ 6రవశ్లో.) "నిండు బండికిన్ జేటభరంబె" అని శ్రీనాథుని అనువాదం. ఈ భావంమూలంలో లేదు. నారాయణీయంనుంచే గ్రహించాడు. తులనాత్మకంగా ఇది పరిశీలించడం అవసరమని ఇంత దూరం చెప్పవలసి వచ్చింది.

శ్లో. అవామా వామార్ధే సకలముభయాకారఘటనాత్
ద్విధాభూతం రూపం భగవదభిధేయం భవతి యత్
పదంతర్మంత్రం మేస్మరహార మయం సేందుమమలం
నిరాకారమ్ శశ్వజ్జప నరపతే! సిద్ధ్యతు సతే.

(నైషధం 14వ సర్గ 86వశ్లోకం)

మల్లినాథుని వ్యాఖ్యానం. అథవర స్వరూపమేవ పంచభిః ప్రపంచేనాహ అవామేత్యాది నరపతే! హేనరేంద్ర! అర్ధేఏక భాగే, అవామా అస్త్రీ పుమానిత్యర్థ భాగాంతరే వామాస్త్రీ అతఏవ ద్విధా భూతం స్త్రీపుంసాత్మవమ్, ఉభయాకార ఘటనాత్ ఉభయోః ఆకారయోః మేలనాత్ సంకలం సంపూర్ణం, భగవదభిధేయం భగవచ్ఛబ్ద వాచ్యమ్ యత్ రూపం భవతి విద్యతే, సేందుం ఇందు కళా సమేతమ్ అమలమ్ నిర్మలమ్, నిరాకారం పరమార్థతః నిరంశం, మంత్రం మంత్రాత్మకం, తద్వత్ గోప్యంవా హారమయమ్ ఈశ్వరాత్మకమ్, మేమమ, తత్ రూపం స్వరూపమిత్యర్థః, అంతః అంతకరణే, స్మర చింతయ, శశ్వత్ నిరంతరం జపమంత్రాత్మ కత్వాత్ జపరూపేణ ఉపాసస్వస మంత్రమూర్తిః భగవాన్ అర్ధనారీశ్వరః, తే తవ, సిద్ధ్యతు ప్రసీదతు ఫలతు ఇత్యర్థః"

మంత్రపక్షేతు:-అర్ధే ప్రథమభాగే అవా ఓకారేణ, మామకారేణ, ప్రణవేన ఇత్యర్థః తథాఅవామార్ధే అర్ధేఉత్తరభాగేపిఅవా ఓ కారేణ మా మకారేణ చ ఉపలక్షితం ప్రణవద్వయ సంపుటిత మిత్యర్థః ఏవ ముభయా కార ఘటనాత్ ఉభయాభ్యామ్ అకారాభ్యామ్ ఘటనాత్ సంయోగాత్ ద్విధాభూతం హార ఇతిద్విధా విభక్తం అథవా ఉభయా

భ్యా మాకారాభ్యామ్ ప్రణవ స్వరూపాయామ్ ఘటనాత్ సంపుటీ కరణాత్ ద్విధాభూతమ్ ద్వ్యాకారం భగవదభిధేయం భగవాన్ శివః అభిధేయో వాచ్యో యస్య తత్ శివవాచకమ్ యత్ రూపం భవతి "ఓం హార ఓం" ఇతి యత్స్వరూపం నిష్పద్యతే తత్ హారమయం హాకార రేఫాత్మకం, నిరాకారం అశ్రుతౌజౌ, తయోరాకారం స్వరూపం నిర్గతౌ రహితౌ ఆకారద్వయౌ యస్మాత్ తాదృశం హాకార రకారయోరుచ్చార ణార్థం యత్ హాకారద్వయం తచ్ఛూన్యం అత ఏత హ్రా ఇతివ్యంజన మాత్రాత్మక మిత్యర్థః, తథా "ఈ" చ ఇందుశ్చ తాభ్యామ్ ఇందుభ్యామ్ సహావర్తత ఇతి తాదృశం సేందుం తురీయ బిందు స్వర సహితం అమలం నిర్దోషం సకలం కలయా అర్ధ చంద్రేణ సహితం మే మదీయం, మంత్రం ప్రణవద్వయ సంపుటితమ్, "ఓం హ్రీం ఓం" ఇత్యాకారకం సారస్వత చింతామణి మంత్రమిత్యర్థః. తదుక్తం పరమేశ్వరే" అ ఉద్ధారస్తు పరోక్షేణ పరోక్ష ప్రియతా శ్రుతేః, శివాంత్య వహ్ని సంయుక్తో బ్రహ్మద్వితయమంతరా తురీయ స్వర శీతాంశు రేఖాంతరా సమన్వితః ఏషా చింతామణిర్నామ మంత్రః సర్వార్థసాధకః జగన్మాతుః సరస్వత్యా రహస్యం పరమం మతమ్ "ఇతి శివశబ్దేన హాకారః వహ్ని శబ్దేన రకారః బ్రహ్మద్వితయ మంతరా ప్రణవద్వితయ మధ్యే తురీయ స్వరేణ ఈ కారః శీతాంశు రేఖాయా అర్ధ చంద్రః తారా శబ్దేన బిందుః ఇత్యర్థః అంతరిక్షాది పూర్వవత్.

యంత్రపక్షే.—భగవత్ యోనీవ అభిధేయం దృశ్యం యత్ రూపం త్రికోణాఖ్యమ్, ఉభయాకారఘటనాత్ త్రికోణద్వయ మేలనాత్ సకలం సంపూర్ణం షట్కోణమిత్యర్థః భవతితదంతః తస్య షట్కోణస్యాంతర్మధ్యే మంత్రం "ఓంహ్రీంఓం" ఇత్యాకారకం, అనంతరోక్తం నరపతే ఇత్యాది పూర్వవత్ అత్రదేవతా మంత్ర యంత్రాణాం త్రయాణామపి ప్రకృతత్వాత్ కేవలప్రకృత శ్లేషోఽలంకారః. శిఖరిణీవృత్తమ్.

ఇందులో మల్లినాథుడు మూడు అర్థాలు వివరించాడు. 1. దేవతాపరము 2 మంత్రపరము 3. యంత్రపరము కాని శ్రీనాథునికి దీని అంతు చిక్కలేదు. అందుకే ఈ శ్లోకాన్ని ఇట్లా తెనిగించాడు.

మ. సకలంబై హిమరుక్కళాభరణమై సవ్యాపసవ్యార్థయు
గ్మకరూపంబయి శైవమై గతకళంకంబై శివంబై యుపా
సక చింతామణియై ప్రసిద్ధ భగవచ్ఛబ్దాభిధేయార్థమై
యొక మంత్రంబు మదీయమొప్పునది నీకుర్వీశ!
యేనిచ్చితిన్.

మూలశ్లోకంలో ఈ క్రింది శబ్దాల ప్రయోగం అనివార్యం. అవి అవామాహామార్ధే, సకలం, భగవత్, తదంతర్మంత్రం, స్మరహార, సేందుం.

"అ వా మా" రాకపోతే (అ ఉ మ కలిస్తే కాని) "ఓం" అన్న అర్థంరాదు. శ్రీనాథుని "సవ్యాపసవ్యార్థయుగ్మక" సమాసం ఇందుకు ఎంతమాత్రం పనికిరాదు. "తదంతర్మంత్రం స్మరహారమయం" అనకపోతే ఓం శ్రీం అను వర్ణాల మధ్య ఉన్న "హ్రీం" అన్న అర్థంరాదు. శ్రీనాథుని "ఒక మంత్రంబు మదీయమొప్పునది" అన్న పదాలు దానికి ముప్పుతెచ్చాయి. "హార" శబ్దం రాకపోతే "హాకార రేఫాత్మక"మనే అర్థంరాదు. శ్రీనాథుని "శైవమై" అనే శబ్దం ఆ పని చేయడానికి అసమర్థం. "సేందుం" రాకపోతే "ఈకార బిందుసహితం" అనే అర్థం ఇక్కడ రాదు. శ్రీనాథుని "హిమ రుక్కళాభరణమై" అన్న సమాసం దీన్ని సాధించలేదు. సకలం భగవత్ అన్న రెండు మూలశబ్దాలు మాత్రం శ్రీనాథుని పద్యం లోకి వచ్చాయి. శ్రీనాథుడు ఆంధ్రానువాదంలో మూలశ్లోకాన్ని నిర్మూలం చేశాడు. ఆయన నైషధానికి వ్యాఖ్య వ్రాసిన ఆంధ్ర

మల్లినాథుడైన కీ. శే. శ్రీ వేదం వేంకటరాయశాస్త్రిగారు కూడా ఆ వ్యాఖ్యానాన్ని అంతమాత్రంగానే వ్రాశారు.

మల్లినాథుడికి ఎంతగా అర్థమై వ్యాఖ్యానించాడో చూడండి. అవామా 'అవా ఓకారేణ మా మకారేణ ప్రణవేన' అని వ్యాఖ్య. అవామా అంటే "ఓం." "ఓం" అనే ప్రణవాక్షరం కుడి వైపున ఉన్నది. ఈ అక్షరం పురుషుడు. ఎడమవైపున స్త్రీ అంటే 'శ్రీ' అనే అక్షరం ఉంది. అంటే "వామా వామార్ధే స్మర హారయం' "స్మర" అనే శబ్దాన్ని విధిరూపమైన క్రియగా తీసుకొంటే మిగిలినది హారమయం హకారరేఫాత్మకం అంటే హ్ర అయినది. ఇది సేందుం తథా ఈచ ఇందుశ్చ తాభ్యామిందుభ్యామ్ సహావర్తత ఇతి సేందుం అని వ్యాఖ్య. అంటే హ్ర వర్ణానికి ఈకార బిందువులు కలుస్తాయి. అప్పుడు హ్,ర,ఈ,మ్. అంటే హ్రీం అవుతుంది. ఈ సేందు హారవర్ణము తదంతర్మంత్రం పూర్వోక్త వర్ణద్వితయ మధ్యోపస్థితమై ఉంటుందని. అంటే ఓంహ్రీంశ్రీం. ఇది సకలం కకారలకార సమేతం అంటే క్లీం. ఫలితార్థంగా వచ్చిన మంత్రం ఓంహ్రీంశ్రీంక్లీం. ఇదంతా మల్లినాథుడు చెప్పినదే.

యంత్ర, దేవతాపరాలైన అర్థాలు కూడా ఇంత చక్కగానూ గ్రహించి వివరించాడు. అయితే ధ్వనిమార్గంలో శ్రీ గుంటూరు శేషేంద్రశర్మగారు స్వర్ణహంసలో ఈ మూడు అర్థాలనేకాక తురీయార్థాన్ని వివరించారు. అది అత్యంత రమణీయమై విద్వల్లో కాన్ని తలలూపించింది.

మరో చమత్కారమేమిటంటే మల్లినాథసూరి ధ్వనిఉందని చెప్పిన శ్లోకాలలో ఆంధ్ర నైషధ వ్యాఖ్యాత అయిన శ్రీ వేదం వేంకటరాయశాస్త్రిగారు ఆ శ్లోకాలకు సమానమయివ పద్యాల్లో అలంకారం ఉందని చెప్పారు.

ఉదాహరణలు :- 2వసర్గ 23వశ్లోకం మల్లినాథుడు అలంకార ధ్వని ఉందన్నాడు. దానికి సరైన శృంగారనైషధం 2వ ఆశ్వాసం 12వ పద్యంలో వేదంవారు సంబంధాతిశయోక్తి, హేతూత్ప్రేక్షా, కార్యనిబంధనా ప్రస్తుత ప్రశంస అనే మూడు అలంకారాలున్నా యన్నారు.

2వసర్గ 25వ శ్లోకంలో ధ్వని ఉందని మల్లినాథుడు అంటే ఆంధ్ర వ్యాఖ్యాత దానికి సరైన 2 ఆశ్వాసం 1?వ పద్యంలో కారణనిబంధనా ప్రస్తుత ప్రశంస ఉందన్నాడు.

3వసర్గ 89వ శ్లోకంలో ధ్వని ఉందని అంటే దానికి సరైన 2వ ఆశ్వాసం 76వ పద్యంలో కారకదీపకాలంకారముందని వేదం వారన్నారు.

6వసర్గ 83వ శ్లోకంలో ధ్వని ఉందంటే దానికి సరైన 3వ ఆశ్వాసం 118వ పద్యంలో సామాన్యాలంకారం ఉందని వేదం-వారన్నారు.

—:o:—

బహుశాస్త్ర వైదుష్యము

తెలుగువారికి సహృదయులైన ఉత్తమ వ్యాఖ్యాతలనే ప్రసిద్ధిఉంది. కొందరి తెలుగు వ్యాఖ్యాతల చేతుల్లో వ్యాఖ్యానం ఒక విశిష్టమైన కళగా రూపొందింది. కోలచల మల్లినాథసూరి మొదలైన వారు అట్లాంటివారు.

వ్యాఖ్యాతకు సర్వశాస్త్ర పాండిత్యం అవసరము. పదవాక్య ప్రమాణపారావార పారీణుడూ, వ్యాఖ్యాతృ చక్రవర్తీ, మహోపాధ్యాయుడూ అయిన మల్లినాథసూరి వ్యాఖ్యాతకు కావలసిన పాండితీ సామగ్రిని 'వాణీం కాణభుజీం' అనే శ్లోకంలో సూచించాడు "కాణాదం పాణినీయంచ సర్వశాస్త్రోపకారకమ్'' అని విజ్ఞులు చెప్పినట్లు కాణాద, పాణినీయాలు సర్వశాస్త్రోపకారకాలు కాబట్టి అవి రానిదే అడుగు ముందుకు సాగదు. వీటిలో కూడా పాణినీయానికే అగ్రస్థానం. ఉభయ మీమాంసలూ, న్యాయ శాస్త్రమూ తప్పనిసరిగా అవసరమైనవే.

పై విధంగా వైశేషికమూ, పూర్వోత్తర మీమాంసలూ, న్యాయశాస్త్రాలూ, వీటన్నిటిలో వ్యాఖ్యాతకు విశేష పాండిత్యం అవసరమని చెబుతూ మల్లినాథుడు తనకా విషయాలమీద ఉండే అధికారాన్ని, వ్యాఖ్యాతగా తనకున్న అర్హతలనూ ఈ కింది శ్లోకంలో తెలియచేశాడు.

"వాణీం కాణభుజీమజీగణదవాసాసీచ్చ వైయాసకీం
అంతస్తంత్రమరంస్త పన్నగగవీ గుంఫేషుచాజాగరీత్,
వాచామాచకలద్రహస్య మఖిలంయచ్చాక్షపాదస్ఫురాం
లోకేऽభూద్యదుపజ్ఞ మేవ విదుషాంసౌజన్యజన్యంయశః."

అర్థము లోకే = లోకమందు, విదుషాం=పండితులకు, సౌజన్య జన్యం = మంచితనంవల్ల పుట్టిన, యశః = కీర్తి, యదుపజ్ఞమేవ = ఏ వినయశీలి అయిన మల్లినాథోపజ్ఞకమై, అభూత్=ఆవిర్భావం చెందిందో;సః=ఆ మల్లినాథుడు; కాణభుజీంవాణీం=కణాద ప్రణీత మైన వైశేషిక తర్కశాస్త్రాన్ని, అజీగణత్=పరిగణించాడు (అభ్యసించాడు). (ఈ వైశేషిక తర్కశాస్త్రం 10 అధ్యాయాల గ్రంథం) వైయాసకీం వాణీం=వ్యాసప్రోక్తమైన ఉత్తర మీమాంసా శాస్త్రాన్ని (బ్రహ్మసూత్రం మొదలైన వేదాంతశాస్త్ర రహస్యాల్ని; (ఈ ఉత్తర మీమాంస నాలుగు అధ్యాయాల గ్రంథం); అవాసాసీత్ చ=బాగా సాధించాడు. అంతస్తంత్రం= జైమినీయ పూర్వ మీమాంసలో (ఇది 12 అధ్యాయాల గ్రంథం) అరంస్త=క్రీడించాడు. పన్నగగవీగుంఫేషు చ=ఆదిశేషుని అవతార మైన పతంజలి వచోరాసులలో (వ్యాకరణశాస్త్రంలో). అజాగరీత్= జాగ్రత్త వహించాడు. అక్షపాదస్ఫురాం వాచామ్= గౌతమముని ఆవిష్కరించిన వాక్కులలోని, అఖిలం రహస్యం= పరమార్థం అంతటినీ, (ఈ గౌతమ న్యాయశాస్త్రం 5 అధ్యాయాల గ్రంథం), ఆచకలత్=ఆకళించుకొన్నాడు.

కాణాదతర్కము :- ఇందులో ద్రవ్య, గుణ, కర్మ, సామాన్య, విశేష, సమవాయ, అభావ, సప్తపదార్థాలూ, ప్రత్యక్ష, అనుమాన, ప్రమాణాలూ ఉన్నాయి. ఇతడు శబ్దోపమానాలు అనుమానాంతర్భూతాలే కాబట్టి రెండే ప్రమాణాలు అంగీకరించాడు.

గౌతమన్యాయము :- ఇందులో ప్రమాణ, ప్రమేయ, ప్రయోజన, సంశయ, దృష్టాంత, సిద్ధాంత, అవయవ, తర్క, నిర్ణయ, వాద, జల్ప, వితండ, హేత్వాభాస, ఛల జాతి, నిగ్రహ స్థానాలూ, ప్రత్యక్షము, అనుమానము, ఉపమానము, శబ్దము అనే నాలుగు ప్రమాణాలూ గౌతముడు అంగీకరించాడు.

పై శ్లోకాన్ననుసరించి చూస్తే మల్లినాథునికి, కణాదుడు రచించిన వైశేషికంలోనూ, పూర్వోత్తర మీమాంసా శాస్త్రాల్లోనూ, వ్యాకరణశాస్త్రంలోనూ, గౌతమ న్యాయశాస్త్రం లోనూ చక్కని పాండిత్యం ఉన్నట్లు స్పష్టమవుతున్నది. ఇంత తక్కువగా చెప్పుకొన్నాడే కాని వ్యాఖ్యానాలు పరిశీలించినమీదట ఇతనికిగల సకల శాస్త్రపాండిత్యం చూస్తే చాలా ఆశ్చర్యం కలుగుతుంది. ఈ శ్లోకంలో మల్లినాథుడు చెప్పుకొన్నది నిజానికి చాలా తక్కువ అని తెలుస్తుంది.

పై విధంగా 5 శాస్త్రాలు చూపబడ్డాయి. వాటిలో కణాద, గౌతముల రెండు శాస్త్రాలూ కలిపి ఒకే తర్కశాస్త్రంగా ప్రసిద్ధి వహించింది. దీన్నే ఈనాడు నవీనతర్కమని వ్యవహరిస్తున్నారు. ఎట్లాగంటే :-

కణాదుడు చెప్పిన ఏడు పదార్థాలనూ, గౌతమముని చెప్పిన నాలుగు ప్రమాణాలనూ తీసుకొని క్రీ.శ. 12వ శతాబ్దంలో గంగేశో పాధ్యాయుడు 'తత్త్వచింతామణి' పేరుతో గ్రంథం రచించి ఈ నవీనతర్కానికి పునాది వేశాడు.

పై శ్లోకంలో ప్రసక్తమైన ఒక్కొక్క శాస్త్రంమీదా మల్లినాథునికి ఉండే అధికారాన్ని, ఆదరాన్ని వివరించడానికి ఒక్కొక్క శాస్త్రంలోనూ నిష్ణాతులైన పండితులను ఒక్కొక్కరిని ఒక్కొక్క శాస్త్రానికి ప్రత్యేకంగా నియమించి తగిన వ్యవధిని వారికిచ్చి పారితోషికాన్ని నిర్ణయించాలి. ఇప్పటికే ఇట్లాంటి శాస్త్రాలమీద ప్రత్యేకాధికారమున్న మహావిద్వాంసుల సంఖ్య వేళ్ళమీద లెక్కించదగినదిగా ఉంది. అట్లాంటివారి సహకారంతో మల్లినాథుని శాస్త్రపాండిత్యాన్ని సమగ్ర గ్రంథంగా రూపొందించడం జరిగితే, దాన్ని ఇతర భాషలలోనికి కూడా అనువాదం చేయిస్తే మల్లినాథసూరి కీర్తి తెలుగు దేశంలోనూ, యావద్భారతంలోనూ

మాత్రమే కాక ఖండఖండాంతరాలలో ప్రకాశించి తెలుగువారికి యావత్ ప్రపంచంలోనూ ఆ చంద్రతారకమైన సుస్థిర ప్రతిష్ఠ సమకూరుతుంది. తెలుగు వెలుగు అంతర్జాతీయ వ్యాప్తి చెందుతుంది. మల్లినాథుని గురించిన ఏదో ఒక శాస్త్రవిషయాన్ని వివరించడమే ఒక మహాపండితునకు శ్రమ సాధ్యమైన పని. అన్ని విషయాలూ ఏ ఒకరిద్దరో సమగ్రంగా వ్రాయడం సాధ్యం కాదు అందువల్ల అత్యధిక సంఖ్యలో పండితులను ఆకర్షించి చేయించవలసిన మహాకార్యమిది. ఇట్లాంటి ప్రయత్నం చేయడానికి రాష్ట్రంలోని సాహిత్య సంస్థలు సత్వరం పూనుకోవాలి. మహాసంస్థలు సాహసించి సాధించవలసిన కార్యమే కాని ఇది సామాన్యులకు సాధ్యమయ్యేదికాదు. మల్లినాథుని వివిధశాస్త్ర వైదుష్యాన్ని దిఙ్మాత్రంగా పరిచయం చేయడానికి ప్రయత్నిస్తున్నాము.

వ్యాకరణశాస్త్రము :- భాషకు మూలభూతమైన వ్యాకరణ శాస్త్రం గురించి ముందుగా చర్చిద్దాం.

శ్లో॥ తమార్యగృహ్యం నిగృహీతధేను
ర్మనుష్య వాచా మనువంశకేతుమ్
విస్మాపయన్ విస్మితమాత్మవృత్తౌ
సింహోరు సత్వం నిజగాద సింహః. (రఘువంశం 2వసర్గ)

ఇక్కడ మల్లినాథుడు 'విస్మాపయన్' పాఠం సాధువని చూపడానికి ఈవిధంగా చెప్పాడు. ఆశ్చర్య పడినరాజును ఆశ్చర్య పెట్టినది మనుష్య వాక్కు. ప్రయోజక కర్త్రి. ఈ వాక్కును ప్రేరణ చేసినది సింహం. "రాజా విస్మయతే" తం విస్మాపయతే మనుష్యవాక్. తయా సింహో విస్మాపయన్" అని అర్థము. ఇక్కడ రెండుణిచ్చులు ప్రయోగింప బడినవి. ధాతు ణిజ్యములచేత మూడు వ్యాపారాలు బోధింప బడుచున్నాయి. 1. ఆశ్చర్యకరణానుకూల, 2. వ్యాపారానుకూల, వ్యాపారాననుకూల వ్యాపారాలు, మనుష్యవాక్కు

ప్రయోజక కర్తృ కాబట్టి ప్రయోజకునివల్ల విస్మయంకలిగితే ఆత్వం వస్తుందని 'నిత్యంస్మయతేః' అనే సూత్రంవల్ల ఆత్వం నిర్బాధము. ఆదంతం కావడంవల్ల "అర్తిహ్రీబ్లీరీక్నూయీక్ష్మాయ్యాతాం పుక్ణౌ" అనే సూత్రంవల్ల పుగాగమమూ, "భీస్మోర్హేతుభయే" అనేసూత్రం వల్ల విహితమైన ఆత్మనేపదమూ, ణిజంత స్మిఙ్ ధాతువుమీద కాబట్టి ఇక్కడ ణిచ్చుమీద ణిచ్చువచ్చింది. పూర్వోక్తాత్మనే పదం రావడానికి నిమిత్తంలేదు. పరస్మైపదమే అని "విస్మాపయన్" అనే పాఠం సంగతమే అని మల్లినాథుడు ప్రతిపాదించాడు.

రఘువంశం 12వ సర్గ 19వ శ్లోకం "దృఢభక్తి రితిజ్యేష్ఠే! దీనిలో "దృఢభక్తి" ఒకసమాసం దీన్ని మల్లినాథుడు ఇక్కడ సుదీర్ఘంగా చర్చించాడు. "దృఢ భక్తిః యస్యసః" అని విగ్రహం చెప్పి "బహువ్రీహి" అన్నాడు. ఈ సమాసంలో పూర్వపదం ఆకారాంత స్త్రీలింగం. కానీ సమాసంలో అది హ్రస్వాంతంగా కనిపిస్తూ ఉంది. అందుకే ఇక్కడ చర్చ అవసరమయింది. ఈ మార్పు పుంలింగంలోకి రావడంవల్ల జరిగి ఉండవచ్చు. "స్త్రియాః పుంవత్" అనే సూత్రం దీనికి ఆధారం. అయితే "ప్రియాది" గణంలోనిపదాలకు ఈసూత్రం వర్తించదు. భక్తి అనే పదం ప్రియాది గణంలో చేరిందే. కాబట్టి ఆ సూత్రంవల్ల ఇదిసాధింపబడదు. అందువల్ల మార్గాంతరంచేత దీన్ని సాధించాలి.

దృఢభక్తిః అస్యఇతి దృఢభక్తిః అని గణ వ్యాఖ్యానంలో చెప్పబడింది. ఇదీ బహువ్రీహి సమాసమే. ఇందులో పూర్వపదం అవ్యయం. ఇప్పుడు మిగిలిన చిక్కులు దీనికిరావు వృత్తికారుడు ఇక్కడ "లింగం" ప్రత్యేకప్రయోజనం సాధించడంలేదు. కాబట్టి దాని వివరణం అనవసరం. అందుకే అది స్త్రీలింగంలోనే ఉండాలి అనే కట్టుబాటు అనవసరం సమాస పూర్వపదం నపుంసక లింగంలో ఉండవచ్చు న్యాసకారుడు కూడా దీన్నేసమర్థిస్తున్నాడు.

"వృత్తికారశ్చ" దీర్ఘనివృత్తిమాత్ర పరో దృఢభక్తి శబ్దో లింగవిశేషస్యానప కారత్వాత్ స్త్రీత్వమపేక్షితమేవ తస్మాత్స్త్రీ లింగత్వాత్ దృఢభక్తి శబ్ద స్యాయం ప్రయోగః ఇత్యభిప్రాయః.

ప్రియాదిగణంలో పఠింపబడిన భక్తిపదం కర్మసాధన భక్తి అనే అర్థం కలది. "భజ్యతే అనేన ఇతి భక్తిః' ఇది భవానీ భక్తి అనే సమాసంలోని భక్తిపదం వంటిదే అని భోజరాజు పేర్కొన్నాడు. అందువల్ల వ్యాకరణ నియమం పాటించి పుంవద్భావం విడువ బడింది. కాని దృఢభక్తి మొదలైన వాటిలోని భక్తిపదం భావసాధన 'భక్తి' (భజనం భక్తిః) అనే భావనామ వాచకం నుంచి వచ్చిన దాన్నిగా మనము గ్రహించాలి. అప్పుడు పైనియమం దీన్ని బాధించదు. దృఢభక్తి సమాసం నిర్దుష్టమే అవుతుంది. ఇక్కడ భోజరాజు మాటలు యథా తథంగా:-

'భోజరాజస్తు కర్మ సాధన స్యైవ భక్తి శబ్దస్య ప్రియాది పాఠాత్ భవ నీ భక్తి రిత్యాదౌ కర్మసాధన త్వాత్ పుం వద్భావ సిద్ధిః దృఢభక్తిరిత్యాదౌ భావసాధనత్వాత్ పుంవద్భావ సిద్ధిః పూర్వ పదస్య" ఇత్యాహ.

కుమార సంభవం 1వ సర్గలో పార్వతీ జంఘా వర్ణనం ఇట్లా ఉంది.

శ్లో. వృత్తాను పూర్వేచ నచాతి దీర్ఘే
జంఘే శుభే సృష్ట వతస్తదీయే
శేషాంగ నిర్మాణ విధౌ విధాతు
ర్లావణ్య ఉత్పాద్య ఇవాస యత్నః

ఇందులో 'ఆస' అనేది "అసభువి" అనే ధాతువుకు లిడంత రూపం కాదు లిట్‌లో 'అస' ధాతువుకు అస్తేర్భూః' అనే సూత్రం చేత అర్ధ ధాతుక పరత్వంలో 'భూ' అనే ఆదేశం విహితము. కాబట్టి 'బభూవ' అనేరూపం సిద్ధిస్తుంది. 'అస్తి క్షీరా' అనేచోట 'అస్తి'

అనేది లట్ సమానార్థక తిజంత ప్రతిరూపకావ్యయంలాగ శాకటా యనుడు 'బభూవ' అనే అర్థంలో 'ఆస' అనేది తిజంతప్రతిరూప కావ్యయం అన్నాడు. 'అస' అనే తిజంతం ప్రసిద్ధమైన తిజంత ప్రతి రూపకావ్యయం అనవచ్చు. 'ఆస' ఆనే తిజంతం అప్రసిద్ధం. 'చోర యామాస' ఇట్లాంటి చోట్ల ఈ ప్రయోగం ఉన్నప్పటికీ 'కృఞ్చాను ప్రయుజ్యతే లిటి' అనే పాణిని సూత్రంవల్ల ఆమంతంమీద లిట్‌లో 'కృభ్వస్తులు' అను ప్రయుక్తాలు అవుతాయనే విధాన సామర్థ్యంచేత 'ఆస' అనేది ప్రయుక్తంఅయినా 'బభూవ' అనేదానికి అనుప్రయోగం చెప్పటంచేత 'అస' ధాతువు లిడంతం 'బభూవ' అనే అయినప్పటికీ భూధాతువు, అస ధాతువులకు ప్రత్యేకం లిడంతాను ప్రయోగ విధానం వ్యర్థమవుతుంది. కాబట్టి 'ఆస' అనేది 'భూభావం లేకుండా ఆమంతంమీది ప్రయుక్తం అయింది తక్కినచోట్ల అట్లాంటి ప్రయో గం ఉండదు. కాబట్టి తిజంత ప్రతిరూప కావ్యయమని శాకటా యనుడు చెప్పిన అంశాన్ని వల్లభదేవుడు ఆక్షేపిస్తూ కవి ప్రయోగం ప్రామాదికమే అని ప్రతిపాదించాడు వామనుడు 'అస గతి దీప్త్యా దానేషు' అనే ధాతువునకు 'ఆస' లిడంతరూపమని చెప్పాడు. 'అస గత దీప్త్యా దానేషు' అనే ఉభయపది ధాతువు లిడంతం 'పరస్మై పదము 'ఆస' అంటే ప్రకాశించెను అంటే ప్రయత్నం ప్రవృత్త్యు న్ముఖమయింది, తాత్పర్యము అని మల్లినాధుడు 'అస' అనే ప్రయో గానికి సాధుత్వాన్ని, ప్రామాణ్యాన్ని, అర్థౌచిత్యాన్ని వివ రించాడు.

మేఘసందేశం 1వ సర్గ 26వ శ్లోకం.

శ్లో. నీచై రాఖ్యం గిరిమధివసేస్తత్ర విశ్రామ హేతో
స్త్వత్సంపరాత్పులకిత మివ ప్రౌఢ పుష్పైః కదంబైః
యః పణ్యస్త్రీ రతి పరిమళోద్గారి భిర్నాగరాణా
ముద్దామాని ప్రథయతి శిలావేశ్మభి ర్యౌవనాని.

ఇందులో 'విశ్రామ' అనేది పాణిని ప్రకారం అసాధువు అని మల్లినాథుడు చెప్పి మార్గాంతరం చేత దీనిని సాధించాడు ఆ చర్చ పరిశీలిద్దాము. 'విశ్రామో విశ్రమః ఖేదాపనయః' భావార్థే ఘఞ్ ప్రత్యయః. స ఏవ హేతుః, తస్య విశ్రామహేతోః విశ్రామ కారణాత్ విశ్రామార్థ మిత్యర్థః. 'షష్ఠీ హేతు ప్రయోగే' ఇతి షష్ఠీ. 'విశ్రామేత్యత్రనోదాత్తో పదేసస్య మాంతస్యానాచమేః' ఇతి పాణినీయే వృద్ధి ప్రతిషేధేఽపి 'విశ్రామోవా' చంద్రవ్యాకరణే వికల్పేన వృద్ధి విధానాత్ రూపసిద్ధిః.

'నోదాత్తోపదేశస్య...' అనేపాణిని నియమాన్ని అనుసరించి వృద్ధి ప్రతిషేధమున్నప్పటికీ 'విశ్రామోవా' అనే చాంద్రవ్యాకరణా న్ననుసరించి వికల్పంగా రూపసిద్ధి సాధ్యం అవుతుందని నిరూపించి మల్లినాథుడు తన బహువ్యాకరణ పాండిత్యాన్ని వెల్లడించాడు.

శ్లో. శ్రియః కురూణా మధిపస్య పాలనీం
ప్రజాసు వృత్తిం యమయుంక్త వేదితుమ్
సవర్ణిలింగీ విదిత స్సమాయయౌ
యుధిష్ఠిరం ద్వైతవనే వనేచరః.

(కిరాతార్జునీయం 1వ సర్గ. 1వ శ్లోకం)

ఇందులో "విదితః" అనే శబ్దం ఉంది. 'ఒక విషయం గురించి తెలిసిన వ్యక్తి' అని దీనికి అర్థం. "విదితం-వేదనమ్ అస్య అస్తీతి విదితః" విదితః అనే శబ్దం భూతకాల కర్మార్థకం. దాన్ని కర్మార్థకంలోనే ప్రయోగించాలి కానీ ఇక్కడ కర్త్రర్థకంలో ఉపయోగించాడు. అంటే విషయాన్ని తెలిసిన వ్యక్తి అని వాడాడు. "విదితవృత్తాంతో విదితః" అని చెప్పి సప్రమాణంగా అనేక ఉదాహృతులతో మల్లినాథుడు సుదీర్ఘంగా చర్చించాడు. మొదట "విదితం వేదనం అస్య అస్తీతి" అని చెప్పి "పరవృత్తాంత జ్ఞానవాన్

ఇత్యర్థః" అని వివరించాడు. రెండో వివరణంలో ఇది సకర్మక క్రియ అయినా విషయం కర్మకు సంబంధించింది కాకపోవడంవల్ల కర్తరి ప్రయోగంలో ఉపయోగించబడింది. దాన్ని ఈ విధంగా వివరించవలసిఉంటుంది "అథవా కర్తరి కర్మధర్మోపచారాత్ విదిత వృత్తాంతో విదిత ఇత్యుచ్యతే" ఈ రెండు సందర్భాలలోనూ 'పీతాగావః', భుక్తాబ్రాహ్మణాః, విభక్తాః భ్రాతరః" మొదలైన ఉదాహరణలు ఇచ్చాడు పైవాటివలెనే దీనికి సాధుత్వాద్ది అని నిరూపించాడు అయితే సకర్మకక్రియలే అయినప్పటికీ సముచితమైన ప్రత్యయాలు చేర్చబడలేదు అనే ఆక్షేపణ ఉంది 'విభక్త' శబ్దం 'విభజింపబడిన' అనే అర్థంతో కాక "ఏవి విభజింపబడ్డాయో" అనే అర్థంలో వాడబడింది. మల్లినాథుడు మహాభాష్యకారుని ఉదాహరిస్తూ "అతఏవ భాష్యకారః" "అకారో మత్వర్థీయః విభక్తం యేషా మస్తీతి విభక్తాః పీతమ్ యేషామస్తీతిపీతాః ఇతి సర్వత్ర" మరో మార్గంచేత కూడా దీన్ని వివరించాడు. సమాసంలోని ఉత్తర పదాన్ని విడిచిపెట్టడం. విభక్తధనాః' అనే సమాసంలో ఉత్తరపదాన్ని విడిచిపెట్టి విభక్తాః అని ప్రయోగించడం కూడాఉంది. "అథవాఅత్రఉత్తరపద లోపోద్రష్టవ్యః. విభక్తధనాః విభక్తాః పీతోదకాః పీతాః ఇతి.

కైయటుడు దీనినే ఇట్లా వివరించాడు. అర్థాన్ని పొందిన పదాన్ని తిరిగి ఉపయోగించనవసరంలేదనీ, అందుకే సమాస ఉత్తర పదం లోపిస్తుందనీ చెబుతూ 'విభక్తధనాః' అనేటప్పుడు విభక్తత ధనానికే చెందుతున్నా అన్నదమ్ములకది వర్తింపచేయబడింది అని వివరించాడు. అట్లాగే త్రాగడం నీటికి చెందిందే అయినా దానిని గోవులకు వర్తింపచేయడం జరిగింది. అదేవిధంగా వృత్తిగతమైన విదితత్వము జ్ఞానకర్తగా ఉన్న వనేచరునికి వర్తింపచేయబడినట్లు మల్లినాథుడు వివరించాడు. అత్రలోప శబ్దార్థమాహకైయటః:-

గమ్యార్థస్యాత్ర ప్రయోగ ఏవలోపోఽభిమతః. విభక్త్యాభ్రితర ఇత్యత్ర ధనస్య యద్విభక్తత్వంతత్ భ్రాతృషూపచరితం ఇతి "

ఇక్కడ మరో రెండు ఉదాహరణలు మల్లినాథుడు చెప్పాడు. "ఏతేన వనాయ పీత ప్రతిబద్ధవత్సామ్" (రఘువంశం), "పాతుం నప్రథమం వ్యవస్యతి జలం యుష్మాస్వపీతేషుయా" (శాకుంతలం) ఏవమాదయో వ్యాఖ్యాతాః.

ఇంకో వివరణం "విదితో విదితవాన్" ఇది సకర్మకక్రియే అయినప్పటికీ కర్మకు చెందకపోవడంచేత కర్తరి ప్రయోగంలో ఉపయోగించబడింది. మల్లినాథుడు తన వాదాన్ని సమర్థిస్తూ— "అథవా విదితో విదితవాన్ సకర్మకాదపి అవివక్షితేకర్మణి కర్తరి క్తః" యథా ఆశ్రితః కర్తా ఇత్యాదౌయథాహుః-ధాతోరర్థాంతరే వృత్తే, ధాత్వర్థేనోపసంగ్రహాత్, ప్రసిద్ధే రవివక్షాతః కర్మణోఽకర్మికా క్రియా ఇతి. అని ప్రమాణం చూపాడు.

శ్లో॥ సంప్రత్యసాంప్రతం వక్తుముక్తే ముసల పాణినా
నిర్ధారితేఽర్థే లేఖ్యేన ఖలూక్త్వా ఖలువాచికమ్.

(శిశుపాలవధ 2వసర్గ 70వ శ్లోకం)

ఈ శ్లోకంలో 'ఖలూక్త్వాఖలువాచికమ్' అని ఉంది. ఇందులో రెండు చిత్రమైన విషయాలున్నాయి. 'ఉక్త్వాఖలు' అంటే 'వచింపరానిది' అని అర్థం. 'వాచికంఖలు' అన్నప్పుడు ఇందులోని ఖలు కేవలం వాక్యాలంకారము. అంటే అర్థరహితమయిందన్న మాట. "నిషేధ వాక్యాలంకారజిజ్ఞా సానునయే ఖల్విత్యుభయ త్రాప్యమరః" అని ఖలు శబ్దానికి ప్రతిషేధార్థక పూరణార్థకాలను అమరం చెబుతూ ఉంది. ఉక్త్వా అనే క్త్వార్థకానికి వాచ్యం అనే అర్థం ఎట్లా వస్తుందంటే "అలంఖల్వోః ప్రతిషేధయోః ప్రాచాం క్త్వేతి క్త్వాప్రత్యయః" అని ఉండటంవల్ల ప్రతిషేధార్థకాలైన

"అలంఖలు" అనే వాటితో యోగమున్నప్పుడు ధాతువుకు 'క్త్వా' ప్రత్యయం రావలసిఉంది. కాబట్టి వాచ్యం అనే కృదంతానికి మారుగా 'ఉక్త్వా' అనే 'క్త్వాంత' రూపంవచ్చిందే కాని "వాచ్యం" అనే అర్థం. ఉక్త్వాఖలు నవాచ్యం నవాచ్యం ఖల్విత్యర్థః ఆద్యఃఖలు ప్రతిషేధార్థః, అన్యఃఖలు వాక్యాలంకారః.

ఇంకో శంకకు ఇక్కడ మల్లినాథుడు చర్చ చేశాడు. "ఖలూక్త్వా ఖలువాచికం" అనేది శ్లోకంలో నాలుగో పాదం. "నపాదాదౌ ఖల్వాదయః" అని. పాదాదినిఖలు మున్నగునవి ఉండరాదని నిషేధం. దానికి మల్లినాథుడు సమాధానం చెబుతూ "ఇహోఽపాదాదౌ ఖల్వాదయ ఇతి నిషేధస్య ఉద్వేజకాభిప్రాయత్వాత్ నఞ్ అర్థస్య ఖలుశబ్దస్య అనుద్వేజకత్వాత్ నఞ్వదేవ పాదాదౌ ప్రయోగోనదూష్యతీత్యను సంధేయం" అని వివరించాడు. ఇక్కడ నఞ్ అర్థక ఖలు శబ్దం ఉద్వేజకం కాదు కాబట్టి పాదాదిని ప్రయోగించడం దూష్యం కాదు. నిరర్థక వాక్యాలంకారాలైన ఖలు శబ్దాదులు మాత్రమే పాదాదిని ఉండతగవు నిషేధార్థకాలైన, అర్థవంతాలైన, ఖలు మొదలైన అవ్యయాలు పాదాదిని ప్రయోగార్హాలే అని సమర్థించాడు

శ్లో॥ పురీమవస్కంద లునీహి నందనం
ముషాణరత్నాని హరామరాంగనాః
విగృహ్య చక్రే నముచిద్విషా బలీ
యఇత్థ మస్వాస్థ్యమహర్దివందివః.

(శిశుపాలవధ 1వసర్గ 51వ శ్లోకం)

ఇక్కడ "అవస్కంద, లునీహి, ముషాణ, హర" అనేవి లోణ్మధ్యమ పురుషలను బోధించే క్రియాపదాలు. అంటే అవస్కంద = అవరోధింపుము; లునీహి=ఛేదింపుము; ముషాణ= దొంగిలించుము: హర=అపహరింపుము. అని అర్థాలు. ప్రథమ పురుష

బోధకమైన రావణ పదానికి మధ్యమ పురుష క్రియలతో అన్వయం కుదరదు. మల్లినాథుడు బలీ అనే పదంతో అన్వయించేటట్లు అవరోధించెను; ధ్వంసించెను, దొంగిలించెను, హరించెను'' అని అన్ని క్రియలకు పౌనః పున్యార్థాన్ని చెప్పి "అత్రావస్కందేత్యాదౌ" 'క్రియాసమభిహారేలోట్': "లోటోహిస్వౌ వాచతధ్వమోః'' ఇత్యను వృత్తౌ 'సముచ్చయేఽన్యతరస్యామ్' ఇతి వికల్పేన కాల సామాన్యే లోట్. తస్యయథోపగ్రహం సర్వతిజాదేశో హిస్వౌచ. ప్రకరణా దినా త్వర్థవిశేషావసానం "అత్రో హేః" ఇతియథాయోగ్యం హిలుక్. పౌనః పున్యం భృశార్థోవా క్రియాసమభిహారః అవస్కం దాది క్రియావిశేషాణాం సముచ్చయః క్రియాసమభిహారః తత్సా మాన్యస్య సముచ్చయే సామాన్యవచనస్య ఇత్యనుప్రయోగః చక్రే ఇతి క్రియాసమభిహారే...సముచ్చయే...అనేసూత్రాలవల్ల సర్వకాల సామాన్యమైన లోట్ ప్రయోగించబడిందనీ, సముచ్చయే సామాన్య వచనస్య అనే సూత్రంవల్ల అవస్కందాది క్రియాసమభి హారానికి చక్రే అనే అనుప్రయోగం చేయబడిందనీ మల్లినాథుడు వ్యాఖ్యానించాడు.

సిద్ధాంత కౌముదిలో పై సూత్రాలకు వృత్తి వ్రాస్తూ ఏతేన పురీమవస్కంద...ఇతి వ్యాఖ్యాతమ్ అవస్కంద లవనాది రూపా భూతానద్యతన పరో కైకకర్తృకా అస్వాస్థ్య క్రియేత్యర్థాత్. ఇహాపునః పునశ్చస్కందేత్యాదిరర్థ ఇతి వ్యాఖ్యానం భ్రమమూలక మేవ. ద్వితీయ సూత్రే "క్రియాసమభిహారే" ఇత్యస్యాననువృత్తేః లోడంతస్య ద్విత్వాపత్తేశ్చ పురీమవస్కందేత్యాది మధ్యమపురుషైక వచనమిత్యపి కేషాంచిత్ భ్రమ ఏవ పురుషవచన సంజ్ఞే ఇహా నేత్యుక్తత్వాత్" భూతానద్యతన పరోక్షాన్ని బోధించే అవస్కంద లవనాదులకు ఏకకర్తృకమైన అస్వాస్థ్య క్రియతోనే అన్వయం. ద్వితీయ సూత్రంలో క్రియాసమభిహార సూత్రానువృత్తి లేనందు

వల్ల మాటిమాటికి అవరోధించెను" అని అర్థం చెప్పిన వ్యాఖ్యానం భ్రమమూలకమే. ఇక్కడ పురీమవస్కంద మొదలైనవాటికి మధ్యమ పురుష ఏకవచనార్థం చెప్పడం కూడా కొందరి భ్రమే పురుష వచన సంజ్ఞలు పేర్కొబడలేదని భట్టోజీదీక్షితులు మల్లినాథుని వ్యాఖ్యను ఖండించాడు.

భట్టోజీదీక్షితుని మాటలు ఆధారంగా తీసుకొని కొందరు మల్లినాథుని వ్యాఖ్యానంలోని పొరపాట్లుగా ఈ స్థలాలను పేర్కొంటున్నారు. కాని నాగోజీభట్టు శబ్దేందు శేఖరం దాకా సాగి పరిశీలిస్తే భటోజీదీక్షితులే భ్రమ ప్రమాదాలకు గురై మల్లినాథుని ఆక్షేపించినట్లు మనకు స్పష్టమవుతుంది.

ఇక్కడ ఈ విషయాన్ని సమగ్రంగా తెలుసుకోవడానికి పాణినీయ సూత్రాల అర్థాన్ని క్రమంగా విచారించడం అవసరం.

"క్రియాసమభిహారేలోట్, లోటోహిస్వౌవాచతధ్వమోః." క్రియాసమభిహారమంటే పౌనఃపున్యము. పౌనఃపున్యార్థాన్ని బోధించవలసివచ్చినప్పుడు 'లోట్' వస్తుంది. ఆ లోట్‌కు "హి:స్వ:" ప్రత్యయాలు వస్తాయి ఇక్కడ పురుషవచన వివక్ష లేకుండా అన్ని కాలాలలోనూ పరస్మైపదంలో "హి" ప్రత్యయమున్నూ, ఆత్మనేపదంలో "స్వ" ప్రత్యయమూ వస్తాయి. "తః ధ్వమ్" ప్రత్యయాల విషయంలో లోట్‌కు హి:స్వః ప్రత్యయాలు వస్తాయి "సముచ్చయేఽన్యతరస్యామ్", అనేక క్రియా సముచ్చయంలో కూడా పైరీతిగానే లోట్‌కి "హి:స్వ" ప్రత్యయాలు వస్తాయి. ఛందోఽధీష్వ, వ్యాకరణ మధీష్వ, నిరుక్త మధీష్వేత్యేవాయమధీతే అంటే ఛందో వ్యాకరణ నిరుక్తాలను మాటిమాటికి అధ్యయనం చేస్తున్నాడు అని భావం.

యథావి ధ్యనుప్రయోగః పూర్వస్మిన్ ఈ లోడ్విధానంలో లోడంతంగా ఏ ధాతువు ప్రయోగింపబడిందో ఆ ధాతువునే అను

ప్రయోగ ధాతువుగా ప్రయోగించాలి అంటే లునీహి లునీహీత్యే వాయం లునాతి అనే ప్రయోగించాలి. కాని లునీహి లునీహీత్యే వాయం ఛినత్తి అని లోట్ ప్రయుక్త ధాతువుకు భిన్నధాతువు ప్రయోగించకూడదు.

సముచ్చయే సామాన్యవచనస్య సముచ్చయంలో లోడ్విధిలో సామాన్యార్థకమైన ధాతువును అనుప్రయోగించాలి. ఓదనం భుంక్ష్వ, సక్తూన్ పిబ; ధానాఃఖాద ఇత్యేవాయం అభ్యవహారతి అని సముచ్చయంలో ప్రయోగించాలి.

క్రియాసమభిహారేద్వేవాచ్యే అనే వార్తికంవల్ల క్రియా సమభిహారధాతువుకు ద్విరుక్తం వస్తుంది. అంటే పై మాఘ శ్లోకంలో "అవస్కంద అవస్కంద, లునీహిలునీహి" అని ద్విరుక్తి ఉన్నప్పుడే పౌనఃపున్యార్థం చెప్పాలి కాని లేనప్పుడు చెప్పకూడదు. ఇది ఇట్లా ఉండగా—

అథైతయోః పథోర్నకతరేణ చన తానీమాని క్షుద్రాణ్యసకృదావర్తీని భూతాని భవంతి జాయస్వ, మ్రియస్వేత్యేతత్ తృతీయగ్ంస్థానం తేనాసౌలోకోనసంపూర్యతే తస్మాత్ జుగుప్సేత తదేష శ్లోకః॥ అనే ఛాందోగ్యోపనిషద్వాక్యానికి భాష్యంలో అత ఉభయమార్గ పరిభ్రష్టా హ్యసకృజ్జాయంతే మ్రియంతఇత్యర్థః తేషాం జనన మరణ సంతతేరనుకరణ మిదముచ్యతే అనేచోట "జాయస్వ, మ్రియస్వ" అనే క్రియాపదాలకు "ఉభయమార్గ పరిభ్రష్టులు మాటి మాటికి పుడుతున్నారు, చస్తున్నారు" అనే అర్థం శ్రీ శంకరాచార్యులు చెప్పారు. ఈ భాష్య వ్యాఖ్యానంలో "పౌనఃపున్యేన లోణ్మధ్యమైకవచనాత్ తయోః సర్వాఖ్యాతేషు విధానాత్ పునః పునర్జాయంతే మ్రియంతే చేత్యస్మిన్నర్థే జాయస్వమ్రియస్వేతి ప్రయోగ ఇత్యాహ" అని ఆనందగిరి పూజ్యపాదులు "జాయస్వ

ప్రియస్వ" అనే లోట్మధ్యను ఏకవచన పదాలు పౌనః పున్యంలో జాయంతే, ప్రియంతే అనే అర్థంలో ప్రయోగించబడినట్లు చెబుతున్నారు.

అదేవిధంగా అథాతో బ్రహ్మజిజ్ఞాసా అనేచోట బ్రహ్మ సూత్ర శాంకర భాష్య వ్యాఖ్య అయిన భామతిలో అథాస్య పురుష ధౌరేయస్యానుభవోపపత్తిభ్యామేవం సునిపుణం నిరూపయతః ఆచ సత్యలోకాదా చావీచేర్జాయస్వ ప్రియస్వేతి విపరివర్తమానం క్షణ ముహూర్త యామాహోరాత్రార్ధమాస మాసర్త్వయన వత్సర యుగ చతుర్యుగ మన్వంతర ప్రలయ మహాప్రలయ, మహాసర్గా వాంతర సర్గ సంసార సాగరోర్మిభిః అనిశం ఉహ్యమానం తాప త్రయ పరీతమాత్మానం జీవలోకం చావలోక్య అస్మిన్ సంసార మండలే అనిత్యాశుచి దుఃఖాత్మకం ప్రసంఖ్యానముపావర్తతే అనే చోట ద్విరుక్తి రహితంగానే షడ్దర్శన చక్రవర్తులైన వాచస్పతి మిశ్రులు ప్రయోగించారు. ఈ భామతీ వ్యాఖ్యానమైన వేదాంత కల్పతరువులో జాయస్వ, మ్రియస్వేతి—పునః పునర్జాయతే, మ్రియతఇత్యర్థః. క్రియాసమభిహారే లోట్ ఇతి పౌనఃపున్యే సర్వ లకారాపవాదేనలోటః స్వాదేశస్యచవిధానాత్ అని ద్విర్భావం లేక పోయినా క్రియాసమభిహార సూత్రంవల్ల పౌనఃపున్యార్థంలో లోట్టు, స్వాదేశమూ వచ్చిందని భగవదమలానందాచార్యులు చెప్పారు.

వైయాకరణ మూర్ధన్యులైన నాగేశభట్టపాదులు కౌముదిని వ్యాఖ్యానిస్తూ వార్తికంలో ద్వేవాచ్యే అని చెప్పటంవల్ల మాఘ శ్లోకంలో ద్విత్వం లేనందువల్ల క్రియాసమభిహారే లోట్ అనే సూత్రంచేత పౌనఃపున్యార్థం చెప్పకూడదు. అనుప్రయోగమైన 'చక్రే'తో అన్వయించి అస్వాస్థ్యం చేకూర్చినట్లు చెప్పాలి లేదా బలవంతుడైన రావణుడు అవస్కంద = అవరోధింపుము మొదలైన క్రియలతో సేవకులను ప్రేరేపించి అస్వాస్థ్యం కలిగించాడని

చెప్పాలి అహర్దివం అని శ్లోకంలో ఉండటంవల్ల పౌనఃపున్యార్థం చెప్పవచ్చు. అను ప్రయోగవిధిని భాష్యకారులు నిరాకరించడంవల్ల జాయస్వ, మ్రియస్వ అనే శ్రుతిలో అనుప్రయోగం అక్కరలేదు అసకృత్ప్రదంవల్ల శ్రుతిలో పౌనఃపున్యార్థం వస్తుంది. అట్లాగే వాచస్పతి ప్రయోగంలో పలుసార్లు చ, చ అని ఉండటంవల్ల పౌనఃపున్యార్థ్యం చెప్పవలసిఉంటుంది. క్రియాసమభిహారే లోట్ అనే సూత్రంచేత పౌనఃపున్యార్థాన్ని చెప్పే కల్పతరువు చింత్యమని లఘు, బృహచ్ఛబ్దేందు శేఖరాలలో విపులంగా చర్చించారు. ఇదంతా పరిశీలించి బాలమనోరమలో బలవంతుడైన రావణుడు ఇంద్రునితో విరోధించి అమరావతి అవస్కందనము, నందనవన లవనము, రత్నమోషణము, అమరాంగనాహరణము ఈ విధంగా అహర్దివము స్వర్గానికి అస్వాస్థ్యం కలిగించాడని మీమాంసా శిరోమణులైన వాసుదేవదీక్షితులు చెప్పారు. కల్పతరువరిమళంలో క్రియాసమభిహారే ఇతి-క్రియాసమభిహారేలోట్ లోటోహిస్వౌ ఇతి పాణిని సూత్రేణ క్రియాపౌనఃపున్య వివక్షాయాం సర్వలకారాప వాదేన లోడ్విహితః; తస్యపరస్మైపదాత్మనేపదయోః యథాక్రమం హిస్వావాదేశే చ విహితౌ నను క్రియాసమభిహారే లునీహిలునీ హీత్యేవాయం లునాతి ఇత్యాద్యుదాహరణాంతరేష్వివ జాయస్వ జాయస్వేత్యే వేమాని జాయంతే, మ్రియస్వ మ్రియస్వేత్యేవ మ్రియంతే. ఇతి ద్విర్భావస్తస్య తస్యధాతోరనుప్రయోగశ్చ ప్రాప్నోతీతితత్రాపి వార్తికే ద్విర్భావానుశాసనాత్; యథావిధ్యను ప్రయోగః పూర్వస్మిన్ ఇతిసూత్రేణ క్రియాసమభిహారే తస్మైవ ధాతోః అనుప్రయోగ నియమాచ్చ నైపదోషః; కిన్తియా సమభిహారవత్ జనన మరణ క్రియాద్వయ సముచ్చయస్యాప్యత్ర వివక్షితత్వాత్, సముచ్చయేఽన్యతరస్యామ్ ఇతి సూత్రేణ సముచ్చయేఽపి లోణ్మధ్యమపురుషైక వచన విధానాత్. తత్రహి నద్విర్భావ వార్తికమస్తి, నాపియథావి ధ్యనుప్రయోగ విధానమస్తి,

కింతు సముచ్చయే సామాన్య వచనస్యేతి సూత్రేణ తావత్ క్రియా విశేషానుగత సామాన్య వచనస్యానుప్రయోగో విహితః ఓదనం భుంక్ష్వ, క్షీరంపిబ, ధానాఃఖాద ఇత్యేవ మభ్యవహారతి ఇత్యాది తదుదాహరణమ్. ఇహాపి జననమరణానుగత సామాన్యరూప విపరివృత్తివాచినోఽనుప్రయోగోఽస్తి అసకృదావర్తిని భూతాని భవ-తిఇతి. క్రియాసమభిహార సముచ్చయోభయ వివక్షాయాంచ సముచ్చయ వివక్షాప్రయుక్తమేవ కార్యం భవతి విప్రతిషేధే పరం కార్యమితిస్మరణాత్ సముచ్చయేఽన్యతరస్యామ్ అనే సూత్రంలో క్రియాసమభిహారే ద్వేవాచ్యే అనే వార్తికాన్ని పఠించలేకపోవడం వల్ల ద్విర్భావం లేకపోయినా పౌనఃపున్యార్థం చెల్లుతుందని సర్వ తంత్ర స్వతంత్రుడైన అప్పయ్యదీక్షితులు పరిష్కరించాడు.

కావ్యవాఙ్మయంలో అవస్కంద, లునీహి, ముషాణ హారఅనే ఈ నాలుగు క్రియలూ నభూతో నభవిష్యతి అనదగిన ప్రయోగాలు, ఇట్లాంటి ప్రయోగాలు మాఘుని మహావైయాకరణునిగా నిరూపించాయి. ఈ మాఘకావ్యాన్ని మాఘేమేఘే గతంవయః అని ఎంతో గర్వించదగినట్లుగా మల్లినాథుడు వ్యాఖ్యానించాడు. అయి నప్పటికి కొందరు ఇట్లాంటిచోట్ల మల్లినాథుడు పొరపాటుపడి వ్యాఖ్యానించినట్లు భావించారు. మల్లినాథుని వ్యాఖ్యాన సామర్థ్యాన్ని, వ్యాకరణపాండిత్య సమగ్రతనూ చూపడానికే ఇంత సుదీర్ఘంగా చర్చించవలసివచ్చింది.

శ్లో. అధరం ఖలుబింబనామకం ఫలమాఖ్యామితి భవ్యమన్వయమ్
లభతేఽధరబింబమిత్యదః పదమస్యా రదనచ్ఛదేవదత్.
(నైషధం 2వ సర్గ 24వ శ్లో.)

ఈ శ్లోకం శ్రీహర్షునివ్యాకరణ శాస్త్రీయ మర్మపరిజ్ఞానాన్ని వేయినోళ్ళతో చాటుతూ ఉంది దీని భావం ఏమిటంటే అధరబింబం అనేపదం అధరం బింబమివఅనేరీతిని ఉపమితసమాసంగా కవిలోకంలో

వాడబడిఉంది దొండపండు వంటి క్రిందిపెదవి అని అర్థం బింబం ఉప మాన పదార్థంగా అధరం ఉపమేయంగా కవులు వాడారు.

శ్రీహర్షుడు అట్లాకాక అధరబింబం అనేపదాన్ని అధరంబింబం యస్మాత్ అని విగ్రహంచూపి బహువ్రీహిగా చెప్పాడు. దేనికంటె అంటే ఏ దమయంతి క్రిందిపెదవికంటె దొండపండు అధరం (నీచ మయిందో) ఆ పెదవి అధరబింబం అనబడుతుంది.

పూర్వకవులుచెప్పిన సమాసంప్రకారం దొండపండుఉపమానం కావడంవల్లనే - అదే-ప్రసిద్ధమనీ, పెదవి ఉపమేయంకావడంవల్ల అది అప్రధానమనీ స్పష్టంఅవుతూఉంది శ్రీహర్షుడు చేసినసమన్వయంలో అంతకంటె ఒక విశిష్టతఉంది ఏది ప్రసిద్ధమైనబింబమో అది దమ యంతి కిందిపెదవికంటె నీచమైనదిఅని చెప్పడంవల్ల పెదవికే ప్రాధా న్యం లభిస్తున్నది. ఇట్లా చూపడంవల్ల కావ్యానికి ఎంతో శోభ చేకూరుతూఉంది. శ్రీహర్షుడిట్లా మార్చడంలో ఒక వ్యాకరణ శాస్త్రరహస్యంఉంది. దానిని గుర్తించేకవి ఈమార్పుచేశాడు ఎట్లా అంటే:- సమర్థఃపదవిధిః 2.1.1 అనే సూత్రంవల్ల పాణిని ఏకార్థీ భావం కల పదాలకే సమాసం ప్రవర్తిస్తుందని చెప్పాడు అట్లాంటి ఏకార్థీభావ సామర్థ్యంలేనప్పుడు సమాసం చేయరాదు. ఉపమిత సమాసం అసమర్థసమాసమని, ఉపమానాని సామాన్య వచనైః అనే సూత్రం అర్థం మహాభాష్యంలో పతంజలి వ్యాఖ్యానించాడు ఆవిధంగా ఉపమిత సమాసం అసమర్థసమాసమయినా శాస్త్రకారుని చేత చెప్ప బడడంవల్ల సాధువుగా పరిగణించాలని వైయాకరణులు నిశ్చయిం చారు.

పై రీతిని భాష్యకారుని సిద్ధాంతాన్ని జీర్ణించుకొన్న శ్రీహ ర్షుడు తన ప్రతిభావిశేషంవల్ల అధరబింబమనే పదాన్ని బహువ్రీహి నాశ్రయించి సమర్థసమాసంగా చూపాడు. ఇట్టి శాస్త్రీయ రహ స్యాన్ని శ్లోకంలో కవి ఇమిడ్చాడు.

"అధరంఖలు బింబనామకం ఫలమస్మాత్" అనేటంతవరకూ విగ్రహవాక్యాన్ని చూపుతున్నాడు. ఇట్లాంటి అర్థాన్ని చూపిస్తేనే అధరబింబమనే పదానికి భవ్యమైన అన్వయంకలుగుతుందనిచెప్పాడు. ఇక్కడ భవ్యమంటే అబాధితము అని అర్థము. కాగా బహువ్రీహి సమాసాన్ని ఆశ్రయించినప్పుడు వృత్తిఘటకాలైన పదార్థాలసంసర్గ సమాసమైన అన్వయం అబాధితమవుతుందని భావం. అట్లాకాక ఉపమిత సమాసాన్నే ఆశ్రయిస్తే పైరీతిని ఇది అసమర్థసమాసం కావడం వల్ల అన్వయం బాధితమవుతుంది. అంటే సమర్థః పదవిధిః అనే పాణిని పరిభాషకు భంగం కలుగుతుంది. ఇది నైషధశ్లోకానికి తాత్పర్యం. ఇట్లాంటి శ్లోకభావాన్ని వివరించడానికి పై వైయాకరణ సిద్ధాంత రహస్యాన్ని ఎరిగినవాడేకావాలి. మల్లినాథుడు అట్లాంటి ప్రతిభావంతుడు కావడంవల్ల పై శ్లోకానికి వ్యాఖ్యరచించగలిగాడు.

"బహువ్రీహి సమాసేచ సతి భవ్యం అబాధితమన్వయం. వృత్తిపదార్థ సంసర్గలక్షణం లభతే అన్యథా అసమర్థ సమాసాశ్రయణే సమర్థః పదవిధిరితి సమర్థపరిభాషాభఙ్గ్యేత" ఈస్థలంలో ఇతరవ్యాఖ్యాతలు శ్రీహర్షుని భావాన్ని గ్రహించలేకపోయారు.

ఈ శ్లోకంలో అధరంఖలు-అధరం కిల అనే పాఠాలున్నాయి. ఖలు-కిల అనే అవ్యయాలు ఏకార్థకాలు. కాగా బహువ్రీహి సమాసాన్ని ఆశ్రయించినప్పుడే అన్వయం సరిపడుతుంది. అట్లాకాకపోతే అన్వయం సరిపోదు అని కవి స్పష్టపరిచాడు. మల్లినాథుడు దాన్ని వివరించాడు.

శ్లో. స్వం నైషధాదేశమహో! విధాయ
కార్యస్య హేతోరపి నానలః సన్
కిం స్థానివద్భావ మధత్తదుష్టం
తాదృక్ కృతవ్యాకరణః పునః సః?

(నైషధం 10వ సర్గ 136వ శ్లో)

ద్రౌపదీస్వయంవరానికి ఇంద్ర, అగ్ని, వరుణ, యమదేవతలు నలుగురూ వచ్చారు. వారు నలుని రూపురేఖలు చూసి ముగ్ధులయ్యారు వీరిలో ఇంద్రుడు దమయంతితో వివాహాన్నికోరి ఆమె నలుని తప్ప మరెవ్వరినీవివాహమాడదని తెలుసుకొని తత్కార్యార్థం నలవేషం వేసుకొన్నాడని పై శ్లోకానికి తాత్పర్యం.

ఇక్కడ వ్యాకరణశాస్త్రంయొక్క సిద్ధాంతంపొదుపబడిఉంది. ఇంద్రుడు ప్రసిద్ధమైన వ్యాకరణాన్ని రచించిన వాడయినా వ్యాకరణ శాస్త్రతత్త్వాన్ని గుర్తించనివాడయ్యాడేమో అని కవి అంటున్నాడు. "స్థానివదాదేశోఽనల్విధౌ" అనే సూత్రంవల్ల ఆదేశం స్థానిధర్మాన్ని పొందుతుందనీ 'అల్'స్థానిగా ఉన్నప్పుడు (S ngle syllable ఉన్నప్పుడు) ఆదేశం స్థానిగా ఉన్నప్పుడుకూడా స్థానిధర్మాన్ని పొందదనీ పాణిని సూత్రించాడు కాని ఒకేవర్ణం స్థానిగా ఉన్నప్పుడుకూడా స్థానిధర్మాలను ఆదేశంలో ఇంద్రుడు అంగీకరించాడేమో. అది దుష్టం అని దీనికి అర్థం కనిపిస్తూఉంది. అల్లే సః అనే పదంలో వ్యాకరణ ప్రక్రియ కనిపిస్తుంది. 'సః' అను పదం నిష్పత్తిచూస్తే ఇట్లాఉంది. 'తద్ + సు' అనే స్థితిలో 'త్యదా దీనామః'అనే సూత్రంవల్ల 'తద్'లో 'ద్' స్థానంలో అకారం ఆదేశంగా ప్రవర్తిస్తుంది అప్పుడు "త + అ + సు" = "త + సు" అనిఉండగా 'త'కారానికి స' ప్రవర్తించి "స + సు' అని అయి ప్రత్యయ సకారానికి ఋత్వమూ, విసర్గమూ ప్రవర్తించి "సః"అని సిద్ధరూపం ఏర్పడుతుంది. దీనిని కవి చూపి 'సః' శబ్దం కొంత ప్రక్రియకల్గి స్థానివద్భావాన్ని అది సంపాదిస్తుందా? అది దుష్టం అని చెప్పాడు. ఇట్లాంటి నిగూఢ శాస్త్రార్థం చమత్కారంగా శ్రీ హర్షుడిక్కడ చూపాడు. పై దానికి మల్లినాథుడు విపులంగా స్పష్టంగా ఎంతో టీకవ్రాశాడు అట్లాంటి కావ్యశాస్త్రాల్ని వ్యాఖ్యానించడం సామాన్యంకాదు.

కావ్యాలలో ఉన్న వ్యాకరణాంశాల్ని వివరించడమేకాకుండా మల్లినాథసూరి కేవలం వ్యాకరణప్రయోగాలకోసమే వ్రాయబడ్డ భట్టి కావ్యానికి సర్వపథీన వ్యాఖ్యనూ, పాణినీయానికి వ్యాఖ్య అయిన కాశికావృత్తికి బయలుదేరిన న్యాసమనే టీకకు న్యాసోద్ద్యోత మనే వ్యాఖ్యనూరచించి తన వ్యాకరణశాస్త్ర పాండిత్యాన్ని వెల్లడించాడు. "పన్నగగవీ గుంఫేషు చాజాగరీత్"అని చెప్పినట్లుగానే ఆదిశేషుని అవతారమైన పతంజలి వాగ్గుంఫనల్లో తనకున్న జాగరూకతను ప్రకటించాడు. 'అజాగరీత్' అనే క్రియాపదాన్ని ప్రయోగించటంలోనే మల్లినాథునికి శబ్దశాస్త్రంమీద ఉండే. అధికారమూ, ప్రత్యేకాభిమానమూ వెల్లడవుతున్నాయి.

—: o :—

న్యాయ దర్శనము

శ్లో. కలశే నిజహేతు దండజః కిము చక్రభ్రమ కారితాగుణః
స తదుచ్చకుచౌ భవన్ ప్రభాఝర చక్ర భ్రమమాతనోతియత్.
(నైషధం 2వ సర్గ 32వ శ్లోకం)

ఘటానికి కారణందండము దానివల్లకలిగిన చక్రభ్రమగుణము (కుమ్మరివాని చక్ర భ్రమణము) కలశమందు సంక్రమించినదా? ఎందుకంటే ఆ చక్ర భ్రమ ఆమె ఉన్నత కుచాలుగా పరిగణిస్తూ ఆమె శరీరంలోని లావణ్యప్రవాహంలో చక్రభ్రమను కలిగిస్తున్నది. అంటే చక్రం తిరగటాన్ని కలిగిస్తున్నది. ఆ స్తనములందు చక్రవాక పక్షులనే భ్రాంతిని కలిగిస్తున్నది. అంటే ఆమె స్తనాలు చక్రవాకాల వలె అందంగా ఉన్నాయని భావం.

"సమవాయి కారణగుణా రూపాదయః కార్యే సంక్రామంతి ననిమిత్తగుణాః ఇతి తార్కికాణాం సమయేస్థితే" అని మల్లినాథుడు తార్కికుల ముఖ్యసిద్ధాంతాన్ని ఉట్టంకించివివరించాడు. కార్యమునందు సమవాయికారణగుణాలే సంక్రమిస్తాయి. కానినిమిత్తకారణగుణాలు సంక్రమించవు.

వస్త్రమునందు సమవాయి కారణాలు దారములు. నిమిత్త కారణాలు దేవాంగి, మగ్గము, పుల్లలు మొదలైనవి. ఇక్కడదారాలు ఎట్లా ఉంటాయో వస్త్రాలు అట్లా ఉంటాయి. అంటే సమవాయి కారణమైన దారం గుణం వస్త్రానికి సంక్రమిస్తుంది. అంతే కాని నిమిత్తకారణాలయిన మగ్గం-నేతగాడు-మొదలైన వాటి గుణాలు వస్త్రానికి సంక్రమించవు. ఇది తార్కికుల సిద్ధాంతము లోకానుభవం కూడా అట్లాగే ఉంది కాని దమయంతీ కుచకలశమున నిమిత్త కార

ణమైన దండంవల్ల కలిగిన చక్రభ్రమగుణాలు సంక్రమించాయా? అని కవి ఉత్ప్రేక్షించాడు. 'చక్రభ్రమ' అనే శ్లిష్టపదాన్ని కవి ప్రయోగించి చమత్కరించాడు న్యాయదర్శనమున మంచి పరిజ్ఞానమున్న మల్లినాథుడు చాల సమర్థంగా వ్యాఖ్యానించాడు న్యాయ దర్శన సంబంధమైన గ్రంధిని ఇక్కడ మల్లినాథుడు అనాయాసంగా విడగొట్టాడు.

శ్లో. పతావతానన్వనుమేయ శోభికాంచీ గుణస్థానమనిందితాయాః
అరోపితం యద్గిరిశేన పశ్చాదనన్య నారీ కమనీయమంకమ్.
(కుమార సంభవం 1వ సర్గ 37వ శ్లోకం)

ఈ శ్లోకంలో కాళిదాసు పార్వతీ నితంబాన్ని వర్ణించాడు. ఈ వర్ణించడంలో ఒక విలక్షణత, ఔచిత్యం నిండిఉన్నాయి. ఒక శాస్త్రసంబంధమైన రహస్యం కవితలో చోటుచేసుకుంది. తర్కం న్యాయంలోకి పర్యవసిస్తుందని ముందే చర్చించిఉన్నాము. అంచూ శాస్త్రప్రమాణాలు ఎరిగిన మల్లినాథుడు అద్భుతంగా వ్యాఖ్యానించాడు.

పార్వతీ నితంబము "అనుమేయశోభి" అనుమాన ప్రమాణం చేత ఊహించదగిన శోభకలది. ఎట్లా అంటే-తర్వాతను ఈశ్వరుడే ఆమె కాంచీ గుణస్థానాన్ని తన తొడపై ధరింపచేసెను అని ఈశ్లోక తాత్పర్యము.

ఇక్కడ మల్లినాథుడు అనుమాన ప్రణాళికను చక్కగా చూపి ఉన్నారు. తార్కికులు అనుమాన రచన ఇట్లా చేస్తారు—పర్వతో వహ్నిమాన్ ధూమాత్ యన్నైవం తన్నైవం యథా హ్రదః ఇట్లాంటి తార్కిక రీతిని అనుసరించి మల్లినాథుడుకూడా అనుమాన రచన చేశాడు. గిరిజా నితంబ బింబం విశ్వాతి శాయి సౌందర్యం - గిరిశాంకారూఢత్వాద్వ్యతి రేకేణ నార్యంతర నితంబ

బింబవత్ పవిప క్షే పొత్వాను క్తి రేవచాధికా దాక్షాయణీ నితంబ బింబ స్యతు పక్షసపక్షయో రన్యతర భావానతి వ్యక్తేర్నిష్కలంక మను మాన మిత్యల మస్థాన సంరంభేణ అని మల్లినాథుడు సరసంగా వివ రించాడు.

మీమాంసా దర్శనము

శ్లో. విశ్వరూపకలనా దుపపన్నం తస్యజైమిని మునిత్వము దీయే
విగ్రహం మఖభుజామ సహిష్ణుర్వ్యర్థతాం మదశనింసనినాయ.
(నైషధం ఓవ సర్గ 39వ శ్లోకం)

నారదుడు దేవలోకానికి వెళ్ళి ఇందుర్ణి చూశాడు అప్పుడు దమయంతీ స్వయంవర ప్రసంగాన్ని తెచ్చి నారదుడు తనకు కలహ భోజనం లేనందువల్ల ఖేదపడుతున్నానని చెప్పాడు. ఇది సందర్భం. అప్పుడు ఇందుడు ఇట్లా పలికాడు.

"నాకు సోదరుడైన ఉపేంద్రుడు నాకు రక్షణచేస్తూ ఉండగా యుద్ధభీతి నాకులేదు. అని ఆ సందర్భమున ఉపేంద్రునికి జైమిని మునిత్వం లభించింది అన్నాడు. ఉపేంద్రుడు జైమిని ఎట్లవుతాడు? ఇదీ మరో గ్రంథగ్రంథి. దీనిని కూడా మల్లినాథుడు తన అశేష శేముషీ విశేషంతో, అపార మీమాంసా దర్శన పాండిత్యంతో వ్యాఖ్యానించాడు.

ఉపేంద్రుడు విశ్వరూపకలనం' చేశాడు. అంటే అన్ని యుద్ధాలు సాక్షాత్కరించుకొన్నాడు. మత్స్యకూర్మాద్యవతారాలు ధరించాడు. అట్లే దేవతలకు ఉపేంద్రుడు విగ్రహం ఓర్చడు. అంటే రాక్షసునితో విరోధం ఓర్చడు. కాబట్టే-మత్-అశనిమ్=మదశనిమ్= నావజ్రాయుధాన్ని వ్యర్థం చేశాడు. రాక్షస సంహారం తానే చేసి నాకు భారం తగ్గించడంవల్ల నావజ్రాయుధం వ్యర్థమయింది.

జైమిని కూడా ఈ పని చేశాడు. ఎట్లా అంటే :- విశ్వరూప శబ్దానికి సూత్రం అని అర్థం కాగా 12 అధ్యాయాలున్న పూర్వ మీమాంసా సూత్రాలను జైమిని రచించాడు. అందువల్ల 'విశ్వరూప కలనం' ఉభయత్రాసమానము. జైమిని దేవతలకు విగ్రహాన్ని అంగీకరించడు. అంటే దేవతలకు శరీరముందనడం ఒప్పుకోడు. "మంత్రిమూ-హవిస్సును అగ్నిలో విడవడం" అనే ఈ రెండూ కలిసే దేవత. అంతే కాని మనుష్యులకువలె దేవతలకు కరచరణాది అవయవసహిత శరీరంలేదు. అని జైమిని అభిప్రాయం ఇది పూర్వ మీమాంసా సిద్ధాంతం. 'దేవతలకు విగ్రహ అసహానము' ఉభయత్రా నమానము. వజ్రహస్త-వజ్రబాహుః మొదలైన వైదిక పదాలు ఇంద్రునికి హస్తాలు-ఆ హస్తంలో వజ్రం ఉన్నట్లు చెబుతున్నాయి. దానినిబట్టి ఇంద్రునికి శరీరమున్నట్లు కానిపిస్తుంది. కాని అది సరి కాదు. ఆ వాక్యాలు అర్థవాదాలు. అంటే వాటికి "స్వార్థమున" తాత్పర్యంలేక కేవలం దేవతల్ని పొగిడేవి మాత్రమే. కాగా "అశనికి" "వ్యర్థతాకల్పనం" కూడా ఉభయ సాధారణము వై అంశాల్నిబట్టి చూస్తే ఇంత గంభీరమైన భావమున్న ఈ శ్లోకాని. పూర్వ మీమాంసా శాస్త్రానుసారంగా సమన్వయాన్ని మల్లినాథుడు చేశాడు. ఇట్లాంటి పూర్వ మీమాంసా సిద్ధాంతాలు నైషధంలో అనేక స్థలాలలో ఉన్నాయి. వాటినన్నిటినీ మల్లినాథుడు చక్కగా వివరించాడు.

శ్లో॥ ప్రతిశరణమశీర్ణ జ్యోతి రగ్న్యాహితానాం
విధివిహిత విరిబ్ధైః సామిధేనీరధీత్య
కృతగురు దురితాఘధ్వాన మధ్వర్యువర్యై
ర్హుతమయముపలీఢే సాధు సాన్నాయమగ్నిః.

(మాఘం 11వసర్గ 41వ శ్లోకం)

ప్రతిగృహంలోనూ అగ్నిహోత్రిశాలల్లో శాస్త్రోక్త ప్రకారం నాలుగు స్వరాలతోనూ సామిధేనీ మంత్రాలు చదువుతూ చేసిన

మహా పాపాలన్నీ పటాపంచలయ్యేటట్లు అధ్వర్యు శ్రేష్ఠులు సాన్నాయ్యాన్ని వేలుస్తుండగా అగ్నిహోతుృడు ఆస్వాదిస్తున్నాడని భావం.

అగ్ని ప్రజ్వలనానికి పఠించే 'ప్రతోవాజా' మొదలైన మంత్రాలకు సామిధేని మంత్రాలని పేరు. ఇక్కడ సామిధేనీ శబ్దం చేత "యాజ్యాపురోమ" వాక్యాది మంత్రాల్నికూడా గ్రహించాలి. 'ఐంద్రం దధ్యమమావాస్యాయామైంద్రం పయోఽమావాస్యాయాం' అమావాస్యనాడు పెరుగుతో ఇంద్రుని గురించి హోమంచేయాలిఅనే ఈ వాక్యాలతో విధించబడ్డ "దధిపయస్సులకు" సాన్నాయ్యమని పేరు

ఈ కావ్యంలో ముందు చంద్రాస్తమయాన్ని వర్ణించి తరవాత ప్రభాతకాలాన్ని వర్ణించడంవల్ల అమావాస్య కాదనటం స్పష్టం అమావాస్యనాడు విధించబడ్డ సాన్నాయ్య హోమం శుక్ల పక్షంలో చేసినట్లు చెప్పడం శాస్త్రవిరుద్ధం. కాబట్టి ఇక్కడ మాఘ కవి సాన్నాయ్య శబ్దాన్ని సామాన్య హవిర్మాత్ర పరంగా ప్రయోగించినట్లుగ్రహించాలి. శబ్దకౌస్తుభంలో "అపాయ్య, సాన్నాయ్య, నికాయ్య, ధాయ్యమాన, హవిర్నివాస సామిధేనీషు" 3.1.26 సూత్రవ్యాఖ్యానంలో "సాన్నాయ్య" శబ్దాన్ని యథా శ్రుత గ్రాహి అయిన మాఘుడు హవిర్మాత్ర పరంగానే ప్రయోగించాడు. ఇక్కడ మాత్రం దధిపయో విషయకమెందువల్ల కాదని ప్రశ్నించ కూడదు. చంద్రాస్తమయ వర్ణన పూర్వకంగా సూర్యోదయాన్ని వర్ణిస్తూ అందులో పఠించడంవల్లా, కృష్ణపాడ్యమి విషయం కావడం వల్లా ఈ దధిపయో యోగమక్కడ సంభవించదు. హవిర్విశేష వాచకమైన 'సాన్నాయ్య'శబ్దం సామాన్యహోమపరంగా కాని విశేషాంతరంగా కాని బోధ్యమని భట్టోజీ దీక్షితులుకూడా చెప్పారు. అగ్నిహోత్రానికి ఒక్కడే ఋత్విజుడైనా ప్రతి గృహంలోనూ అందరూ అగ్నిహోత్రాలుచేస్తూ ఉండటంవల్ల ఇక్కడ అధ్వర్యులని

బహువచనం వాడబడింది. ఇక్కడ మల్లినాథుని వివరణ చాలా బాగుంది.

వైశేషిక దర్శనము

శ్లో. "అవ్యానారభమాణస్య విభోరుత్వాదిశాః పరైః
ప్రజంతి గుణతామర్థాః శబ్దా ఇవ విహాయసః."

ఈ శ్లోక వ్యాఖ్యానంలో మల్లినాథుని వైశేషికదర్శనంలోని వైదుష్యం చూడవచ్చు.

జయేచ్ఛగల సమర్థుడైన రాజు తానే కార్యాలను ప్రారంభించకపోయినా ఇతరులచేత ఆకార్యాలు చేయించి విభువైన ఆకాశం అంటే సర్వత్రా వ్యాపించేదైన ఆకాశము-సబ్దమైన దైనా తాను శబ్దగుణత్వాన్ని ఎట్లా పొందుతుందో అట్లాగే రాజు సర్వార్థాలను పొందుతాడని భావం.

"శ్రోత్ర గ్రాహ్యో యోఽర్థః సశబ్దః" (2-2-21); "పరిశేషాల్లింగ మాకాశస్య" (2-1-2) మొదలైన వైశేషికసూత్రాలతో శబ్దాకాశాల్ని గురించి కణాదమహర్షి చెప్పాడు. శ్రోత్రం అంటే చెవిచే గ్రహించబడే గుణంగలది శబ్దము శబ్దానికి ఆశ్రయంఆకాశం. శబ్దం ధ్వన్యాత్మకం, వర్ణాత్మంఅని రెండు విధాలు. మృదంగం మొదలైన వాటినుంచి పుట్టిన శబ్దంధ్వన్యాత్మకము సంస్కృతం, తెలుగు మొదలైన భాషారూపమైనది వర్ణాత్మకము భేరీదండ సంయోగం కలిగేటప్పుడు భేర్యాకాశ సంయోగంచేత ధ్వన్యాత్మకమైన శబ్దం పుడుతుంది. వీచీ తరంగ న్యాయంవల్లకానీ, కదంబ ముకుళన్యాయం వల్ల కానీ ఇట్లా పుట్టిన శబ్దాలనుంచి శబ్దసంతానాలు ఉద్భవిస్తేశ్రోత్ర శష్కుల్యవచ్ఛిన్నమైన ఆకాశం గ్రహించడంవల్ల మనము వాటిని వినగలుగుతున్నాము. సర్వత్రా వ్యాపించి సర్వమూర్త ద్రవ్య సంయోగంకలిగిఉన్న శూన్యపదార్థానికి ఆకాశమని పేరు "శష్కులి"

అంటే చెవికి ముందుభాగం. శ్రవణవివరసంజ్ఞకమైన అంటే చెవిలోని రంధ్రరూపమైన ఆకాశమే శ్రోత్రం. ఈ విధంగా ఆకాశం స్తబ్ధంగా ఉంచేదైనా శబ్దప్రవాహానికి కారణంకావడంవల్ల ఇందులో ఈవిధంగా చెప్పబడిఉంది మల్లినాథుని వివరణలేకపోతే ఇది అర్థంకాదు.

పౌలస్త్య దర్శనము

శ్లో॥ ఉదాసితారం నిగృహీత మానసై
ర్గృహీత మధ్యాత్మదృశా కథంచన
బహిర్వికారం ప్రకృతేః పృథగ్విదుః
పురాతనం త్వాం పురుషం పురావిదః.

(మాఘం 1వ సర్గ)

నారదుడుచేసిన శ్రీకృష్ణ స్తవము. పూర్వతత్వజ్ఞులైన కపిలుడు మొదలైన మహర్షులు సంయమచిత్తంతో ఆధ్యాత్మిక దృష్టితో క్రియాశూన్యుడూ, మహదాది వికారాలకంటె విలక్షణుడూ, సత్త్వ రజస్తమో గుణాత్మిక అయిన ప్రకృతికంటె వేరైనవాడూ అయిన అయిన పురాణపురుషుడూ నీవే అని చెబుతున్నారు.

మూలప్రకృతి రవికృతిర్మహదాద్యాః ప్రకృతి వికృతయః
సప్తషోడశకశ్చ వికారోన ప్రకృతిర్నవికృతిః పురుషః (కారిక 3)

మూలప్రకృతి, మహత్తు, అహంకారం, పంచతన్మాత్రలు, పంచజ్ఞానేంద్రియాలు, పంచకర్మేంద్రియాలు, పంచమహాభూతాలు, మనస్సు ఇవి 24 తత్వాలు ప్రకృతి వికృతులకు భిన్నుడూ, కూటస్థుడూ, నిత్యుడూ, పరిణామ శూన్యుడూ అయినవాడు పురుషుడు (పరమాత్మ) అని సాంఖ్యకారికలో ఉంది. 'అజామేకాం లోహిత శుక్లకృష్ణామ్' అని శ్రుతికూడా ఇట్లాగే చెబుతూఉంది 'అజ' అంటే పుట్టుక లేనిది, 'ఏక' అంటే సజాతీయద్వితీయరహితా.

లోహిత శుక్ల కృష్ణవర్ణా అయినది ప్రకృతి సత్వరజస్తమో గుణాత్మిక. రాగాత్మకం కావడంచేత ఎఱ్ఱనిదిత జోగుణం. ప్రకాశాత్మకం కావడంచేత తెల్లనిది సత్త్వగుణం ఆవరణాత్మకం కావడంచేత నల్లనిది తమోగుణము. ఈ త్రిగుణాత్మిక అయిన ప్రకృతికంటె వేరైనవాడు పురుషుడు అంటే పరమాత్మ అని సాంఖ్యప్రవచనం.

మల్లినాథుని వ్యాఖ్య ఇక్కడచూస్తే అతనికిగల సాంఖ్య దర్శన పాండిత్యం అర్థమవుతుంది. వ్యాఖ్యలేకపోతే ఈ సమన్వయం మనకర్థంకాదు

యోగ దర్శనము

శ్లో. సర్వవేదిన మనాది మాస్థితం దేహినామపి జిఘృక్షయా వపుః
క్లేశ కర్మఫలభోగ వర్జితం పుంవిశేషమమమీశ్వరం విదుః
(మాఘం 14వ సర్గ 62వ శ్లోకం)

ఇది భీష్మస్తవము, ఆది శూన్యుడూ, సర్వజ్ఞుడూ, జీవులను అనుగ్రహించడంకోసం దేహం ధరించినవాడూ, క్లేశకర్మఫలాలూ, వాటిభోగాలూ లేనివాడూ అయిన పురుష విశేషునే ఈశ్వరునిగా యోగులు నిరూపిస్తున్నారు. శ్రీమత్పతంజలి మహర్షి యోగదర్శనంలో ఇట్లా సూత్రించాడు.

సూ అవిద్యాస్మితా రాగద్వేషాభినివేశాః పంచక్లేశాః (2 3) అవిద్య, అస్మిత, రాగము, ద్వేషము, అభినివేశము అనేవి 5 క్లేశాలు.

సూ. "అనిత్యా శుచి దుఃఖానాత్మసు నిత్యశుచి సుఖాత్మ ఖ్యాతి రవిద్యా." (2 5) అనిత్యమైన వస్తువులపై నిత్యత్వబుద్ధీ, శుచిలేని వాటిపై శుచిత్వబుద్ధీ, దుఃఖంపై సుఖత్వబుద్ధీ, అనాత్మంపై ఆత్మత్వబుద్ధీ, కలిగిఉండటమే అవిద్య.

సూ. దృగ్దర్శనయో రేకాత్మతేవాస్మితా (2.6, "దృక్కు" అంటే చూసేవాడు ద్రష్ట దర్శనమంటే చూడటానికి కరణమైనది. బుద్ధి ఈ రెండింటికీ భేదంలేనిదే ఏకాత్మతా బుద్ధి 'అస్మిత.'

సూ. సుఖానుశయీ రాగః (2.7) సుఖమూ, దాని సాధనమూ వీటిపైనగల తృష్ణ-రాగము.

సూ. దుఃఖానుశయీ ద్వేషః (2.8) దుఃఖాలను ప్రతిఘటించాలనే క్రోధమే ద్వేషము.

సూ. స్వరసవాహీ విదుషోఽపి తథారూఢేఽభినివేశః (2 9) పూర్వజన్మ సంస్కారంవల్ల పండితునిలోకూడా ప్రసిద్ధమైన మరణాది భయమే అభినివేశము.

సూ. 'క్లేశమూలమ్ కర్మాశయోదృష్టాదృష్ట జన్మ వేదనీయః' (2.12) వర్తమాన జన్మము దృష్టము. భవిష్యత్ జన్మము అదృష్టం. ఈ జన్మల భోగమూలంచేత తెలియదగినది, క్లేశమూలమైనది అయిన పుణ్యాపుణ్యరూపము కర్మాశయము.

సూ. సతిమూలే తద్విపాకో జాత్యాయుర్భోగాః (2 13).

క్లేశంతోకూడిన కర్మాశయము విపాకఫలానికి కారణ మవుతుంది. జాతి (జన్మము), ఆయువు (జీవనకాలం), భోగం (సుఖదుఃఖాద్యనుభవము), అని విపాకము మూడువిధాలు.

సూ క్లేశకర్మ విపాకాశైర్య రపరామృష్టః పురుష విశేష ఈశ్వరః (1-24) ఇట్లాంటి అవిద్యాదులైన క్లేశాలూ, పుణ్య పాప కర్మలూ, తత్ఫలాలైన జాతిభోగాది విపాకాలూ, వాటిని వెంబడించే ఆశయాలూ (వాసనాప్రపంచం) వీటిచే మూడు కాలాల్లోనూ స్పృశించబడని పురుష విశేషుడే ఈశ్వరుడనే యోగదర్శన సిద్ధాంతాన్ని మల్లినాథుడు ఇక్కడ సప్రమాణంగా వివరించాడు.

వేదాంత దర్శనము

శ్లో॥ ఉదీర్ణరాగ ప్రతిరోధకం జనై
రభీక్ష్ణ మక్షుణ్ణతయాతి దుర్గమమ్
ఉపేయుషా మోక్షపథం మనస్వినః

స్త్వమగ్రభూమి ర్నిరపాయ సంశ్రయాః
(మాఘం 1వ సర్గ 52వ శ్లోకం)

చోరాది బాధలతో కూడిన దుర్గమారణ్యంలో ఉన్న బాటసారికి అపాయరహితమైన స్థానంవలె సంసార విషయక రాగద్వేషాలతో ప్రతిబంధకమై చేరడానికి దుర్గమమైన మోక్షమార్గాన్ని ప్రవేశించిన పరిశుద్ధ మనస్సు కలవానికి పునరావృత్తి రహితమైన గమ్యస్థానం "నీవే" అని నారదుడు శ్రీకృష్ణుని గురించి చేసిన స్తోత్రము.

శ్రీకృష్ణుడే మోక్షస్థానమనీ, అతణ్ణి చేరినవారికి పునరావృత్తిలేదనీ భావం.

"తమేవ విదిత్వాఽతి మృత్యుమేతి నాఽన్యః పంథావిద్యతేఽయనాయ" (శ్వేతాశ్వతరోపనిషత్తు) మోక్షాన్ని కోరేవాడు ప్రత్యగభిన్న పరబ్రహ్మాన్ని తన స్వరూపంగా తెలుసుకొని మృత్యువుని దాటుతాడు స్వస్వరూపప్రాప్తికి జ్ఞానమొక్కటి దప్ప వేరేమార్గం లేదు పరబ్రహ్మప్రాప్తే మోక్షం. "నస పునరావర్తతే" అట్లాంటి బ్రహ్మైక్యాన్ని పొందినవాడు తిరిగి సంసారబంధాల్లో చిక్కుకోడని ఉపనిషత్తులు చెబుతున్నాయి.

మల్లినాథుడు ఉపనిషత్తులను ఉదాహరించి తన వేదాంత దర్శన వేత్తృత్వాన్ని చక్కగా వెల్లడించాడు.

అలంకార శాస్త్రం

మేఘ సందేశం 1వ సర్గ 67వ శ్లోకం. దీనికి వ్యాఖ్యానం వ్రాస్తూ అనుకూలనాయకుని-స్వాధీనపతికను మల్లినాథుడు మనకు

పరిచయంచేస్తాడు; "అత్రకైలాసస్యానుకూల నాయకత్వ మలకాయాశ్చ స్వాధీనపతికాఖ్య నాయికాత్వంచధ్వన్యతే " ఏకాయత్తోఽను కూలఃస్యాత్ 'ఇతి ప్రియోపలాలితా నిత్యం స్వాధీ పతికామతా' ఇతి చలక్షయంతి, ఉదాహరన్తిచ, 'లోలయన్నలక ప్రాంతాన్ రచయన్ పత్రమంజరీః, ఏకాం వినోదయత్యాఙ్గంతాం ఛాయావదనువర్తతే' ఇతి. ఎంతో సుకుమారంగా వివరించాడు.

మేఘ సందేశం 1వ సర్గ 50వ శ్లోకం

అన్నిచోట్లా 'ఇవ' శబ్దం ఉపమావాచకంకాదు. అయినా కొందరు ఇవశబ్దంకనపడగానే అది 'ఉపమా' అని భ్రమపడుతున్నారు అని ఆ సందర్భాన్ని మల్లినాథుడు మనకు చూపుతున్నాడు. 'ముక్తాహారమివ' —ముక్తాహారమా అన్నట్లుగా ఉత్ప్రేక్ష్యంతే చూడగలరు. "అత్రాత్యంత నీలమేఘ సంగతస్య ప్రవాహస్య భూకంఠ ముక్తాగుణత్వే నోత్ప్రేక్షణాదు త్ప్రేక్షేవేయమితీవ శబ్దే వ్యజ్యతే. నిరుక్తకారస్తు-తత్ర తత్రోపమా యత్ర ఇవ శబ్దస్యదర్శనమ్. ఇతీవ శబ్దదర్శనాత్ అత్రా-ప్యుపమైవేతి బభ్రామ. అని నిరుక్తకారుని అవివేకాన్ని ఎత్తిచూపాడు అంతేకాక "మన్యేశంకే ధ్రువం నూనం ప్రాయ ఇత్యేవమాదయః ఉత్ప్రేక్షా వాచకాః శబ్దాః ఇవ శబ్దోఽపి తాదృశః"అని ఉత్ప్రేక్షావాచకపదాల్లో 'ఇవ'కూడా ఉంది ఈ విషయాన్ని గమనించకపోవడం నిరుక్తకారుని ప్రమాదంగాని, భ్రమ కాని కాకతప్పదు.

మేఘసందేశం 1వ సర్గ 34వ శ్లోకం

ఉజ్జయినీ ప్రదేశంలో "వత్సరాజైన ఉదయనుడు ప్రద్యోతుని ప్రియపుత్రిక వాసవదత్తను హరించాడు ఇక్కడే ప్రద్యోతుని బంగారు తాళవృక్షవనం ఉండేది. నళగిరిఅనే ఏనుగు కట్టుకొయ్యను ఊడ బెరికి యథేచ్ఛగా తిరిగేది"అని ఈవిధంగా పూర్వకథా కోవిదు

లైన వృద్ధులు ఇంటికివచ్చిన దూరదేశపు బంధువుల్ని వినోదింప చేస్తారు అని వివరిస్తూ మల్లినాథసూరి ఇదిభావి కాలంకార మవుతుంది అని చెబుతాడు తదుక్తమ్—'అతీతానాగతం యత్ర ప్రత్యక్షత్వేన లక్ష్యతే అత్యద్భుతార్థకథనాత్ భావికం తదుదాహృతమ్" ఇతి. ఏదో చాలా ఉంది అనుకొనేచోట అందరూ విపులంగా వివరిస్తారు పెద్దగా వ్యాఖ్యానిస్తారు కాని మల్లినాథుడు చిన్నవిషయాల్లోకూడా సుకుమార భావాన్ని పరిశీలించి మనోహరమైన వివరణంచేస్తాడు. భావికాలంకారం ఇక్కడ ఎంతసుకుమారంగాసుందరంగా "ఇత్యాగతాన్ రమయతిజనో యత్ర బంధూనభిజ్ఞః"అనే దాన్లోంచి గ్రహించాడో చూస్తే మల్లినాథుని ప్రతిభ గోచరమవుతుంది.

మల్లినాథసూరికి అలంకారశాస్త్రంలో కూడా ప్రగాఢమైన వ్యుత్పత్తి ఉంది. దానికి ఆతని వ్యాఖ్యానాలే తార్కాణం.

మమ్మటుడూ, రుయ్యకుడూ, దండీ జయదేవుడూ వామనుడూ, విద్యానాథుడూ మొదలైన వారందరూ అలంకారాలన్నీ వేరువేరుగా నిర్వచించారు మల్లినాథుడు తన వ్యాఖ్యానాల్లో ఏదో ఒక్కరి నిర్వచనాలనుగాక అందరి లక్షణాల్ని భిన్నభిన్నస్థలాల్లో ఉదాహరించాడు. భోజుని ఒక్కచోట, మరోచోట సింగభూపాలుని స్మరించాడు అలంకారికులందరికీ ఉచిత మర్యాదలిచ్చి గౌరవించాడు.

"వాగర్థా వివసంపృక్తౌ" అనేశ్లోకంలో ఉపమాలంకారంచెప్పి ప్రతాపరుద్రీయ శోభూషణ లక్షణం ఉదాహరించాడు.

విద్యానాథుడూ, మమ్మటుడూమొదలైనవారందరూ ఉత్ప్రేక్షాలంకారలక్షణాన్ని నిర్వచించినవారే కాని మల్లినాథుడు"అస్త్యుత్తరస్యామ్" అనేశ్లోకంలో ఉత్ప్రేక్షాలంకారముందని చెప్పి దానికి అలంకార సర్వస్వంనుంచి లక్షణం పేర్కొన్నాడు.

ఇట్లా వివిధ లాక్షణికుల లక్షణాలను వివిన్న స్థలాల్లో పేర్కోవడం కేవలం పాండిత్య ప్రదర్శనంకోసమే అని భావించడం సబబుకాదు. ఎందుకంటే కొందరు ఆలంకారికులు కొన్ని అలంకారాల సూక్ష్మాతిసూక్ష్మ భేదాలను అంతగా వివరించలేదు. మల్లినాథుడు అలంకారాలలోని అతిసూక్ష్మ భేదాలను కూడా గుర్తించ గల ప్రతిభావంతుడు కావడంవల్ల ఆయా సూక్ష్మభేదాల్ని విశిష్టంగా చెప్పిన ఆలంకారికుల లక్షణాలనే ఆయా సందర్భాలలో అతడు చెప్పాడు అనుకోవాలి.

దినేదినే సాపరివర్ధమానా
లబ్ధోదయా చంద్రమసీవ రేఖా
పుపోష లావణ్యమయాన్ విశేషాన్
జ్యోత్స్నాంతరాణీవ కళాంతరాణి

ఈ శ్లోకంలో పార్వతీదేవి చంద్రరేఖవలె దినదినాభివృద్ధి చెందుతూందని వర్ణింపబడింది. అందువల్ల ఇది ఉపమాలంకారమని చెప్పి ఎవరి లక్షణాన్నో ఉదాహరించవచ్చు కాని అట్లా చెప్పి ఊరుకోవడం అలంకారశాస్త్రంతో గాఢ పరిచయమున్న మల్లినాథుని మతంకాదు అతడు ఇక్కడ ఆచార్య దండి లక్షణాన్ని పేర్కొన్నాడు. దండి తన కావ్యాదర్శంలో ఉపమాలంకార సూక్ష్మాతి సూక్ష్మ ప్రభేదాలను చెప్పి ఉన్నాడు 'అనేకేవ' శబ్దాలుంటే 'వాక్యార్థోపమ' అని పేర్కొన్నాడు. ఈ శ్లోకంలో ఆ లక్షణం ఉందని మల్లినాథుడు పేర్కొంటూ "ఇయమనేకేవ" శబ్దం హ్వాక్యార్థోపమేత్యాహ దండీ తల్లక్షణంతు

వాక్యార్థేనైవ వాక్యార్థః కోఽపియద్యుపమీయతే
ఏకానేకేవ శబ్దత్వాత్ సావాక్యార్థోపమామతా

అని వివరించాడు.

అలంకార శాస్త్రమర్యాదల్ని చక్కగా ఆకళించుకొన్నాడు కాబట్టి మల్లినాథుడు శ్లేష, శబ్దశక్తి మూలధ్వని, వాచ్యసిద్ధ్యంగాది నిరూపణ సందర్భాలలో ఎక్కడా పొరపాటుపడడు ,

మల్లినాథుడు ధ్వనికీ, గుణీభూతవ్యంగ్యానికీ ఉన్న భేదాన్ని కూడా స్పష్టంగా కుమారసంభవంలో కింది శ్లోకంలో ఎట్లా వివరించిందీ చూద్దాం.

కుబేరగుప్తాం దిశముష్ణరశ్మౌ
గంతుం ప్రవృత్తే సమయం విలంఘ్య,
దిగ్దక్షిణా గంధవహాం ముఖేన
వ్యళీకనిశ్వాస మివోత్ససర్జ.

వసంత విజృంభణాన్ని కవి వర్ణిస్తున్న సందర్భం ఇది. సూర్యుడు ఉత్తరదిక్కుకు పోతూండగా దక్షిణదిక్కు దుఃఖంతో నిట్టూర్చినట్లు గాలి వీచిందని దీని భావం. ఇక్కడ శబ్ద శక్తిమూలకమైన అర్థాంతరం కూడా ఉంది. అయితే ఆ వ్యంగ్యార్థం వాచ్యమైన ఉత్ప్రేక్ష సిద్ధించడానికి సాధకం కావడంవల్ల ఇది ధ్వనికాక వాచ్య సిద్ధ్యంగంగా వ్యవహృతమవుతూ ఉంది.

మల్లినాథుడు ఇతరాలంకార శంకా నివృత్తిచేస్తూ సహేతుకంగా ఈ విషయాన్ని ఉపపాదిస్తాడు అతని వ్యాఖ్యానం

అత్రోత్ప్రేక్షాలంకారః సచ సమాసోక్తి రేవేయ ముత్ప్రేక్షానుప్రవిష్టేతి శంకనీయమ్. కేవల విశేషణసామర్థ్యాదేవ అప్రస్తుత ప్రతీతా సోక్తిష్ఠతే. అత్రతు దక్షిణేతి సామర్థ్యాదపి నాయికా ప్రతీయతే నచ శ్లేషఏవ ప్రకృతాప్రకృత విషయః ఉభయశ్లేషే శ్లిష్టవిశేష్యానంగీకారాత్ తస్మాత్ శబ్దశక్తిమూలోఽయంధ్వనిః సచవ్యళీక నిశ్వాస రూపచేతనధర్మసంభావనార్థం దక్షిణస్యదిశః నాయికయా సహాభేదమాపాదయన్ భేదేఅభేద లక్షణాతి శయోక్త్యుపజీవనం. నిశ్వాసమివేతి వాచ్యోత్ప్రేక్షాంనిర్వహతీతివాచ్యం సిద్ధ్యంగభూత ఇత్యుత్ప్రేక్ష్యామః.

ఇంక ఔచిత్య చర్చ మల్లినాథుడెట్లాచేసింది పరిశీలిద్దాం.

శ్లో॥ ఏవం వాదిని దేవర్షౌ
పార్శ్వే పితురధో ముఖీ
లీలా కమలపత్రాణి
గణయా మాస పార్వతీ

ఈ శ్లోకం కుమారసంభవ కావ్యంలోనిది ఎందరో దీన్ని వ్యాఖ్యానించారు. చాలామంది లజ్జా భావ ధ్వనికి దీన్ని ఉదాహరించారు. కాని మల్లినాథుడు ఈ శ్లోకంలో 'అవహిత్థా' భావ ధ్వనిని పేర్కొన్నాడు. వాస్తవంగా అధోముఖత్వంలో వ్యక్తమయ్యే లజ్జా భావం కన్నా లీలాకమలపత్రగణనరూప ప్రధాన క్రియచేత అభివ్యక్తమయ్యే "అవహిత్థా భావానికే" ప్రాధాన్యమివ్వడంలో ఎంతో ఔచిత్యం ఉంది

శ్రుతులు

యజ్ఞానికి దక్షిణవలె దిలీపునికి సుదక్షిణాదేవి పత్నిగా ఉందని కాళిదాసు చెప్పాడు యజ్ఞానికి దక్షిణ భార్య అనడానికి వేద ప్రామాణ్యాన్ని చూపిస్తూ మల్లినాథుడు "యజ్ఞో గంధర్వస్తస్య దక్షిణా అప్సరసః", "తేనక్షం తే దక్షిణాం ప్రతిగృహ్య" అనే శ్రుతి వాక్యాలనెంతో సందర్భశుద్ధిగా ఉదాహరించాడు

కుమారసంభవం 3వసర్గ 7వ శ్లోకం మల్లినాథుడు వ్యాఖ్యానించినతీరు పరిశీలించదగినది. ఇంద్రుడు మన్మధుని పిలిపించగా మన్మధుడు "ఏ యేకపత్నీని నీకు స్వాధీనం చేయాలి!" అని ప్రశ్నిస్తాడు ఆ సందర్భంలో మల్లినాథుడు ఇంద్రుని శీలాన్ని బయటిపెడతాడు "త్వదర్థే పతివ్రతామపి వ్రతాద్భ్రంశయిష్యామీత్యర్థః ఏతచ్చేంద్రస్య పారదారికత్వాదుక్తమ్. తథాచ శ్రుతిః "అహల్యాయై జారః" ఇతి అని శ్రుతిప్రామాణ్యాన్ని చూపిం

చాడు. అధికారులలో ఉండే బలహీనతపరిజనానికి ఎట్లాంటి అలుసు ఇస్తుందో దీనిలో మన్మథుని సాహసవచనాలు వెల్లడిస్తున్నాయి.

రఘువంశం 2వసర్గ 1వ శ్లోకంలో "జాయా ప్రతిగ్రాహిత గంధమాల్యాం" అనేచోట కవి సుదక్షిణాదేవి పట్ల "భార్య" మొదలైన శబ్దాలు వాడకుండా "జాయా" శబ్దం వాడటంలోని సారస్యాన్ని మల్లినాథుడు ఇట్లా వివరిస్తాడు. త్వరలో సుదక్షిణా దేవి కుమారుణ్ణి కంటుందనే భావాన్ని 'జాయా' శబ్దం స్ఫురింప జేస్తూ ఉందంటూ 'జని ప్రాదుర్భావే' పతిర్జాయాం సంప్రవిశతి గర్భో భూత్వేహమాతరం, తస్యాం పునర్నవోభూత్వా దశమే మాసి జాయతే" "తజ్జాయా జాయా భవతి యనస్యాం జాయతేపునః" అని ఐతరేయ బ్రాహ్మణంలోని వాక్యాలు ఉదాహరించాడు. సుదక్షిణాదేవి 'జాయ'కాబోతున్నదనే ధ్వనిని మనకు చూపాడు.

ధర్మశాస్త్రము:—

కుమార సంభవములో మైనాక జన్మ వృత్తాంత సార్థక్యాన్ని వివరిస్తూ మల్లినాథుడు "పితా నజ్ఞాయతే యస్యా, భ్రాతా యది నవిద్యతే. నోపయేచ్ఛేత్తుతాం కన్యాం, ధర్మలోప భయాత్ సుధీః" "యస్యాస్తు నభవేద్భ్రాతా, నవిజ్ఞాయేత వాపితా, నోపయేచ్ఛేత తాం ప్రాజ్ఞః, పుత్రికా ధర్మశంకయా!" ఇత్యభ్రాతృకకన్యా పరిణయ నిషేధాత్" అని ధర్మశాస్త్రాన్ని ప్రమాణంగా చూపుతాడు. పార్వతికి లేక పోతే అదో లోపమవుతుందని మల్లినాథుడు చెప్పకపోతే మైనాక వృత్తాంతం అప్రస్తుతమని మనకు తోస్తుంది

రఘువంశంలో సుదక్షిణా దిలీపులు వసిష్ఠాశ్రమం చేరారు. అప్పుడు వసిష్ఠ మహాముని అగ్ని హోత్రానుష్ఠానంలో ఉన్నాడు. అది ముగిసిన పర్వాతనే మునికి రాజదంపతులు నమస్కరించారు. ధర్మ శాస్త్ర నిర్ణేతఅయిన మల్లినాథుడు కవి హృదయాన్ని ఇట్లా

ఆవిష్కరించాడు. "జపం హోమంచ కుర్వాణో నాభివాద్యో ద్విజై ర్భవేత్" ఇత్యనుష్ఠాన మధ్యేఽభివాద నిషేధాత్" అని మల్లినాథుడు వ్యాఖ్యానించకపోతే అనుష్ఠాన విఘ్నం కలిగించడం ఇష్టంలేక డలీపుడు వేచి ఉన్నాడని మాత్రం మనము భావిస్తాం. అంతేకాని దేవతారాధనలో ఉన్నవాడు. అభివాదం స్వీకరించడం దేవతాపచారమనే మహత్తరభావం మనకు స్ఫురించదు

వైద్య శాస్త్రము:—

మాఘం 2వ సర్గ 96వశ్లోకంలో వైద్యశాస్త్ర రహస్యం ఇమిడి ఉంది.

సామ దాన, భేద, దండోపాయాల్లో నాలుగోదైన దండాన్నే ఉపయోగించి సాధించవలసిన శత్రువు మీద సామం ఉపయోగించడం వల్ల హాని కలుగుతుంది స్వేదనిర్గమనంచేత తగ్గింపదగిన ఆమ జ్వరాన్ని నీటితో ప్రాజ్ఞుడు తగ్గించడానికి ప్రయత్నిస్తాడు. నీరుతగిలితే ఆమజ్వరం ప్రకోపిస్తుంది అట్లాగే సామంప్రయోగిస్తేశత్రువు రెచ్చిపోతాడు. దండమే ప్రయోగించాలి. ఇక్కడ మల్లినాథుని వచనాలు చూద్దాం

"నను సామాది సుకరోపాయము పేక్ష్యకింపాతిక సిద్ధినా దండేన యథాహ మనుః " సామ్నా భేదేన దానేన సమస్తై రథవా పృథక్ విజేతుం ప్రయతే తారన్నయుద్ధేన కదాచనే"తి దండసాధ్యేరిపౌ సామ అపక్రియా స్వేద్యం ఆమజ్వరం ప్రాజ్ఞః కః అంభసా పరిసించతి, నకోఽపీత్యర్థః. జ్వరితస్యాం భస్సేక వత్శుక్రద్ధస్య సాంత్వం ఉద్దీపకం స్యాత్. అతో దండ్య ఏవేతి భావః " అని వైద్యశాస్త్రాన్ని ఉదాహరిస్తాడు

'రాజయక్ష్మ' గురించి చెబుతూ మల్లినాథుడు వాహట వచనాన్ని ఉదాహరిస్తాడు:- "అనేక రోగానుగతో బహురోగ పురో

గమః రాజయక్ష్మా క్షయ శోషః రోగరాడితి చస్మృతః." నక్షత్రాణామ్ ద్విజానామ్ రాజ్ఞోఽభూద్యదయం పురా, యచ్చ రాజాచ యక్ష్మాచ రాజయక్ష్మాతతోమత' ఇతి. అతోదుర్జేయ ఇతిభావః. అని శిశుపాలుణ్ణి రాజయక్ష్మతో పోల్చే సందర్భంలో వ్యాఖ్యానిస్తాడు.

జ్యోతి శాస్త్రము:—

రఘువంశం 3వసర్గ 13వ శ్లోక రఘువు పంచగ్రహాలూ ఉచ్చలో ఉండగా జన్మించడం రఘువుకు దేవ తుల్యత్వం సూచిస్తుందని మల్లినాథుడు కృషీయమనే జ్యోతిషగ్రంథం నుంచి ప్రమాణం చూపాడు. అంతేకాక వరాహమిహిర బృహజ్జాతక, లఘుజాతక, రాజమృగాంక, కూటస్థీ యాలనుంచి ఉదాహరించాడు.

మన్మథుడు శివదృష్టిని పురశ్శుక్ర ప్రవేశంలా తప్పించుకొన్నాడని కాళిదాసుచెప్పాడు. దీన్ని వివరిస్తూ మల్లినాథుడు.

శ్లో. ప్రతిశుక్రం ప్రతిబుధం
ప్రత్యంగారక మేవచ,
అపి శక్ర సమోరాజా
హతసైన్యో నివర్తతే

అనే జ్యోతిషశ్లోకాన్ని ఉదాహరించాడు.

మాఘం 13వ సర్గ. 22వ శ్లోకం. భీముడూ అర్జునుడూ ఇరువైపులా ఉండగా శ్రీకృష్ణుడు రెండుగ్రహాలమధ్యఉన్న దురుధరాయోగాన్ని పొందిన చంద్రుడిలా ప్రకాశించాడు అని చెప్పినచోట మల్లినాథుడు జ్యోతిశ్శాస్త్రోదాహరణలు చాలా ఇచ్చాడు. కొన్ని ఉదాహరణలు చూద్దాం.

శ్లో. "రవివర్జ్యం ద్వాదశగై రనఫా చంద్రాద్ద్వితీయగైస్సునఫా
ఉభయస్థితైర్దురుధరా కేమద్రుమ సంజ్ఞకోఽతోఽన్యః"

ఉత్పన్న భోగసుఖభుగ్ధన వాహనాఢ్య
స్త్యాగాన్వితో దురు ధరా ప్రభవః సుభృత్యః.

అని వరాహమిహిరాచార్యులు దురుధరా యోగ జాతకుని గురించి చెప్పాడు. ఇదే విషయాన్ని ఇంకా వివరిస్తూ —

వాగ్బుద్ధి విక్రమగుణైః ప్రథితః పృథివ్యాం
స్వాతంత్ర్య సౌఖ్యధనవాహన భోగ భోగీ
దాతా కుటుంబ జనపోషణ లబ్ధఖేదః
సద్వృత్తవాన్ దురుధరా ప్రభవో ధురిస్థః.

ఈ యోగం పట్టినవాడు అంటే జాతకచక్రంలో చంద్రునికి రెండు వైపులా (కవితప్ప) గ్రహాలుఉన్నవాడు ధనవాహనాలు కల వాడూ, భోగీ, సుఖీ, త్యాగీ, వాగ్బుద్ధులచేత, విక్రమంచేతలోకంలో కీర్తిపొందేవాడు బహుకుటుంబజనులు కలవాడూ, మంచి శీలం కల వాడూ, స్వాతంత్ర్య జీవనంకలవాడూ అవుతాడు. ఇది దురుధరా యోగలక్షణం. ఈవిధంగా ఏశాస్త్రానికి అశాస్త్రమే మల్లినాథునికి కొట్టినపిండిగా నల్లేరుమీదబండిగా సాగిపోతూ ఉంటుంది.

సాముద్రికము :

కుమారసంభవం 1వ సర్గ 33వ శ్లోకం వ్యాఖ్యలో "అత్ర సాముద్రికాః: యస్యారక్తతలౌ పాదౌ పున్నతౌ గ్రౌతలస్పృశౌ, నిగూఢగుల్ఫౌ నిహితౌ సాస్యాన్న్యపతి సమ్మతా" పార్వతీదేవి సౌందర్యాన్నివర్ణిస్తూ ఆమె పాదాలు రక్తకాంతులు చిందుతున్న, సంచలించే మెట్టతామరల్లా ఉన్నాయంటూ ఎర్రని పాదాలుండడం మహారాణి లక్షణమని సాముద్రికశాస్త్రాన్ని ఉదాహరించాడు.

మేఘసందేశంలో 2వ సర్గ 21వశ్లోకం వ్యాఖ్యానంలోకూడా మల్లినాథుడు సాముద్రికశాస్త్రాన్ని ఉదాహరించాడు.

"శిఖరిదశనా. ఏతేనాస్యా భాగ్యవత్త్వం పత్యాయుష్కరత్వం సూచ్యతే తదుక్తం సాముద్రికే:— "స్నిగ్ధాః సమాః సరూపాః

సుపంక్తయః శిఖరిణో౽ శ్లిష్టాః దంతాభవంతియాసాం తాసాంపాదౌ జగత్స్రగ్వం, తాంబూలరసరక్తే౽పి స్ఫుటభాసః సమోదయాః, దంతాః శిఖరిణో యస్యాశ్చిరం జీవతి తత్పతిః" ఇతి "చకిత హరిణీ ప్రేక్షణా-ఏతేనాస్యాః పద్మినీత్వం వ్యజ్యతే

శకున శాస్త్రము

మేఘసందేశం 2వ సర్గ 34వ శ్లోకం వ్యాఖ్యానం పరిశీలిద్దాం. నిమిత్తనిదానే:- 'స్పందాస్మూర్ధ్ని చ్ఛత్రలాభం లలాటే పట్టమంశుకమ్, ఇష్టప్రాప్తి దృశో రూర్ధ్వమపాంగే హానిమాదిశేత్' 'వామభాగస్తునారీణాంపుంసాం శ్రేష్ఠస్తుదక్షిణః దానే దేవాదిపూజాయాం స్పందే౽ లంకరణ్నేపిచ. ఇతిస్త్రీణాం వామభాగ ప్రాశస్త్యాత్, ఇష్టప్రాప్తి కలుగుతుందన్నాడు

మేఘసందేశం 1వ సర్గ 9వ శ్లోకంలో మరో ఉదాహరణ ఉంది. 'అనుకూలవాత, చాతకరుత బలకాదర్శనానాం శుభసూచకత్వం శకునశాస్త్రేదృష్టమ్' 'తత్తువిస్తరభయాన్న లిఖతమ్'అని అన్నాడు.

అట్లాగే 1వ సర్గ 17వ శ్లోకంలో మరో విషయం ఇట్లా చెప్పాడు "ప్రథమావసథేయస్య సౌఖ్యం తస్యాఖిలే౽ ధ్వని శివం భవతి యాత్రాయామన్యథాత్వ శుభంధ్రువమ్" ఇతి.

కిరాతార్జునీయం 6వ సర్గ 3వ శ్లోక వ్యాఖ్యానం పరిశీలిస్తే శకున శాస్త్రవిషయాలు మల్లినాథుడిట్లా చెప్పినట్లు తెలుస్తుంది.

నివాతప్రదేశంలో ఎదురుగా గాలివీచడం శుభసూచకం అని మల్లినాథుడు వివరిస్తూ "వాతాహతమర్జునం సఖాయః సఖాయమివ అభిముఖమేత్య ఆలింగితవంతః" నివాతప్రదేశే౽భిముఖ వాయుస్సిద్ధి సూచకః"అన్నాడు.

సంగీత శాస్త్రము

కుమారసంభవ కావ్యంలో సంగీతశాస్త్ర రహస్యాలున్నాయి కావ్యపాఠాలు శిష్యులకు చెప్పే విద్వాంసులు వ్యాఖ్యల్లోఉన్న

సంగీత శాస్త్రవిషయాల్ని అజ్ఞాతాలనో అప్రస్తుతాలనో తోసివేస్తారు. మల్లినాథునికి అజ్ఞాతశాస్త్రమే లేదనిపిస్తుంది.

'ఉద్గాస్యతామిచ్ఛతి కిన్నరీణాం' అనేచోట 'ఉత్'అనే ఉపసర్గ ప్రయోగానికి మల్లినాథుడు సార్థక్యాన్ని చూపుతాడు. 'ఉద్గాస్యతాం దేవయోనిత్వాత్ ఉచ్చైర్గాంధార గ్రామేణగానం కరిష్యతాం ఉక్తంచనారదేన.'

షడ్జమధ్యమనామానౌ గ్రామౌ గాయంతి మానవాః
నతు గాంధారనామానం సలభ్యోదేవయోనిభిః.

అని వివరణచేస్తాడు.

పంచమ, ఋషభాలు ప్రాతఃకాలంలో నిషిద్ధాలని చెబుతూ మల్లినాథుడు దానికి ప్రమాణంగా భరతుని ఉదాహరించాడు. పంచమాది నిషేధే భరతః — "ప్రభాతే సుతరాంనింద్య ఋషభః పంచమోఽపిచ జనయేత్పృథనం హ్యుత్తాపంచత్వం పంచమోఽపిచ" ఇత్యాది. ఈ విధంగా కాలానుగుణంగా ఏవి ఎప్పుడు పాడుకోవాలో చెబుతూ నియమోల్లంఘనంవల్ల సంభవించే హానికి శాస్త్ర ప్రమాణం చూపాడు.

గ్రామలక్షణం చెప్పేటప్పుడు స్వరసందోహం గ్రామ మంటారని చెప్పాడు. అది మూడు రకాలన్నాడు. మూర్ఛనా లక్షణం చెబుతూ ఒక్కొక్క గ్రామానికే ఏడేసి మూర్ఛనలు ఉంటాయని అందుచేత అవి మొత్తం 21రకాలని అన్నాడు. 'నానపేక్షితముచ్యతే' అనే తన ప్రతిజ్ఞకు భంగంకలగకుండా "తత్ర తన్నామాని ప్రతిజ్ఞా భంగభయాత్ నలిఖ్యంతే. ఇతి సర్వమవదాతమ్ అని పూర్తిచేశాడు.

నాట్య శాస్త్రము

మాఘం 2వ సర్గ 8వ శ్లోకంలో బలరామ, ఉద్ధవులతోమంత్రాలోచన చేసేటప్పుడు మొదట శ్రీకృష్ణుడు పలికినమాటలు.

నాటికంలోని కథావస్తువుకు పూర్వరంగం ఎట్లాంటిదో అలాగే నా మాటలు మీరు చెప్పబోయే నీతివాక్యాలకు పూర్వరంగంగా ఉప కరిస్తుందని శ్రీకృష్ణుడు అన్నాడు ఇక్కడ మల్లినాథుడు.

శ్లో. యన్నాట్య వస్తునః పూర్వం రంగ విఘ్నోపశాంతయే
కుశీలవాః ప్రకుర్వంతి పూర్వరంగః ప్రకీర్తితః

అని వసంత రాజీయాన్ని ఉదాహరించాడు.

మాఘం 13వ సర్గ 66వ శ్లోకం వ్యాఖ్యానిస్తూ మల్లినాథుడు నృత్య, నృత్తభేదాల్ని వివరించాడు. ఈ సందర్భంలో దశరూపకం నుంచీ, కాళిదాసునుంచీ ఉదాహృతులు చూపాడు. 'అత ఏవ కాళి దాసోఽపి అంగసత్త్వవచనాశ్రయమ్ మిథంస్త్రీషు నృత్యముపధాయ దర్శయన్. తథోక్తందశరూపకే:- భావాశ్రయంతు నృత్యం స్యాత్ నృత్తంతాళల యాశ్రయమ్, ఆద్యం పదార్థాభినయో మార్గోదేశీ తథాపరః' ఇత్యాది.

శృంగార శాస్త్రము

మేఘసందేశం 1వ సర్గ 25వ శ్లోకం వ్యాఖ్యానిస్తూ శృంగార శాస్త్రానికి మల్లినాథుడిచ్చిన ఉదాహృతులు చూద్దాం.

"కామినామధరాస్వాదః సురతాదతిరిచ్యతే."

ఇట్లే ఈ కింది వ్యాఖ్యాన ఉదాహృతులు కూడా పరిశీలించవచ్చు.

1వ సర్గ 29వ శ్లోకం. హి. స్త్రీణామేషస్వభావో యద్విలాసై రేవరాగ ప్రకాశనం నతుకంఠత ఇతిభావః. విభ్రమశ్చాత్ర నాభి దర్శనాది రుక్త ఏవ.

1వసర్గ 32వ శ్లోకంలో "సంవాహ్యం తేచ సురతశ్రాంతాః ప్రియైర్యువతయః."

2వసర్గ 21వ శ్లోకం. అనేన నారీణాం నాభిగాంభీర్యాన్మధ్య రసాతిరేక ఇతికామ సూత్రార్థః సూచ్యతే.

2వసర్గ 36వ శ్లోకం. "శక్తయోరేకవార సురతస్య యామావధికత్వాత్స్వప్నేఽపి తథా భవితవ్యమిత్యభిప్రాయః. తథాచరతి రహస్యే — ఏకవారావధిర్యామో రతస్య పరమోమతః. చండ శక్తి మతోర్యూనోరుద్భట క్రిమవర్తినోః" ఇతి.

1వసర్గ 3వ శ్లోకం. విరహిణాం మేఘదర్శనం కామాది వికారోద్దీపనమితిభావః.

1వసర్గ 16వ శ్లోకం. యథాకశ్చిద్బహువల్లభఃపతిః కుత్రచిత్ క్షేత్రే గూఢం విహృత్య దాక్షిణ్యాభంగభయాత్ నీచమార్గేణ నిర్గత్య పునః పర్యావృత్తః ఇవ సంచరతి తద్వదితిధ్వనిః. దీనివల్ల మల్లినాథుని లోకజ్ఞత ఎంత సునిశితమో తెలుస్తూ ఉంది.

1వసర్గ 18వ శ్లోకం తథాపరిశ్రాంతః కశ్చిత్కామీ కామిన్యాః కుచకలశే విశ్రాంతస్సన్ స్వపితి తద్వద్భవానపి భువో నాయికాయాః స్తన ఇతిధ్వనిః.

మేఘ సందేశం 2వసర్గ 32సర్గ శ్లోక వ్యాఖ్యానం మల్లినాథుడు శృంగారశాస్త్రంపై ఉపన్యాసమే ఇచ్చాడనిపిస్తుంది.

సంభోగో విప్రలంభశ్చ ద్విధాశృంగార ఇష్యతే
సంయుక్తయోఽస్తు సంభోగః విప్రలంభో వియుక్తయోః
పూర్వానురాగ మానాఖ్య ప్రవాస కరుణాత్మనా
విప్రలంభశ్చతుర్థాత్ర ప్రవాసస్తత్రచత్రిధా
కార్యతః సంభ్రమాచ్ఛాపాదస్మిన్ కావ్యేతు శాపజః
ప్రాగసంగతయోర్యూనోఃసతి పూర్వానురంజనే
చక్షుః ప్రీత్యాదయోఽవస్థాదశస్యుస్తత్క్రమోయథా
దృఙ్మనస్సంగ సంకల్పా జాగరః కృశతాఽరతిః
హ్రీత్యాగోన్మాద మూర్ఛాంతా ఇత్యనంగదశా దశ
పూర్వసంగతయో రేవ ప్రవాసఇతి కారణాత్

న తత్ర పూర్వవత్ చక్షుః ప్రీతిరుత్పత్తుమర్హతి.
హృత్సంగస్యతు సిద్ధస్యాప్య విచ్ఛేదోఽ త్రవర్ణ్యతే
అన్యాశ్చ పూర్వవద్వా చ్యా ఇతితావత్ వ్యవస్థితిః
వైయర్థ్యాదాదిమాం హిత్వావైరస్యాదంతిమాం తథా
హృత్సంగాది రిహోచష్ట కవిరష్టావితి స్థితిః
మత్వాస్యదృశ్యం లిఖంతీతి పద్యేఽస్మిన్ ప్రతిపాదితా
చక్షుఃప్రీతిరితిప్రోక్తం నిరుత్తరకృతానతత్
చక్షుః ప్రీతిర్భవేచ్చిత్రేష్వదృష్ట చరదర్శనాత్.
యథాంమాలవికా రూపమగ్నిమిత్రస్య పశ్యతః
ప్రోషితానాంచ భర్తౄణాం క్వదృష్టాఽదృష్టపూర్వతా
అథత్రాపి సందేహే స్వకలత్రాణి పృచ్ఛతు
కింభర్తృ ప్రత్యభిజ్ఞాస్యాత్కిం వైదేశిక భావనా.
ప్రవాసాదాగతే స్వస్మిన్నిత్యలం కలహైర్వృతా ఇతి.

పై విధంగా మల్లినాథుడు శృంగారశాస్త్రంలో తనకుగల సంపూర్ణ పాండిత్యాన్ని వెల్లడించాడు హాస్యచతురతకు కూడా ఇతనిలో కొదువలేదు. విషయాన్ని వివరిస్తూ "అత్రాపి సందేహే స్వకలత్రాణివృచ్ఛతు" అని ఒక విసురు విసురుతాడు.

అశ్వశాస్త్రము

మాఘకావ్యం 5వసర్గ 60వ శ్లోక వ్యాఖ్య.

అశ్వాల స్వభావాన్ని, ధారల గురించీ మల్లినాధుడు చాలా విశేషాలు చెప్పాడు. ఇక్కడ భోజరాజు హయలీలావతిని, రేవతోత్తరం మొదలైన అశ్వశాస్త్రాల్ని ఉదాహరిస్తాడు.

ధారాః-గతిభేదాః. "అశ్వానాంతుగతిర్ధారా విభిన్నాసాచ పంచధా, ఆస్కందితం, ధౌరితకం, రేచితం, వల్గితం, ప్లుతమ్. గతయోఽమూఃపంచధారా ఇత్యమరః. అశ్వశాస్త్రేతు. సంజ్ఞాంత

రేణోక్తాః; గతిఃప్లుతాచతుష్కాచ తద్వన్మధ్యా జవాపరా, పూర్ణవేగా తథాచాన్యా పంచధారాః ప్రకీర్తితాః. ఏకైకా త్రివిధాధారా హాయ శిక్షావిధౌమతాః, లఘ్వీమధ్యా తథా దీర్ఘా జ్ఞాత్వైతా యోజయే త్క్రమాత్ ఇతి. తథాచ పంచదశ విధాభవంతితాః పంచదశవిధ ధారాః. ప్రసాధయితుమ్ పరిచేతుం నవసు వీథిషు సంచార స్థానేషు గమయాంబభూవ, పీఠయోనవాశ్వానాంధారా, దార్ఢ్యార్థాః పరిమితాః ప్రచారదేశాః తాశ్చ త్రిస ఇత్యేకే నవేత్యన్యే తత్రోత్తర పక్షమాశ్రిత్య కవినా నవస్విత్యుక్తం. యథాహ భోజరాజః "వీథ్యస్తిస్రోఽథ ధారాణాం లఘ్వీ మధ్యోత్తమాః క్రమాత్, తాసాం స్యాద్ధనుషాం మానమశీతిన్నవతిశ్శతమ్, శ్రేష్ఠ మధ్యోత్త మానాంతు వాజినాం వీథికాస్స్మృతాం, నవాన్యాః కథితా వీథ్యో రుష్టానాం క్రమణక్రమే. అన్యేషామపి సర్వత్రగతి దార్ఢ్యార్థమీరి తాః సమోన్నతా సా విషమాంబుకీర్ణా శుద్ధా నతాగ్రా తృణ వీరుదాఢ్యా, స్థాణుప్రకీర్ణోపల సంప్రకీర్ణా పాంశ్వాన్వితోక్తా నవధేతి వీథ్యః. సర్వవీథిషు యోవాజీ దృఢశిక్షాసమన్వితః తేన రాజా రణేనిత్యం మృగయాయామ్ ముదంవ్రజేత్ ఇతి. అన్యేతు గతివిశేషా వీథయ ఇత్యాహుః—"ఉరశ్చాలీ శిరశ్చాలీ పృథులో మధ్యమానకః, ఆలీఢశ్శోభనైరంగైః ప్రత్యాలీఢ స్తథాపరః, ఉపధే నవడక్తంచ పాదచాలీచ సర్వగః నిర్దిష్టా వీథయస్త్వేతాః...ఇతి. అని తన అశ్వశాస్త్ర పాండిత్యాన్ని వెల్లడించాడు.

గజశాస్త్రము

మాఘం 5వసర్గ 41వ శ్లోకం వ్యాఖ్యానంలో మల్లినాథుడు గజశాస్త్రవేత్తృత్వాన్ని వ్యక్తం చేశాడు. చర్మం తెగినా రక్తం కారుతున్నా మాంసం తెగిపడుతున్నా తన్ను తాను తెలియని క్షణం కలిగిన ఏనుగు గంభీరవేది అని 'రాజపుత్రీయం'లో ఉంది. పరిచ యం పొందిన శిక్షణ కూడా చిరకాలానికి అంటే ఆలస్యంగా

గ్రహించేది గంభీరవేది అని "మృగచర్మీయం"లో చెప్పబడిఉంది. ఈ విషయాలు మల్లినాథుడు సోదాహరణంగా చూపాడు. 'త్వగ్భేదాచ్ఛోణిత స్రావాన్మాంసస్యచ్యవనాదపి ఆత్మానం యోన జానాతి సాస్యాద్గంభీరవేదితే'తి రాజపుత్రీయే. చిరకాలేనయోవేత్తి శిక్షాం పరిచితామపి గంభీర వేది విజ్ఞేయ స్సగజో గజవేదిభి "రితి మృగచర్మీయే." ఇదికాక పాలకావ్యంలో నుంచి కూడా ఉదాహరణలు చూపాడు.

మాఘం 18వసర్గ 8వ శ్లోకం. సంధానాదిషు జాతసుస్థిర బలో గృహ్ణాతి యుక్తంమదం, నిద్రాణః ప్రతిదంతివైరి మనసా ప్రీతః కరాధూననాత్, కేశోర్ధ్వాళ్ళపలళ్ళ సంధిషు యువాయూథ ప్రియోగాశ్రియః, కల్యాణాహ్వయ మేతివారణ ఇహ ప్రాప్త శ్చతుర్థీందశామ్."

పాలకావ్యం. నూటఇరవై సంవత్సరాలు వయస్సుగల ఏనుగులకు 12 దశలు సంభవిస్తాయి. దశ అంటే పది సంవత్సరాలు. అందులో నాలుగోదశలో ప్రవేశించిన ఏనుగులకు ప్రౌఢశోభ కలుగుతుంది అంగసంధులు బలియటం, మదం ఎక్కువ కావడం, తొండం ఊపడంలో సంతోషం, వెంట్రుకలు నిక్కిఉండటం, చపలత్వం, యౌవనంలో ఉండే గజయూథాలతో కలిసి తిరగటం ఇవన్నీ చతుర్థ దశ పొందిన గజలక్షణాలు ఈ దశలో ఉన్న ఏనుగును కల్యాణ గజమని పేర్కొవడం ఉచితమని పాలకావ్య మహర్షి గజశాస్త్రంలో చెప్పాడు. ఈ విషయాలు మాఘవ్యాఖ్యానంలో మల్లినాథుడు విపులంగా చర్చించాడు.

రత్నశాస్త్రము:-

మాఘం 18వ సర్గ 58వశ్లోక వ్యాఖ్యానంలో మయసభా వర్ణన ఘట్టంలో మల్లినాథుడు రత్నశాస్త్రానికి సంబంధించిన విషయాలు వివరించాడు

వాలవాయమంటే వైదూర్యాలు పుట్టేదేశం. వాలవాయ శబ్దానికి విదూర శబ్దము ఆదేశమూ, లేదా పర్యాయము లేదా ఉప చరితార్థం విదూరపర్వతంలో అవి ఉద్భవించాయి. కాబట్టి వైదూర్యాలని చెప్పే అభిప్రాయం మల్లినాథుకు సరికాదన్నాడు. వాటిని ఆనగరంలో సానపట్టి ఉండవచ్చు. కాని అవిమాత్రం విదూరపర్వతజన్యాలే అని చెబుతూ ప్రమాణంగా 'వైదూర్యం వాలవాయజం' అని విశ్వ నిఘంటువు చూపాడు.

పాముల పడగలపై పుట్టిన నాగమణులు దగ్గరగా ఉన్నప్పుడు గర్జిస్తూ ఉండగా ఆసభాంగణం వైదూర్యాలకు ఉద్భవ స్థానం అవు తున్నదని ఈ శ్లోకం భావం.

సర్పాల శిరోమణులు సన్నిధిలో ఉన్నప్పుడు అకాలంలో కూడా మేఘాలు గర్జిస్తాయనీ, ఎక్కడ ఈ నాగమణులూ, మేఘ గర్జనలూ ఉంటాయో అదే విదూరభూమి అనీ ఈ వ్యాఖ్యలో వివరించాడు.

గజకుంభస్థలాల్లో ముత్యాలుంటాయనే విషయం వ్యాఖ్యా నిస్తూ మల్లినాథుడు ముత్యాలకు ఉత్పత్తిస్థానాలను ఈ క్రిందవిధంగా పేర్కొనాడు

కరీంద్ర జీమూత వరాహ శంఖ
మత్స్యాహి శుక్త్యుద్భవ వేణుజాని
ముక్తాఫలాని ప్రథితాని లోకే
తేషాంతు శుక్త్యుద్భవ మేవ భూరి. అని కూడా చెప్పాడు.

రాజనీతి శాస్త్రము:—

మాఘం 2వ సర్గ 84వ శ్లోకంలో "శత్రువు బలవంతుడై నప్పుడు తనలో ఉండే కోపాన్ని వ్యక్తం చేయకుండా సమయం వచ్చేవరకూ శత్రువును గౌరవిస్తూనే ఉండి, సమయం కలిసివచ్చి

నప్పుడు శత్రుసంహారం చేయాలి అని ఉంది. దీన్ని వివరిస్తూ మల్లినాథుడు -

"వహేదమిత్రం స్కంధేన యావత్కాల విపర్యయః
తమేవ చాగతే కాలే భింద్యాద్ఘట మివాశ్మనా." ఇతి

అని రాజనీతి శాస్త్ర పాండిత్యాన్ని వెల్లడించాడు.

కిరాతార్జునీయం 1వ సర్గ 4వ శ్లోకం వ్యాఖ్యానిస్తూ మల్లినాథుడు 'రాజులు చార చక్షువులు' అన్న విషయాన్ని వివరిస్తూ గావః పశ్యంతి గంధేన, వేదైః పశ్యంతి పండితాః, చారైః పశ్యంతి రాజానః చక్షుర్భ్యామితరే జనాః' ఇతి. 'స్వపర మండల కార్యావ లోకనే చారాః చక్షూంషి క్షితి పాలకానామితి నీతి వాక్యామృతే.' అని అన్నాడు. ఇట్లాంటి అనేక తావుల్లో తన రాజనీతి శాస్త్ర పరి జ్ఞానం ప్రకటించాడు.

మతము:- మాఘం 2వ సర్గ 24 శ్లోకం వ్యాఖ్య.

బౌద్ధమతస్థులకు సర్వ శరీరాల లోనూ పంచస్కంధాలు తప్ప వేరే 'ఆత్మ' అనే పదార్థం లేదు అలాగే రాజులకు సంధి మొద లైన సర్వకార్యాలలోనూ, కార్యారంభం మొదలైన ఐదు అంగాలు తప్ప వేరే 'మంత్రం' లేదని భావము.

కామందక నీతిశాస్త్రంలో 'సహాయాస్సాధనోపాయా విభాగో దేశకాలయోః విపత్తేశ్చ ప్రతీకార స్సిద్ధిః పంచాంగమిష్యతే' అని ఉన్నట్లు మల్లినాథుడు ఉదాహరించాడు.

ఇట్లాగే బౌద్ధ మతంలో రూప స్కంధమూ, వేదనాస్కం ధమూ,విజ్ఞాన స్కంధమూ, సంజ్ఞాస్కంధమూ, సంస్కార స్కం ధమూ, అనే ఐదు స్కంధాలు ప్రసిద్ధాలు. "రూప వేదనా విజ్ఞాన సంజ్ఞా సంస్కారాః పంచ సంధాః తత్ర విషయ ప్రపంచో రూప స్కంధః జ్ఞాన ప్రపంచో వేదనా స్కంధః, ఆలయ విజ్ఞానసంతానో

విజ్ఞాన స్కంధః, నామ ప్రపంచ స్సంజ్ఞా స్కంధః. వాసనా ప్రపంచః సంస్కారస్కంధఃఏవంపంచవిధా పరివర్తమానో జ్ఞానసంతానఏవాత్మేతి బౌద్ధాః ఏవంచ యథా బౌద్ధానాం సర్వేషు శరీరేషు స్కంధ పంచ కాతిరిక్త 'ఆత్మా' నాస్తి తథారాజ్ఞా ముక్తాంగ పంచకాతిరిక్తో 'మంత్రో నాస్తీతి. దీన్ని బట్టి మల్లినాథుని బహుముఖ విజ్ఞాన వికాసం వెల్లడి అవుతున్నది.

——ః౦ః——

మల్లి సౌరభవం

మల్లినాథుడు వ్యాఖ్యారంభ పద్యాలలో స్వయంగా మల్లినాథ కవిసోఽయం అనీ మల్లినాథ విదుషా అనీ చెప్పుకొన్నాడు. అంతేకాక వాణీం కాణభుజీ మనే పద్యంలో వెల్లడించిన బహుశాస్త్ర పాండిత్యం "వ్యాఖ్యాతృ చక్రవర్తి"గా మల్లినాథునకు గల అర్హతల్ని వేనోళ్ళ చాటుతూంది.

కాళిదాస శ్రీహర్ష, భారవి. మాఘ మహాకవుల కావ్యాలకు మల్లినాథుడు చేసిన వ్యాఖ్యానాలు అనిదం పూర్వాలూ, అద్భుత రమణీయాలూనూ. మల్లినాథుని బహుముఖ ప్రజ్ఞా పాటవాలకు అవన్నీ మాణిక్య దర్పణాలు. వ్యాఖ్యలకు అతడు పెట్టే పేర్లే అతని పేరు దిగంతాలలో మ్రోయించాయి అతనిటీకలు పంచకావళికితరళ అనీ, కాళిదాసుకు సంజీవని అనీ, భారవికి ఘంటా పథమనీ, మాఘానికి సర్వంకష అనీ, నైషధానికి జీవాతువు అనీ చిత్ర చిత్రంగా నామకరణం చేస్తాడు. కవిత్వంలో దాగిఉండే అచ్చమైన అందాలు ఆవిష్కరించడంలో ఎంత ఒడుపు చూపిస్తాడో ఇదమిత్థంగా చెప్పలేం. అతని వ్యాఖ్యానం చదువుతూఉంటేరసరమ్యాలో కాల్లోవిహారిస్తున్నట్లుఉంటుంది. శాస్త్ర పాండిత్యం, కవనశక్తి ఒక్కచోట కుదరటం అరుదైనా మల్లినాథుడు శాస్త్ర పాండిత్యంలో ఎంతప్రజ్ఞా వంతుడో, మధుర కవితా విన్యాసంలో అంత చతురుడు పూర్వ కవీశ్వరుల శైలీ, పలుకుబడీ పొందు కుదుర్చుకున్నా యీతని రచనల్లో.

మల్లినాథుడు కేవలం విమర్శకుడే కాదు. ఉత్తమ కోటికి చెందిన వ్యాఖ్యాత, కవి చూడామణి. కవులకు విమర్శకుడు విమర్శకులకు కవి. ఈ రెండూ సమపాళంగా పండినవాడే ఉత్తము కవిగా రూపొందుతాడు. అందానికి అందం, పరిమళానికి పరిమళం రెండూ

నిండించుకున్న మల్లెపూవులా ఉంటాడు. అందుకనే మల్లినాథుడు లోకోత్తర ప్రతిభావంతుడని అందరూ అంటారు అతడు వ్యాఖ్యానించిన కావ్యాల్లో అక్కడక్కడ మీగడ తరగల్లా కొన్ని శ్లోకాలు చిలికించాడు. వాటిని పరిశీలిస్తే మల్లినాథుని అంతరంగం ఎంత కవితా కమనీయంగా ఉంటుందో బోధపడుతుంది. అతడు పుంఖానుపుంఖంగా కావ్యాలు నిర్మించక పోవడం మన దురదృష్టం. రఘువీర చరితం, ఉదారకావ్యం, భక్తి రహస్యం, నక్షత్ర పాఠాధ్యాయం అనే నాలుగు గ్రంథాలు మాత్రం మల్లినాథుని కావ్యాలుగా మనకు తెలియ వస్తున్నాయి.

వ్యాఖ్యానాల ఆరంభంలో మనకు లభించిన ముత్యాలవంటి ఈ శ్లోకాలు సంఖ్యలో అల్పమైనా సారస్యంలో అర్థగాంభీర్యంలో, చమత్కారంలో, మధురమయభణితిలో అనల్పమైన కవితామృతం వర్షిస్తున్నాయి. ఈ శ్లోకాలు అతని కవితా కలాప్రాగల్భ్యానికి నికషోపలాలు.

మల్లినాథుని రచన మల్లిపూవుల గుబాళింపులా ఉంటుంది. క్రొత్త క్రొత్త సోయగాలు వెదజల్లుతూ వెయ్యందాలతో నెత్తావులు గుప్పుమంటూ ఉంటాయి. అతనిరచనల్లో సంస్కృత కవితా సరస్వతికి అతడు అందించిన అలంకారాలు ఎప్పుడూ కలకల్లాడుతూఉంటాయి. ఆశ్చర్యంవేస్తూ ఉంటుంది అతని పాండిత్యంలోతులు చూస్తూఉంటే. ఈ తక్కువ శ్లోకాలలోనే కవితామృతం జల్లులు కురిపించాడు-రసిక లోకం గుండెలు "ఝల్లు"మనేలా. భావనా ప్రగల్భమైన రచనతో అందర్నీ ఔనని రసికతా రమణీయంగా తలలూపించి, అజ్ఞాతపూర్వాలైన సురసరస్వతీ సౌందర్యాల్ని కుమ్మరించాడు.

కాలగర్భంలో కలిసిపోయినవి పోగా ఆకవి చంద్రుని సువర్ణ లేఖిని చిందించిన ఆ మధుబిందువులు కొన్నైనా అదృష్టవశాత్తు

మనకు మిగిలాయి. వాటన్నిటిని ఒకచోట చేరిస్తే రమణీయమైన ఒక చిన్న మధురకావ్యం కాకపోదు.

రఘువంశ వ్యాఖ్యానారంభంలో 21 శ్లోకాలు, కుమారసంభవ వ్యాఖ్యారంభ లో 2 శ్లోకాలూ, శిశుపాలవధ వ్యాఖ్యారంభంలో ఒక శ్లోకమూ, కిరాతార్జునీయవ్యాఖ్యారంభంలో 3 శ్లోకాలూ, ఏకావళి వ్యాఖ్యలో 3 శ్లోకాలూ మొత్తం 30 శ్లోకాలు లభించాయి.

ఈ శ్లోకాలుపరిమాణంలోనూ, పరిమళాలు వెదజల్లడంలోనూ మల్లెలకు దీటైనవే.

మహా కావ్యాలకు వ్యాఖ్యలు నిర్మిస్తూ ఆ వ్యాఖ్యానందనోద్యాన వీథుల్లో మల్లినాథుడు విరియించిన ఈ పద్య మల్లీసుమాలు అపూర్వ సౌరభాన్ని గుబాళిస్తూ కన్నులపండువుగా సాక్షాత్కరించి రసజ్ఞుల హృదయాల్ని పరవశింపజేస్తున్నాయి.

ఇందులో శారదనూ, గణపతినీ, శ్రీకృష్ణునీ, శివుణ్ణీ, శ్రీ రామచంద్రుణ్ణి స్తుతించిన శ్లోకాలున్నాయి. అన్నింటిలో శ్రీరామచంద్రుని స్తోత్రించేసిన శ్లోకాలు ఎక్కువగా ఉన్నాయి. హరిహరాద్వైతాన్ని బాటిస్తూనే శ్రీరామచంద్ర చరణారవిందాల మీద భక్తి భావాన్ని గాఢంగా ప్రకటించాడు

"వాగర్థావివ సంపృక్తౌ వాగర్థ ప్రతిపత్తయే
జగతః పితరౌ వందే పార్వతీ పరమేశ్వరౌ."

కాళిదాసు రఘువంశ కావ్యారంభంలో చేసిన మొట్టమొదటి ప్రార్థనా శ్లోకమిది. మల్లినాథుడు ఆ శ్లోకభావాన్నే అనుసరిస్తూ కాళిదాసుపైని తనకుగల గౌరవభావాన్ని చూపించడమే కాకుండా ఆ శ్లోకభావానికి శృంగార రసపరిమళంకూడాచేర్చి మెరుగుపెట్టాడు.

శ్లో. మాతాపితృభ్యాం జగతో నమో వామార్థ జానయే
సద్యోదక్షిణ దృక్పాత సంకుచద్వామ దృష్టయే.

రఘువంశ వ్యాఖ్యారంభంలో మల్లినాథుడు చేసిన మొట్ట మొదటి ప్రార్థనా శ్లోకమిది దీనిలో వామార్ధజానీ దక్షిణ దృగ్వి న్యాసంచేత తక్షణమే సంకోచం పొందుతున్న వామదృష్టి కలదీ, అయిన జగత్పితరుల జంటకు నమోవాకాలు అర్పించాడు. అర్ధనారీ శ్వర సమ్మోహనరూపాన్ని ధ్యానించి, ఆ రూపాన్ని పాఠకుల హృదయపద్మాలపైన నిలిపాడు.

శ్లో. అంతరాయ తిమిరోపశాంతయే
శాంతపావన మచింత్య వైభవమ్
తంనరం వపుషి కుంజరం ముఖే
మన్మహే కిమపి తుందిలం మహః.

అంతరాయాంధకారం తొలగిపోవడానికి అనిర్వచనీయమైన ఒక మహస్సుకు నమస్కరిస్తున్నాడు. ఆ మహస్సు అచింత్యమైన వైభవం కలది శాంతమూ, పావనమూ అయినది మానవశరీరమూ, కుంజరముఖమూ కలది. ఈ విధంగా తుందిలమైన మహాగణాధిపతి రూపాన్ని మనకు సాక్షాత్కరింపజేశాడు.

శ్లో. శరణం కరవాణి శర్మదంతే
చరణం వాణి చరాచరోపజీవ్యమ్
కరుణా మసృణైః కటాక్షపాతైః
కురు మామంబ కృతార్థ సార్థవాహమ్.

సకల సౌఖ్యసంధాయకాలూ, చరాచరోపజీవ్యాలూ, అయిన నీ పాదాలను ఆశ్రయిస్తున్నాను. తల్లీ! దయామృత స్నిగ్ధమయిన నీ కటాక్షపాతంచేత సారస్వత మార్గంలో ప్రయాణిస్తున్న నన్ను దరిజేర్చి కృతార్థుణి చెయ్యి. అని వాగ్దేవిని స్తుతించాడు. దీనిలోని రమణీయపదవి న్యాసాలతోపాటు, సౌఖ్యప్రదాలూ, చరాచరోప జీవ్యాలూ, అయిన శారదా చరణకమలాలు, కరుణా రసమసృణ

మైన ఆవాగ్దేవి కృపాకటాక్ష వీక్షణాలు భక్తుల హృదయాల్ని పర వశం చేస్తున్నాయి. మంజులకుసుమాంజలుల్ని ఘటింపజేస్తున్నాయి.

శ్లో. ఆశాసు రాశీ భవదంగవల్లీ
భాసైవ దాసీకృత దుగ్ధసింధుమ్
మందస్మితై ర్నిందిత శారదే దుం
వందేఽరవిందాసన సుందరి! త్వామ్.

తల్లీ! అరవిందాసన సుందరీ! దిగంతాలకు వ్యాపించి రాశీ భూతమైన పరమధవళమైన నీ శరీరం సౌందర్యం క్షీరసాగరాన్ని దాసీకృతం చేసుకుంది మందస్మిత కాంతులచేత శరదిందు కాంతుల్ని జయించావు అని భక్తిపరవశుడై మరో పద్యంలో విశ్వవ్యాప్తమైన శరచ్చంద్ర చంద్రికా ధవళమైన బ్రాహ్మీమూర్తిని స్తుతించాడు ఆ శారదామూర్తిని ఎంత స్తుతించినా తృప్తితీరదు.

శ్లో. ఉపాధిగమ్యోఽప్యనుపాధిగమ్యః
సమావలోక్యోఽప్యసమావలోక్యః
భవోఽపియోఽభూదభవః శివోఽయం
జగత్యపాయాదపి నస్సపాయాత్.

ఉపాధిగమ్యుడే అయినా అనుపాధిగమ్యుడట. అసమలోచను డైనా సమదృష్టి కలవాడేనట. భవుడుగా ప్రసిద్ధుడైనా తాను అభవు డట. ఇట్లాంటి జగన్మంగళకరుడైన శివుడు మనల్ని ఆపదలనుంచి రక్షించుగాక అని పరమేశ్వరుణ్ణి మరో మారు విరోధాభాసరూపమైన ఆలంకారిక శైలిలో కీర్తించి వేదాంతతత్త్వాన్ని ఆవిష్కరించాడు.

దీనికి—

"అకించన స్సన్ ప్రభవ స్స సంపదాం
త్రిలోకనాథః పితృసద్మగోచరః

స భీమరూప శ్శివ ఇత్యుదీర్యతే
న సంతి యాథార్థ్య విదః పినాకినః''

అనే కాళిదాస శ్లోకభావం మూలం కావచ్చు.

శారదా శారదాంభోజ వదనా వదనాంబుజే
సర్వదా సర్వదాఽస్మాకం సన్నిధిం సన్నిధింక్రియాత్.

ఇందులో సన్నిధిని ప్రసాదించమని శారదాదేవిని ప్రార్థించాడు. శబ్దాలంకారంతో నిండి ఈ పద్యం అత్యంత హృద్యంగాఉంది.

ఇందీవరదళశ్యామ మిందిరా నంద కందళమ్
వందారు జనమందారం వందేహం యదునందనమ్.

నల్లకలువరేకులా అందమైన శ్యామలవర్ణంకలవాడూ, లక్ష్మిదేవిఆనందానికి మూలమైనవాడూ, నమస్కరించేవారికి కల్పవృక్షంలా కోరినవన్నీ ఇచ్చేవాడూ ... అయిన శ్రీకృష్ణునికి నమస్కారము. అని ఈ పద్యంలో యదునందనుణ్ణికీర్తించినమస్కరించాడు. ఇదికూడా శబ్దాలంకార శోభితమై అలరారుతున్నది.

జాహ్నవీ మూర్ధ్ని పాదే వా కాలః కంఠే వపుష్యథ
కామారిం కామ తాతం వా కంచిదేకం భజామహే॥

గంగ తలమీదో లేక పాదమందో, నల్లదనం కంఠమందో లేక శరీరమందో, మన్మథునిచంపిందో లేక పెంచిందో ఏదో ఒకమైన ఆ దివ్యరూపాన్ని భజిస్తున్నాము.

మల్లినాథుడు శివ కేశవులకు సమానమైన ప్రతిపత్తినిచ్చే అద్వైతి. కాబట్టే కొన్నిచోట్ల పార్వతీ పరమేశ్వరుల్ని, మరికొన్ని చోట్ల గణపతినీ, కొన్నితావుల్లో విష్ణ్వవతారాలైన శ్రీరామ, కృష్ణుల్ని స్తోత్రించేశాడు. తిక్కనలోఉన్న హరిహరా ద్వైతభావం ఇతణ్ణీ ఆకర్షించినట్లు కనిపిస్తుంది. "కిమస్థిమాలాం కిముకౌస్తుభంవా

పరిపిష్క్రియాయాం బహుమన్యసే త్వం కిం కాలకూటః కిమువా యశోదా స్తన్యం తవస్వాదు వద ప్రభో మే॥

తిక్కనగారి ప్రార్థనలోని ఈ అద్వైతభావమే మల్లినాథుని లేఖినినుంచి "జాహ్నవీమూర్ధ్ని...భజామహే" అనే పద్యరూపంగా జాలువారింది, సువర్ణానికి పరిమళం అబ్బినట్లు మూలానికి వన్నె సమకూర్చింది.

భజేమహి నిపీత్యైకం ముహురన్యం పయోధరమ్
మార్గం తం బాలమాలోక్య శ్వసంతౌ వాదిదంపతీ॥

ఒక పక్క పాలుతాగి రెండోపక్క పాలుతాగడానికి పయోధరం వెదకుతున్న బాలుణ్ణిచూసి ఆదిదంపతులైన ఆ అర్ధనారీశ్వర మూర్తులు నిట్టూర్పులు విడిచారట. ఇందులో కవి భావనాబలము గోచరమవుతున్నది. సుకుమార సుందర శృంగార దర్శకమూ, హాస్య. కరుణారస సంభరితమూ, భక్తిభావ బంధురమూ అయిన దీని లోని భావ గాంభీర్యం 'నభూతో నభవిష్యతి' అన్నట్లుగా ఉంది.

దీనిలోని భావసౌందర్యాన్ని, సౌకుమార్యాన్ని మరచిపోలేక, వదలుకోలేక అల్లసానిపెద్దన మనుచరిత్ర ఆరంభంలో దీనిని అనుసరించే ప్రయత్నంచేసినాదానిలోని ద్వితీయచరణభావాన్ని విడిచి పెట్టాడు. 'మార్గంతంబాలమాలోక్య శ్వసంతౌవాదిదంపతీ' ఇందులో బాలమాలోక్యవరకు మాత్రమే అల్లసానిపెద్దన గ్రహించాడు.

శ్లోకానికి జీవమైన 'శ్వసంతౌ వాదిదంపతీ' అనేది విడిచిపెట్టాడు. మల్లినాథుని శ్లోకం అర్ధనారీశ్వర స్వరూపానికి ఆదిదంపతులకి చెందింది కాగా మనుచరిత్రలో పెద్దన బాలగణపతి స్తుతిగామాత్రం మార్పు చేశాడు. కాని మరో పయోధరంకోసం వెదికిన బాలునికి స్తన్యమీయలేని ఆ తల్లి నిస్సహాయత నిట్టూర్పు చిత్రించిన మల్లినాథుని కవితా కలా ప్రాగల్భ్యమూ, భావనాబలమూ అనన్య సామాన్యము. ఈ

ఒక్క పద్య చాలు మల్లినాథుని మహాకవులపంక్తిని కూర్చొబెట్ట డానికి.

అల్లసాని వారి పద్యంకూడా పరిశీలిద్దాం.

ఉ. అంకము జేరి శైల తన యాస్తన దుగ్ధము లాను వేళ బా
ల్యాంక విచేష్ట దొండమున నవ్వలి చన్గబళింపబోయి యా
వంక గుచంబుగాన కహివల్లభహారముగాంచి వేమృణా
ళాంకుర శంకనంటెడు గజాస్యునిగొల్తు నభీష్టసిద్ధికిన్.

హేరంబ మవలంబేఽహం యస్మిన్ పాతాళ కేళిషు
దంతే నోదస్యతి క్షోణీం విశ్రామ్యంతి ఫణీశ్వరాః.

పాతాళ కేళి విలాసాల్లో ఏకదంతంతో భూమిపై కెత్తి భూభా రాన్ని వహించే ఫణీశ్వరులకు కొంత విశ్రాంతికలిగించిన గజాననుని స్తోత్రం చేశాడు. ఇదొక సుకుమారభావన మధురోహ.

ఏకలోచన మేకార్ధేసార్ధలోచన మన్యతః.
నీలార్ధం నీల కంఠార్ధం మహః కిమపి మన్మహే.

ఒకే శరీరం అర్ధ భాగంలో ఒక నేత్రం, రెండో అర్ధభాగంలో సార్ధలోచనం అంటే 1½ నేత్రం, శరీరంలో ఒక అర్ధ భాగం నైల్యం. మరో అర్ధభాగంలో కంఠమందే నైల్యం అమరిఉన్న అద్భుత తేజ స్సుకు నమస్కారం అనిస్తుతించాడు.

అర్ధ నారీశ్వర మూర్తిలో శివదేహార్ధాన్ని గౌరి ఆక్రమించు కొంది. అందుచేత శివుని అర్ధదేహం మాత్రమే మనకు కనిపిస్తుంది. గౌరి అర్ధదేహం దర్శనమిస్తుంది. కాబట్టి శివునిభాగంలో 1½ నేత్రాలు, కంఠార్ధంలో నీలిమ గోచర మవుతాయి. గౌరిభాగంలో ఒక్క నేత్రం శరీరమంతటా నైల్యం గోచరిస్తాయి. పరమేశ్వరుడు పరమ ధవళ దేహుడు. గౌరీదేవి శ్యామల మూర్తి. పై శ్లోకం ఒక ప్రహేళిక. ఒక పొడుపుకథ మేధావుల బుద్ధికిఒకపరీక్ష నిశిత పరిశీలనకిది నిక షోపలము

ఆకర్ణసే నిత్యమానందం రామనామ కథామృతమ్
సద్భిః స్వశ్రవణై ర్నిత్యం పేయంపాపం ప్రణోదితుమ్.

పాపాపనోదం కోసం కర్ణాంజలి సంపుటాలతో అహరహం రామనామ కథామృతం పానంచేయ తగిందని మల్లినాథుడిందులో ఆశంసిస్తున్నాడు. రామనామ కథామృతాన్ని ఉగ్గడించి కూడా తృప్తితీరక మనస్సును మళ్ళీ ప్రబోధిస్తున్నాడు.

రామచంద్ర చరణార విందయో
రంతరంగ! చరభృంగ లీలయా
తత్ర సంతిహి రసా శ్చతుర్విథా
స్తా న్యథారుచి సదైవ నిర్విశ.

ఓ మనస్సా! శ్రీరామచంద్రుని చరణార విందాలతో భృంగంలా విహరించు. అక్కడ ధర్మార్థకామమోక్షాలు అనే నాలుగు రసాలు నీకు లభిస్తాయి. యథేచ్ఛగా ప్రవేశించి అనుభవించు.

వందామహే మహోద్దండ దోర్దండౌ రఘు నందనౌ
తేజో నిర్జిత మార్తాండ మండలౌ లోక నందనౌ.

మహోద్దండ దోర్దండ మండితులూ, తేజో నిర్జిత మార్తాండ మండలం కలవారూ అయిన రామలక్ష్మణులకు నమస్కారం. ఇందులో దివ్యస్వరూప దర్శనం చేశాడు. దీనికి- "తరుణౌరూప సంపన్నౌ సుకుమారౌ మహాబలౌ పుండరీకవిశాలాక్షౌ చీర కష్ణాజినాంబరౌ" అనే శ్రీమద్రామాయణ శ్లోకం సమానంగాఉంది. దాన్ని మళ్ళీ స్ఫురింపిస్తున్నది. శ్రీరామనామ కీర్తన మెంతచేసినా మళ్ళీ ఆ శ్రీరామ మహిమనే పొగడు తున్నాడు.

"త్రైలోక్య శల్యోద్ధరణాయ సింధో
శ్చకార బంధం మరణం రిపూణాం
పుణ్యప్రణామం భువనాభి రామం
రామం విరామం విపదాముపాసే"

త్రిలోక కంటకుడైన రావణుని సంహరించడం కోసం సముద్రానికి బంధమూ, శత్రువులకు మరణమూ కల్పించినవాడూ, పుణ్య ప్రవాహుడూ, విపత్తుల్ని తొలగించే వాడూ, భువనాభిరాముడూ, అయిన శ్రీరామ చంద్రుని ఉపాసిస్తున్నాడు.

సంజీవనం మైథిల కన్యకాయాః
సౌందర్య సర్వస్వ మహానిధానమ్,
శశాంక పంకేరుహ యోస్సమానమ్
రామస్య వందే రమణీయమాస్యమ్.

ఈ శ్లోకంలో శ్రీరామచంద్రుని ముఖారవింద సౌందర్యాన్ని వర్ణించి నమస్కరిస్తున్నాడు. "పుంసాం మోహనరూపాయ" అన్నట్లు సౌందర్య సర్వస్వ మహానిధానమైన మైథిలీ ప్రాణనాథునికి నమస్కరిస్తున్నాడు.

ఆరణ్యకం గృహస్థానం శ్వశురౌ పద్రజఃకణాః
స్వయమౌద్వాహికం గేహం తస్మై రామాయ తేనమః.

ఈ శ్లోకం రచించేటప్పుడు మల్లినాథుని హృదయంలో శ్రీరాముని అహల్యా శాపవిమోచనలీల మెదిలి ఉంటుందని భావించ వచ్చు. ఎలాగంటే :-

ఎవనికి అరణ్య గృహస్థానం అయిందో, ఎవని పాదరజః కణాలు అహల్యకు శాపవిమోచనంచేసి శిలారూపాన్ని తొలగించి మానుషీత్వం ప్రసాదించి గౌతమునికి తిరిగీ దానం చేయడంవల్ల అత్తమామలయ్యాయో-ఈ విధమైన గౌతమాహల్యల సంయోగ లక్షణరూపమైన పునరుద్వాహానికి ఎవడు వివాహ మండపవేద్యాదులుగా స్వయంగా ఔద్వాహిక గేహంగా వ్యవహరించాడో, అట్లాంటి శ్రీరామచంద్రునకు నమస్కారము అని అతిగంభీరమైన భావాన్ని ఈ శ్లోకంతో ఇమిడ్చాడు.

దేశోపద్రవంలాంటి మహాసంక్షోభాలేర్పడినప్పుడు నిర్బంధంగా పతితులైనవారికి ఆపద్ధర్మంగా ప్రాయశ్చిత్తాదికం జరిపించి చిరకాల పాతిత్యంనుంచి విముక్తులైనవారికి తిరిగి వివాహాదికం జరిపించడం శాస్త్రంలో కనిపిస్తున్నది.

ఈ విధంగా శ్రీరామచంద్రుడు అహల్యకు శాపవిమోచనం చేసి పునర్జన్మ ప్రసాదించి తిరిగి గౌతమునికి దానం చేశాడు. ఈ పునర్వివాహసమయంలో శ్రీరాముడు కల్యాణమండప, వేదిక, మంగళ వస్తురూపమై స్వయంగా వ్యవహరించాడు. పాదరజః కణాలు అహల్యకు పునర్జన్మ ప్రసాదించి ఆమెకు తల్లిదండ్రులై అహల్యా దానంచేత గౌతమునికి అపాదరజః కణాలే అత్తలయ్యాయి.

దీనికి సంస్కృత వివరణ కూడా అందిస్తున్నాము. "ఏతత్పద్య ప్రణయనావసరే మల్లినాథ స్వాంతే ప్రభో రహల్యోద్ధార లీలా ఆ విర్బభూవే త్యనుమీయతే. తథాచ. ఆరణ్యకం అరణ్యాం యస్య గృహస్థానం ఆసీత్, యస్య పద్రజః కణాః పాదపా సవః శ్వశురావ భూతాం, శిలాభూ తాహల్యాయా మానుషీత్వ సంపాదనేన గౌత మాయ దానాత్ రామపాద రజః కణానాం శ్వాశుర్యం సువచమ్ ఏతాదృశ గౌతమాహల్యా సంయోగ లక్షణే పునరుద్వాహేఔద్వా హికం గేహం. వివాహ మండప వేద్యాదిచ,యః స్వయమేవ (రామ ఏవ) బభూవ. దృష్టంచ శాస్త్రే చిరపాతిత్యోన్ముక్తస్య పునరుప నయ నోద్వాహాది. తస్మై రామాయ నమోస్త్వితి కథం చిల్లాప నీయ మిదం పద్యమ్ యద్యపి యద్రజఃకణా ఇతిపాఠః సర్వత్రోప లభ్యతే తథాప్యత్ర యత్తదో ర్దూరాన్వయేన దురూహత్వాత్ అస్మాభిః పద్రజః కణాః ఇత్యయమేవ పాఠః ఆదృతోఽస్తి.

ఈ శ్లోకంలో అలంకారం, ధ్వని, రసంఅన్నీ ఉన్నాయనిపి స్తుంది శాస్త్రరహస్యాన్ని ఇమిడ్చిన ఈ కవిచూడామణి సర్వ సమ ర్థుడు. మాఘునికి, శ్రీహర్షునికి దీటైన పాండితీ సంపదతో వారి

కావ్యాల్లోని గ్రంథ గ్రంథులను, శాస్త్ర మర్మాలను హేలగా లీలగా వ్యాఖ్యానించ గలిగాడు.

బృందారకా యస్య భవంతి భృంగా
మందాకినీ యన్మకరంద బిందుః
త వారవిందాక్ష పదార విందం
వందే చతుర్వర్గ చతుష్పథం తత్

అరవిందాక్షా! శ్రీరామచంద్రా! నీ పాదపద్మంలో మందాకిని మకరంద బిందువులా ఆవిర్భవించింది. బృందారక భృంగాలు నీ పాదారవిందాల్ని ఆశ్రయించాయి. ధర్మార్థ కామమోక్షాలకు చతుష్పథమైన నీ పాదారవిందానికి నమస్కారం. అనుప్రాస రూపక విన్యాసాలతో భక్తిపరిమళాలతో గుబాళించే ఈ పద్యం ఎంతో హృద్యంగా ఉంది.

నమో రామ పదాంభోజ రేణవే యత్ర సంతతం
కుర్వంతి కుముదప్రీతి మరణ్యా గృహమేధినః.

గౌతమాశ్రమంలో అహల్యాశాపమోక్షం జరిగిన చోట రామ పదాంభోజ రేణువునకు మహర్షులు నమస్కరిస్తున్నారు.

అరణ్యక గృహస్థులైన మహర్షులు ఏ పాదపద్మరేణువుపైన నిరంతరం కుముదప్రీతిని భావనచేస్తుంటారో, అట్లాంటి శ్రీరాముని పదాంభోజ రేణువుకు నమస్కరిస్తున్నాను. శ్రీరామచంద్రుని పాదధూళి పరమపావనము అది అహల్యాశాపాన్ని తొలగించింది. పునర్జన్మ ప్రసాదించింది. మహర్షులకూ, భక్తులకూ నిరంతరం ఆరాధనీయం. కుముదం సుగంధం వెదజల్లినట్లు శ్రీరామచంద్ర పదాంభోజరేణువు కారుణ్య, వాత్సల్య, ముక్తి, భక్తి భావసుగంధాల్ని విరజిమ్ముతుంది. దీనిలోఉన్న భావసౌకుమార్యం సహృదయ హృదయాహ్లాద జనకంగా ఉంది

యత్పాదపాంసు సంపర్కాదహల్యాసీదపాంసులా
కారుణ్య సింధవే తస్మై నమో వైదేహిబంధవే

ఎవరి పాదపంక సంపర్కంవల్ల అహల్యాపాప పంకం క్షాళిత మయిందో-అట్లాంటి కరుణా సింధువైన వైదేహి బంధువుకు నమస్కారము.

ఇందులోని శబ్దాలంకార విరోధాభాసలు మల్లినాథునిపాండిత్య ప్రకర్షను చాటుతున్నాయి. ఇక్కడ "వైదేహీబంధవే"అనికాకుండా 'వైదేహిబంధవే'అని మల్లినాథుడు ప్రయోగించాడు. దాన్నికొద్దిగా పరిశీలిద్దాం.

కుమారసంభవం 4వ సర్గ 16వ శ్లోకం వ్యాఖ్యలో మల్లినాథుడిట్లా అంటాడు "జీబంతస్యాపి దూతీశబ్దస్య ఛందో భంగభయాద్ధ్రస్వః. వి."అపిమాషం మషంకుర్యాత్ చందోభంగే త్యజేద్గిరమ్. ఇతి కేచిత్, 'ఉణాదయో బహులమ్' ఇతిబహుల గ్రహణార్థ్రస్వ ఇతి వల్లభః. ఈ విధంగా 'దూతీ'శబ్దానికి హ్రస్వం సాధించి, 'రతిదూతిపదేషు'అనే చోట్లో 'దూతి'శబ్దం సాధువేఅని నిరూపించాడు. అదే విధంగా 'వైదేహీ'శబ్దం జీబంతమైనా "ఉణాదయో బహులమ్"అనే బహుళగ్రహణంవల్ల హ్రస్వాన్ని సాధించి "వైదేహిబంధవే" అనే రూపాన్ని సాధించుకోవచ్చు. ఆ ప్రయోగం దృష్టిలో పెట్టుకొని ఆ చమత్కార ప్రయోగాన్ని ఇక్కడ మల్లినాథుడు చేశాడని భావించడంలో ఔచిత్యం లేకపోలేదు.

మనసో మమసంసారబంధముచ్ఛేత్తు మిచ్ఛతః
రామచంద్ర పదాంభోజ యుగళం నిగడాయతామ్.

సంసారబంధాన్ని ఛేదించే తలపుగల నామనస్సునకు రామచంద్ర పదాంభోజ యుగళం నిగళమగుగాక-అని ప్రార్థిస్తున్నాడు నాకీ సంసారబంధంనుంచి మోక్షం కలిగించడానికి నీ చరణాలే శరణమని ఆశిస్తున్నాను అని మల్లినాథసూరి - శ్రీరామచంద్ర చరణార

వించాలను బహువిధాలుగా ప్రార్థించి బహువిధాలుగా వర్ణించాడు. శ్రీరామనామ కథామృతాన్ని తాను తనివితీర ఆస్వాదించిభక్తులకు కూడా సమృద్ధిగా పంచిపెట్టాడు.

దైవం త్రైలోక్య జీవాతుం త్రైలోక్య హృదయంగమమ్
అమూర్తమూర్ధజం వందే శివం శశి శిరోమణిమ్.

ముల్లోకాలకూ జీవనాధారమైనవాడూ, త్రైలోక్య హృదయంగముడూ, అమూర్తమైన ఆకాశాన్ని కేశాలుగా ధరించినవాడూ, శశిశిరోమణీ అయిన శివునికి నమస్కరిస్తున్నాను. పరమేశ్వర నిజతత్త్వాన్ని, ప్రభావరూపాన్ని ఈ శ్లోకంలో వర్ణించాడు.

శివాయ జగతామస్తు శివయోః ప్రేమతాదృశమ్
యేనాన్యోన్య శరీరార్ధ మన్యోన్యస్మై సమర్పితమ్.

ఒకరికొకరు శరీరార్థాలు సమర్పించుకొన్న పార్వతీ పరమేశ్వరుల లోకోత్తర ప్రేమభావం జగత్కల్యాణ సంధాయకమగు గాక అని అర్ధనారీస్వర రూపాన్ని ధ్యానిస్తూ కవి లోకకల్యాణం ఆకాంక్షిస్తున్నాడు.

దంతాంచలేన ధరణీతలమున్నమయ్య
పాతాళకేళిషుధృతాది వరాహలీలమ్
ఉల్లాఘనోత్ఫణ ఫణాధర గీయమాన
క్రీడావదాన మిభరాజ ముఖం నమామః

ఆదివరాహమూర్తిలా పాతాళ కేళులలో దంతాంచలంతో ధరణీతలాన్ని మీదికెత్తి తన కేళీవిలాసాన్ని పాములు పడగలెత్తి గానంచేస్తూఉంటే వినోదించే ఇభరాజముఖునికి నమస్కరిస్తున్నాము. ఆదివరాహమూర్తి పాతాళకేళులతో ఈ గజరాజవదనుని పాతాళ కేళుల్ని పోల్చి సుకుమార కల్పనచేసి రసికులమనస్సులకు ఆహ్లాదాన్ని కలిగించాడు.

అర్ధాంగీకృత దాంపత్య మపి గాఢానురాగియత్
పితృభ్యాం జగత స్తస్మై కస్మైచిన్మహసే నమః.

అర్ధాంగీకృత దాంపత్యమే అయినా ఏది గాఢానురాగము కలదో అట్లాంటి జగత్పితరులైన పార్వతీ పరమేశ్వరుల దాంపత్య మహిమకు నమోవాకాలర్పిస్తున్నాను. అర్ధాంగీకృతమైనా గాఢానురాగం కలదట ఈ అపూర్వదాంపత్యం. రసవత్తరమైన ఊహా చిత్ర నిర్మాణమిది. ఇట్లా ఊహించడం అనితరసాధ్యము. అపూర్వమూ, ఆశ్చర్యజనకమూ అయిన ఈ విరోధాభాసాల సొగసులకు జగత్పితరుల ముఖాల్లో దరహాసచంద్రికారేఖలు భాసిల్లి ఉండక పోవు.

ఆలంబే జగదాలంబం హేరంబ చరణాంబుజం
శుష్యంతి యద్రజః స్పర్శాత్సద్యః ప్రత్యూహవార్ధయః

ఏ మహానుభావుని పాదరజ స్స్పర్శవల్ల ప్రత్యూహవారిధులు తత్క్షణమే ఇంకిపోతాయో ఆలోకాధారభూతమైన ఆ హేరంబుని చరణాంబుజాన్ని ఆలంబంగా స్వీకరిస్తున్నాను.

తద్దివ్యమవ్యయం ధామ సారస్వత ముపాస్మహే
యత్ప్రకాశాత్ ప్రలీయంతే మోహాంధ తమసశ్ఛటాః.

దేనిప్రకాశంవల్ల మోహాంధతమస్సులు విచ్ఛిన్నమైపోతాయో అట్లాంటిదివ్యమూ, అవ్యయమూ అయిన సారస్వతతేజస్సును ఉపాసిస్తున్నాను అని సారస్వత తేజస్సును ఉపాసించిన ఆ మహనీయునికి శబ్ద బ్రహ్మసాక్షాత్కారం కలగటంలో ఆశ్చర్యమేమున్నది.

అఙ్గేకృత్వాప్రియ సహచరీ మంతికం సంప్రయాంతీం
వ్రీడాభారాదవనతముఖీ మంబికామాదరేణ
లోలాపాంగాం ప్రణయమధురాంలోచనాంతేన పశ్య
న్నంతస్తుష్యన్నవతు భగవానంబికా వల్లభోనః.

ప్రియసఖిని ముందుగా పెట్టుకొని తన సమీపానికివస్తున్నది, వ్రీడాభారంవల్ల అవనతముఖి, లోలాపాంగాలుకలది. ప్రణయ మధుర సమ్మోహన మూర్తి అయిన పార్వతీదేవిని అదరంతో క్రీగంటి చూపులతో వీక్షిస్తూ లోలోన సంతోషిస్తున్న అంబికావల్లభుడైన భగవానుడు మనల్ని రక్షించుగాక అని ఆ పార్వతీపరమేశ్వరుల ముగ్ధమోహన సరస శృంగార స్వరూపాలు సాక్షాత్కరింపజేశాడు. ఇట్లాంటి శ్లోకమొక్కటి చెప్పినా చాలు జీవితం ధన్యమవుతుంది.

అధ్యారూఢః కపర్దం పితురమరధునీం హేలయా గాహమానః
కర్షన్హర్షాతి రేకాత్ కనక కమలినీ షండముద్దండవృత్త్యా
అంతర్మగ్నం కరాగ్రం ఫణిపతి శిరసిస్వైరమాధాయతోయమ్
ముంచన్సించన్నథస్తాత్ ప్రమథపతి శిశుర్భాతిబాలోగణేశః.

తండ్రిగారి వాహనమైన వృషభాన్ని అధిరోహించి ఆకాశ గంగలో హేలగా మునకలువేస్తూ హర్షాతిరేకంతో మహోద్ధత వృత్తితో కనకకమలినీ షండాన్ని కలచివేస్తూ కరాగ్రంతో నీటిని గ్రహించి, ఫణిపతి తలపైన స్వేచ్ఛగా నిలిపి, నీటిని కిందికివిడుస్తూ తడుపుతూ క్రీడిస్తూ ప్రమథపతి శిశువైన బాలగణేశుడు ప్రకాశిస్తున్నాడు.

స్వీయైర్నిత్యం గుణపరిమళై ర్మోదయంతీదిగంతా
నత్యుద్దండై రమృతకిరణై రైందవీ లేఖికేవ
సాలంకారా సులలితపదా సాధువృత్తాసభావా
మాతానిత్యం మమభగవతీ భారతీ సన్నిధత్తామ్.

అత్యంత సమృద్ధమైన అమృతకిరణాలతో చంద్రలేఖ దిగంతాల్ని సుధా ప్రవాహంలో ముంచినట్లు స్వీయగుణపరిమళంతో సర్వదా పరవశింపజేస్తూ సాలంకారా, సులలితపదవిన్యాసా, సాధు వృత్తా, భావసమృద్ధా అయి ప్రకాశిస్తూ భగవతి భారతీదేవి నిత్యమూ

నాకు సన్నిధిని ఒసంగుగాకఅని కవి ప్రార్థించాడు. ఐందవీ లేఖ అమృతాన్ని కురిపించడం ఒక యోగవిద్యారహస్యం. ఇట్లా చెప్పడం సామాన్యులకు సాధ్యంకాదు.

ఇందులో కవితారహస్యాన్ని అంతటినీ మల్లినాథుడు ఇమిడ్చాడు. సారస్వత మంత్రోపదేశాన్ని అనుగ్రహించాడు. భావించే కొద్దీ పాఠకుల్ని పరవశింపజేసే పరమ సుకుమారభావాల్ని అందించాడు. యోగవిద్యారహస్యాన్నీ, వేదాంతతత్త్వాన్నీ ఇందులో నిక్షేపించాడు.

—:o:—

వివిధ విషయాలు

(1) ఇందుమతీ స్వయంవర ఘట్టంలో మధురా నగరాధిపతి స్వయంవరానికి వచ్చినట్లు కాళిదాసు వర్ణించాడు.

ఈ మధురానగరాన్ని ఇందుమతీదేవికి మనమడైన శత్రుఘ్నుడు నిర్మించాడు. లవణాసురుని జయించిన సందర్భంలోనే దీని నిర్మాణం జరిగినట్లు అందరికీ తెలుసు. వాస్తవం ఇట్లాఉండగా ఇందుమతీ స్వయంవరానికి మధురానగర ప్రభువు రావడం ఎట్లా సమంజసమని మల్లినాథుడు శంకిస్తాడు. ఇది మల్లినాథుని నిశితపరిశీలనకూ, సూక్ష్మదృష్టికీ నిదర్శనంగాఉంది.

(2) రామాయణంలో శ్రావణకుమారుడు దశరథ బాణహతుడై నదీతీరంలోనే చనిపోయినట్లు వర్ణింపబడిఉంది. రఘువంశంలో శ్రావణకుమారుని కొనఊపిరితో ఉండగా తల్లిదండ్రుల దగ్గరకు దశరథుడు మోసుకొనిపోయినట్లు ఉంది. ఈ విషయాన్ని రామాయణకథతో పోల్చి మూలానికివిరుద్ధంగాఉందని నిర్భయంగా మల్లినాథుడు ఆ దోషాన్ని ఎత్తిచూపాడు. మల్లినాథుడుచేసిన "నామూలం లిఖ్యతే కించిత్" అనే ప్రతిజ్ఞకు ఈ విమర్శనిదర్శనంగాఉంది రఘువంశానికి రామాయణం మూలం. కాళిదాసుపై ఎంత గౌరవమున్నా మూలానికి విరుద్ధమైన ఈవిషయాన్ని మల్లినాథుడు అంగీకరించలేకపోయాడు.

(3) రఘువంశం 18వ సర్గ 78వ శ్లోకంలో లక్ష్మణుడు నమస్కరించగా భరతుడు అతణ్ణి లేవనెత్తి ఆలింగనం చేసుకొన్నట్లు వర్ణింపబడిఉంది. ఇక్కడ మల్లినాథుడు రామాయణశ్లోకాన్ని ఉదాహరించాడు.

ఇస్తున్నాం. అందులో మల్లినాథుడు ఉదాహరించిన గ్రంథాలూ, గ్రంథకర్తలపేర్లూ ఇవ్వబడుతున్నాయి. వాటినిబట్టి అతనికి గల సర్వశాస్త్రపాండిత్యం వెల్లడిఅవుతుంది.

మల్లినాథుని శైలి

ఇతని సంస్కృత వాక్యరచనా విన్యాసం సులభశైలిలో ఉండి సుబోధకంగా ఉంటుంది. విషయవివరణ చాలా స్పష్టంగాఉంటుంది అంతేకాక తక్కువపదాలతో చెప్పదలచిన భావాన్ని హృదయానికి గాఢంగా పట్టేటట్లు ఇతనివ్యాఖ్యాన శైలిఉంటుంది. ఇతని వాక్యాలు సూత్రప్రాయంగా ఉండి సులభంగా కంఠస్థంచేయడానికి వీలుగా ఉంటాయి. పైగా వీటిలో అమూల్యమైన ధర్మసూక్ష్మాలూ, లోక న్యాయాలూ నిండిఉంటాయి. ఉదాహరణకు కొన్ని వాక్యాలు చూద్దాం.

"సర్వస్యాపి మహాజన పరిగ్రహ ఏవ పూజ్యతాహేతుః"

"సర్వాంగసౌష్ఠవ దర్శనాత్ సద్యోలగ్నం ప్రియ మనస్త్ర శేతిభావః"

"ఇహపరత్రచ తారకత్వాత్ పాత్రే కన్యాదానంగార్హస్థ్యస్య ఫలమ్."

"స్త్రీణాం కిల స్త్రీష్వేవాయత్తం లజ్జారక్షణమితిభావః"

"వయసా ఘనీకృతా కాంచీ సఖీవ జగ్రాహ."

"స్వకర గ్రాహ్యమపి ప్రసవం స్వకాంతా ప్రియార్థం తద్దీయ మానమేవాగ్రహీషురిత్యర్థః."

"స్వేచ్ఛా ఏవహి పరైరుపక్రియంతే, స్వయంచఉపకుర్వతే."

—: 0 :—

మల్లినాథుని ఆత్మీయత

తెలుగు వారి కీర్తి ఆసేతు శీతనగవ్యాప్తం కావటానికి కృషి చేసిన మహానుభావులలో మల్లినాథుడు అగ్రగణ్యుడు. కాళిదాసాది మహాకవులు సంస్కృతభాషలో వ్రాసిన కావ్యాలకు అందులో ఉండే అందచందాలు అందరికీ అర్థమయ్యేలా వ్యాఖ్యానాలు వ్రాసి సురభారతికి అనుపమానమైన సేవచేశాడు. ఆ వ్యాఖ్యానాలు మల్లినాథుని బహుముఖ ప్రజ్ఞాపాటవాలకు మాణిక్య దర్పణాలు. అమరభారతికి అమూల్యమైన అలంకారాలు.

కావ్యపాఠాలు చదువుకొనే ప్రతిసంస్కృత విద్యార్థికి మల్లినాథుని వ్యాఖ్యానాలు సహాధ్యాయుడుగా, ఆచార్యుడుగా, పరమాచార్యుడుగా, ఒక వృద్ధమూర్తిదగ్గర కూర్చుండి అన్వయాలు చూపిస్తున్నట్లూ, అర్థాలు వివరిస్తున్నట్లూ, పదప్రక్రియలు, అలంకారాలు, సారస్యాలు, ధ్వనులు నిగ్గుదేల్చి పండుఒల్చి చేతిలో పెట్టినట్లుగా ఉంటాయి.

మల్లిపూవుల గుబాళింపులా ఉంటుంది. మల్లినాథుల వారి వ్యాఖ్యానాల పోహళింపు. ఆయనే లేకపోతే కొన్ని కొన్ని మహాకావ్యాలు నూరామడలదూరంలో, అనుభవదూరంగా ఉండిపోయేవి. ఆయన తెలుగువాడై పుట్టటం అపురూపమైన వ్యాఖ్యలు వెలయించటం మన భాగ్యవిశేషం. అమరభారతికి ఆయన అలంకరించిన అలంకారాలు ఎప్పుడూ నూత్నశోభలు వెదజల్లుతూఉంటాయి. కలకాలం కలకల్లాడుతూ ఉంటాయి. ఆయన పాండిత్యం లోతులు చూస్తూ ఉంటే ఆశ్చర్యంవేస్తుంది ఎన్నింటిలో ఆయనకు గాఢప్రవేశముందో ఊహకూడా అందదు. వ్యాకరణంలో, తర్కంలో, వేదాంతంలో,

తతో లక్ష్మణమాసాద్య వై దేహీంచ పరంతపః
అభివాద్య తతః ప్రీతో భరతో నామ చాబ్రవీత్."

ఇందులో లక్ష్మణుడే జ్యేష్ఠుడన్నట్లు వెంటనే అనిపిస్తుంది. దానివల్ల కాళిదాసు పొరపాటుపడ్డాడేమో అనే సందేహంకూడా కలుగుతుంది కాని మల్లినాథుడు రామాయణ వ్యాఖ్యాత హృదయాన్ని ఇక్కడ ఆవిష్కరించి 'భరతుడు సీతా లక్ష్మణులను దర్శించాడనీ, అభివాదనం సీతకుమాత్రమే అనీ లక్ష్మణునికి కాదనీ స్పష్టం చేసి భరతుడు లక్ష్మణునికంటె పెద్దవాడే అనే విషయం స్పష్టమే అని వివరించాడు. ఇక్కడ కాళిదాసు చెప్పినది రామాయణానికి విరుద్ధమేమీకాదని మల్లినాథుడు సమర్థించాడు.

(4) నైషధం 19వ సర్గ 52వ శ్లోకం వ్యాఖ్యానిస్తూ మల్లినాథుడు "ఆదిశేషుడు తనకు వెయ్యితలలున్న కారణంగా 2,000 కళ్ళతో చూస్తాడనీ, 2,000 చెవులతో వింటాడనీ వివరించాడు.

ఇట్లా మల్లినాథుడు చెబుతూ "విశ్వేశ్వర భట్టారకుని వ్యాఖ్యనుఉట్టంకించాడు. పాములకు కన్నులే చెవులు కాబట్టి 1000 చెవులతోవిని, 1000 కన్నులతో చూస్తాయని అతడు వ్యాఖ్యానించాడు. ఈ విషయం మల్లినాథుడు విచారణీయమన్నాడు.

అయితే ఇక్కడ మల్లినాథుడు వాచ్యంగా చెప్పకపోయినా మల్లినాథుని అభిప్రాయమేసరిఅయినది. పాములువిన్నప్పుడు చూడలేవు. చూసినప్పుడు వినలేవు అందువల్ల 1000కళ్లతో చూడటం, 1000చెవులతో వినడంపొసగదు.

(5) నైషధం 17వ సర్గ 205వ శ్లోకంలో కవి నలుణ్ణి రామునితో సరిపోల్చాడు. అయితే వీరిద్దరూభిన్నయుగాలకు చెందినవారు. నలుడు కృతయుగంనాటివాడు. రాముడు త్రేతాయుగం నాటివాడు. అంటే కృతయుగంతర్వాత త్రేతాయుగమనీ వెనుక

యుగంలో వాడితో ముందుయుగంవాణ్ణి పోల్చటం సరికాదు కదా! అంటే కవి తదనంతరకాలంలోనివాడు కాబట్టి ఇట్లాంటివాటిని మనం అంగీకరించవచ్చునని మల్లినాథుడు సమర్థించాడు. పైగా కాలం అనంతమనీ అందులో సంఘటనలు పునరావృతమవుతాయని సమర్థించాడు.

(6) మేఘసందేశం 1వ సర్గ 2వ శ్లోకం ఆషాఢశుద్ధ పాడ్యమి నాడు యక్షుడు మేఘాన్ని చూశాడు. తన భార్యకు ఆ మేఘుని చేత సందేశం పంపదలచాడు. మేఘునితో అతను కార్తీకశుద్ధ ఏకాదశితో నాశాపం తీరిపోతుంది. ఈ నాలుగు మాసాలూ కళ్లు మూసుకొని కాలంగడపమని భార్యకు వార్త అందించమంటాడు.

అయితే ఇక్కడ ఆషాఢశుద్ధ పాడ్యమినుంచి కార్తీక శుద్ధ ఏకాదశి నాటికి 4నెలల 10రోజులవుతుందే? మరినాలుగు నెలలేతేవడం ఎట్లాపాసగుతుంది? అందుచేత 'ఆషాఢస్య ప్రథమ దివస' పాఠానికి బదులుగా "ఆషాఢస్య ప్రశమ దివస" అన్నపాఠం చెప్పుకొంటే "ప్రత్యాసన్నేనభసి" అనేచెప్పుకో యే శ్లోకానికి కూడా అనుకూలంగా ఉంటుందన్నాడు.

మల్లినాథుడు ఇక్కడ ఆవాదాన్ని ఖండించాడు ప్రశమదివస పాఠప్రకారం మూడు నెలల పదిరోజులే శాపాంతానికి అవుతుంది. అప్పుడు నాలుగు నెలలకి 20రోజులు తగ్గిపోయిన 'ప్రశమ దివస' పాఠంకన్నా 10రోజులు ఎక్కువైన 'ప్రథమ దివస' పాఠమే శ్రేష్ఠమవడం సబబు అని మల్లినాథుడు తన వాదాన్ని చాలా నైపుణ్యంతో సమర్థించుకున్నాడు.

పాఠభేదాలమీద చర్చలుసాగి స్తే గ్రంథం పెరిగిపోతుంది. పూర్వపక్షసిద్ధాంతాలు అందుకేవివరించలేదు. అట్లాగే మల్లినాథుని బహుముఖ శాస్త్రపాండిత్య లో స్థాలీపులాకంగా ఒకటి రెండు విషయాలు మాత్రమే చెప్పివిరమించాము. అయితే గ్రంథాంతంలో అనుబంధం

తతో లక్ష్మణమాసాద్య వైదేహీంచ పరంతపః
అభివాద్య తతఃప్రీతో భరతో నామ చాబ్రవీత్."

ఇందులో లక్ష్మణుడే జ్యేష్ఠుడన్నట్లు వెంటనే అనిపిస్తుంది. దానివల్ల కాళిదాసు పొరపాటుపడ్డాడేమో అనే సందేహంకూడా కలుగుతుంది కాని మల్లినాథుడు రామాయణ వ్యాఖ్యాత హృద యాన్ని ఇక్కడ ఆవిష్కరించి 'భరతుడు సీతా లక్ష్మణులను దర్శిం చాడనీ, అభివాదనం సీతకుమాత్రమే అనీ లక్ష్మణునికి కాదనీ స్పష్టం చేసి భరతుడు లక్ష్మణునికంటె పెద్దవాడే అనే విషయం స్పష్టమే అని వివరించాడు. ఇక్కడ కాళిదాసు చెప్పినది రామాయణానికి విరుద్ధ మేమీకాదని మల్లినాథుడు సమర్థించాడు.

(4) నైషధం 19వ సర్గ 52వ శ్లోకం వ్యాఖ్యానిస్తూ మల్లి నాథుడు "ఆదిశేషుడు తనకు వెయ్యితలలున్న కారణంగా 2,000 కళ్ళతో చూస్తాడనీ, 2,000 చెవులతో వింటాడనీ వివరించాడు.

ఇట్లా మల్లినాథుడు చెబుతూ "విశ్వేశ్వర భట్టారకుని వ్యాఖ్యనుఉట్టంకించాడు. పాములకు కన్నులే చెవులు కాబట్టి 1000 చెవులతోవిని, 1000 కన్నులతో చూస్తాయని అతడు వ్యాఖ్యా దించాడు. ఈ విషయం మల్లినాథుడు విచారణీయమన్నాడు.

అయితే ఇక్కడ మల్లినాథుడు వాచ్యంగా చెప్పకపోయినా మల్లినాథుని అభిప్రాయమేసరిఅయినది. పాములువిన్నప్పుడు చూడ లేవు. చూసినప్పుడు వినలేవు అందువల్ల 1000కళ్లతో చూడటం, 1000చెవులతో వినడంపొసగదు.

(5) నైషధం 17వ సర్గ 205వ శ్లోకంతో కవి నలుణ్ణి రాము నితో సరిపోల్చాడు. అయితే వీరిద్దరూభిన్నయుగాలకు చెందినవారు. నలుడు కృతయుగంనాటివాడు. రాముడు త్రేతాయుగం నాటి వాడు. అంటే కృతయుగంతర్వాత త్రేతాయుగమనీ వెనుక

యుగంలో వాడితో ముందుయుగంవాణ్ణి పోల్చటం సరికాదు కదా! అంటే కవి తదనంతరకాలంలోనివాడు కాబట్టి ఇట్లాంటివాటిని మనం అంగీకరించవచ్చునని మల్లినాథుడు సమర్థించాడు. పైగా కాలం అనంతమనీ అందులో సంఘటనలు పునరావృతమవుతాయని సమర్థించాడు.

(6) మేఘసందేశం 1వ సర్గ 2వ శ్లోకం ఆషాఢశుద్ధ పాడ్యమి నాడు యక్షుడు మేఘాన్ని చూశాడు. తన భార్యకు ఆ మేఘుని చేత సందేశం పంపదలచాడు. మేఘునితో అతను కార్తీకశుద్ధ ఏకాదశితో నాశాపం తీరిపోతుంది. ఈ నాలుగు మాసాలూ కళ్ళు మూసుకొని కాలంగడపమని భార్యకు వార్త అందించమంటాడు.

అయితే ఇక్కడ ఆషాఢశుద్ధ పాడ్యమినుంచి కార్తీక శుద్ధ ఏకాదశి నాటికి 4నెలల 10రోజులవుతుందే? మరినాలుగు నెలలేఅవడం ఎట్లాపొసగుతుంది? అందుచేత 'ఆషాఢస్య ప్రథమ దివస' పాఠానికి బదులుగా "ఆషాఢస్య ప్రశమ దివస" అన్నపాఠం చెప్పుకొంటే "ప్రత్యాసన్నే నభసి" అనేచెప్పుకోయే శ్లోకానికి కూడా అనుకూలంగా ఉంటుందన్నాడు.

మల్లినాథుడు ఇక్కడ ఆ వాదాన్ని ఖండించాడు ప్రశమదివస పాఠ ప్రకారం మూడు నెలల పదిరోజులే శాపాంతానికి అవుతుంది. అప్పుడు నాలుగు నెలలకి 20రోజులు తగ్గిపోయిన 'ప్రశమ దివస' పాఠంకన్నా 10రోజులు ఎక్కువైన 'ప్రథమ దివస' పాఠమే శ్రేష్ఠమవడం సబబు అని మల్లినాథుడు తన వాదాన్ని చాలా నైపుణ్యంతో సమర్థించుకున్నాడు.

పాఠభేదాలమీద చర్చలుసాగిస్తే గ్రంథం పెరిగిపోతుంది. పూర్వపక్ష సిద్ధాంతాలు అందుకేవివరించలేదు. అట్లాగే మల్లినాథుని బహుముఖ శాస్త్రపాండిత్యంలో స్థాలీపులాకంగా ఒకటి రెండు విషయాలు మాత్రమే చెప్పివిరమించాము. అయితే గ్రంథాంతంలో అనుబంధం

ఇస్తున్నాం. అందులో మల్లినాథుడు ఉదాహరించిన గ్రంథాలూ, గ్రంథకర్తలపేర్లూ ఇవ్వబడుతున్నాయి. వాటినిబట్టి అతనికి గల సర్వశాస్త్రపాండిత్యం వెల్లడిఅవుతుంది.

మల్లినాథుని శైలి

ఇతని సంస్కృత వాక్యరచనా విన్యాసం సులభశైలిలో ఉండి సుబోధకంగా ఉంటుంది. విషయవివరణ చాలా స్పష్టంగాఉంటుంది అంతేకాక తక్కువపదాలతో చెప్పదలచిన భావాన్ని హృదయానికి గాఢంగా పట్టేటట్లు ఇతనివ్యాఖ్యాన శైలిఉంటుంది. ఇతని వాక్యాలు సూత్రప్రాయంగా ఉండి సులభంగా కంఠస్థంచేయడానికి వీలుగా ఉంటాయి. పైగా వీటిలో అమూల్యమైన ధర్మసూత్రాలూ, లోక న్యాయాలూ నిండిఉంటాయి. ఉదాహరణకు కొన్ని వాక్యాలు చూద్దాం

"సర్వస్యాపి మహాజన పరిగ్రహ ఏవ పూజ్యతాహేతుః"

"సర్వాంగసౌష్ఠవ దర్శనాత్ సద్యోలగ్నం ప్రియ మనస్త్రేతిభావః"

"ఇహపరత్రచ తారకత్వాత్ పాత్రే కన్యాదానంగార్హస్థ్యస్య ఫలమ్."

"స్త్రీణాం కిల స్త్రీష్వేవాయత్తం లజ్జారక్షణమితిభావః"

"వయసా ఘనీకృతా కాంచీ సఖీవ జగ్రాహ."

"స్వకర గ్రాహ్యమపి ప్రసవం స్వకాంతా ప్రియార్థం తద్దీయ మానమేవాగ్రహీషురిత్యర్థః."

"స్వచ్ఛా ఏవహి పరైరుపక్రియంతే, స్వయంచఉపకుర్వతే."

—: o :—

మల్లినాథుని ఆత్మీయత

తెలుగు వారి కీర్తి ఆసేతు శీతనగవ్యాప్తం కావటానికి కృషి చేసిన మహానుభావులలో మల్లినాథుడు అగ్రగణ్యుడు. కాళిదాసాది మహాకవులు సంస్కృతభాషలో వ్రాసిన కావ్యాలకు అందులో ఉండే అందచందాలు అందరికీ అర్థమయ్యేలా వ్యాఖ్యానాలు వ్రాసి సుర భారతికి అనుపమానమైన సేవచేశాడు. ఆ వ్యాఖ్యానాలు మల్లినాథుని బహుముఖ ప్రజ్ఞాపాటవాలకు మాణిక్య దర్పణాలు. అమరభారతికి అమూల్యమైన అలంకారాలు.

కావ్యపాఠాలు చదువుకొనే ప్రతిసంస్కృత విద్యార్థికీ మల్లినాథుని వ్యాఖ్యానాలు సహాధ్యాయుడుగా, ఆచార్యుడుగా, పరమాచార్యుడుగా, ఒక వృద్ధమూర్తిదగ్గర కూర్చుండి అన్వయాలు చూపిస్తున్నట్లూ, అర్థాలు వివరిస్తున్నట్లూ, పదప్రక్రియలు, అలంకారాలు, సారస్యాలు, ధ్వనులు నిగ్గుదేల్చి పండుఒల్చి చేతిలో పెట్టినట్లుగా ఉంటాయి.

మల్లిపూవుల గుబాళింపులా ఉంటుంది. మల్లినాథుల వారి వ్యాఖ్యానాల పోహాళింపు. ఆయనే లేకపోతే కొన్ని కొన్ని మహా కావ్యాలు నూరామడలదూరంలో, అనుభవదూరంగా ఉండిపోయేవి. ఆయన తెలుగువాడై పుట్టటం అపురూపమైన వ్యాఖ్యలు వెలయించటం మన భాగ్యవిశేషం. అమరభారతికి ఆయన అలంకరించిన అలంకారాలు ఎప్పుడూ నూత్నశోభలు వెదజల్లుతూఉంటాయి. కలకాలం కలకల్లాడుతూ ఉంటాయి. ఆయన పాండిత్యం లోతులు చూస్తూ ఉంటే ఆశ్చర్యంవేస్తుంది. ఎన్నింటిలో ఆయనకు గాఢప్రవేశముందో ఊహాకూడా అందదు. వ్యాకరణంలో, తర్కంలో, వేదాంతంలో,

పూర్వమీమాంసలో శ్రుతి, స్మృతి, పురాణేతిహాసాల్లో అలంకారంలో అర్థశాస్త్రంలో, కామశాస్త్రంలో, ఆయుర్వేదంలో, అశ్వ గజ, రత్నపరీక్షా, జ్యోతిశ్శాస్త్రాలలో, శకున. సాముద్రిక, మంత్ర శాస్త్రాల్లో, నాట్యశాస్త్రాలలో, కవిత్వంలో ఒక టేమిటి అన్నిట్లోనూ అందివేసినట్లుగా ఉంది ఆయన ప్రజ్ఞాపాటవం.

ఏది ఎక్కడ ఎంత అవసరమో అంత సుమాళంగా అందిస్తాడు ఆయా శాస్త్రాల్లో ఉన్న కళావిలాసాన్ని. కువ్యాఖ్యా విషమూర్ఛిత మైన కాళిదాస కవిత్వానికి సంజీవినిపోశాడు. వ్యాఖ్యలకు ఆయన పెట్టినపేర్లే సార్థక్యాన్ని, సామర్థ్యాన్ని, ఔచిత్యాన్ని వెల్లడిస్తాయి. తరళమని, సంజీవిని అని, ఘంటాపథమని, సర్వంకషీన అని, నిష్కం టక అని, జీవాతువు అని చిత్ర చిత్రంగా నామకరణంచేస్తాడు. కవిత్వంలో దాగిఉండే అచ్ఛమైన అందాలు ఆవిష్కరించడంలో ఎంత ఒడుపుచూపిస్తాడో, ప్రక్షిప్తాలు పట్టిఇవ్వటంలో అంత ప్రజ్ఞ కనబరుస్తాడు ఆయన వ్యాఖ్యానం చదువుతూఉంటే రసరమ్య లోకాల్లో విహరిస్తున్నట్లూ, పారిజాత పరిమళాలతో మత్తెక్కిన మార్గంలో ప్రయాణంచేస్తున్నట్లు ఉంటుంది. ఎంతలోకజ్ఞానం, ఎంత విచిత్ర అనుభూతి, ఎన్ని సం ప్రదాయాలు, ఎన్నిరహస్యాలకు ఆవి ష్కరణాలు, ఎన్ని సమస్యలకు పరిష్కారాలు, ఎంత విలాసమైన వింగడింపు ఒక విజ్ఞాన విపణిలాఉంటుంది ఆయన వ్యాఖ్యాన సరణి

కాళిదాస మేఘం ఎక్కడికో, ఎగిరిపోయేది దిక్కూ తీర్థం లేకుండా మనకు దొరికేదికాదు. మల్లినాథుడు ఒక అనుకూల పవ వంలా పనిచేసి ఆ మేఘాన్ని తెలుగు దేశానికి పట్టుకొనివచ్చాడు. అమృతవర్షం కురిపించాడు కవితాకమనీయంగా. పట్టుకుంటే ఇమి డేదికాదు పట్టుకుంటే తెలిసేదికాదు. అందుకునే ఎత్తుల్లో ఉండేది కాదు. అలాంటిమేఘాన్ని అలవోకగా పట్టి జల్లులు కురిపించాడు రసజ్ఞుల హృదయాలు పరవశంచెందేలా. ఆయుస్సు మేలిమంతా

కరిగిపోయిందట మాఘం, మేఘం చూస్తుంటే, వ్రాస్తుంటే భావనా ప్రగల్భమైన విహాయస వీథిలో విహరిస్తున్న మేఘాన్ని పట్టుకోడానికి ఎంత ఆయాసపడ్డాడో! ఏమైతేనేం కాళిదాస కవితా కేదారాన్ని పండించాడు. సాగుచేసి బాగుచేసి మేలి మేలి పంటలతో మేఘం మాఘం ఒక్క లాంటివి. ఆమాత్రం ఈమాత్రం వాడికి ముక్కు దూరవు. ముక్కతోచదు దిక్కూ తెలీదు ఆ రెండింటికీ మల్లినాథుడు పండించిన వ్యాఖ్యానాలు కన్నులపండువుగా ఉంటాయి. ఆయన అసాధారణ మేధావైశిత్యానికి కైమోడ్పులర్పిస్తాం. బహుముఖ ప్రజ్ఞావైభవానికి జోహారుచేస్తాము. మూలంలో లేంది చెప్పడు. అక్కరలేంది అసలేచెప్పడు. చెప్పింది మాత్రం ఎవరూ చెప్పంది, అందిర్నీ మెప్పించేదీ, సురసరస్వతీ సౌందర్యాల్ని కుమ్మరించేదీ చెస్తాడు. "త్వయ్యాయత్తం కృషి ఫలమితి", "ఛన్నోపాంతః పరిణత ఫలద్యోతిభిః"; "ప్రాప్యావంతీ నుదయనకథా", "పాదన్యాసైః." మొదలైన శ్లోకాల్లో ఆయన చూపించినధ్వని విశేషాలు పరమ, రమణీయంగా ఉంటాయి. "వేణీభూతప్రతను సలిలా", తస్మిన్ కాలే మొదలైనశ్లోకాలలో ఆయనచెప్పే రహస్యాలు-రతిసర్వస్వాలు రతిరహస్య మణిదీపాలు.

వైజయంతి, విశ్వ, యాదవ, శాశ్వత, మేదినీ, ఉత్పలమాలా హలాయుధ, రుద్ర, అమరాది నిఘంటువుల్ని ప్రమాణంగా చూపిస్తాడు.

వ్యాకరణంలో ఆయనకుండే పాండిత్యం అపారం. నైషధం రెండోసర్గలో "భవ్యమన్వయం లభతేఽధరబింబం"అనే చోట చేసిన వ్యాఖ్యానం, 'భవ్యమబాధితం వృత్తిపదార్థాత్ సంసర్గ లక్షణ'మని సమర్థ పరిభాషా స్వార్థకతా నిరూపణంచేస్తాడు. "క్రియేత చేత్ సాధు విభక్తి చింతా'', భక్తుం ప్రభుం వ్యాకరణస్యదర్పణమ్, "గత్వాంతరా నలం భైమీ","ఉభయే ప్రకృతిఃకామే' "ఇహాకిముషసి"ఇత్యాది

స్థలాల్లో వ్యాకరణ పాండిత్యం మరింతగా స్పష్టంగా అవుతుంది. తర్కంలో వైశేషికులైన వ్యోమశివాచార్య శ్రీధరాచార్య, ఉదయనాచార్య కాణాద సూత్రవ్యాఖ్యానాలు ప్రస్తావిస్తాడు. "ధ్వాంతస్సమోరు", "ఉదయతిస్మ" అనే నైషధ శ్లోకాల్లో అతి లోకంగా ఈ న్యాయవైదుష్యం వెల్లడవుతుంది.

"విశ్వరూపకరణాత్", "అనాదిధావి", పరంపరాయా అనే స్థలాల్లో పూర్వోత్తర మీమాంసాశాస్త్ర పాండిత్యం వ్యక్తంచేస్తాడు. నైషధంలో "శ్రీశరాన్ అధితిసాత్వరవాణి" ఇట్లాంటి స్థలాల్లోనూ, మాఘకావ్యంలో ప్రథమంలో, భారవిలో, రఘువంశ, కుమార సంభ వాల్లో ఆయాసర్గల్లో వేదాంత పారిజాత ప్రసూనపరిమళాలు గుబా ళిస్తూ ఉంటాయి. మాఘంలో "ఉదాసితారం", "విజయస్త్వయి సేనాయాః", 'సాంఖ్యపురుష'. "ధాతులీన", ఈస్థలాల్లో సాంఖ్య యోగ రహస్యాలు అందించాడు. అన్వయముఖంగా అన్నింటినీ వ్యాఖ్యానంచేస్తూ తనకి పూర్వం ఉన్న అలంకారశాస్త్రాలన్నింటినీ సమన్వయం చేస్తాడు. మమ్మట, భామహ, వామన, దండి, భోజ, రుయ్యకాది మహాలంకారికుల్ని మనోజ్ఞంగా సమన్వయ పరిచాడు. శ్రుతబోధ, వృత్తరత్నాకర, పింగళచ్ఛందాదులలోని మర్మాలు ప్రతిసర్గచ్ఛందంలోనూ ఆవిష్కరిస్తాడు. మన్వాదులధర్మశాస్త్రాలు, కామందకీయం, శుక్రనీతి మాఘంలోనూ, భారవిలోనూ రెండో సర్గల్లో పండిస్తాడు. "రణద్భిరాఘట్టనయా" అనే మాఘ శ్లోకంలో సంగీత కళావేత్తృత్వం కనపడుతుంది. ఆయనటీకలు ఏకావళికి తర ళులు, కాళిదాసుకి సంజీవినులు, భారవికి ఘంటాపథం, మాఘానికి సర్వంకష, నైషధానికి జీవాతువు, తంత్రవార్తికానికి సిద్ధాంజనం, స్వరమంజరికి పరిమళం ఇంకా మిగిలిపోయినవి కొన్ని నిష్కంటకలు, కొన్ని సర్వపథీనలు.

మల్లినాథుని వ్యాఖ్యానాల ఆరంభంలోని శ్లోకాలు ఆయన కవితా కలాప్రాగల్భ్యానికి భక్తిపరవశత్వానికి ప్రతీకలుగాఉంటాయి.

వాటిలో "ఏకలోచన మేకార్ధేసార్ధలోచనమన్యతః, నీలార్థం నీల కంఠార్ధం మహఃకిమపి మన్మహే"; జాహ్నవీ మూర్ధ్నిపాదేవాకాలః కంఠేపపుష్యథ, కామారిం కామతాతంవా కంచిదేకం భజామహే మనసో మమసంసార బంధముచ్ఛేత్తు మిచ్ఛతః, రామచంద్ర పదాం భోజయుగళం నిగళాయతామ్: అర్థాంగీకృతదాంపత్యమపి గాఢాను రాగియత్; ఉపాధిగమ్యో వ్యనుపాధిగమ్యః, భజేమహి నిపిక్రయైకం మహురన్యం పయోధరం, మార్గంతం బాలమాలోక్య శ్వసంతావాది దంపతీ ఇత్యాది శ్లోకాలు మల్లినాథుని పాండిత్యానికి నికషోపలాలు.

మల్లినాథుడు గొప్ప ప్రతిభావంతుడని వేరే చెప్పనక్కరలేదు. ఆతని వ్యాఖ్యానాలన్నీ దానికి నిదర్శనాలే పాఠభేదాలు నిరూపించడంలో, ప్రక్షేపాలు పట్టిఇవ్వటంలో దుర్వ్యాఖ్యలు ఖండించటంలో ఈతనిప్రతిభ వ్యక్తమవుతుంది. చాలా మంది శిష్యులకు పాఠాలు చెప్పడంవల్ల, వ్యాఖ్యానాలు రచించడంవల్ల ప్రసిద్ధి వహించిన మల్లినాథసూరికి పదవాక్య ప్రమాణపారావార పారీణుడనీ, శాస్త్రవ్యాఖ్యానాదులు రచించిన తరువాత మహోపాధ్యాయుడనీ బిరుదనామాలు లభించాయి. అన్వర్థంగా విద్వల్లోకంలో పదమంటే వ్యాకరణం, వాక్యమంటే మీమాంస, ప్రమాణమంటే తర్కం. ఈ మూడుశాస్త్రాల్లో పారంగతులైనవారికే ఈ బిరుదు చెల్లుతుంది. "ఈక్షతేర్నాశబ్దమ్" అనే వేదాంతసూత్రానికి ఉపోద్ఘాతం వ్రాస్తూ "తత్ర పద వాక్య ప్రమాణజ్ఞేనాచార్యేణ వేదాంతవాక్యానాం బ్రహ్మణి గతి ప్రదర్శనాయ షాక్యాబాస, యుక్త్యాభాస ప్రతిపత్తయః పూర్వ పక్షీ కృత్య నిరాక్రియంతే" అనే సందర్భంలో ఈ పదవాక్య ప్రమాణజ్ఞ బిరుదం వ్యాసమహర్షికి విశేషణంగా మొట్టమొదట శ్రీశంకర భగవత్పాదులు వాడారు. అట్టిబిరుదము మల్లినాథుడికే మళ్ళీలభించడమూ, మరెవ్వరికీ అట్లాంటిబిరుదం లభించకపోవడమూ గమనించదగ్గది.

ఆనాటి ప్రభుపండితుల సారస్వత కృషి ఇట్లా ఉండేది. విద్యా సేవ విజ్ఞానాభివృద్ధి విద్వజ్జన పరిశ్రమమే మల్లినాథుని మనతము. పాండి త్యాన్ని ప్రభువులు, విద్వాంసులూ గుర్తించారు. హర్షించారు. రెండో ప్రౌఢదేవరాయలు విజయనగర సామ్రాజ్యాన్ని పరిపాలి స్తున్న కాలంలో సెట్టి, కోమటి, వైశ్య, వణిగాదులయిన తెగలలో చతుర్వింశతి నగరాల్లోనూ, నూట ఎనిమిది దివ్య తిరుపతులలోనూ వర్తకవ్యాపారాలు చేసుకోవడానికి ఎవరెవరు, అర్హులనే విషయంలో వివాదం ఏర్పడింది. వివాదగ్రస్తమైన కాంచీపురశాసనాన్ని పరిశీలించి ధర్మనిర్ణయం చేయడానికి రాయలు ఒక మహాధర్మసభ నెలకొల్పి డానికి మహావిద్వాంసుడైన మల్లినాథసూరిని అధ్యక్షుణ్ణి చేశాడు. ఆ విధంగా మల్లినాథుడు చేసిన ధర్మనిర్ణయం 'వైశ్య వంశసుధాకర మనే పేరుతో ఒకమహాగ్రంథంగా మైసూరుప్రభుత్వంవారి ప్రాచీన సంస్కృత గ్రంథాలయంలో భద్రపరచబడిఉంది. ఈ సంఘటన మూలంగా మల్లినాథుని ధర్మశాస్త్రవేత్తృత్వం గోచరమవుతుంది. ధనార్జనకోసంగాని, సత్కార గౌరవాలకోసంగాని ఎన్నడూ మల్లినాథుడు రాజాస్థానాలలో అడుగుపెట్టలేదు. సమయం వచ్చి నప్పుడు ధర్మనిర్ణయ మహాసభకు అధ్యక్షతవహించి ధర్మనిర్ణయం చేయడానికీ రాజాదరం, ప్రజాదరం పొందడానికీ వెనుకంజ వేయ లేదు. దీన్నిబట్టి మల్లినాథునిలోకజ్ఞత, ధర్మానురక్తి, సామర్థ్యమూ వెల్లడి అవుతాయి.

దూరతీరాలనుంచి విద్యాభ్యాసం కోసం తన దగ్గరకు వచ్చి తన్నాశ్రయించిన విద్యార్థుల్ని కనికరించి విద్యా దానంతోపాటు తండ్రివలె పోషించిన ధర్మాత్ము డీమహోపాధ్యాయుడు. రాత్రిం బవళ్లు కంటవత్తివేసికొని వివిధగ్రంథాలు పరిశీలించి బహుళసంఖ్యలో వ్యాఖ్యానాలు రచించా డీమహావ్యాఖ్యాత. విద్యార్థుల్ని దృష్టిలో పెట్టుకొనే ఈ వ్యాఖ్యలు వ్రాసినట్లు "మందాత్మానుజిఘృక్షయా"

అనే మల్లినాథుని మాటలవల్ల స్ఫురిస్తుంది. క్షమావంతుడు, అనల సుడు అయిన ఈతని బహుముఖమైన కృషి "తన కావించిన సృష్టి తక్కొరులచేతన్ కాదునాన్" అన్నట్లు అనితరమైనది. వాదాలతో ప్రతిపక్షుల్ని ఆక్షేపించే పట్టుల్లోకూడా కఠినపదాలు ప్రయోగించక పోవడం ఈతని అనౌద్ధత్యానికీ, మృదు భాషిత్వానికీగుర్తు శాస్త్ర ప్రవచనాలతో రాటుదేలినా, హాస్యమెరుగని మోటుమానిసిమాత్రం కాదు. పన్నీరు జల్లువంటి లలితహాస్యాలు నేర్చినవాడే "యక్షస్య ఉన్మత్తత్వాత్ ప్రలపిత"మ్మని వ్యాఖ్యాత నిరుక్తకారుడంటే అతని మాట అతనికే చెల్లిస్తూ "స్వయమేవోన్మత్త ప్రలాపి" అని నవ్వు కుంటాడు. నాథుడనే వ్యాఖ్యాతమాటలు పేర్కొంటూ 'నాథవచన మనాథవచనమేవ' అని తిరస్కరిస్తాడు. మృదుపుగా "పీతజన్మజరసమ్" అనే చోట వ్యాకరణవిశేషాలు వివరిస్తూ ఇక్కడ కొందరు వ్యాఖ్యా తలు పాఠాన్ని పుంలింగంలోకిమార్చడాన్ని మల్లినాథుడు విమర్శిం చాడు. ఇదివారి అవివేకానికిమూలమన్నాడు. 'ఏవంచ యదత్ర జరస ఇతి—కేషాంచిత్ పాఠాంతర కల్పనం తదజ్ఞాన విజృంభిత మేవ అంటాడు. ఒకచోట విషయాన్ని వివరిస్తూ ఉపపత్తులెన్నో చెప్పి చెప్పి ఇంకా సందేహం తీరకపోతేయది తత్రాపి సందేహ స్సకలత్రాణి పృచ్ఛతు అని సుకుమారంగా హెచ్చరిస్తాడు.

మల్లినాథుడు అఖిలశాస్త్రవేత్తఅయినా దిగంత విశ్రాంతకీర్తి అయినా కొంచెమైనా గర్వమెరుగనిఅమలచరిత్రుడు. విద్వాంసులకు, సౌజన్యంవల్ల కలిగిన యశస్సు ఈయనతోనే లోకంలో ప్రారంభ మైంది. 'లోకేఖా ద్యదుపజ్ఞ మేవ విదుషాం సౌజన్య జన్యం యశః' అని నిగర్వంగా చెప్పుకొన్న వినయసంపన్నుడు.

అన్నింటికి మెరుగులు పెట్టింది ఈ విజ్ఞానమూర్తి భక్తిభావం. ఎన్నిచదువులు చదివినా, ఎన్నిగ్రంథాలు వ్రాసినా పాండిత్యం తల్ల వడుతుందేకాని భక్తిభావం కలగడంభాగ్యవిశేషం. వ్యాఖ్యారంభాల్లో

ఈ మహోతాత్త్వికుడు పొందుపరిచిన శ్లోకాలు భక్తివైరాగ్యాలకు దీపికలు. ఇవి ఇతని ఆత్మసౌందర్యానికి అద్దం పడతాయి.

ఆశంసే నిత్యమానందం రామనామకథాఽమృతం
సద్భిః స్వశ్రవణై ర్నిత్యం పేయం పాపం ప్రణోదితుమ్
రామచంద్ర చరణారవిందయో రంతరంగ చరభృంగలీలయా
తత్ర సంతి హి రసాశ్చతుర్విధాస్తాన్యథారుచి సదైవ నిర్విశ
యత్పాదపాంసు సంపర్కాదహల్యాసీ దపాంసులా
కారుణ్యసింధవే తస్మైనమో వై దేహి బంధవే
మనసోమమసంసార బంధముచ్ఛేత్తు మిచ్ఛతః
రామచంద్ర పదాంభోజ యుగళం నిగళాయతామ్

అని ఈవిధంగా ఆశించాడు - మహాభక్తుడు మల్లినాథసూరి. పైకి కర్మయోగియై జీవితమంతా సారస్వతసేవలో వ్యయించి, లోపల జ్ఞానయోగియై చతుర్థపురుషార్థాన్ని ఆకాంక్షించిన పుణ్యమూర్తి మన మహోపాధ్యాయుడు.

ఇంతటి సమగ్రత్వం లభించేది ఏ కొందరి జీవితాల్లో మాత్రమే "ఆత్మావై పుత్ర నామాసి" అన్నట్లు తనంతటి పండితుడు పుంభావ సరస్వతి జ్యేష్ఠకుమారుడు పెద్దిభట్టు తన వ్యాఖ్యలకు దీటయిన వ్యాఖ్యలు వ్రాసి ప్రతాపరుద్ర యశోభూషణానికి రత్నాపణం తెరచిన ద్వితీయపుత్రుడు కుమారస్వామి సోమపీథి. మల్లినాథుడు స్వరమంజరికి పరిమళ వ్యాఖ్యవాస్తే స్వరమనోజ్ఞమంజరికి పరిమళ వ్యాఖ్యవ్రాసి తండ్రిగారి అడుగుజాడలలో నడచిన మూడవ కుమారుడు గిరినాథుడు. తనచుట్టూ తానురచించిన వ్యాఖ్యానాలు, కృతిరత్నాలు, శిష్యరత్నాలు 'వానిదిబాగ్యవైభవ' మన్నట్లుగా నిండుగా సాగింది. మల్లినాథుని జీవితం నిర్మలంగా ప్రవాహంలా.

ఉభయ కవిమిత్రుని 'కిమస్థిమాలాం కిముకౌస్తుభంవా పరిష్క్రియాయాం బహు మన్యసే త్వం, కింకాలకూటః కిమువా

యశోదా స్తన్యం తవస్వాదువద ప్రభో మే". అనే శ్లోకం మల్లినాథుణ్ణి ఆకర్షించింది. అందుచేతనే "జాహ్నవీమూర్ధ్ని పాదేవాకాలః కంఠే వపుష్యథ, కామారిం కామతాతంవా కంచి దేకం భజామహే అనే శ్లోకాన్ని మల్లినాథుడుని లేఖిని ఆవిష్కరించింది.

ఇదేవిధంగా మల్లినాథుని "భ జేమహినిపిర్యైకం ముహురన్యం పయోధరం, మార్గంతం బాల మాలోక్య శ్వసంతావాది దంపతీ" అనే శ్లోకం ఆంధ్రకవితా పితామహుణ్ణి ముగ్ధుణ్ణి చేసింది. ఈ భావాన్నే "అంకముజేరి శైలతనయా స్తనదుగ్ధములాను వేళ" అనే ప్రార్థనా పద్యంలో తీసుకురావడానికి ప్రయత్నం చేశాడు.

వ్యాఖ్యాతలలో మల్లినాథుని వ్యాఖ్యాన పద్ధతులకు మోజు పడి అనుసరించినవారు ముగ్గురున్నారు. బాల భారతానికి వ్యాఖ్యానం వ్రాసిన మహామంత్రి తిమ్మరుసు, ప్రబోధ చంద్రోదయానికి వ్యాఖ్య వ్రాసిన నాదిండ్ల గోపనమంత్రి, ప్రతాపరుద్రీయానికి రత్నాపణ వ్యాఖ్య వ్రాసిన కుమారస్వామిసోమపీథి. మల్లినాథుని "నామూలం లిఖ్యతేకించిత్ నానపేక్షితముచ్యతే" అనే నియమాన్ని అక్షరాలా పాటించారు.

ఇక వేదం వేంకటరాయశాస్త్రిలవారి సంగతి చెప్పనక్కర లేదు. ఎందుకంటే వారు మల్లినాథుని 'సంజీవినికి చేటికగా 'సంజీవని' వెలయించినవారు. ఆంధ్ర మల్లినాథులుగా తెలుగు వ్యాఖ్యాన ప్రపంచంలో ధ్రువతారగా నిల్చారు.

సురవరం ప్రతాపరెడ్డిగారి ప్రతిభ కొనియాడుతూ డా॥ సి. నారాయణరెడ్డిగారు "మూర్ఛపోయినట్టి తెలుగుజాతి సంస్కృతికి టీకలుదీసిన మల్లినాథుడని రెడ్డిగారిని వర్ణించడంలో నారాయణరెడ్డి గారికి మల్లినాథునిపైన ఉండే గౌరవం రెడ్డిగారిపై ఉండే ఆత్మీయత ప్రస్ఫుటమవుతాయి.

మల్లినాథుడు కాళిదాసును బుద్ధిపూర్వకంగా అనుసరించిన అనుకరించిన స్థలాలుచూస్తే మల్లినాథునికి పూర్వ కవులమీద, అందు లోనూ కాళిదాసుపైన ఉండే గౌరవభావం గర్వరాహిత్యం దర్శన మిస్తాయి. "వాగర్థావివ సంపృక్తౌ వాగర్థప్రతిపత్తయే, జగతః పితరౌ వందే పార్వతీపరమేశ్వరౌ" అని కాళిదాసు కావ్యారంభంచేస్తే- మాతా పితృభ్యాం జగతో నమో వామార్ధజానయే, సద్యో దక్షిణ దృక్పాత సంకుచ ద్వామదృష్టయే'' అని మల్లినాథుడు వ్యాఖ్యా రంభం చేస్తాడు. కాళిదాసు "మంద్రః కవియశః ప్రార్థీ గమిష్యామ్యుప హాస్యతాం, ప్రాంసులభ్యే ఫలే లోభాదుద్బాహు రివవామనః."

''అథవాకృత వాగ్ద్వారే వంశేస్మిన్ పూర్వసూరిభిః",

"మణౌవజ్ర సముత్కీర్ణే సూత్రస్యేవాస్తిమేగతిః''

అని వినయాన్ని ప్రకటించుకొంటే "కాళిదాస గిరాంసారం కాళిదాసః సరస్వతీ, చతుర్ముఖోఽథవాసాక్షా ద్విదుర్నాన్యేతు మాదృశాః" "తథాపి దక్షిణావర్తనాథాద్యైః క్షుణ్ణవర్త్మసు, వయంచ కాళిదాసోక్తిష్వవకాశం లభేమహి'' అని మల్లినాథుడు కాళిదాసువలెనే తన వినయాన్ని ప్రకటించుకొన్నాడు కాళిదాసు పైన తనకుండే గురుభావం ప్రదర్శించుకున్నాడు.

సమకాలికుల్ని గౌరవించే సౌజన్యం, ఔదార్యం వారి గ్రంథాలకు ప్రచారం కలిగించే అభిమానం, ఆదరం మల్లినాథునిలో మూర్తీభవించాయి తన వ్యాఖ్యానాలలో సమకాలికుల గ్రంథాల్ని ఎక్కువగా ఉదాహరించి వాటికి ప్రచారం కలిగించాడు

స్వీయాభిప్రాయాన్ని నిర్భయంగా ప్రకటించే ధైర్యం మల్లి నాథునికి ఎక్కువ. వ్యాఖ్యానాల్లో పూర్వ వ్యాఖ్యాతల మతాలను నిర్దాక్షిణ్యంగా ఖండించాడు. అట్లాగని దోషైకదృక్కు మాత్రం కాడు. గుణలేశం ఉంటే దాన్ని వెదకిపట్టుకొని మనముందుంచు తాడు.

సాధ్యమయినంతవరకు మూలపాఠాలనే సమర్థిస్తాడు. ఆగంతుక పాఠాలను ప్రక్షిప్త పాఠాలను అంగీకరించడు. ఏవిధం గానూ సమర్థించడానికి వీలుకానిచోట్ల కూడా "నిరంకుశాః కవయః" అనీ "ప్రక్రమాను సారాత్తాం మదస్తమపి వలభ సంగఇతి ప్రయోక్తవ్యే విశేషణత్వేన ప్రయోగో మహాకవీనా మనుద్వే గాత్" అనీ సమర్థిస్తాడు పాఠాంతరాల్లో ప్రమాణంగా ఉన్న వాటిని, అర్హమైనంతవరకూ పరిగణనలోకి తీసుకోవడం ఈయనలో ఉన్న ప్రత్యేకత. అనేక వ్యాఖ్యానాలతో ఉన్న వ్రాతప్రతులు భద్రపరచి ఉంచటం దీనికి మరో కారణం కావచ్చు. ఒక్కొక్కప్పుడు తానిచ్చిన పాఠాలకు సమగ్ర చర్చ చేస్తాడు. ఒకప్పుడు ఏ చర్చా చేయడు. ప్రమాణంగా ఒక పాఠాన్ని గ్రహించినప్పుడు దానిని అంగీకరించిన వ్యక్తిపేరు పేర్కొవడం కూడా మల్లినాథునికి అల వాటు అయన వ్యక్తి అనటంకంటె విజ్ఞాన సర్వస్వమనదగినవాడు. మల్లినాథసూరి అభినవగుప్తుడు నిర్ణయించిన సహృదయ లక్షణాలన్నీ మూర్తీభవించినవాడు. గ్రంథ ప్రచారానికిగాని వ్యాప్తికిగాని అవ కాశమేలేని అట్లాంటి రోజులలో ఇన్ని గ్రంథాలు, నిఘంటువులు మల్లినాథుడుదాహరించడం మహాశ్చర్యం కలిగిస్తుంది. వ్యక్తిగత విషయాలజోలికి మల్లినాథుడు పోలేదు పీఠికాశ్లోకాల్నిబట్టి శైవ మతాభిమానమున్నట్లు కొందరు చెబుతున్నారు. కాని అది అంత నిశ్చయంగా చెప్పడానికి వీలుగాలేదు. పీఠికాశ్లోకాలలో శ్రీరామ చంద్రస్తుతి ఎక్కువగా చేశాడు. అదికాక రఘువీరచరితమనే మహా కావ్యాన్ని రచించాడు. వీటినిబట్టి శ్రీరామ భక్తిపరుడని మాత్రం స్పష్టంగా తెలుస్తున్నది.

మల్లినాథుని వ్యాఖ్యానాలు వేదవేదాంగాలకు శ్రుతి, స్మృతిపురాణేతిహాసాలకు, ధర్మార్థ కామశాస్త్రాలకు, ఛందోఽలంకా రాలకు పట్టుకొమ్మలుగా ఉంటాయి.

"జగతి వివిధ విద్యాసింధుముష్టింధయానాం
పరభణితి పరీక్షా యుజ్యతే సజ్జనానాం
తదిహ మమ నిబంధే దూషణం భూషణంవా
భవతియది విదగ్ధైః తద్ధ్యవశ్యంవిమృశ్యమ్."

అంటాడు ఏకావళీ టీకాంతంలో 'బెండో'' గుండో' తేల్చ మంటాడు సాహసంగా. ఎంత ప్రత్యయమున్నవాడు! అలా అని అన్యధికార్కరం లేదు.

పారీణాః పదసాగరస్యకతిచిత్
తంత్రే స్వతంత్రాఃపరే
కేచిత్ కర్కశతర్కవక్ర భణితి
ప్రౌఢిప్రియం భావుకాః
అన్యే సత్కవితామృతా బ్ధిలహరీ
మృష్టాంశ ముష్టింధయాః
నైతే కేపివయంతు, కింతు
తఇమే సర్వేబహూకుర్వతే.

—o—

తద్దివ్య మవ్యయంధామ సారస్వతముపాస్మహే
యత్ప్రకాశాత్ ప్రలీయంతే మోహాంధతమసశ్ఛటాః

శుభమ్.

—o—

అనుబంధము

గ్రంథాలు – గ్రంథకర్తలు

1 రామాయణమ్ 2 మాఘకావ్యమ్ 3 నైషధః 4 రససుధాకరః 5 పాలకావ్యః 6 భవిష్యోత్తరమ్ 7 మార్కండేయః 8 వాల్మీకిః 9 రాజమృగాంకః 10 యాజ్ఞవల్క్యః 11 మితాక్షరా 12 న్యాసోద్యోతః 13 మాతంగః 14 న్యాసకారః 15 భట్టమల్లః 16 పరాశరః 17 వాత్స్యాయనః 18 అలంకార సర్వస్వకారః 19 కామందకః 20 జయాదిత్యః 21 వసంతరాజీయమ్ 22 దశరూపకమ్ 23 కామందకమ్ 24 ఘంటాపథమ్ 25 సంజీవినీ 26 గణవ్యాఖ్యానమ్ 27 భాష్యకారః 28 పౌరాణికాః 29 హలాయుధః 30 రంగరాజః 31 పూర్వాచార్యాః 32 హేమచంద్రః 33 రత్నాకరః 34 హేమః 35 వృత్తరత్నాకరః 36 అమరశేషః 37 నైదానికాః 38 కావ్యప్రకాశమ్ 39 'సోహమిత్యాది' శ్రుతిః 40 'నచపునరావర్తతే' శ్రుతిః 41 ఆచార్యదండీ 42 క్షీరస్వామీ 43 అభిధానరత్నమాల 44 మహాభాష్యమ్ 45 భగవానగస్త్యః 46 వైజయంతీ 47 సంగీతరత్నాకరం 48 అలంకారశాస్త్రము 49 భాగవతము 50 భగవద్గీత 51 విష్ణుపురాణము 52 అలంకార సర్వస్వసంజీవిని 53 భట్టోమల్లః 54 భట్టపాదః 55 భట్టనాయకః 56 తంత్రవార్తికటీకా 57 చక్రవర్తిన్ 58 కిరణావళి 59 అలంకారసర్వస్వ సంజీవినీకారః 60 స్వరమంజరీ పరిమళవ్యాఖ్య 61 ముద్రారాక్షసమ్ 62 శ్రీశంఖుకః 63 పురుషసూక్తమ్ 64 శబ్దార్ణవము 65 ఆశ్వలాయనః 66 అవస్థాసంగ్రహః 67 వ్యాఖ్యాసుధా 68 అశ్వశాస్త్రమ్ 69 రేవతోత్తరమ్ 70 హయలీలావతి 71 మృగచర్మీయమ్ 72 రాజపుత్రీయమ్ 73 శాకటాయానః 74 సర్వధరః 75 దేశికః 76 భోజరాజః 77 విశ్వప్రకాశః

78 సాంఖ్యసిద్ధాంతః 79 పింగళనాగః 80 అగస్త్యరత్నశాస్త్రము
81 కాత్యాయనః 82 నారసింహమ్ 83 శకునార్ణవః 84 అఖ్యాత
చంద్రికా 85 అపస్తంబః 86 ఆర్యభట్టః 87 లఘుజాతకమ్ 88 కాళి
దాసః 89 కుమారసంభవమ్ 90 కూటస్థీయమ్ 91 గోనర్దీయః
92 చాతుసః 93 దక్షిణావర్తః 94 దండనీతిః 95 దశరూపకమ్
96 హరివంశః 97 సిద్ధయోగసంగ్రహః 98 వృత్తికారః 99 విష్ణు
పురాణమ్ 100 విశ్వప్రకాశః 101 వాహటః 102 ఉత్పలమాలా
103 మిహిరాచార్యః 104 హేమచంద్రః 105 వామనపురాణమ్
107 అష్టాంగహృదయమ్ 108 అభిధానచింతామణి 109 అభిధాన
రత్నమాల 110 ఉణాదిసూత్రమ్ 111 ఉత్తరకాండమ్
112 ఋగ్వేదసంచికా 113 కామసూత్రమ్ 114 కిరాతార్జునీయమ్
115 ఛాందోగ్యోపనిషత్ 116 చాణక్యనీతిః 117 ఘంటాపథః
118 కువలయానందః 119 తైత్తిరీయోపనిషత్ 120 నిరాలంబోప
నిషత్ 121 వార్తికమ్ 122 వసంతరాజీయమ్ 123 భవిష్య
పురాణమ్ 124 గణసూత్రమ్ 125 మహానారాయణోపనిషత్
126 మహాభారతమ్ 127 భాష్యమ్ 128 ముండకోపనిషత్ 129 అను
శాసనము 130 అగస్త్యుడు 131 యజుర్వేదసంహితా 132 మేఘ
దూతమ్ 133 జయాదిత్యః 134 రత్నప్రకాశః 135 రఘువంశమ్
136 యోగయాత్రాః 137 రత్నశాస్త్రమ్ 138 పరిభాషా 139 పాల
కావ్యమ్ 140 రేవతోత్తరమ్ 141 శ్వేతాశ్వతరోపనిషత్
142 పాణినిః 143 వృత్తరత్నాకరటీకా 144 వృత్తివార్తికమ్
145 ఆపస్తంబుడు 146 కల్యాణవర్మ 147 జైమినిః 148 న్యాస
కారః 149 పింగళనాగః 150 పౌరాణికాః 151 భాష్యకారః
152 నృత్యవిలాసః 153 నిరుక్తమ్ 154 సర్వస్వకారః 155 వ్యక్తి
వివేకః 156 వైద్యకమ్ 157 ప్రకాశవర్షః 158 రసరత్నాకరము
159 వాత్స్యాయనీయాః 160 రత్నప్రదీపః 161 త్రికాండ
శేషమ్ 162 రభసకోశః 163 దశరూపకః 164 బాలకావ్యము

165 సాముద్రికాః 166 రతిరహస్యమ్ 167 కుముదాకరః
168 ధన్వంతరిః 169 సిద్ధాంతకౌముది 170 శాకటాయనః
171 సాహిత్యదర్పణము 172 ఏకావళి 173 వ్యక్తివివేకకారః
174 నీతివాక్యామృతమ్ 175 భవభూతి 176 అభిజ్ఞానశాకుంతలమ్
177 సారస్వతాలంకారం 178 రసాకరః 179 అలంకారసూత్రము
180 శ్రీహర్షచరితమ్ 181 సంగీతరత్నాకరమ్ 182 రసరత్నా
కరము 183 అజయ్యకోశః 184 అశోకకల్పమ్ 185 నిరుక్తకారః
186 మాలతీమాలా 187 మదిరార్ణవము 188 అమరవచన
వ్యాఖ్యానమ్ 189 నృత్యసర్వస్వమ్ 190 శంభురహస్యమ్
191 స్కాందపురాణమ్ 192 పాణినీయమ్ 193 చాంద్ర
వ్యాకరణమ్ 194 నిమిత్తనిదానమ్ 195 కర్ణోదయమ్ 196 శకున
శాస్త్రమ్ 197 రాజకందర్పః 198 శాబరభాష్యము 199 అలం
కారికాః 200 బ్రహ్మపురాణమ్ 201 శ్రౌతలింగము 202 యోగ
సారము 203 నానార్థకోశః 204 పరిశిష్టము 205 నిరుక్తము
206 ముగ్ధబోధకారః 207 భూపాలః 208 జ్యోతిషికాః
209 గజాయుర్వేదము 210 అభినవగుప్తః 211 నారదః
212 బ్రహ్మాండపురాణమ్ 213 భరతః 214 బుధః 215 కాశికా
2 6 యాస్కః 217 నాథః 2 8 వశిష్ఠః 219 కోశః 220 కవిః
221 కౌటల్యః 222 మనుః 223 వాగ్భటః 224 రుద్రః
225 రసికాః 226 అజయః 227 భారవిః 228 పతాకాయము
229 సజ్జనః 230 మాతంగః 231 మాఘః 232 వైద్యకము
233 రుద్రటః 234 మార్తాండః 235 ధరణిః 236 భట్టః
237 సాంఖ్యాః 238 బాహటః 239 కేశవః 240 కైయటః
241 శాశ్వతః 242 దత్తిలః 243 యాదవః 244 విశ్వః
245 వామనః 246 భామహః 247 శాంకర 248 శాబర
249 గోవర్ధనః 250 ఆశమము 251 ముకుటః 252 కణభుక్

253 గార్గ్యః 254 గౌతమః 255 వ్యాసః 256 శంఖః 257 హారీతః 258 భాగురాః 259 స్కాందమ్ 260 సంగ్రహః 261 హైమః 262 హరిః 263 స్వామీ 264 అనేకార్థః 265 మేదినీ 266 న్యాయః 267 శ్రుతిః 268 శాస్త్రమ్ 269 వచనమ్ 270 ఉత్పలః 271 వల్లభః 272 అజయపాలుడు 273 ఆర్యభట్టు 274 ఉజ్వల దత్తుడు 275 ఉదయనుడు 276 ఉద్భటుడు 277 కాహళుడు 278 కౌమారుడు 279 గురు 280 చార్వాకుడు 281 ధ్వనికారుడు 282 ధనంజయుడు 283 న్యాయాచార్యః 284 నైయాయికాః 285 పారమేశ్వరః 286 పాస్కరః 287 పితామహః 288 ప్రాభాకరః 289 బౌద్ధాః 290 భాట్టాకారికాః 291 భూపాల 292 భట్టి 293 మాంత్రికః 294 వరరుచి 295 యాజ్ఞికాః 296 మీమాంసకాః 297 వరాహమిహిర 298 విద్యాచక్రవర్తి 299 విద్యాధర 300 విశ్వేశ్వరభట్టారక 301 వ్యాడి 302 వ్యోమశివాచార్య 303 శతరి 304 శౌనక 305 శ్రీధరాచార్య 306 సుబోధినీకార 307 సౌగత 308 సూత్రకారః 309 హరి 310 కాదంబరి 311 అధి కారసూత్రమ్ 312 అహవయాత్ర 313 కళాకోశ 314 గణరత్న మహోదధి 315 గరుడపురాణం 316 దర్పణ 317 దర్శన 318 నిఘంటువు 319 నిమిత్తనిదాన 320 పృథ్వీప్రకరణ 321 పశుశాస్త్ర 322 బుద్ధచరిత 323 బృహస్పతిస్మృతి 324 బ్రహ్మాండపురాణము 325 భాష్యలక్షణము 326 భారతి 327 మాలవిక 328 వర్ధమానసూత్ర 329 వేదాంతము 330 వేద వాక్యము 331 శయనశాస్త్రము 332 శాలికా 333 శ్రీమద్భాగ వతోక్తి 334 శివమహిమ్నస్తోత్రము 335 హారావళి.

—o—

Bibliography

1. రఘువంశం (9 వ్యాఖ్యానాలతో పూనా ప్రచురణ).
2. కుమారసంభవం.
3. కిరాతార్జునీయం.
4. మేఘసందేశం.
5. శిశుపాలవధమ్.
6. నైషధీయచరితం.
7. ప్రతాపరుద్రీయ రత్నాపణవ్యాఖ్య.
8 తెలుగు విజ్ఞానసర్వస్వం భాషాసంస్కృతి.
9. సంగ్రహాంధ్ర విజ్ఞానకోశము 7వ వాల్యూమ్.
10. సంస్కృతకవి జీవితము.
11. స్వర్ణహంస.
12. అతురార్చన.
13. శారదామంజీరము.
14 సాహితీవాల్లభ్యము.
15. ఆంధ్రమాఘము,
16. ఏకావళి.
17. భట్టికావ్యము.
18. ప్రబంధవాఙ్మయము.
19. కావ్యాదర్శం (హిందీవ్యాఖ్యతో).
20. సంస్కృత మాన్యుస్క్రిప్ట్స్ ఇన్ ది రాజస్థాన్ ఓరియంటల్ రిసెర్చ్ ఇనిస్టిట్యూట్ పార్టు B.

21. తెలుగు జర్నల్లు.
22. కాకతీయ సంచిక.
23. చక్రం మాసపత్రిక.
24. రఘువీరచరితమ్.
25· భారతులు.
26. అభిజ్ఞానశాకుంతలమ్.
27. రాజశిల్పి.
28. రసార్ణవసుధాకరమ్.
29. రెడ్డి సంచిక.
30. చాటుధారా చమత్కారసారాః.
31. శ్రీవాథుని శృంగారనైషధ వ్యాఖ్యానం.
32. ఆంధ్రుల చరిత్ర సంస్కృతి (ఖండవల్లి లక్ష్మీరంజనం)
33. శ్రీమతి ఆర్. అనంతలక్ష్మి సిద్ధాంతవ్యాసం.
34. డా॥ పి. శ్రీరామమూర్తిగారి సిద్ధాంతవ్యాసం.
35. వేదం వేంకటరాయశాస్త్రిగారి మేఘసందేశం.
36. సురవరం ప్రతాపరెడ్డి స్మారక సంచిక.
37. కీ. శే. వేదం వేంకటరాయశాస్త్రిగారి సన్మాన సంచిక.
38 సురవరం ప్రతాపరెడ్డి జీవితము-సాహిత్యము.
39 *History of Reddy Kingdoms.*
40. *Alfred Hillebrandt Kalidasa (An estimate of his literary merit)*
41. *Kalidasa's Vison of Kumarasambhava.*
42. *The Kumarasambhava of Kalidasa by Surya kanta*
43. *Hfstory of Classical Samskrit Literature by Sri M. Krtshnamachariar.*
44. *New Indian Antiqvuary Vol. II.*

సహకరించిన మనీషులు

1. ఆచార్య దివాకర్ల వేంకటావధానిగారు.
2 ఆచార్య K. V. R నరసింహంగారు.
3 ఆచార్య B రామరాజుగారు
4. ఆచార్య యస్వీ జోగారావుగారు.
5. ఆచార్య పి. శ్రీరామమూర్తిగారు.
6. ఆచార్య పాటిబండ మాధవశర్మగారు.
7. శ్రీ గుండేరావు హర్కారేగారు.
8. శ్రీ కప్పగంతుల లక్ష్మణశాస్త్రిగారు.
9. శ్రీ తిరుమల రామచంద్రగారు.
10 శ్రీ గుంటూరు శేషేంద్రశర్మగారు.
11. శ్రీ కేశవపంతుల నరసింహశాస్త్రిగారు
12 శ్రీ పేరి సూర్యనారాయణశాస్త్రిగారు.
13. శ్రీ మధునాపంతుల సత్యనారాయణశాస్త్రిగారు.
14. శ్రీ K. V. N. అప్పారావుగారు.
15. శ్రీ కొల్లూరు లక్ష్మణమూర్తిశర్మగారు.
16. శ్రీ కొల్లూరు అవతారశర్మగారు.
17 శ్రీ మానాప్రగడ శేషశాయిగారు.
18. శ్రీ గూడపాటి సాంబశివరావుగారు.
19 శ్రీ చర్ల గణపతి శాస్త్రిగారు.
20. శ్రీ పుల్లెల శ్రీరామచంద్రుడుగారు.
21. శ్రీ గంటిజోగి సోమయాజిగారు.
22 శ్రీ గుమ్మా జానకిరామారావు.
23 డా॥ కొత్తపల్లి వీరభద్రరావుగారు.

24. డా॥ ముదిగొండ వీరభద్రశాస్త్రిగారు.
25. శ్రీహరి ఆదిశేషువుగారు.
26. శ్రీ నీలా జంగయ్యగారు.
27. శ్రీ పాళం చెన్న కేశవరెడ్డిగారు.
28. శ్రీ పోరంకి దక్షిణామూర్తిగారు.
29. శ్రీ M. L. నరసింహారావుగారు.
30. శ్రీ ఆర్యసోమయాజుల నరసింహశాస్త్రిగారు.
31. శ్రీ ముకురాల రామారెడ్డిగారు.
32. శ్రీ అనుముల కృష్ణమూర్తిగారు.
33. శ్రీ భాష్యం రామానుజాచార్యులుగారు.
34. శ్రీమతి పి. విజయలక్ష్మిగారు.
35. శ్రీమహబూబ్ నారాయణగారు.

